
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 184
బుధవారం 24-9-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



'కనక' వర్షం

బంగారం ధరలు ఆకాశమే హద్దు అన్న రీతిలో ఎప్పటికప్పుడు కొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. ముఖ్యంగా 2025లోనే పసిడి ధర 50 శాతం, వెండి ధర 55 శాతం చొప్పున పెరిగాయి.

- వివరాలు 16లో



ప్రజారోగ్యంలో విప్లవం..

కేంద్రం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ పథకం ప్రజారోగ్య రంగంలో విప్లవమని మోదీ అభివర్ణించారు.

వివరాలు 6లో ▸



కోల్‌కతా గజగజ

నాలుగు దశాబ్దాల తరువాత కురిసిన రికార్డు స్థాయి భీకర వర్షాలతో కోల్‌కతాతోపాటు పొరుగు జిల్లాలు గజగజ వణికిపోయాయి.

వివరాలు 6లో ▸



ఉత్తమాటలతో యుద్ధాలు ఆగవు

ప్రపంచంలోనే శక్తివంతమైన దేశమైన అమెరికాకు సమీపంలోకి వచ్చే దేశం మరొకటి లేదని డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు.

వివరాలు 6లో ▸



మీకోసం ఆపేశారు..

అమెరికా పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌కు చేదు అనుభవం ఎదురైంది. ట్రంప్ కాన్వాయ్ వేళ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు.

వివరాలు 6లో ▸

ప్రపంచం కీర్తించేలా..

వెయ్యేళ్లు నిలిచేలా మేడారం సమ్మక్క, సారలమ్మ ఆలయ పునర్నిర్మాణం : సీఎం రేవంత్



గద్దెల ప్రాంగణంలో గంట కొడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క తదితరులు

- ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడేలా ప్రణాళికలు సిద్ధం
- అమ్మల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది
- ఆలయం అభివృద్ధికి ఎన్ని నిధులైనా వెచ్చిస్తాం
- తెలంగాణ కుంభమేళాను కేంద్రం గుర్తించాలి..నిధులు ఇవ్వాలన్న సీఎం
- ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం.. గద్దెల కొత్త డిజైన్లు విడుదల

ఆనాడు పాలకులు సమ్మక్క–సారలమ్మ ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపారు. కానీ మా ప్రభుత్వం ఏర్పడటం వల్ల ఆదివాసీ బిడ్డలను అభివృద్ధి చేయడంతో పాటు ఆదివాసీ దేవతల ఆలయాలకు సేవ చేసే భాగ్యం కలిగింది. సమ్మక్క సారలమ్మల గద్దెల అభివృద్ధి, ప్రాంగణ పునర్నిర్మాణంతో మంత్రి సీతక్కకు, నాకు జన్మ ధన్యమైనట్లే. ఆదివాసీలను, పూజారులను, సంప్రదాయ కుటుంబాలను ఆలయ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నాం. రాతి కట్టడాలు ఎప్పటికీ చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిపోయేలా ఉంటాయి. మహా జాతరకు మళ్లీ వస్తా.. ఈసారి జాతరను గొప్పగా చేసుకుందాం..

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణ కుంభమేళా నిర్వహించే మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయాన్ని ప్రపంచం కీర్తించేలా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా ప్రకృతి ఒడిలో ఉన్నట్టుగా ఈ ఆలయం ఉందని, ఈ నేపథ్యంలో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కాకతీయులు నిర్మించిన రామప్ప తరహాలో చరిత్రకు సాక్ష్యులుగా, వెయ్యేళ్లు నిలిచేలా ఆలయ పునర్నిర్మాణాన్ని రాతి కట్టడాలతో చేపడతామని చెప్పారు. మంగళవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క–సారలమ్మ ఆలయ పునర్నిర్మాణం పనులను సీఎం ప్రారంభించారు. అంతకుముందు మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు, అధికారులు ఆయనకు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. అనంతరం సీఎం పోలీసు కమాండ్ కంట్రోల్ రూం ప్రాంగణంలో పోలీసుల గౌరవ వందనం

మిగతా 2వ పేజీలో ▸

సినిమాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి

71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ముర్ము



జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత మోహన్‌లాల్, ఉత్తమ నటులు షారూక్‌ఖాన్, విక్రాంత్, ఉత్తమ నటి రాణీ ముఖర్జీ

15లో

న్యూస్‌రీల్

బాలికలకు 'ప్రేమ్‌జీ' స్కాలర్‌షిప్స్



ఉన్నత విద్య అభ్యసించే బాలికలకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఏటా రూ.30 వేల ఉపకార వేతనం అందిస్తోందని అజీమ్ ప్రేమ్‌జీ తెలంగాణ ప్రాంత బాధ్యుడు శ్రీనివాస్‌రావు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు.

- వివరాలు 3లో▸

జామ్‌లో జయం సాధించేలా!



ఐఐటీల్లో చదవాలనే కలను నిజం చేసుకునేందుకు మరో మార్గం ఉంది.. అదే ద జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జామ్). ఈ పరీక్షలో ప్రతిభ ద్వారా దేశంలోని టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో సైన్స్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు.

- వివరాలు 16లో▸

'ధాన్యం' కేంద్రాల్లో వాతావరణ హెచ్చరికలు



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వారీగా వాతావరణ హెచ్చరికలను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు.

- వివరాలు 12లో▸

23 గ్రామాలపై మధ్యంతర ఉత్తర్వులు



ములుగు జిల్లా మంగపేట మండలంలోని 23 గ్రామాలపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 23 గ్రామాలను షెడ్యూల్ ప్రాంతాలుగా పరిగణిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది.

- వివరాలు 2లో▸

మాకు దక్కాల్సిన వాటా 763 టీఎంసీలు

- కృష్ణాలో వాటా కోసం కృష్ణా ట్రిబ్యునల్ ముందు తెలంగాణ వాదనలు
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడి
- ఆల్మట్టి ఎత్తు పెంపుపై సుప్రీంను ఆశ్రయిస్తామన్న మంత్రి



సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు న్యాయంగా 763 టీఎంసీలు దక్కాలని, ఈ వాటాను రాబట్టుకునేలా జస్టిస్ బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణ వాదనలు వినిపిస్తోందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. కృష్ణా బేసిన్‌లో తెలంగాణలోని పరీవాహక ప్రాంతం, కరువు ప్రాంతాలు, జనాభా ప్రాతిపదికన వాటాలు ఇవ్వాలని కోరుతున్నట్లు వెల్లడించారు. 'కృష్ణా నదీ జల వివాదాల పరిష్కార ట్రిబ్యునల్–2 ఉమ్మడి రాష్ట్రానికి మొత్తంగా 1,050 టీఎంసీల నీటిని కేటాయించింది. ఇందులో 75 శాతం డిపెండబులిటీ ఆధారంగా

మిగతా 12వ పేజీలో ▸

చేసిందంతా చంద్రబాబే

ఓటుకు కోట్లు కేసులో ఆయనదే కీలకపాత్ర

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు నిందితుడు మత్తయ్య లేఖ



- 2016 మహానాడులో చంద్రబాబు, రేవంత్ నాతో మాట్లాడారు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటేసేలా స్టీఫెన్‌సన్‌ను ఒప్పించాలన్నారు
- రూ. 5 కోట్లు ఇచ్చేందుకు సిద్ధమని చెప్పాలన్నారు.. పోలీసులకు దొరకకుండా లోకేశ్ నన్ను విజయవాడ తరలించారు
- అతని సన్నిహితుల సహకారంతో నిర్బంధించారు
- ఈ కేసులో బాబు, లోకేశ్, ఏబీ వెంకటేశ్వరరావునూ నిందితులుగా చేర్చండి..
- కేసును సుప్రీం లేదా ఇతర హైకోర్టులు విచారించాలని విజ్ఞప్తి

13లో



మనకొచ్చే డాలర్లు తగ్గుతాయా?

- భారత్‌కు వచ్చే రెమిటెన్సులపై హెచ్–1బీ ఫీజు ప్రభావం?
- 'లక్ష డాలర్ల' వన్‌టైమ్ ఫీజుతో కొత్త దరఖాస్తులపై ఎఫెక్ట్

- వివరాలు 2లో▸


అమ్మాయిల ఆశలపై నీళ్లు

హెచ్–1బీ లబ్ధిదారుల్లో పురుషుల కంటే స్త్రీలు తక్కువే

కొత్త దరఖాస్తులకు కంపెనీలు విముఖత చూపొచ్చు

దీంతో యువతులపైనే ప్రభావం ఉండొచ్చంటున్న నిపుణులు

- వివరాలు 17లో▸



సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 24-9-2025



“‘పాస్‌పోర్ట్’ అనేది 9 నుంచి 11 సంవత్సరాల మధ్య పిల్లల కోసం రూపొందించిన సోషల్-ఎమోషన్ లెర్నింగ్ ప్రోగ్రామ్. భావోద్వేగాల నుంచి జీవననైపుణ్యాల వరకు పలు అంశాలు ఇందులో ఉంటాయి. సమస్య ఎదురైనప్పుడు దాన్ని తామే పరిష్కరించుకునే సామర్థ్యాన్ని పిల్లల్లో పెంచడం లాంటివెన్నో ‘పాస్‌పోర్ట్’లో ఉన్నాయి. కెనడా ప్రొఫెసర్ బ్రయన్ మిషార ఈ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌ను రూపొందించాడు.”

● పేరెంటింగ్

పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ఇలా చేయవద్దు

పి.ఎం.ఐ (పేరెంట్ మెంటర్ ఇంటరాక్షన్)కు సమాచారం రాగానే తల్లిదండ్రులు తమకు టీచర్లు ఏదో బాకీ ఉన్నట్టు టీచర్లను నిలదీయడానికే ఈ అవకాశం వచ్చినట్టు భావిస్తుంటారు. పి.ఎం.ఐ అనేది పిల్లలు స్కూల్లో ఎలా ఉన్నారో, చదువులో వారి అవగాహన ఎలా ఉందో, వారికి తల్లిదండ్రుల నుంచి ఎలాంటి మద్దతు కావాలో టీచర్లు తెలియచేసే ఇంటరాక్షన్. కాబట్టి పి.ఎం.ఐ.లలో తల్లిదండ్రులు వ్యవహరించకూడని విషయాలను నిపుణులు చెప్తున్నారు. అవి ఏంటంటే...



టీచర్-పేరెంట్ మీటింగ్ అనగానే తల్లిదండ్రులు రెండు విధాలుగా ప్రవర్తిస్తారు.

ఒకటి అసలు వెళ్లరు. రెండు.. వెళ్లి టీచర్‌ను అనేక ప్రశ్నలు అడగాలి, వీలైతే నిలదీయాలి అనుకుంటారు. అసలు వెళ్లకపోవడం ఎంత తప్పో వెళ్లి టీచర్ల దగ్గర ‘గట్టిగా’ వ్యవహరించడం కూడా అంతే తప్పు. ‘మన అబ్బాయి/అమ్మాయి బుద్ధిగా చదువుకుంటోంది. పి.ఎం.ఐకి వెళ్లి కొత్తగా తెలుసుకునేదేముంది’ అని కొంతమంది తల్లిదండ్రులు.. తీరిక లేదనే కారణంతో కొంతమందీ వెళ్లరు. బాగా చదివినంత మాత్రాన, మంచి మార్కులు వచ్చినంత మాత్రాన స్కూల్లో పిల్లలు ఎలా ఉన్నారో మనకు తెలిసేది పి.ఎం.ఐ వల్ల మాత్రమే. తల్లిదండ్రుల కంటే టీచర్లు ఎక్కువగా పిల్లలను పరిశీలిస్తారు. కాబట్టి పి.ఎం.ఐ.కి హాజరు కావడం తప్పనిసరి.

మరోవైపు పిల్లల చదువును భూతద్దంలో పెట్టి చూస్తూ, చదువుకు సంబంధించిన అన్ని లోపాలకు కారణం స్కూలు టీచర్లే అనే విధానంతో తల్లిదండ్రులు ఉంటారు. వీరు తరచూ టీచర్లకు కాల్ చేయడం, పి.ఎం.ఐ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడటం మోతాదు మించిన స్పందన అని చెప్పవచ్చు. నిజానికి ఇటీవల స్కూలు పాఠాలు పిల్లలను గైడ్ చేస్తూ ఇంటర్నెట్ ద్వారా మిగిలిన చదువు పూర్తి చేసుకునేలా ఉంటున్నాయి. ఇది అర్థం చేసుకుని టీచర్లను నిందితులుగా చూడటం కంటే వారు పిల్లల గురించి చేసిన అబ్జర్వేషన్స్ ను విని అర్థం చేసుకుని కర్తవ్యాన్ని నెరవేర్చుకోవాలి. కొన్ని స్కూళ్లలో నెల, రెండు నెలలకోసారి పేరెంట్-టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తుండగా, మరికొన్ని చోట్ల క్వార్టర్లీ/ హాఫ్ ఇయర్లీ పరీక్షలు అయ్యాక నిర్వహిస్తుంటారు. ఈ సమయంలో అటు టీచర్లు, ఇటు తల్లిదండ్రులు కొన్ని తప్పులు చేస్తున్నారని నిపుణులు అంటున్నారు.

అమ్మానాన్నలూ.. ఇలా చేయొద్దు

● కొన్ని ఇళ్లల్లో తల్లి మాత్రమే పేరెంట్-టీచర్స్ మీటింగ్‌కు హాజరవుతుంటుంది. దాంతో తన విషయాలేవీ తండ్రికి తెలియవనే ధీమాతో పిల్లలు ఉంటారు. అప్పుడప్పుడూ నాన్న కూడా మీటింగ్‌కు వెళ్లాలి. వెళ్లడం కుదరకపోతే టీచర్లతో మాట్లాడి పిల్లల గురించి కనుక్కోవాలి.

● పి.ఎం.ఐలలో పిల్లల మార్కులను, వారి ప్రతిభను ఇతరులతో పోలుస్తూ మాట్లాడుతుంటారు కొందరు తల్లిదండ్రులు. క్లాసులో తమ పిల్లలే ఫస్ట్ రావాలని అంటుంటారు. అలా కాకుండా పిల్లల సమస్య ఏమిటో కనుక్కోవాలి. కేవలం మార్కుల గురించే కాకుండా ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పిల్లల భాగస్వామ్యం గురించి కూడా కనుక్కోవాలి.

● తల్లిదండ్రులు టీచర్లతో మాట్లాడుతున్నప్పుడు పిల్లలు మౌనంగా నిలబడి ఉంటారు. అలా కాకుండా, వారిని కూడా మీ సంభాషణల్లో భాగస్వామిని చేస్తే స్వేచ్ఛగా వారి విషయాలు మీతో పంచుకుంటారు.

● తమ పిల్లలు ఎవరితో మాట్లాడుతున్నారు, ఎవరితో ఎక్కువసేపు ఉంటున్నారనే అనుమానాలని టీనేజ్ పిల్లల తల్లిదండ్రులు పిల్లల ముందు కాకుండా టీచర్లతో విడిగా మాట్లాడటం మేలు.

● క్లాసుల్లో పిల్లలు అల్లరి చేయడం, జట్టు కట్టి టీచర్లను కామెంట్ చేయడం చేస్తున్నారని టీచర్లు చెప్పినప్పుడు కొందరు ‘మా పిల్లలే అల్లరి చేస్తున్నారా’ అని ఎదురు ప్రశ్నిస్తారు. దాంతో టీచర్లు మీ పిల్లల ప్రవర్తనా దోషాలు చెప్పడం మానేస్తారు.

టీచర్లూ..
ఈ సూచనలు మీకు

● కొంతమంది టీచర్లు పిల్లల ప్రవర్తనలో కనిపించిన చిన్న చిన్న లోపాల్ని పెద్దవి చేసి తల్లిదండ్రులకు చెప్తుంటారు. దీనివల్ల వారిలో ఆందోళన పెరుగుతుంది. ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది. ఇలా చేయడం సరికాదు. ఫిర్యాదుల్లా కాకుండా, ‘ఈ ప్రవర్తన మారితే మీ పిల్లలు మరింత రాణించగలరు’ అనే పద్ధతిలో చెప్పాలి.

● పిల్లల చదువుతోపాటు వారికి ఇంకే రంగంపై ఆసక్తి ఉంది, అందులో రాణిస్తే ఎలా ఉంటుందనే అంశాలను కూడా టీచర్లు తల్లిదండ్రులతో చర్చించొచ్చు.

● పిల్లల తల్లిదండ్రులందరికీ సమానమైన గౌరవం ఇవ్వాలి. వారి ఆహార్యాన్ని, మాటల్ని, ఆర్థిక స్థితిని బట్టి వేర్వేరుగా చూడటం తగదు.

● కేవలం ఫిర్యాదు చేయడానికే కాకుండా, పిల్లల్ని మెచ్చుకునేందుకూ సమయం కేటాయించాలి. వారి చిన్న చిన్న విజయాలనూ పొగడాలి. తద్వారా వారిలో, వారి తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతుంది.



సహనమే శక్తి

“దుర్గా మాతని శక్తి స్వరూపిణి అంటారు. ప్రతి స్త్రీలోనూ అంతర్లీనంగా దుర్గా మాత ఉంటుందని నేను నమ్ముతాను. అందుకే ఎలాంటి క్లిష్టమైన సవాల్‌ను ఎదుర్కొనాల్సి వచ్చినా బలంగా, ధైర్యంగా ముందుకు వెళ్లగలుగుతున్నారు... సక్సెస్ అవుతూ, వారిని వారు సంరక్షించుకోగలుగుతున్నారు. స్త్రీ శక్తికి ప్రతీకగా నిలిచే దసరా మహిళలందరికీ పెద్ద పండగ” అని అన్నారు యువ నటి **శివానీ నాగారం**. ‘అంబాజీపేట మ్యారేజి బ్యాండు’ చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమకు నటిగా పరిచయం అయ్యారు శివానీ. ఇటీవల ‘లిటిల్ హార్ట్స్’తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నారు. తెలుగు తెరపై ఈ మధ్య మెరిసిన నవ తారల్లో తెలుగమ్మాయి శివానీకి అవకాశాలు మెండుగానే ఉన్నాయి. విజయోత్సాహంలో ఉన్న శివానీ దసరా, బతుకమ్మ పండగ విశేషాలను ‘సాక్షి’తో ప్రత్యేకంగా పంచుకున్నారు.


శివానీ నాగారం

➡ మా కుటుంబానికి ‘దసరా’ చాలా పెద్ద పండగ. మేం అందరం కలిసి చాలా సందడిగా దసరా నవరాత్రులను చేసుకుంటాం. అలాగే బతుకమ్మ పండగను కూడా సెలబ్రేట్ చేస్తాం. రంగు రంగుల పువ్వులు సేకరించి, మా కుటుంబంలోని మహిళలతోపాటు అపార్ట్‌మెంట్‌లోని మహిళలందరం కలిసి బతుకమ్మ ఆడతాం.

➡ దసరా అనగానే నాకు అమ్మవారు గుర్తుకు వస్తారు. మనకు ఉన్న చెడు వెళ్లిపోయి మనల్ని అమ్మవారు గుడ్ డేస్, గుడ్ స్ట్రెంత్‌తో ఆశీర్వదిస్తారు. మేం ఆ రోజు బంగారం కొంటాం. తొమ్మిదో రోజు ఆయుధ పూజ చేస్తాం. మా ఇంట్లో ఉన్న కార్లు, బైక్‌లకు పూల మాల వేసి, పూజలు చేస్తాం. ఇంటిని బాగా అలకరించుకుంటాం. బూరెలు, పాయసం, పులిహోర... ఇలా రకరకాల వంటకాలు చేసి, దేవుడికి పూజ చేసి, నైవేద్యం పెడతాం. ఇక నా జీవితంలో దసరా పండక్కి ప్రత్యేకమైన మూమెంట్స్ కొన్ని ఉన్నాయి. పెద్దవాళ్ల దగ్గర ఆశీర్వాదాలు తీసుకుంటాను. కొన్ని పండగలకు మా కజిన్స్ మా ఇంటికి వస్తారు. కొన్నిసార్లు మేం వాళ్ల ఇంటికి వెళ్తాం. అలా అందరం కలిసి సెలబ్రేట్ చేసుకుంటుంటాం.

➡ దసరా పండగకి సంబంధించి నా స్కూల్ డేస్‌లో కానీ, కాలేజ్ డేస్‌లో కానీ ఎలాంటి మైథలాజికల్ క్యారెక్టర్ చేయలేదు. అయితే అవకాశం వస్తే ఆ తరహా పాత్ర చేయాలని ఉంది. ఎందుకంటే ఆ పాత్రలో కొంత మహిళా సాధికారత ఉంటుందని నా నమ్మకం. ఓ నటిగా నాకు స్థిరత్వం, ఓపిక చాలా ముఖ్యం. దసరా అంటే క్లిష్ట పరిస్థితులను దాటుకుని, విజయం సాధించడం. అందుకే మనకు ఓపిక, నమ్మకం ఉండాలి. చెడు రోజులను బలంగా ఎదుర్కొని, హుందాగా నెగ్గుకు రాగలగాలి.

➡ కోల్‌కతాలో దసరా నవరాత్రులను ఘనంగా జరుపుకుంటారు. నా జీవితంలో ఒక్కసారైనా నేను కోల్‌కతా వెళ్లి, దుర్గామాత పూజలో పాల్గొనాలని ఉంది. కొన్నిసార్లు నేను హైదరాబాద్‌లో బెంగాలీ సమితులకు వెళ్లాను. ప్రతి ఏడాది దసరా నవరాత్రుల ఉత్సవాల్లో ఏదో ఒక రోజు తప్పకుండా వెళ్లి, అమ్మవారిని దర్శించుకుంటాను. అక్కడ దుర్గామాతకు హారతి ఇస్తారు. ఆ సమయంలో బెంగాలీ మహిళలు తెల్లచీర ధరించి, నుదుట ఎరుపు రంగు బొట్టు పెట్టుకుని, డ్యాన్స్ చేస్తుంటే ఆ వైబ్రేషన్స్ వేరుగా ఉంటాయి. ఇక దసరా ఫెస్టివల్‌కి నా కాలేజీ డేస్ నుంచి దాండియా, గర్బా ఆడటం అలవాటు. ఎవరు దాండియా, గర్బా ఫెస్టివల్స్‌ను ఏర్పాటు చేసినా అక్కడికి మేం గ్రూప్‌గా వెళ్లి రాత్రంతా ఆడేవాళ్లం. అంత క్రేజీగా ఉండేది. నాకు అది లవ్లీ ఎక్స్‌పీరియన్స్.

నేను స్పిరిచ్యువల్ పర్సన్‌ని

బాధగా ఉన్నప్పుడు, సంతోషంగా ఉన్నప్పుడనే కాదు... అవకాశం దొరికినప్పుడల్లా దేవాయాలకు వెళ్తుంటాను. గుడిని ఇల్లుగా భావిస్తాను. అలాగే ఇంటిని కూడా దేవాలయంలా అనుకుంటాను. మా కుటుంబ సభ్యులు కూడా అలానే ఉంటారు. నేను ఎక్కడికి వెళ్లినా, ఎక్కడున్నా దేవుడు అక్కడే ఉన్నారని నేను అనుకుంటాను. ఏదో ఒక ఆధ్యాత్మిక శక్తి నన్ను రక్షిస్తుందని నా నమ్మకం. నన్నే కాదు... అందర్నీ రక్షిస్తుంటుందని భావిస్తాను. ఈ నమ్మకం వల్లే జీవితంలో ముందుకు వెళ్లగలుగుతాం.

– మునిమి శివాంజనేయులు

ఉపవాసం అంటే స్వీయ నియంత్రణ

ఉపవాసం గురించి ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలు వారికి ఉండొచ్చు. దసరా సమయంలో ఇప్పటివరకు నేనైతే ఉపవాసం ఉండలేదు. మా అమ్మ, అమ్మమ్మగార్లు ఉంటారు. అయితే ఉపవాసం చేయడం వల్ల స్వీయ నియంత్రణ కలుగుతుంది. అమ్మవారికి మన వంతుగా ఏదో ఇచ్చిన ఓ సంతృప్తి ఉంటుంది.

ఓపికతో ఉండాలి

మనకు మనమే స్ఫూర్తిగా నిలవాలంటే ముందు మనపై మనకు నమ్మకం, ఆత్మ విశ్వాసం ఉండాలి. ఇదే మనకు మనం ఇచ్చుకునే మోటివేషన్. ఎంత ఓపికతో ఉంటే అంత మంచి ఫలితం వస్తుందంటారు. సహనంగా ఉంటే ఏ పనైనా సరిగ్గా అవుతుంది. అందుకే నా ఓర్పే నా శక్తి అని నమ్ముతాను.

● లీగల్

మా ఆయన అమాయకుడు... ఆయన లవర్ మీద కేసువేయచ్చా?

మాకు పెళ్లై 5 సంవత్సరాలు అవుతోంది. ఇటీవలే నా భర్త మరొకరితో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని తెలిసింది. తన ఫోన్లో ఆధారాలు కూడా చూశాను. నా భర్త చాలా మంచివాడు. అయితే ఆ మహిళ తనను మోసం చేసింది అని చెప్పాడు. నేను ఆ మహిళపై కేసు పెట్టి జైలుకి పంపలేనా?

– ఒక సోదరి, విశాఖపట్నం

సాధారణంగా స్త్రీలు తమ భర్త/కొడుకు మంచివాడే కానీ పక్క వాళ్ళు చెడగొడుతున్నారు అని భావిస్తూ ఉంటారు. అది సరికాకపోవచ్చు. ఇద్దరు వ్యక్తుల మధ్యలో ఎటువంటి బలవంతం లేకుండా ఒక బంధం ఏర్పడింది అంటే, అది వివాహేతరమైనప్పటికీ, వారు ఇష్టపూర్వకంగానే చేశారు అని భావించాలి. పూర్వం ఐ.పీ.సీ సెక్షన్ 497 అమలులో ఉన్నప్పుడు పరాయి స్త్రీ/మరొకరి భార్యతో లైంగిక సంబంధ కలిగి ఉంటే అది నేరంగా పరిగణించబడేది. కానీ సుప్రీం కోర్టు ఈ సెక్షన్‌ను రాజ్యాంగ వ్యతిరేకమని పరిగణించి రద్దుచేసింది. దీని అర్థం వైవాహిక సంబంధాన్ని దాటి మరొకరితో లైంగిక సంబంధం కలిగి ఉండవచ్చు అని కాదు. లైంగిక స్వేచ్ఛ పూర్తిగా వ్యక్తిగతమైనప్పటికీ భర్త లేదా భార్య మరొకరితో సంబంధం కలిగి ఉండటాన్ని విడాకులకు ప్రాతిపదికగా, గృహ హింసగానూ అనేక సందర్భాలలో పలు హైకోర్టులు సుప్రీంకోర్టు కూడా పేర్కొన్నాయి. అంటే క్రిమినల్ చట్టాలలో శిక్ష ఉండదు కానీ విడాకులు తీసుకోవడానికి, భారీ భరణం పొందడానికి, గృహహింస చట్టం కింద పరిహారం పొందడానికి బలమైన కారణం కావచ్చు. అంతేకాక, ఒక మహిళ తన భర్తతో లైంగిక సంబంధం కలిగిన ఒక మహిళపై సివిల్ సూట్ /దావా వేస్తూ నాలుగు కోట్ల రూపాయల పరిహారం చెల్లించాలి అంటూ కోర్టును ఆశ్రయించగా ఇలాంటి దావా చెల్లదు అని ఈ సమస్య ఢిల్లీ హైకోర్టుకు చేరింది. ఢిల్లీ హైకోర్టు తన తీర్పును వెల్లడిస్తూ ఈ దావా సమంజసమే అని పేర్కొంది. అయితే దావా వేసిన మహిళ తన వైవాహిక జీవితంలో ఉద్దేశపూర్వకంగా మరొక మహిళ జోక్యం చేసుకుని తనకు భర్త నుండి/వైవాహిక జీవితం నుండి దక్కవలసిన ప్రేమ – ఆప్యాయతలకు భంగం కలిగించింది అని రుజువు చేయవలసి ఉంటుందని కూడా ఢిల్లీ హైకోర్టు చెప్పింది. దీని అర్థం: ఒకవేళ ఆ మూడవ వ్యక్తి ఉద్దేశపూర్వక ప్రమేయం లేదు, సదరు మహిళ భర్తయే స్వచ్ఛందంగా/ఇష్టపూర్వకంగా మరొకరితో సంబంధాన్ని ఏర్పరచుకున్నారు అని రుజువు చేస్తే, ఆ మూడవ వ్యక్తిపై ఎలాంటి సివిల్ కేసు బాధ్యత కూడా ఉండదు. ఎందుకంటే మానవ సంబంధాలు (అవి వివాహేతర సంబంధాలు అయినా) పూర్తిగా వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశాలు. మూడవ వ్యక్తి పనికట్టుకుని మరొకరి వైవాహిక జీవనానికి భంగం కలిగించారు అని, అందులో భర్త/భార్య పాత్ర లేదు అని రుజువు చేయటం అంత సులభం కాదు. వివాహేతర సంబంధం కలిగి ఉన్నారు అనే కారణం చూపుతూ విడాకుల కేసు వేసిన సందర్భాలలో, అలాంటి సంబంధం కలిగిన మూడో వ్యక్తిని కూడా కేసులో చేర్చాలి అని పలు కోర్టులు అభిప్రాయపడ్డాయి. ఇలాంటి కేసులో కూడా పరిహారం కోరే ఆస్కారం లేకపోలేదు!

ఇక మీ విషయానికి వస్తే, మీ భర్త స్వచ్ఛందంగా మీకు చెప్పలేదు కాబట్టి, మూడో వ్యక్తి తనని మోసం చేసిందంటే మీరు ఎలా నమ్ముతున్నారు? మీరు ఆ మహిళపై క్రిమినల్ కేసు పెట్టే వీలు లేదు. పెట్టాలి అనుకోవటం కూడా సమంజసం కాదు. పైన చెప్పిన విధంగా సివిల్ కేసు వేస్తే వేయవచ్చు. అప్పుడు మీ భర్తపై తన ప్రియురాలు మాత్రం క్రిమినల్ కేసు వేసే ఆస్కారం ఉంది మరి!



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

● దేవీ నవరాత్రులు

నవ దుర్గలు... వర్ణాలు

దేవీ నవరాత్రులు వచ్చాయి. ఈ తొమ్మిది రోజులూ భక్తులు అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి ఆమెకు ఇష్టమైన నైవేద్యాలు పెట్టి నృత్య గానాలు చేసి భక్తి పారవశ్యంలో ఓలలాడుతుంటారు. అయితే అమ్మవారికి రోజుకో నైవేద్యం పెట్టినట్లే రోజుకో రంగు వస్త్రాలతో అలంకరిస్తారు. అంతేకాదు, తాము కూడా ఆ రంగు వస్త్రాలను ధరించి, అమ్మవారి అనుగ్రహాన్ని అందుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. నవరాత్రులలో ఇప్పటికే రెండు రోజులు గడచిపోయాయి. మిగిలిన రోజుల్లో అయినా అమ్మవారిని ఆమెకు ఇష్టమైన రంగులతో అలంకరిద్దాం. అమ్మ అనుగ్రహానికి పాత్రత పొందుదాం.





1. శైలపుత్రి: మొదటి రోజున అమ్మవారిని శైలపుత్రిగా అలంకరించి ఎరుపు రంగు వస్త్రాలను ధరిస్తారు. శైలపుత్రి అలంకారం బలానికి, శక్తికి ప్రతీక అయితే, ఎరుపు రంగు అభిరుచికి, ధైర్యానికి సూచిక.

నైవేద్యం: పులిహోర, కట్టు పొంగలి



2. బ్రహ్మచారిణి: నీలం రంగు నీలవర్ణం నిశ్శబ్దానికి, ప్రశాంతతకు, భక్తికి ప్రతీక అయితే, బ్రహ్మచారిణి అమ్మవారు క్రమశిక్షణ, ఏకాగ్రత అలవడేలా చేసి, ఆధ్యాత్మికాభివృద్ధిని కలిగిస్తుంది.

నైవేద్యం: కొబ్బరి అన్నం, పాయసాన్నం



3. చంద్రఘంట: భక్తులు చంద్రఘంటాదేవిని సౌందర్యానికి, సాహసానికి ప్రతీకగా భావిస్తారు. ఈ అమ్మను ఆరాధించడం వల్ల భయం, ప్రతికూలతలు తొలగుతాయని నమ్ముతారు. ఈ రోజున సంతోషానికి, సానుకూల భావనలకు చిహ్నమైన పసుపు రంగు వస్త్రాలను ధరిస్తారు.

నైవేద్యం : క్షీరాన్నం, దద్దోజనం, గారెలు



4. కూష్మాండ: ఈ అలంకారంలో అమ్మవారు సాక్షాత్తూ ఈ విశ్వానికి ప్రతీకగా భావిస్తారు. ఈ తల్లిని ఆరాధించడం వల్ల ఏ పనినైనా సాధించగలిగే శక్తి సామర్థ్యాలు అలవడతాయని నమ్ముతారు. ఈ రోజు ధరించే ఆకుపచ్చ రంగు ప్రకృతిని ప్రతిబింబిస్తుంది. ఆకుపచ్చ వృద్ధికి, ఉపశమనానికి సంకేతంగా నిలుస్తుంది.

నైవేద్యం : దద్దోజనం, క్షీరాన్నం




5. స్కందమాత: స్కందుడు అంటే కార్తికేయుడు అంటే కుమారస్వామి. అమ్మవారిని స్కందమాతగా ఆరాధించడం వల్ల సంతానం లేని వారికి సంతానం కలగడంతోపాటు ధైర్యం కూడా లభిస్తుంది. ఈ అమ్మవారికి ధూమ్రవర్ణం అంటే బూడిదరంగు ఇష్టం. బూడిద రంగు సమతుల్యతకు, స్థిరత్వానికి, తెలివితేటలకూ చిహ్నం.

నైవేద్యం : కేసరి, పరమాన్నం, దద్దోజనం




6. కాత్యాయని: ఈ అమ్మవారి ఆరాధన వల్ల ఆత్మవిశ్వాసం అభివృద్ధి చెందడంతోపాటు సమస్యలను ఎదుర్కొనే శక్తి చేకూరుతుందని భక్తుల విశ్వాసం. కాత్యాయనీ దేవికి ఇష్టమైన నారింజ రంగు ధైర్యానికి, జిజ్ఞాసకు, పరివర్తనకూ ప్రతీక.

నైవేద్యం : చక్కెర పొంగలి, క్షీరాన్నం



7. కాళరాత్రి: దుర్గాదేవి రౌద్రరూపానికి ప్రతీకగా కాలరాత్రి అమ్మవారిని సంభావిస్తారు. ఈ అమ్మవారి ఆరాధనతో భయాలు తొలగి, దేనినైనా ఎదుర్కొనగలిగే ధైర్యం కలుగుతుందంటారు. ఈమెకు ప్రీతికరమైన తెలుపు రంగు స్వచ్ఛతకు, ప్రశాంతతకూ ప్రతీక.

నైవేద్యం : కదంబం, శాకాన్నం



8. మహాగౌరి: సంతోషానికి, ప్రశాంతతకు, ఆధ్యాత్మిక శక్తికి ప్రతీక అయిన ఈ అమ్మవారిని గులాబీ రంగు వస్త్రాలతో అలంకరిస్తారు. గులాబీరంగు వస్త్రాలను ధరించడం వల్ల కరుణ భావనలు కలుగుతాయి. మనసుకు ప్రశాంత చేకూరుతుంది.

నైవేద్యం : చక్కెర పొంగలి



9. సిద్ధిదాత్రి: ఈ అమ్మవారి ఆరాధన వల్ల అతీంద్రియ శక్తులు సిద్ధిస్తాయని, విజ్ఞానం, సంపద చేకూరతాయని భక్తుల విశ్వాసం. ఈమెకు ప్రీతికరమైన ఊదారంగు శక్తికి, ఆధ్యాత్మికతకు, ఆశయ సాధనకూ తోడ్పడుతుంది,

నైవేద్యం : పులిహోర, లడ్డూలు, బూరెలు, గారెలు.

రంగులు.. మానసిక ప్రభావం

ఏ రోజుకు నిర్దేశించిన రంగును ఆ రోజున వాడటం వల్ల మనసుకు ఉత్సాహం, ఉల్లాసం కలుగుతాయని ఆధ్యాత్మిక వేత్తలతోపాటు మనస్తత్వ నిపుణులు కూడా చెబుతారు.

– డి.వి.ఆర్.

● బిజినెస్ టు బిజినెస్

గెలుపు పాఠం




అనూరాధ

కొన్ని దశాబ్దాల క్రితం మారుతి వినాయక్ గోకర్ణ అనే యువ ఇంజినీర్ ఎన్నో కలలతో చిన్న కంపెనీ ప్రారంభించాడు. కొన్ని సంవత్సరాల తరువాత వినాయక్ చనిపోవడంతో కంపెనీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వినాయక్ భార్య అనురాధకు వ్యాపార వ్యవహారాల గురించి ఏమీ తెలియదు. అప్పటికి ఆమె వయసు 44 సంవత్సరాలు. ఇద్దరు పిల్లలు.

‘యూనివర్శిటీ ఆఫ్ లండన్’లో ఇంగ్లీష్ ప్రొఫెసర్ అయిన అనురాధ కంపెనీ నిర్వహణ బాధ్యతను భుజాన వేసుకుంది. ‘పాఠాలు చెప్పినంత తేలిక కాదు’ అన్నారు విమర్శకులు. అయితే కంపెనీ బాధ్యతలు తీసుకున్న తరువాత తానే ఒక గెలుపు పాఠం అయింది. అప్పుల బారిన పడిన కంపెనీని ఆరు సంవత్సరాల వ్యవధిలో లాభాల బాట పట్టించింది.

కట్ చేస్తే...

ఆ కంపెనీ పేరు... ట్రిటాన్ వాల్వ్స్. మన దేశంలో ఆటోమోటివ్ టైర్ వాల్వ్‌లు, ఉపకరణాల తయారీలో అతి పెద్ద సంస్థ. వాహన పరిశ్రమకు అవసరమైన అత్యున్నతమైన టైర్ వాల్వ్‌లను అందించే ప్రపంచ స్థాయి సంస్థగా ఎదిగింది.

‘నిన్న చేసిన పొరపాటు నేడు పాఠం అవుతుంది. నా వ్యాపార ప్రస్థానంలో అలాంటి పాఠాలు ఎన్నో నేర్చుకున్నాను’ అని తన సక్సెస్‌మంత్రా గురించి చెప్పింది అనురాధ గోకర్ణ.

బులియన్
బంగారం 10 గ్రా.। వెండి కిలో
సెప్టెంబర్ 23న ముగింపు ధరలలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,18,310	1,14,500	1,15,690	1,16,450	1,17,400	1,14,540
బంగారం (22 క్యారెట్లు)	1,11,250	1,03,200	1,06,050	1,07,940	1,08,010	1,05,000
వెండి	1,45,000	1,36,400	1,50,000	1,38,400	1,38,500	1,49,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 184

బుధవారం 24-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్‌కు ఎదురుందా..

ఆసియా కప్ టి20 టోర్నీలో నేడు బంగ్లాదేశ్‌తో టీమిండియా పోరు -15లో



మూడో రోజూ మార్కెట్ డీలా

హెచ్1–బీ వీసా రుసుము పెంపు.. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాల ప్రభావం -16లో



న్యూయార్క్ సెల్ నెట్‌వర్క్‌పై కుట్ర

ఐరాస ప్రధాన కార్యాలయం చుట్టుపక్కల సెల్ నెట్‌వర్క్‌ను స్తంభింపజేసేందుకు చేసిన కుట్రను నగర పోలీసులు భగ్నం చేశారు.

వివరాలు 6లో ▸



హెచ్-1బీ విధానంలో మార్పులు

అత్యంత నైపుణ్యమున్న విదేశీయులకే హెచ్-1బీ వీసా ప్రక్రియలో అధిక ప్రాధాన్యత కల్పించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది.

వివరాలు 6లో ▸



పండుగ బ్లాక్‌బస్టర్

పండుగల సీజన్‌లో జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో పలు ఉత్పత్తుల అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి.

వివరాలు 16లో ▸



సహనమే శక్తి

స్త్రీ శక్తికి ప్రతీకగా నిలిచే దసరా వేడుక మహిళలందరికీ పెద్ద పండుగ అని అంటున్నారు యువ నటి శివాని నాగారం.

ఫ్యామిలీలో ▸

న్యూస్‌రీల్

స్పీకర్ రూలింగ్‌ను చట్ట విరుద్ధంగా ప్రకటించండి



శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు తిరస్కరిస్తూ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఇచ్చిన రూలింగ్‌ను సవాలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

- వివరాలు 17లో

మావోల రక్షణ దళంలో కోవర్టులు!



మావోయిస్టు పార్టీని కోవర్టుల సమస్య పట్టి పీడిస్తోంది. ఆ పార్టీ అగ్రనేతల వద్ద పనిచేస్తున్న రక్షణ దళ సభ్యులే కోవర్టులుగా మారుతున్నారు. పార్టీ వ్యూహాలు, నేతల కదలికల సమాచారాన్ని భద్రతా దళాలకు చేరవేస్తున్నారు.

- వివరాలు 14లో ▸

9 ఏళ్లలో సాగునీటికి రూ.లక్ష కోట్లు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత విద్య, వ్యవసాయం, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత

- రూ.1.42 లక్షల కోట్ల మూలధన వ్యయంలో రూ.లక్ష కోట్లకు పైగా సాగునీటి రంగానికే...
- తొమ్మిదేళ్లలో విద్యారంగంలో మూలధన వ్యయం కేవలం రూ.2,250 కోట్లు
- వైద్యానికి రూ.6,496 కోట్లు.. గ్రామీణాభివృద్ధికి రూ.11 వేల కోట్లు
- రెవెన్యూ వ్యయంలో విద్య, వ్యవసాయానికే ప్రాధాన్యత... రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి ఏటా రూ. 9,300 కోట్లు
- అన్ని రంగాల్లో కలిపి మొత్తం ఖర్చు రూ.11.68 లక్షల కోట్లు..
- ఆరు రంగాలకు రూ.5.34 లక్షల కోట్లు.. అనివార్య ఖర్చులు రూ.3.9 లక్షల కోట్లు
- 2013-14 నుంచి 2022-23 వరకు రాష్ట్రాల ఆర్థిక పురోగతి నివేదికలో వెల్లడించిన కాగ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలి తొమ్మిది సంవత్సరాలలో సాగునీటి రంగానికి ప్రభుత్వం రూ.1,14,145 కోట్లు ఖర్చు చేసినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వెల్లడించింది. అందులో మూలధన వ్యయం కింద రూ.1,03,894 కోట్లు, రెవెన్యూ వ్యయం కింద రూ.10,251 కోట్లు వెచ్చించినట్టు తెలిపింది. స్టేట్ ఫైనాన్సెస్ (2022-23) పేరుతో రూపొందించిన నివేదికను ఇటీవల జరిగిన అన్ని రాష్ట్రాల ఆర్థిక కార్యదర్శుల సమావేశంలో కాగ్ విడుదల చేసింది. పదేళ్ల విశ్లేషణ పేరుతో 2013-14 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు, రెవెన్యూ రాబడులు, ఖర్చులు, రాష్ట్రాల సొంతపన్నుల ఆదాయం, కేంద్రం నుంచి పలు రూపాల్లో అందే సాయం, అప్పులు, చెల్లింపులు, అనివార్యంగా చేయాల్సిన ఖర్చులు ఆ పదేళ్ల కాలంలో ఎలా పెరిగాయి.. అన్ని రాష్ట్రాలు ఎలా ఖర్చు పెట్టాయి.. జీఎస్డీపీలో ఈ రంగాల ఖర్చులు, అప్పుల శాతం ఎంత? ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి అనుగుణంగా ఏ రాష్ట్రాలు ఎలా ఖర్చు చేస్తున్నాయనే అంశాలను విశ్లేషించింది. అయితే, తెలంగాణ రాష్ట్రం 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి ఏర్పాటైనందున తొమ్మిదేళ్ల గణాంకాలను అందులో పొందుపరిచారు.

ఒకటిరెండు రంగాలే..

కాగ్ నివేదిక ప్రకారం అనేక రంగాల్లో దేశంలోని ప్రధాన రాష్ట్రాలతో తెలంగాణ పోటీ పడుతూ తొమ్మిదేళ్ల తన ప్రయాణాన్ని కొనసాగించింది. మొదటి తొమ్మిదేళ్లలో సాగునీరు, విద్య,

మిగతా 5వ పేజీలో ▸

తెలంగాణ ఏర్పాటైన తొలి తొమ్మిదేళ్లలో ఏటా జరిగిన బడ్జెటరీ ఖర్చు (రూ.కోట్లలో)

సంవత్సరం	ఖర్చు
2014-15	60,529
2015-16	94,719
2016-17	1,18,205
2017-18	1,15,476
2018-19	1,28,430
2019-20	1,34,357
2020-21	1,50,002
2021-22	1,74,147
2022-23	1,92,536
మొత్తం	11,68,401

వారాంతంలోగా స్థానిక నోటిఫికేషన్!

హైకోర్టు గడువు ముంచుకొస్తుండటంతో సర్కారు నిర్ణయం

అంతకుముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు జీవో

- ముందు ఎస్ఈసీ షెడ్యూల్.. తర్వాత ఎన్నికల నోటిఫికేషన్
- రిజర్వేషన్ల ఖరారుకు అర్ధరాత్రి వరకు అధికారుల కసరత్తు
- సీల్డ్ కవర్లలో జిల్లా కలెక్టర్లకు నివేదికలు
- తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లు ఖరారు చేయాలని సర్కారు ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఈ వారాంతంలోగా వెలువడే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఆలోగానే నోటిఫికేషన్ జారీ చేయడం వల్ల ఆ ఆదేశాలను పాటించినట్టు అవుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. దీనికిముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు ప్రభుత్వం జీవో జారీ చేస్తుందని, ఆ వెంటనే ఎన్నికల నిర్వహణ తేదీ ఖరారు చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) సమాచారం తెలియజేస్తుందనే చర్చ అధికార వర్గాల్లో జరుగుతోంది. ముందుగా ఎస్ఈసీ షెడ్యూల్ జారీ చేస్తుందని, మరుసటిరోజు నోటిఫికేషన్ విడుదల చేయొచ్చునని చెబుతున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. 42 శాతం రిజర్వేషన్లపై బీసీ సంక్షేమ శాఖ లేదా ప్రణాళిక శాఖ జీవో జారీ చేసిన తర్వాత, దీని ఆధారంగా పంచాయతీరాజ్ అధికారులు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై జీవో జారీ చేస్తారని అంటున్నారు.

రిజర్వేషన్లు బయటకు పొక్కొద్దు..

మంగళవారం కల్లా ఎంపీటీసీ స్థానాలు, ఎంపీపీ అధ్యక్షులు, జెడ్పీటీసీ స్థానాలు, వార్డు సభ్యులు, సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు

మిగతా 13వ పేజీలో ▸

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బీ వీసా వన్‌టైమ్ ఫీజును 1,00,000 డాలర్లు చేయడం ప్రపంచాన్ని నివ్వెరపోయేలా చేసింది. ముఖ్యంగా భారత టెక్ కంపెనీలు, యూఎస్‌లో ఉద్యోగం చేయాలని ఉవ్విళ్లూరుతున్న నిపుణులకు ఈ నిర్ణయంతో షాక్ తగిలింది. ఫీజు ఈ స్థాయిలో భారీగా పెంచడం వల్ల భారత సేవల రంగానికి నష్టం వాటిల్లుతుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. అంతేకాక, యూఎస్ నుంచి భారత్‌కు వచ్చే నగదు (రెమిటెన్సులు) తగ్గుతుందని చెబుతున్నారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్



భారత్‌కు వచ్చే రెమిటెన్సులపై హెచ్-1బీ ఫీజు ప్రభావం?


'లక్ష డాలర్ల' వన్‌టైమ్ ఫీజుతో కొత్త దరఖాస్తులపై ఎఫెక్ట్


మనకొచ్చే డాలర్లు.. తగ్గుతాయా?

అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాకు కొత్తగా ప్రతిపాదించిన లక్ష డాలర్ల ఫీజును కంపెనీలు భారంగా భావిస్తే ఆ మేరకు కొత్త దరఖాస్తులు తగ్గడం ఖాయమని నిపుణులు చెబుతున్నారు. ఇదే జరిగితే యూఎస్‌కు వెళ్లే ఉద్యోగుల సంఖ్య తగ్గి, ఆ మేరకు రెమిటెన్సులు పడిపోతాయని వారంటున్నారు. హెచ్-1బీ వీసా పొందుతున్న వారిలో ఏటా సుమారు 70 శాతం భారతీయులే ఉంటారు.

అమెరికాదే సింహభాగం

ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక మొత్తంలో విదేశాల నుంచి వచ్చే నగదు అందుకుంటున్న దేశం మనదే. 2024-25లో ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న భారతీయులు మనదేశానికి 135.46 బిలియన్ డాలర్లు పంపినట్టు రిజర్వు బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో అత్యధిక శాతం వాటాతో యూఎస్ అగ్రస్థానంలో నిలిచింది. 2020-21లో మొత్తంగా వచ్చిన రెమిటెన్సులు 80,185 మిలియన్ డాలర్లు కాగా, 2020-21లో అది 89,127 మిలియన్ డాలర్లకు పెరిగింది. అమెరికా నుంచి వచ్చే రెమిటెన్సుల శాతం 2020-21లో 23.4 శాతం నుంచి 2024-25లో ఏకంగా 27.7 శాతానికి పెరిగింది. అంటే.. నాలుగింట ఒకవంతుకు పైగా అమెరికానుంచే వస్తోందన్నమాట.






టాప్ కంపెనీలు

2024-25లో అత్యధిక సంఖ్యలో హెచ్-1బీ వీసాలు స్పాన్సర్ చేసిన కంపెనీలు

అమెజాన్‌కామ్ సర్వీసెస్	10,044
టీసీఎస్	5,505
మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్	5,189
మెటా ప్లాట్‌ఫామ్స్	5,123
యాపిల్	4,202
గూగుల్	4,181
కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్	2,493
జేపీమోర్గాన్ చేజ్ అండ్ కో	2,440
వాల్‌మార్ట్ అసోసియేట్స్	2,390
డెలాయిట్ కన్సల్టింగ్	2,353

సంవత్సరం	జారీ అయిన హెచ్-1బీ వీసాలు	భారతీయుల శాతం
2019-20	1,24,983	75.66
2020-21	61,569	74.73
2021-22	2,06,002	80.72
2022-23	2,65,777	77.68
2023-24	2,19,659	68.58



ఆధారం: యూఎస్ సెన్సెస్, ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, అమెరికా పౌరసత్వ, ఇమ్మిగ్రేషన్ సేవల విభాగం

క్లుప్తంగా...

పెండింగ్ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయండి

కేంద్ర రైల్వే మంత్రికి డీకే అరుణ విజ్ఞప్తి



సోమన్నకు వినతిపత్రం అందజేస్తున్న డీకే అరుణ. చిత్రంలో శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టు పనులు వెంటనే పూర్తి చేయాలని కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్నకు బీజేపీ ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి పలు పెండింగ్ పనులకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆమె వెంట ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

తెలంగాణకు 22 మంది కాంగ్రెస్ పరిశీలకులు

డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం...

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల ఎంపికకు మొత్తం 69మంది అబ్జర్వర్‌లను కాంగ్రెస్ పార్టీ నియమించింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'సంఘటన్ శ్రీజన్ అభియాన్'లో భాగంగా వీరిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించినట్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. 69 మంది పరిశీలకుల్లో 22 మంది తెలంగాణకు రానున్నారు.

వాణిజ్యపరమైన ఆటలకు అనుమతి లేదు

ఎంఎంసీసీసీ జనరల్ సెక్రెటరీ రాగిడి లక్ష్మారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేలు, ఎంపీల కాలనీ కల్చరల్ సెంటర్ (ఎంఎంసీసీసీ) జంట నగరాల్లో రోజురోజుకు ప్రాచుర్యం పొందుతున్నందు వల్లే కొందరు తెలియని వ్యక్తులు ద్వేషంతో దుష్ప్రచారం చేస్తున్నారని ఎంఎంసీసీసీ ప్రధాన కార్యదర్శి రాగిడి లక్ష్మారెడ్డి ఆరోపించారు. 'సాక్షి'లో ప్రచురితమైన 'కల్చరల్ సెంటర్‌లో 'కిట్టీ'దందా..!'అనే కథనంపై మంగళవారం ఒక ప్రకటనలో ఆయన వివరణ ఇచ్చారు. రమ్మీ, బ్రిడ్జ్ వంటి నైపుణ్యం కలిగిన ఆటలు మాత్రమే ఎంఎంసీసీసీలో ఆడటానికి అనుమతి ఉందని, ఇతర వాణిజ్యపరమైన ఆటలకు అనుమతి లేదన్నారు. తమ క్లబ్ కార్డ్ గేమ్‌లకు ఎటువంటి రుసుము వసూలు చేయదన్నారు. క్లబ్ నిబంధనలతోపాటు హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారమే కార్డుల విభాగాలను నడుపుతున్నామన్నారు.



సమ్మక్క గద్దెను మొక్కుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



గద్దెల ప్రాంగణం విస్తరణ, పునర్నిర్మాణ మాస్టర్‌ప్లాన్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

ప్రపంచం కీర్తించేలా మేడారం

▶ మొదటి పేజీ తరువాయి

స్వీకరించారు. గిరిజన కొమ్ము కోయ నృత్యంతో, గిరిజన సంప్రదాయం ప్రకారం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్దకు వెళ్లారు. అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. మాస్టర్ ప్లాన్ పేరుతో రూపొందించిన గద్దెల నూతన డిజైన్లను విడుదల చేశారు. ఆలయం అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఆలయం పనులు ప్రారంభించారు. సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

అమ్మల ఆశీస్సులతోనే ప్రజా ప్రభుత్వం

'మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందింది. ఇది తెలంగాణ ప్రజల ఆత్మీయత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీక. రాష్ట్ర సాంస్కృతిక గొప్పతనాన్ని, గిరిజనుల పోరాట చరిత్రను ప్రతిబింబిస్తుంది. ఆదివాసీలు దేశానికి మూలవాసులు.. పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మ తల్లులు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి అమ్మవార్లను సందర్శిస్తున్నా. 2023 ఫిబ్రవరి 6న ఈ గద్ద మీదనుంచే పాదయాత్ర మొదలుపెట్టా. అమ్మల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించింది. శాశ్వత ప్రాతిపదికన గద్దెల ప్రాంగణం, పునర్నిర్మాణం పనులు చేపట్టాం. ఈ ఆలయం డబ్బులతో కొలిచేది కాదు.. నమ్మకంతో కొలిచేది. ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా అభివృద్ధి ఉండాలి. ఇందుకోసం ప్రభుత్వం ఎన్ని నిధులైనా కేటాయిస్తుంది.

ఆదివాసీ కుంభమేళాకు నిధులెందుకివ్వరు..?

'కుంభమేళాకు వేలకోట్లు ఇస్తున్న కేంద్రం ఆదివాసీ కుంభమేళా మేడారం జాతరకు ఎందుకు నిధులు ఇవ్వడంలేదు? జాతీయ స్థాయిలో మేడారం జాతరకు గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా. నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఈ విషయం ఆలోచించాలి. అయోధ్య, కుంభమేళాకే కాదు.. మేడారానికి కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించి నిధులు తీసుకురావాలి..' అని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ..గతంలో ఈ మహా జాతరను అధికారికంగా నిర్వహించే అవకాశం తనకు ఇవ్వాలని కోరుకున్నానని, అదే మాదిరిగా నా కోరికను తీరుస్తూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటై జాతరను అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు.

మొక్కులు సమర్పించుకున్న సీఎం

మేడారం సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను దర్శించుకున్న సీఎం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు 68 కేజీల నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకున్నారు. 2024 ఫిబ్రవరిలో తల్లులను దర్శించుకుని నిలువెత్తు బంగారం సమర్పించుకున్నప్పుడు ముఖ్యమంత్రి బరువు 68 కిలోలు కాగా.. ఇప్పుడు కూడా 68 కిలోలే ఉన్నారు.

పూజారులు, ఆదివాసీ సంఘాలతో భేటీ

ఆలయ అభివృద్ధిపై సమీక్ష సందర్భంగా ఆలయ విస్తరణకు సంబంధించిన ప్రణాళిక, డిజైన్లను పూజారులు, ఆదివాసీ సంఘాలకు అధికారులు వివరించారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు సీఎం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి ఆదివాసీ సంఘాలు తీసుకువచ్చాయి. వీటిపై స్పందించిన సీఎం..ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకునే ఆలయ అభివృద్ధి ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో ఆలయ విస్తరణ, అభివృద్ధికి పూజారులు, ఆదివాసీ సంఘాల నాయకులు ముక్తకంఠంతో ఆమోదం తెలిపారు. హెలికాప్టర్‌లో వచ్చిన ముఖ్యమంత్రి వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు. ఆయా కార్యక్రమాల్లో వీరితో పాటు ఎమ్మెల్సీలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, బాలు నాయక్, కడియం శ్రీహరి, మురళీనాయక్ , రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

ఇక ఒకే వరుసలో గద్దెలు



మేడారం గద్దెల నమూనా చిత్రం

సమ్మక్క, సారలమ్మ గద్దెలు ప్రస్తుతం ఒక వరుసలో ఉండగా, వీరి ఎదురుగా పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు ఉన్నాయి. అయితే భక్తులు క్యూ లైన్ ద్వారా సమ్మక్క- సారలమ్మను దర్శించుకుని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల వద్దకు రావటం ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు ఒకే వరుసలో ఉండేలా నిర్మాణానికి వీలుగా కొత్తగా డిజైన్ రూపొందించారు. గద్దెల చుట్టూ ఉన్న ఇనుప గ్రిల్స్ స్థానంలో గ్రానైట్ నిర్మాణం చేపట్టనున్నారు. గ్రానైట్‌పై సమ్మక్క, సారలమ్మ చరిత్రతో పాటు గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలు, వారి లిపి, జాతర వైభవం తెలియజేసే బొమ్మలను చెక్కనున్నారు. అదే విధంగా మహా జాతర వేళ భక్తులకు సమ్మక్క, సారలమ్మ తల్లులు.. పగిడిద్ద రాజు, గోవిందరాజుల దర్శనం కష్టం కాకుండా స్థల సేకరణ ద్వారా గద్దెల ప్రాంగణం విస్తరణను ప్లాన్‌లో చేర్చారు. ఇందుకోసం దేవాదాయ శాఖకు చెందిన 4 ఎకరాలు, ప్రభుత్వ భూమి 19 ఎకరాలు.. మొత్తం 23 ఎకరాలు సేకరిస్తారు. అతిథి గృహాలు నిర్మించాలనే ప్రతిపాదన కూడా ఉంది.

23 గ్రామాలపై మధ్యంతర ఉత్తర్వులు

హైకోర్టు తీర్పుపై స్టే విధించిన సుప్రీంకోర్టు

- గిరిజనేతరులకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు
- 1950నాటి రాష్ట్రపతి ఉత్తర్వుల్లో ఆ గ్రామాలు లేవన్న పిటిషనర్ న్యాయవాది



సాక్షి, న్యూఢిల్లీ/మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలంలోని 23 గ్రామాలపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 23 గ్రామాలను షెడ్యూల్డు ప్రాంతాలుగా పరిగణిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. 'సెప్టెంబరు ఆఖరులోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఆ 23 గ్రామాల్లోనూ రిజర్వేషన్ల ప్రకారమే షెడ్యూల్ విడుదల చేసే అవకాశముంది. అందువల్ల అత్యవసరంగా ఈ పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది'అని సీనియర్ న్యాయవాది వివేక్ తన్ఖా చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. 1949లో మంగపేట మండలంలోని 23 గ్రామాలు షెడ్యూల్డు తెగలకు చెందినవని చెబుతూ జారీ చేసిన నోటిఫికేషన్ సబబే అంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది.

అసలేం జరిగిందంటే..

నిజాం ప్రభుత్వం 1949లో హైదరాబాద్ రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలను నోటిఫై చేసి, ఈ నోటిఫికేషన్‌ను ఢిల్లీకి పంపింది. దీని ప్రకారం పాల్వంచ, బూర్గంపహాడ్, అశ్వారావుపేట, దమ్మపేట, కుకునూరు, నెల్లిపాక తదితర ప్రాంతాలను హైదరాబాద్ స్టేట్ గిరిజన ప్రాంతాలని స్పష్టం చేసింది. అప్పుడు పాల్వంచ తాలూకా పరిధిలో ఉన్న మంగపేట (ప్రస్తుత ములుగు జిల్లా) మండలంలోని 23 గ్రామాలను ఆ తరువాత రాజ్యాంగంలోని షెడ్యూల్డ్ ఏరియాలో భాగమని తేల్చింది. అయితే, 1/70 చట్టం అమల్లోకి వచ్చిన తరువాత కోయ బ్రహ్మానందం సహా 130 మంది మంగపేట షెడ్యూల్ ప్రాంతం కాదంటూ.. 1973, 1974లో కేసు వేశారు. అయితే, అప్పటి 1/70 చట్టం పరిధిలో మంగపేట ఉందని వాదించేందుకు గిరిజనుల దగ్గర ఆధారాలు లేకపోవటంతో మంగపేట గిరిజనేతర ప్రాంతమేనని 1974లో కోర్టు తీర్పునిచ్చింది. దీంతో అప్పటి నుంచి ఆదివాసీ గిరిజనులు సమస్యలు ఎదుర్కొన్నారు. 2006లో ఆదివాసీలు ఏకతాటిపైకి వచ్చి ఆ 23 గ్రామాలను షెడ్యూల్ ప్రాంతం కిందే ఉంచాలని హైకోర్టును ఆశ్రయించగా, ఆ గ్రామాలు షెడ్యూలు పరిధిలోకే వస్తాయని తీర్పు చెప్పింది. దీంతో 2006లో ఎన్నికలు నిర్వహించారు. గిరిజనులే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ తీర్పును పునఃసమీక్షించాలని 2011లో గిరిజనేతరులు హైకోర్టును ఆశ్రయించగా, 2014లో జస్టిస్ రమేశ్ రంగనాథన్ ధర్మాసనం గిరిజనులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే, గిరిజనేతరులు అదే ఏడాది డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. వాటిని రద్దు చేస్తూ ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టాలను తీసుకురాలేదు కాబట్టి.. ఆ 23 గ్రామాలు షెడ్యూలు ప్రాంతాలేనని సీజే ధర్మాసనం 2023, జూలై 5న తీర్పు వెలువరించింది. అదే ఏడాది ఆగస్టు 24న గిరిజనేతరులు హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీన్ని మంగళవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ ధర్మాసనం విచారించింది. గౌరవ్ అగర్వాల్, ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సెల్ శ్రవణ్, ఏవోఆర్ మోహిత్ రావు తెలంగాణ ప్రభుత్వం తరఫున... సీనియర్ న్యాయవాదులు వివేక్ తన్ఖా, విష్ణువర్ధన్ రెడ్డి పిటిషనర్ల తరఫున వాదించారు.

రాష్ట్రపతి ఉత్తర్వుల్లో ఆ గ్రామాలు లేవు

1950లో రాష్ట్రపతి జారీచేసిన ఉత్తర్వుల్లో మంగపేట మండలంలోని 23 గ్రామాలు లేవని, అందువల్ల వాటిని గిరిజన గ్రామాలుగా గుర్తిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవని వివేక్ తన్ఖా వాదనలు వినిపించారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ 23 గ్రామాలను ప్రెసిడెంట్ నోటిఫై చేశారని, అయితే.. ఈ ప్రక్రియ కొంత ఆలస్యం జరిగిందని, ఈ మధ్యలో ఆ గ్రామాలను పాల్వంచ తాలూకా నుంచి ములుగు తాలూకాలో కలిపారని తెలిపారు. ఇది కేవలం పాలనాపరమైన పొరపాటే కానీ.. రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకం కాదన్నారు. అవి ముమ్మాటికీ గిరిజన గ్రామాలేనని వాదించారు.

మీ కృషి తెలుగు చిత్రసీమను

కొత్త శిఖరాలకు చేర్చింది

జాతీయ అవార్డు గ్రహీతలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అభినందనలు



సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ చలన చిత్ర అవార్డులు అందుకున్న వారి కృషి, సృజనాత్మకత తెలుగు చిత్రసీమను కొత్త శిఖరాలకు చేర్చిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రశంసించారు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న తెలుగు సినీ ప్రముఖులకు మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన అభినందనలు తెలిపారు. '71వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఉత్తమ తెలుగు చిత్రం అవార్డు అందుకున్న భగవంత్ కేసరి, యానిమేషన్ - విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో ఉత్తమ చిత్రం పురస్కారం అందుకున్న 'హనుమాన్'చిత్ర బృందానికి హృదయపూర్వక అభినందనలు. బలగం చిత్రానికి ఉత్తమ గీత రచయిత అవార్డు అందుకున్న కాసర్ల శ్యామ్, 'బేబీ'చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే అవార్డు పొందిన సాయి రాజేశ్, అదే చిత్రానికి ఉత్తమ నేపథ్య గాయకుడిగా అవార్డు అందుకున్న రోహిత్, 'గాంధీ తాత చెట్టు'చిత్రానికి ఉత్తమ బాలనటిగా అవార్డు అందుకున్న సుకృతి బండ్రెడ్డి, 'హనుమాన్' చిత్రానికి ఉత్తమ స్టంట్ కొరియోగ్రఫీ అవార్డు అందుకున్న నందు, పృథ్వీకి హృదయపూర్వక అభినందనలు. మీ అందరి కృషి, సృజనాత్మకత తెలుగు చిత్రసీమను కొత్త శిఖరాలకు చేర్చింది. మీ విజయాలు యువతకు ప్రేరణగా నిలవాలని, భవిష్యత్తులో మరిన్ని ఘన విజయాలను అందుకోవాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను'అని పేర్కొన్నారు.

'నిలోఫర్' కొనుగోళ్లపై

విచారణకు ఆదేశం

- పరికరాల కొనుగోళ్లు టెండర్ల ద్వారానే జరపాలి: వైద్యశాఖ కార్యదర్శి
- 'సాక్షి' కథనానికి స్పందన




నిలోఫర్ ఆసుపత్రి వద్ద కలెక్టర్ నారాయణ రెడ్డితో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ

సాక్షి, హైదరాబాద్: నిలోఫర్ ఆస్పత్రిలో పరికరాల కొనుగోళ్లపై విచారణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా చేపట్టే కొనుగోళ్లన్నీ టెండర్ల ద్వారానే చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ అధికారులను ఆదేశించారు. మంగళవారం నిలోఫర్ ఆస్పత్రిలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అధ్యక్షతన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చొంగ్తూతోపాటు డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో మంగళవారం 'సాక్షి'లో 'నిలోఫర్‌లో అక్రమాలపై విచారణ ఏది?'శీర్షికన ప్రచురితమైన కథనంపై చొంగ్తూ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. హిందూస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) సీఎస్ఆర్ కింద కేటాయించిన రూ.20 కోట్ల నిధులను వెచ్చించిన తీరుపై ఆడిట్ నిర్వహించాలని, భవిష్యత్‌లో పరికరాల కొనుగోళ్లన్నీ టీజీఎస్ఎంఐడీసీ ద్వారానే చేపట్టాలని ఆదేశించినట్టు తెలిసింది. కాగా తన హయాంలో జరిగిన రూ.6 కోట్ల విలువైన పరికరాల కొనుగోళ్లన్నీ పారదర్శకంగా జరిగాయని, ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ 'సాక్షి'కి తెలిపారు.

నిలోఫర్‌లో పీజీ హాస్టల్ భవనం: నిలోఫర్ ఆస్పత్రి ప్రాంగణంలో 280 మంది డాక్టర్లు (పీజీ స్టూడెంట్స్, సీనియర్ రెసిడెంట్స్) ఉండేందుకు అనువుగా హాస్టల్ భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ అధ్యక్షతన నిలోఫర్ హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో నిర్ణయించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు భవనాల నిర్మాణం కోసం ఆస్పత్రి ప్రాంగణంలో స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ మేరకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించనున్నట్టు చొంగ్తూ తెలిపారు. ఈ హాస్టల్లో పెద్దసంఖ్యలో డాక్టర్లు 24 గంటలపాటు అందుబాటులో ఉంటారని, తద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ఆస్పత్రి భవనంపై నిర్మించిన ఐరన్ స్ట్రక్చర్‌ను త్వరలోనే వైద్య సేవల కోసం అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రాంగణంలో నిర్మించిన ధర్మశాల భవనాన్ని ఆరోగ్యశాఖకు అప్పగించాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు.

జస్టిస్ ఘోష్ నివేదిక నిలిపేయండి

హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన స్మితా సబర్వాల్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపి జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను నిలిపివేయాలని కోరుతూ అప్పటి సీఎం కేసీఆర్ అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కమిషన్ తనకు సాక్షిగా సమన్లు మాత్రమే జారీ చేసిందని, చట్టప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. ఈ పిటిషన్‌పై ఒకట్రెండు రోజుల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ ధర్మాసనం విచారణ చేపట్టనుంది. 'కాళేశ్వరం నిర్మాణంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నేను బాధ్యురాలిని కాను. అప్పటి ముఖ్యమంత్రికి ఫీడ్‌బ్యాక్ ఇచ్చానని. సీఎంవో ప్రత్యేక కార్యదర్శి హోదాలో 3 బరాజ్‌ల నిర్మాణ స్థలాలను కూడా సందర్శించానని కమిషన్ పేర్కొంది. బరాజ్‌ల నిర్మాణానికి పరిపాలనా అనుమతి, ఆమోదాల మంజూరులో నా పాత్ర ఉందని చెప్పింది. సంబంధిత ఫైళ్లను కేబినెట్ ఆమోదం కోసం ఉంచనందుకు, నిబంధనలను ఉల్లంఘించినందుకు నాపై తీవ్ర చర్యలకు సిఫార్సు చేశారు. కమిషన్ నాపై పక్షపాతంతో పరువు నష్టం కలిగించేలా తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. ఈ నివేదికను రద్దు చేయాలి'అని స్మిత పిటిషన్‌లో పేర్కొన్నారు.



సౌమ్యకు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం. చిత్రంలో మంత్రి శ్రీహరి తదితరులు

ఫుట్‌బాల్ క్రీడాకారిణి సౌమ్యను అభినందించిన సీఎం

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోతు సౌమ్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ఇటీవల అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య నుంచి ఉత్తమ క్రీడాకారిణి పురస్కారాన్ని సౌమ్య అందుకున్నారు. ఫుట్‌బాల్‌లో విశిష్ట ప్రతిభను సౌమ్య చాటారని సీఎం ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ముహమ్మద్ అలీ రఫ్వుత్ పాల్గొన్నారు.

బాలికలకు 'ప్రేమ్‌జీ' స్కాలర్‌షిప్స్

- ఉన్నత విద్యలో చేరినవారికి ఏటా రూ.30 వేలు
- ఈ నెలాఖరు వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి



స్కాలర్‌షిప్ దరఖాస్తు పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్య అభ్యసించే బాలికలకు అజీమ్ జీ ప్రేమ్ ఫౌండేషన్ ఏటా రూ.30 వేల ఉపకార వేతనం అందిస్తోందని అజీమ్ ప్రేమ్‌జీ తెలంగాణ ప్రాంత బాధ్యుడు ఎం శ్రీనివాస్‌రావు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్లో టెన్త్, ఇంటర్ చదివి గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరిన బాలికలకు ఈ స్కాలర్‌షిప్ అందిస్తారని వెల్లడించారు. డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ చదివే బాలికలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. గ్రాడ్యుయేషన్‌లో చేరింది మొదలు కోర్సు పూర్తయ్యే వరకు ఏటా రూ.30 వేలు అందిస్తారని వివరించారు. అయితే, విద్యార్థులు తప్పనిసరిగా టెన్త్, ఇంటర్ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉండాలని తెలిపారు. 18 రాష్ట్రాల్లో 2.5 లక్షల మంది బాలికలకు తమ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నట్టు శ్రీనివాసరావు వెల్లడించారు. బెంగళూరు, భోపాల్‌లో యూనివర్సిటీలు నిర్వహిస్తోందని చెప్పారు. మధ్యప్రదేశ్‌లో 1.26 లక్షల మంది, కర్ణాటకలో 88 వేల మంది స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తు చేశారని, తెలంగాణలో 3,275 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు. బాలికల్లో ఈ పథకం పట్ల సరైన అవగాహన లేకపోవడమే ఇందుకు కారణమని అన్నారు.

దరఖాస్తు చేయడం ఇలా...

అజీమ్ ప్రేమ్‌జీ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేయవచ్చు. తాజా పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సంతకం, బ్యాంకు ఖాతా వివరాలు, టెన్త్, ఇంటర్ మార్కుల మెమో, ఆధార్ కార్డు, గ్రాడ్యుయేషన్ అడ్మిషన్ ఫీజు (బోనఫైడ్ లేదా ట్యూషన్ ఫీజు రసీదు)తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. దీనికి ఎలాంటి ఫీజు ఉండదు. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు పంపాలి. రెండో విడత దరఖాస్తుల ప్రక్రియను వచ్చే ఏడాది జనవరిలో ప్రా రంభిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మంది విద్యార్థినులకు స్కాలర్‌షిప్ అందిస్తారు. అ ర్హులను లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. పూర్తి వివరాల కోసం 99630 28900 నంబర్‌లో సంప్రదించాలని ఫౌండేషన్ సూచించింది.

ప్రజల బతుకమ్మగా సంబురాలు

- టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- గాంధీభవన్‌లో వేడుకలకు హాజరైన పొన్నం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటైన తర్వాత తొమ్మిదేళ్ల పాటు బతుకమ్మను కూడా బీఆర్‌ఎస్ రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజల బతుకమ్మగా సంబురాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. మంగళవారం టీపీసీసీ ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో గల్ఫ్ సంక్షేమ బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మహేశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని చెప్పారు. బతుకమ్మ సంబురాల్లో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలని కోరారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గిన్నిస్‌బుక్ రికార్డుల్లో ఎక్కేలా రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేషన్ల చైర్‌పర్సన్‌లు వెన్నెల గద్దర్, కల్వ సుజాత, రైతు కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి హాజరయ్యారు.

గ్రూప్-1 అప్పీళ్లను నేడు విచారిస్తాం

- టీజీపీఎస్సీ అప్పీల్‌తోపాటే మీ వాదనలూ వింటాం
- గ్రూప్-1 విజేతకు స్పష్టం చేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి దాఖలు చేసిన అప్పీల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వేసిన అప్పీల్‌తో కలిపి విచారిస్తామని హైకోర్టు తెలిపింది. అప్పీల్‌ను బుధవారానికి వాయిదా వేసింది. ఈ అప్పీళ్లపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ చేపట్టనుంది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో అవకతవకలు జరిగాయంటూ ఉద్యోగుల ఎంపికను రద్దు చేయడం చెల్లదని హైదరాబాద్ గోపాల్‌నగర్‌కు చెందిన గ్రూప్-1 విజేత షాగుఫ్తా ఫిర్దౌస్ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున కె.లక్ష్మీనరసింహ వాదనలు వినిపిస్తూ.. పరీక్షలు సరిగా నిర్వహించనందున అవకతవకలు జరిగేందుకు ఆస్కారం ఉందంటూ ఎలాంటి దర్యాప్తు, విచారణ లేకుండా సింగిల్ జడ్జి తీర్పు ఇవ్వడం చెల్లదన్నారు. అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే పరీక్షను రద్దు చేస్తారని చెప్పారు. కమిషన్ తరఫున న్యాయవాది రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. కమిషన్ కూడా అప్పీల్ దాఖలు చేసిందని గుర్తుచేశారు. దీంతో ధర్మాసనం.. ఇద్దరి వాదనలు ఒకేసారి వింటామని తెలియజేస్తూ విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

అగ్రోఫారెస్ట్రీకి పూర్తి సహకారం

పీసీసీఎఫ్ డా.సువర్ణ హామీ

సాక్షి, హైదరాబాద్: తమ శాఖ నుంచి అగ్రోఫారెస్ట్రీకి పూర్తి సహకారం అందిస్తామని పీసీసీఎఫ్ డా.సువర్ణ పేర్కొన్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా కలపకు డిమాండ్ పెరుగుతోందని, అందువల్ల కేవలం అటవీ ప్రాంతంలో లభించే చెట్లు మాత్రమే కాకుండా రైతులు తమ పంట పొలాల్లో వెదురు, యూకలిప్టస్, సుబాబుల్‌తోపాటు త్వరగా పంట సాగుకు వచ్చే కలపపై దృష్టి పెట్టాలన్నారు. కలపేతర వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఫర్నిచర్ తయారు చేసుకోవాలని సూచించారు. మంగళవారం ఓ ప్రైవేట్ హోటల్లో... ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలో కలప ఆధారిత పరిశ్రమల అభివృద్ధిపై సమావేశం జరిగింది. ఐడబ్ల్యూఎస్‌టీ డైరెక్టర్ శక్తి సింగ్ చౌహాన్ బృందం తాజా సాంకేతికతలు, పరిశోధన ఫలితాలు, శిక్షణా అవకాశాలపై టింబర్ డిపో ప్రతినిధులకు వివరించింది.



దౌర్జన్యాన్ని ప్రతిఘటించటం అంటే,
దేవుని పట్ల విధేయత ప్రకటించటం!
– మేడమ్ భికాజీ రుస్తుం కామా

సాక్షి
బుధవారం, 24 సెప్టెంబర్ 2025

పాలస్తీనాకు ప్రపంచం ఆసరా

‘అమెరికా సొమ్ముతో, బ్రిటన్ ఆయుధాలతో ఉగ్రవాదాన్ని ఆసరా చేసుకుని యూదులు పాలస్తీనా దేశంలోకి చొరబడి అక్కడ దేశాన్ని నిర్మించుకుంటామనటం ఏం న్యాయం? నాజీల చేతుల్లో అనుభవించిన దుర్దశ వారికి శాంతి పాఠాలు నేర్పితే సర్వులూ సంతోషించేవారు’ –ఇజ్రాయెల్ ఆవిర్భావానికి అగ్రరాజ్యాలు బాటలుపరుస్తున్నప్పుడూ, యూదు ఉగ్రవాదులు మానవబాంబులుగా మారి విధ్వంసం సృష్టిస్తున్నప్పుడూ మహాత్ముడు తన ‘హరిజన్’ పత్రికలో రాసిన వ్యాసంలోని వాక్యాలివి. ఏడున్నర దశాబ్దాలుగా పాలస్తీనాలో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న విధ్వంసం, జనహననం మరిన్ని దేశాల కళ్లు తెరిపించాయి. పాలస్తీనాను ప్రపంచపటం నుంచి తుడిచిపెట్టడానికి ఉవ్విళ్లూరుతూ గాజా స్ట్రిప్‌లో అమానుష హత్యాకాండకు పాల్పడుతున్న ఇజ్రాయెల్‌కు చెంపపెట్టులా పాలస్తీనాను లాంఛనంగా గుర్తిస్తున్నట్టు పది దేశాలు ప్రకటించాయి. బ్రిటన్, కెనడా, పోర్చుగల్, ఆస్ట్రేలియాలు ఆదివారం... ఫ్రాన్స్, మరో అయిదు దేశాలు ఆ మరునాడూ ఈ గుర్తింపు ప్రకటన చేశాయి. ఇప్పటికే భారత్ సహా 147 దేశాలు పాలస్తీనాను గుర్తించాయి. దీంతో ఐక్యరాజ్యసమితిలోని 193 దేశాల్లో 80 శాతం పాలస్తీనాను గుర్తించినట్టయింది. రెండు దేశాల ఉనికిని గుర్తిస్తూ, పాలస్తీనా సమస్యకు శాంతియుత పరిష్కారాన్ని కోరుకుంటూ సమితి నిర్వహించిన ఉన్నత స్థాయి అంతర్జాతీయ సదస్సులో 33 దేశాల ప్రతినిధులు ప్రసంగించారు. ఇప్పటికే 65,300 మంది పౌరులను హతమార్చి, గాజాను మరుభూమిగా మారుస్తున్న ఇజ్రాయెల్ ఆగడాలను ఖండించిన ఈ నిండు సభకు గైర్హాజరు కావటంద్వారా అమెరికా తన నైజాన్ని చాటుకోగా, ఇజ్రాయెల్‌కు మొహం చెల్లలేదు.

పాలస్తీనాను గుర్తించటమంటే ఉగ్రవాద సంస్థ హమాస్‌కు బహుమతి ఇచ్చినట్టేనన్న ఇజ్రాయెల్, అమెరికాల తర్కం అర్థరహితమైనది. శాంతియుతంగా పాలస్తీనా కోసం పోరాడుతున్న పాలస్తీనా లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఓ)ను బలహీనపరచటానికి 1987లో హమాస్ ఆవిర్భావానికి లోపాయకారీగా మద్దతునిచ్చింది ఇజ్రాయెలే! దాని కనుసన్నల్లోనే జనంలో పలుకుబడి పెంచుకుని, మరో సంస్థ ఫతాపై పైచేయి సాధించి, చివరకు 2007లో గాజాలో పాలనా బాధ్యతలు చేపట్టిన హమాస్ ఉగ్రవాద విధానాలను మెజారిటీ ప్రజలు మొదటి నుంచీ వ్యతిరేకించారు. ఎంతో పకడ్బందీగా ఉండే ఇజ్రాయెల్ భద్రతా వ్యవస్థ కన్నుగప్పి 2023 అక్టోబర్ 7న 1,200 మంది పౌరులను కాల్చిచంపి, 240 మందిని అపహరించటం వెనక కూడా ‘ఏదో జరిగిందన్న’ అనుమానాలు అనేక మందిలో ఉన్నాయి. ఆ సంగతలా ఉంచి హమాస్ దాడిని ఆసరా చేసుకుని సాధారణ ప్రజానీకంపై బాంబుల వర్షం కురిపించి వేలాదిమందిని హతమార్చటం, ఆహార పదార్థాలూ, నీళ్లు అందకుండా చేసి ఆకలిమంటల్లో ఆహుతి చేయటం ఏ విధంగా సమర్థనీయం?

ఇజ్రాయెల్ ఆగడాలను ప్రశ్నించినప్పుడల్లా అక్టోబర్ 7 ఘటన మాటేమిటని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అమాయకంగా అడుగుతున్నారు. ఆయనకు ముందున్న జో బైడెన్ ఇదే తర్కంతో ఇజ్రాయెల్ దుర్మార్గాలకు మద్దతునిచ్చారు. అమెరికాలో ఉన్న యూదు ఓటుబ్యాంకుకు ఆశపడి అక్కడి పాలకులు ఇజ్రాయెల్ సాగిస్తున్న ఆగడాలకు డబ్బూ, ఆయుధాలూ సమకూరుస్తున్నారు. ఈ క్రమంలో ప్రపంచంలో అమెరికా ఏకాకి అవుతున్నదని మరుస్తున్నారు. అంతర్జాతీయ న్యాయస్థానంలో న్యాయమూర్తిగా పని చేసి మానవ హక్కుల కోసం, ముఖ్యంగా మహిళల, పిల్లల హక్కుల కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్న నవీ పిళ్లై ఐక్యరాజ్యసమితి విచారణ కమిషన్ అధ్యక్షురాలిగా ఇటీవల సమర్పించిన నివేదికలోని వివరాలు దిగ్భ్రాంతి గొలుపుతాయి. ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్, ప్రధాని నెతన్యాహూ, మాజీ రక్షణమంత్రి యోవ్ గాలెంట్, ఇజ్రాయెల్ సైన్యం నరమేధం అనదగ్గ చర్యలకు పాల్పడ్డారని ఈ కమిషన్ నిర్ధారించింది. దీని ఆధారంగా అంతర్జాతీయ న్యాయస్థానం నరమేధం జరిగిందని ప్రకటించాల్సి ఉంది. వచ్చే నెలలో 80వ వార్షికోత్సవం జరుపుకోబోతున్న ఐక్యరాజ్యసమితి నిస్సహాయంగా మిగిలిపోవటం ప్రపంచానికి పొంచివున్న పెనుముప్పును తెలియజెబుతోంది. దౌత్యపరంగా ప్రపంచ దేశాలన్నీ తీసుకొస్తున్న ఒత్తిళ్లు ఫలించి కనీసం ఈ దశలోనైనా ఇజ్రాయెల్ దుర్మార్గాలు నివారించలేకపోతే భవిష్యత్తరాలు క్షమించవు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.తదియ తె.4.18 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి చవితి, **నక్షత్రం:** చిత్త ప.3.11 వరకు తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.9.22 నుండి 11.08 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.31 నుండి 12.19 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.11 నుండి 9.55 వరకు.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.54
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

ఎదురు చూడొద్దు



విజయానికి కీలకం... ప్రయోగాలు చేయడం, విఫలమవటం, వైఫల్యాల నుండి అమూల్యమైన పాఠాలు నేర్చుకోవటం! విజయం మీకు ఎదురొచ్చేవరకు మీరు చేయవలసిన పని ప్రయత్నిస్తూ ఉండటమే!! విజయం కోసం చూస్తూ ఉండటం కాదు!!

– మాధవ్ షేఠ్, హెచ్‌టెక్ ఇండియా సీఈవో

మీలోనే ఉంది



మీరు ఇతరుల నుండి నేర్చుకుంటే నేర్చుకోండి కానీ, మీ నైపుణ్యాల మీదే మీరు నమ్మకం ఉంచండి. ఇతరులను అనుకరించాలనే ఆలోచనతో ఏదీ ప్రారంభించకండి. మీ బలాలకు తగ్గట్టుగా గేమ్ ఆడండి. తప్పకుండా అనుకున్నది సాధిస్తారు.

– ఏంజెలస్ పొస్టెకోగ్లో, సాకర్ మేనేజర్, ఆస్ట్రేలియా

ముందే ఓడినట్లు!



ఆందోళన మిమ్మల్ని ముందుకు తీసుకెళ్లలేదు. సాధించగలమా అని చింతిస్తూ కూర్చున్నారంటే మీరు ముందే ఓడిపోయినట్లు! శిక్షణ తీసుకోండి. సాధన చెయ్యండి. శక్తి పుంజుకోండి. మిగతాది మీరు పోటీకి దిగబోయే మైదానమే చూసుకుంటుంది.

– ఉసేన్ బోల్ట్, రిటైర్డ్ రన్నర్, జెమైకా

రెండు గుర్రాలు



చాలా మంది 40 దాకా పని చేసి, ఆపైన విశ్రాంతి తీసుకోవాలని కోరుకుంటారు. 40 సరే, రాబోయే ఐదు నిమిషాల్లో ఏమి జరుగుతుందో ఎవరికి తెలుసు? దేనికీ గడువులు విధించుకోకండి. ఏకకాలంలో మీ వర్క్‌నీ, లైఫ్‌నీ స్వారీ చేసుకుంటూ వెళ్లండి.

– గౌతమ్ సింఘానియా, రేమండ్స్ గ్రూప్ ఎండీ

ఎందులో లేదు?!



ఉదయాన్నే మేల్కొనడం, మేఘాలను చూడటం, సముద్రం కదులుతున్న తీరును గమనించటం, మనుషులను కలవటం ప్రతిదీ నాకు ఇన్‌స్పిరేషనే! చిత్ర దర్శకురాలిగా కళ కంటే జీవితాన్ని మరింత ఆసక్తికరంగా మార్చగలగటమే నాకు అతి పెద్ద గౌరవం.

– పాయల్ కపాడియా, ‘ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్’ డైరెక్టర్

సిద్ధం చేస్తున్నా



ఒక అమ్మాయిగా, భారతీయ నటిగా, హాలీవుడ్‌లో భాగం కావాలనుకోవడం ఎంతోమంది కనే కల. నేను నా కలను నిజం చేసుకున్నప్పటికీ, అవకాశాల కోసం చూస్తున్న నా వంటి అమ్మాయిలకు ఇక్కడో సీటును సృష్టించాలనుకుంటున్నాను.

– ప్రియాంకా చోప్రా, సినీ నిర్మాత

నేపాల్ సంధిస్తున్న శేషప్రశ్నలు

విశ్లేషణ



అఖిలేశ్ ఉపాధ్యాయ్

కొన్ని దశాబ్దాలు అసలేమీ జరగదు, కానీ కొన్ని రోజుల్లోనే దశాబ్దాలు జరిగిపోతాయి. లెనిన్ అన్న ఈ మాటలు నేపాల్ విషయంలో అక్షర సత్యాలయ్యాయి. నేపాల్‌లో ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ వేళ్లూనుకుంది. వ్యాపార సంస్థలు, రాజకీయ పార్టీలు పరస్పర ప్రయోజనాలందుకుంటూ చెట్టపట్టాలేసుకుని తిరిగాయి. అకస్మాత్తుగా ఎగసిన నిరసన ప్రదర్శనల వేడిని వారు ఇప్పుడు చవిచూశారు.

ఇంటర్‌నెట్, డిజిటల్ టెక్నాలజీ మొగ్గ తొడిగిన (1997–2012) కాలంలో పుట్టిపెరిగిన తరాన్ని ‘జెన్ జెడ్’గా పిలుస్తున్నారు. ఈ ‘జెన్ జెడ్’ నేపాల్‌లో తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. ఈ యువతరం తెచ్చిన విప్లవం బహుశా స్వల్పకాలమైనదే కావచ్చు. కానీ, అది చూపిన ప్రభావం పెద్దది. నిరసనలు మొదలైన తెల్లారే మూడు పార్టీల ప్రభుత్వం కుప్పకూలింది. ప్రధాని కేపీ శర్మ ఓలి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. నిరసనలకు ఐదు రోజుల ముందు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్‌తో సహా 26 సామాజిక మాధ్యమ వేదికల మూసివేతకు ఆయన ఆదేశించారు. అప్పటికాయన ప్రజాభిమతాన్ని ప్రతిఘటించే వ్యక్తిగానే కనిపించారు. తీరా, ప్రధాని అధికారిక నివాసమైన బాలూవతార్ నుంచి ఉడాయించవలసి వచ్చింది. ప్రధాని సింహాసనాన్ని అధిష్ఠించేందుకు వేచి ఉన్న షేర్ బహదూర్ దేవ్‌బా, ఆయన భార్య అర్జూ దేవ్‌బా (ఈమె విదేశాంగ మంత్రిగా కూడా ఉన్నారు)లపై వారి నివాసంలోనే దాడి జరిగింది. దేశవ్యాప్తంగా యువత ధ్వంసం చేస్తూ వచ్చిన రాజకీయ పార్టీల ఆస్తులు, బడా నాయకుల ప్రైవేటు నివాసాలకు లెక్కలేదు. సుప్రీంకోర్టు, పార్లమెంట్, ప్రభుత్వం కొలువుదీరే సింఘ దర్బార్ కూడా వారి ఆగ్రహ ‘జ్వాలల’ నుంచి తప్పించుకోలేక పోయాయి.

జెన్ జెడ్ తొలి ఉద్యమం

నిరసనకారుల్లో అనేక మంది స్కూలు యూనిఫారంలలో ఉన్నప్పటికీ, పోలీసులు వారిపై దమన నీతిని ప్రదర్శించారు. దమనకాండలో స్కూలు, కాలేజీ విద్యార్థులు పందొమ్మిది మంది (వారిలో 17 మంది ఖాట్మండులోనే) హతులయ్యారు. దాంతో దేశమంతా ఏకమైంది.

1990లో, తర్వాత 2006లో సామూహిక ప్రజా ఉద్యమాలప్పుడు కూడా ఇలాగే జాతీయ స్థాయిలో అతిశయం వ్యక్తమైంది కానీ, అవినీతిమయ రాజకీయ నాయకులతో వారి ఆశలన్నీ అడియాసలయ్యాయి. నేపాలీ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ –యునైటెడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు) ప్రజాభిమతానికి అనుగుణంగా నడచుకోలేకపోయాయి. ఆ రెండు ఉద్యమాలలో ‘జెన్ జెడ్’ పాత్ర నామమాత్రమే. ఇప్పుడు నేపాల్ రికార్డు స్థాయిలో వలసలను చూస్తున్న సమయంలో, యువతలో కోపం కట్టలు తెంచుకుంది. నేపాల్ అపసవ్య కారణాలతోనే ప్రపంచంలో వార్తలకెక్కడాన్ని చూసి వారు విసుగెత్తిపోయారు.



నేపాల్ ఆపద్ధర్మ ప్రధాని సుశీలా కర్కీ ముందు సవాళ్లెన్నో!

◆ పాత మూడు పార్టీలలోని నాయకులందరూ అపఖ్యాతి పాలైనవారు కాదు. వారు కౌంటర్ విప్లవానికి తెర లేపుతారా? అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం పాత పార్టీలన్నీ విలీనమవుతాయా? పట్టుమని వారం కూడా గడవక ముందే, కొత్త ప్రధాని సుశీల కర్కీ రాజీనామా చేయాలని వస్తున్న నిరసనలను ఆమె ఎలా నిభాయిస్తారు?

అవినీతి సూచిలో ఏయేటికాయేడు నేపాల్ ఎగబాకుతూ వస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థ మినుకు మినుకు అంటూ అయినా ఉందంటే, దానికి, వర్తక వ్యాపారాలో, విదేశీ సాయమో కారణం కాదు. రాజకీయ పార్టీల చేయూత అంతకన్నా లేదు. విదేశాలలో పని చేస్తున్న నేపాలీయులు స్వదేశానికి పంపిస్తున్న జమలతోనే స్థానికులు చాలా వరకు రోజులు వెళ్ళదీస్తూ వస్తున్నారు. పశ్చిమాసియా నుంచి మలేషియా వరకు, నార్వే నుంచి న్యూజిలాండ్ వరకు నేపాలీయులు కష్టపడి పనిచేస్తూ గడిస్తున్న నాలుగు రాళ్ళలో కొంత మొత్తాన్ని స్వదేశంలోని కుటుంబ సభ్యులకు పంపుతున్నారు. అలాచూస్తే, మారుమూల గ్రామాలలోని వారితో సహా, కుటుంబాల విడి ఆదాయాలు పెరుగుతూ వస్తున్నాయి. అంతమాత్రాన నేపాలీయులు ధనికులుగా మారింది ఎన్నడూ లేదు.

ఇప్పుడేం జరగొచ్చు?

ఈ మార్పులన్నింటి మధ్య కొన్ని భయ సందేహాలు మిగిలే ఉన్నాయి. ప్రాబల్యం వహించిన పాత మూడు పార్టీలలోని నాయకులందరూ అపఖ్యాతి పాలైనవారు కాదు. వారిలో కొందరికి వారి నియోజకవర్గాలతో ఇప్పటికీ పటిష్ఠమైన సంబంధాలే ఉన్నాయి. వారు కౌంటర్ విప్లవానికి తెర లేపుతారా? అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం పాత పార్టీలన్నీ విలీనమవుతాయా? లేక నాల్గవ పెద్ద పార్టీ అయిన రాష్ట్రీయ స్వతంత్రతా పార్టీ (ఆర్.ఎస్.పి.)లోకి ఫిరాయింపులకు ఇది దారితీస్తుందా? ఈ పార్టీలోనే యువ టెక్నోక్రాట్లు పెద్ద వర్గంగా ఉన్నారు. ఎన్నికల కమిషన్ వద్ద, 2022 సాధారణ ఎన్నికలకు ఆరు నెలల ముందు మాత్రమే రిజిస్టరైన ఆర్.ఎస్.పి. త్వరితగతిన జాతీయ పార్టీగా పరిణమిస్తుందా? ఖాట్మండులో ప్రజాదరణ కలిగిన యువ మేయర్ బాలెన్ షా వీరితో చేతులు కలుపుతారా? రాజధానికి బయట పార్టీని విస్తరించడానికి ఎన్నడూ ఉత్సాహం చూపని షా, యువతతో కొత్త పార్టీని పెట్టి దానికి నాయకత్వం వహిస్తారా?

ఈ పరిస్థితులన్నింటి మధ్య ‘జెన్ జెడ్’ స్థానం ఏమిటి? ఈ యువతకు గొంతుకగా సూదన్ గురుంగ్ ఉన్నారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి, నేపాల్ తొలి మహిళా ప్రధాని సుశీలా కర్కీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన సూదన్ ఆమె పట్ల గౌరవ ప్రపత్తులను ప్రదర్శించారు. కానీ పట్టుమని వారం కూడా గడవక ముందే, అదీ సూదన్ సమక్షంలోనే, ఆపద్ధర్మ ప్రధాని కర్కీ రాజీనామా చేయాలని ‘జెన్ జెడ్’ నిరసనకారులు డిమాండ్ చేశారు. మంత్రివర్గాన్ని విస్తరించే ముందు ఆమె తమతో సంప్రదించలేదని అన్నారు. బాలెన్ షా న్యాయ సలహాదారు ఓమ్ ప్రకాశ్ ఆర్యల్‌ను హోమ్ మంత్రిగా నియమించడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

సైన్యం పాత్ర ఏమిటి?

నేపాల్ సైన్యం ఏం చేయబోతోందనేది కూడా ముఖ్యమైన అంశం. సార్వభౌమాధికారం 1990లో ప్రజల చేతికి వచ్చి, పార్లమెంట్ 2008లో రాచరికాన్ని రద్దు చేసేంత వరకు, రాచరికం పట్లనే సైన్యం విధేయత చూపుతూ వచ్చింది. తిరిగి అది ఇప్పుడు మళ్ళీ రాచరికం వైపే మొగ్గు చూపుతుందా? క్షేత్రస్థాయిలో నేపాలీయుల మధ్య సాంస్కృతిక పునరుజ్జీవనం కనిపిస్తోంది. హిందూ మతానికి చెందిన వివిధ వ్యక్తీకరణల్లో అది కేంద్రీకృతమవుతోంది. కానీ, నేపాలీయులు రాజకీయ హిందూయిజానికి ఎన్నడూ ఓటు వేయలేదు. వచ్చే ఏడాది (2026) మార్చి 5న నిర్వహిస్తారని చెబుతున్న ఎన్నికలు చరిత్రను మలుపు తిప్పుతాయా? నూతన ప్రభుత్వం ఈ పరిణామ క్రమాన్ని ఎలా నిర్వహిస్తుందనేది ప్రశ్న. నేపాలీ ప్రజలు ఆరు నెలల (రాజకీయాల్లో సుదీర్ఘ కాలం కిందనే లెక్క) తర్వాత, రాజకీయ తీర్పును వెలువరించేంత వరకు ఈ భయాందోళనలు కొనసాగుతూనే ఉంటాయి.

వ్యాసకర్త ఖాట్మండులోని ఐ.ఐ.డి.ఎస్.లో సీనియర్ రీసెర్చ్ ఫెలో (‘ది హిందుస్తాన్ టైమ్స్’ సౌజన్యంతో)

దేశానికి రక్తతర్పణం చేసిన అహింసా మూర్తి!

టైమ్ మిషన్

ఆమె 73 ఏళ్ల ముదుసలి. జాతీయ పతాకాన్ని ఎత్తిపట్టి ‘వందేమాతరం’, ‘ఆంగ్లేయులారా! ఇండియాను వదిలి వెళ్లండి’ అంటూ నినాదాలు చేస్తూ ఆరువేల మందితో ఒక పోలీస్ స్టేషన్‌ను ఆక్రమించేందుకు శాంతియుతంగా దండయాత్ర చేస్తోంది. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. అయినా ఆమె ముందుకే కదిలింది. ఈసారి జెండా పట్టుకున్న చేతిని గురిచూసి కాల్చారు. వెంటనే రెండో చేతిలోకి జెండాను మార్చుకుని మునుముందుకు దూకింది. దీంతో పోలీసులు రెచ్చిపోయారు. ఆమె రెండో చేతిపైనా, నుదుటి పైనా కాల్పులు జరిపారు. తెల్లని ఖద్దరు చీర రక్తసిక్తమయ్యింది. ఆ బక్కచిక్కిన వృద్ధ యోధ కుప్పకూలింది – కానీ జెండాను మాత్రం కిందపడకుండా గుండెలకు హత్తుకునే!

1942 సెప్టెంబర్ నాలుగవ వారంలో చోటు చేసుకున్న ఈ బలిదానం గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది. ‘వృద్ధ మహిళా గాంధీ’ (గాంధీ బురి)గా పేరుగాంచిన ఆమె పేరు మాతంగినీ హజ్రా. 1869లో బెంగాల్‌లోని హోగ్లా గ్రామంలో ఒక పేద కుటుంబంలో జన్మించిన ఆమెకు పన్నెండేండ్లకే వివాహం చేశారు. కానీ 18 ఏండ్లకే వితంతువయ్యింది. పిల్లలు లేని ఆమె సమాజ సేవ, దేశ సేవకే తన జీవితాన్ని అంకితమిచ్చింది. ఆమెకు చదువు లేదు. అయినా గాంధీజీ బోధనలకు ఆకర్షితురాలయ్యింది. ఆయన చెప్పినట్లే జీవించింది. 1930లలో శాసనోల్లంఘన ఉద్యమంతో పాటు మిగతా ఉద్యమాల్లోనూ పాల్గొని జైలుకెళ్లింది.



మాతంగినీ హజ్రా జ్ఞాపక చిహ్నాలు

భారత జాతీయ కాంగ్రెస్ బ్రిటిష్ పాలనకు ముగింపు పలకాలని 1942 ఆగస్టు 8న ‘క్విట్ ఇండియా’ (ఇండియా వదిలి వెళ్లండి) ఉద్యమాన్ని ప్రారంభించింది. గాంధీజీ ‘డూ ఆర్ డై’ (విజయమో, వీరస్వర్గమో) అంటూ ఉద్యమాన్ని ఉరకలెత్తించారు. ఈ ఉద్యమ సమయానికి మాతంగినికి 73 ఏండ్లు. బెంగాల్‌లోని మిడ్నాపూర్ జిల్లాలో ఉద్యమానికి సరైన నాయకత్వం అందించే గాంధీవాదులు లేకపోవడంతో ఈ ఉద్యమం ప్రజల తిరుగుబాటుగా మారింది. బ్రిటిష్ అధికారాన్ని నేరుగా సవాలు చేసే సమాంతర ప్రభుత్వాన్ని లేదా ‘జాతీయ సర్కార్’ను తామ్లుక్‌లో ‘సమర్ పరిషద్’ ఏర్పాటు చేసింది. మాతంగినీ పక్కా గాంధేయవాదే కానీ ఈ తిరుగుబాటుదారుల్లో ఒకరుగా మారారు.

పోలీస్‌స్టేషన్‌పైకి దండయాత్ర

1942 సెప్టెంబర్ 29న తామ్లుక్ పోలీస్ స్టేషన్ (అప్పట్లో సెయ్లున్ స్క్వేర్)పై నియంత్రణ సాధించడానికి తామ్లుక్ జాతీయ సర్కార్ ఒక నిరసన మార్చ్ నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఇది బ్రిటిష్ అధికారంపై ప్రత్యక్ష తిరుగుబాటే! పోలీస్ స్టేషన్‌పై భారత జాతీయ జెండాను ఎగురవేయడానికి వేలాదిమందితో (వీరిలో ఎక్కువమంది స్త్రీలు) మాతంగినీ బయలుదేరింది. పోలీస్ స్టేషన్ ఉన్న ఊరు సమీపానికి ఆమె తన అనుయాయులతో చేరుకున్నప్పుడు, యూరోపియన్ అధికారుల ఆధ్వర్యంలోని బ్రిటిష్ ఇండియన్ పోలీసు దళాలు అడ్డగించాయి. అయినా ముందుకే కదలడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఆమె ‘వందేమాతరం’ నినాదం చేస్తూనే కుప్పకూలిపోయింది. ఆమె పక్కనే మార్చ్ చేస్తున్న ఇద్దరు యువకులు సఖావత్ అలీ, సతీష్ చంద్ర సామంతా పైనా పోలీసులు కాల్పులు జరపడంతో వారూ వీర మరణం పొందారు. మాతంగినీ హజ్రా భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అత్యంత ధైర్యవంతురాలిగా చరిత్ర లిఖించారు. తామ్లుక్‌లో ఆమె బలిదానం జరిగిన చోట ఆమె విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రస్తుతం ఉన్న తామ్లుక్ పోలీస్ స్టేషన్ పేరు ‘మాతంగినీ హజ్రా పోలీస్ స్టేషన్’గా మార్చారు. భారత ప్రభుత్వం 2002లో ఆమె గౌరవార్థం ఒక తపాలా బిళ్లను జారీ చేసి తనను తాను గౌరవించుకుంది. ◆

చైతన్యమే ఆయుధంగా...

ఇన్ బాక్స్

గత మూడు దశాబ్దాలుగా తెలుగు నేలపై చైతన్యానికీ, సంఘటిత శక్తికీ పర్యాయపదంగా పనిచేస్తున్న ‘చైతన్య మహిళా సంఘం’ 2025 సెప్టెంబరు 24 నాటికి 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కడప జిల్లా పొద్దుటూరులో సభ జరుగుతోంది. ఈ సందర్భంగా సంస్థ చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

అనేక మహిళా ఉద్యమాల్లో పాల్గొన్న 200కు పైగా భావసారూప్యత గల మహిళా సంఘాలు 1995లో గుంటూరులో ‘ఆంధ్రప్రదేశ్ చైతన్య మహిళా సమాఖ్య’గా ఏర్పడ్డాయి. 2015లో అది ‘చైతన్య మహిళా సంఘం’ (సీఎమ్ఎస్)గా పేరు మార్చుకుంది. శ్రామిక మహిళల విముక్తి, స్త్రీ–పురుషుల సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించడం లక్ష్యాలుగా ఈ సంఘం పని చేస్తోంది. కుల, పితృస్వామ్య నిర్మూలన జరిగే పోరాటాలలో పాలు పంచుకుంటున్నది. భూస్వామ్య, సామ్రాజ్య వాద, మనువాద భావజాలానికి వ్యతిరేకంగా పోరాడుతున్నది. ఈ లక్ష్యాలతో విద్యార్థులతో, ఉద్యోగులతో, బస్తీలలోని మహిళలతో కలిసి ఎన్నో పోరాటాలు చేసింది. కాలనీలలో, బస్తీల్లో స్థానిక సమస్యల పరిష్కారానికి పోరాటాలు విజయం సాధించింది. సాంఘిక సంక్షేమ, వసతి గృహాలు ప్రభుత్వ కళాశా లలు సంఘానికి ప్రధాన కార్యక్షేత్రాలు. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యల కొరకు గోడ పత్రికలు వేసింది.




‘గృహహింస చట్టం’లోని లోపాలను ప్రభుత్వానికి ఎత్తి చూపింది. సదస్సులు, సభలు నిర్వహించి చర్చించింది. సమాజంలో ఎన్ని అత్యాచారాలు జరిగినా అందులో పురుషుల తప్పేమీ లేదన్నట్టుగా ఉండేది. కానీ పరిస్థితి మారింది. ఇది మహిళా ఉద్యమం సాధించిన విజయం. మద్యా నికి వ్యతిరేకంగా పోరాడే క్రమంలో, బాధితులకు అండగా ధర్నాలు చేస్తున్న సమయంలో, ఈ మధ్య జరిగిన అందాల పోటీలను వ్యతిరేకిస్తున్న క్రమంలో కార్యకర్తలు ఎన్నోసార్లు అరెస్టులకు గురి అయ్యారు. ఇంత చేస్తున్నా నేడు మహిళా ఉద్యమం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నది.

మెజారిటీ మహిళలు తమ ఇష్టాలు చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారు. వీరిలో చాలామంది నేరస్థులుగా మారుతున్నారు. ప్రేమ, పెళ్లి, జీవితం పట్ల, సరైన అవగాహన కలగకుండా చేస్తున్న సామాజిక ఆర్థిక పరిస్థితులు, పతనమైపోతున్న సాంస్కృతిక విలువలే ఇలాంటి ఆలోచనలు ప్రేరేపిస్తున్నాయి. ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది.

– బి. జ్యోతి I చైతన్య మహిళా సంఘం
(నేడు వైఎస్సార్ కడప జిల్లా పొద్దుటూరులో సీఎంఎస్ త్రిదశాబ్ది సభ)

డేటా పాయింట్



నేత్రోత్సవం



‘వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన వేంకటేశ సమోదేవో న భూతో న భవిష్యతి’ అని స్కాంద పురాణం మాట. వేంకటాద్రికి సాటియైన స్థానం విశ్వంలో లేదనీ, శ్రీవేంకటేశ్వరస్వామికి సమానమైన దేవుడు గతంలో లేరనీ, ఇక ముందు ఉండరనీ దీని అర్థం. తిరుమల కొండ ఒక పవిత్ర, మహిమాన్వితమైన స్థలం అని భక్తుల నమ్మకం. పురాణాల ప్రకారం శ్రీనివాసుడు వేంకటాద్రిపై వెలిసిన తొలినాళ్లలో లోక కల్యాణం కోసం బ్రహ్మదేవుడిని పిలిచి తనకు ఉత్సవాలు నిర్వహించమని ఆజ్ఞాపించారట. అప్పుడు బ్రహ్మదేవుడు 9 రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించాడనీ అందుకే వీటికి ‘బ్రహ్మోత్సవాలు’ అని పేరు వచ్చిందనీ ప్రతీతి.

తిరుమలలో జరిగే మిగిలిన ఉత్సవాలతో పోలిస్తే ఈ బ్రహ్మోత్సవాలు చాలా పెద్దయెత్తున, అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలు లోక కల్యాణార్థం నిర్వహించబడతాయి. వెంకటేశ్వర స్వామివారిని వివిధ రూపాల్లో, అవతారాల్లో దర్శనం చేసుకున్న వారికి అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తవడంతో పాటు, పుణ్య ఫలాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ విషయాలన్నీ వరాహ, భవిష్యోత్తర పురాణాల్లో ‘వేంకటాచల మాహాత్మ్యం’ అనే పేరుతో వివరించబడ్డాయి. కొండపై ఎక్కడ చూచినా గోవింద నామ ఘోషలే! భక్తుల కోలాహలమే! నాదనీరాజనం, ఆస్థాన మండపాల్లో వినసొంపైన ఆధ్యాత్మిక సంగీత, సాంస్కృతిక కార్యక్రమాల హేల, అన్నప్రసాద వితరణ శాలల్లో భక్తులకు స్వామివారి ప్రసాదం, ఫల పుష్ప ప్రదర్శనశాలల్లో పూల పరిమళాలు, నాలుగు మాడవీధుల్లో స్వామివారి వాహన సేవల్లో స్వామివారి విభిన్న అలంకారాలు; వాహన సేవల ముందు భజన బృందాలు, కోలాటాలు, ప్రబంధగోష్ఠిగానం, మంగళవాద్యాల ఘోష! ఇలా ఒకటికాదు ఎన్నో ఆకర్ష ణీయ మనోహరదృశ్యాలతో, వినూత్నశోభతో అలరారే ఆ వైభవం కన్నులారా చూడాల్సిందే!

– వాడవల్లి శ్రీధర్ (సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2 వరకు తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు)



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బ్రహ్మచారిణి దేవిగా దర్శనమిచ్చిన అలంపూర్ శ్రీ జోగుళాంబ అమ్మవారు - అలంపూర్



రెండో రోజు మంగళవారం అన్నపూర్ణగా దర్శనమిచ్చిన వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారు - హనుమకొండ కల్చరల్



మంగళవారం బ్రహ్మచారిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారు - బాసర

దాశరథి రంగాచార్య సతీమణి
కమల కన్నుమూత



దాశరథి కమల

కంటోన్మెంట్: సుప్రసిద్ధ రచయిత డాక్టర్ దాశరథి రంగాచార్య సతీమణి దాశరథి కమల (92) మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో కన్నుమూశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అశ్రు నయనాల నడుమ మంగళవారం సాయంత్రం మారేడుపల్లిలోని హిందూ శ్మశాన వాటికలో ఆమె భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. దాశరథి దంపతులకు కుమారుడు విరించి, ఇద్దరు కుమార్తెలు సుధ, ఉదయశ్రీ ఉన్నారు. దాశరథి రంగాచార్య సాహితీ ప్రస్థానంలో కమల కీలక పాత్ర పోషించారు. ఆయన రచనలకు కమల వెన్నెముకగా నిలిచారని సాహిత్య లోకం గుర్తుచేసుకుంటోంది. దాశరథి కమల ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు రచయితలు, సాహితీ అభిమానులు ఆకాంక్షించారు. ఆమె మరణం సాహిత్య లోకానికి తీరని లోటు అని వ్యాఖ్యానించారు. సికింద్రాబాద్ మున్సిపాలిటీ చివరి కమిషనర్‌గా పనిచేసిన దాశరథి పదవీ విరమణ అనంతరం ఈస్ట్ మారేడుపల్లిలో స్థిరపడ్డారు. 2015 జూన్ 7న ఆయన మరణించారు.

9 ఏళ్లలో సాగునీటికి రూ.లక్ష కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చినట్టు రెవెన్యూ, మూలధన ఖర్చుల లెక్కలు వెల్లడిస్తున్నాయి. తొమ్మిదేళ్లలో రూ.1.42 లక్షల కోట్లను మూలధన వ్యయం కింద ఖర్చు పెట్టగా, రూ.లక్ష కోట్లకు పైగా ఒక్క సాగునీటి రంగంలోనే ఆస్తుల కల్పనకు ఖర్చు చేశారు. ఆ తర్వాత రవాణా రంగంలో రూ.20 వేల కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.11 వేల కోట్లు వెచ్చించారు. విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో మాత్రం మూలధన వ్యయం ఆశించిన మేర జరగలేదు. రెవెన్యూ వ్యయం విషయానికి వస్తే.. విద్యకు రూ.1,08,941 కోట్లు, వ్యవసాయానికి రూ. 1,08,881 కోట్లు వెచ్చించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి తొమ్మిదేళ్లలో రూ.76,440 కోట్లు ఖర్చు చేశారు. మూలధన వ్యయంతో కలిపి ఏడాదికి సగటున రూ.9,300 కోట్లు ఖర్చు చేశారని కాగ్ గణాంకాలు చెబుతున్నాయి. ఇక, తొమ్మిదేళ్లలో మొత్తం బడ్జెటరీ ఖర్చు (రెవెన్యూ, మూలధన వ్యయం కలిపి) రూ.11,68,401 కోట్లు. అందులో విద్య, వైద్యం, సాగునీరు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలకు రూ.5,34,346 కోట్లు వెచ్చించారు. రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు, పింఛన్లు, అప్పులకు వడ్డీల కింద అనివార్యంగా చేయాల్సిన వాటి కోసం రూ.3,95,941 కోట్లు ఖర్చు పెట్టినట్లు కాగ్ నివేదిక తెలిపింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలి తొమ్మిదేళ్లలో ప్రధాన రంగాల్లో ఖర్చు ఇలా (రూ.కోట్లలో)

రంగం	2014-15	2022-23
పోలీస్	2,853	8,427
విద్య, క్రీడలు	7,001	17,729
ఆరోగ్యం	2,572	8,804
తాగునీరు, పారిశుద్ధ్యం	1,300	4,946
గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి	2,162	7,610
సాంఘిక సంక్షేమం, పోషణ	3,790	14,585
ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీల సంక్షేమం	3,365	11,782
వ్యవసాయం, అనుబంధ రంగాలు	5872	21,187
గ్రామీణాభివృద్ధి	3,587	7,985
సాగునీరు	13,208	38,265
విద్యుత్	3,534	18,450

2014-15 నుంచి 2022-23 వరకు ప్రధాన రంగాల్లో జరిగిన మొత్తం ఖర్చు (రూ.కోట్లలో)

రంగం	రెవెన్యూ ఖర్చు	మూలధన ఖర్చు	మొత్తం
విద్య	1,08,941	2,550	1,11,491
ఆరోగ్యం	45,969	6,496	52,465
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమం	76,440	8,187	84,627
వ్యవసాయం	1,08,881	9,898	1,18,779
గ్రామీణాభివృద్ధి	41,448	11,391	52,839
సాగునీరు	10,251	1,03,894	1,14,145
మొత్తం	3,91,930	1,42,416	5,34,346

మొదటి తొమ్మిదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అనివార్యంగా పెట్టాల్సి వచ్చిన ఖర్చు (రూ.కోట్లలో)

సంవత్సరం	ఖర్చు
2014-15	20,076
2015-16	33,840
2016-17	36,842
2017-18	42,688
2018-19	44,263
2019-20	47,441
2020-21	52,049
2021-22	55,336
2022-23	63,406
మొత్తం	3,95,941

తండ్రి మృతదేహం కోసం ఛత్తీస్‌గఢ్‌కు...

- ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కట్టా రాంచంద్రారెడ్డి
- నేడు మృతదేహం అప్పగిస్తామన్న ఎస్పీ

కోహెడ రూరల్ (హుస్నాబాద్): ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన సీపీఐ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కట్టా రాంచంద్రారెడ్డి (65) మృతదేహాన్ని స్వగ్రామం తీసుకురావడానికి ఆయన కుమారుడు చంద్రశేఖర్ ఛత్తీస్‌గఢ్ వెళ్లాడు. కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన కట్టా రాంచంద్రారెడ్డి ప్రభుత్వ టీచర్ ఉద్యోగం వదిలి మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై 1985లో భార్య శాంతి కుమారితో కలిసి మావోయిస్టు పార్టీలో చేరేందుకు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలో సోమవారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో రాంచంద్రారెడ్డి అలియాస్ రాజు మృతి చెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా దండకారణ్యంలో చోటు చేసుకుంది. కాగా, ఆయన మృతదేహం తీసుకురావడానికి అడ్వకేట్‌తో కలిసి కుమారుడు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లారు. కానీ మంగళవారం అప్పగిస్తామన్న మృతదేహం సాయంత్రం వరకు ఎదురుచూసినా ఇవ్వలేదు. బుధవారం ఉదయం అప్పగిస్తామని అక్కడి ఎస్పీ సమాచారమిచ్చినట్టు కుమారుడు తెలిపారు.

పోలీసుల అదుపులో ఆర్బీఎఫ్, హెప్సీబా సంస్థ యజమాని

4 వేల మంది ఖాతాదారులు..రూ. 100 కోట్ల పెట్టుబడులు

పాలకుర్తి టౌన్: 4వేల మందిని ఖాతాదారులుగా చేర్పించుకొని రూ.కోట్లలో మార్కెటింగ్ వ్యాపారం నిర్వహిస్తున్న జనగామ జిల్లా పాలకుర్తికి చెందిన రియాల్టీ బిజినెస్ ఫెయిర్ హెల్ప్ సిస్టం (ఆర్బీఎఫ్), హెప్సీబా మార్కెటింగ్ యజమానిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. సూర్యాపేట జిల్లాకు చెందిన తెప్పలి సైదులు రెండేళ్ల క్రితం పాలకుర్తిలో మార్కెటింగ్ కార్యాలయం తెరిచి 4 వేల మందిని చేర్చుకున్నాడు. రూ.100 కోట్ల పెట్టుబడులు పెట్టించినట్టు సమాచారం. పెట్టుబడి పెట్టిన వారికి ప్రతీ నెలా అకౌంట్లలో డబ్బులు రావడంతో అత్యాశతో పేద ప్రజలు అప్పులు చేసి, సొమ్ములు, వడ్డీ వ్యాపారుల వద్ద, బ్యాంకులో (బంగారం)కుదవ పెట్టి తెచ్చిన డబ్బులను ఆర్బీఎఫ్‌లో పెట్టుబడులు పెట్టినట్టు తెలిసింది. అనధికారికంగా రూ. కోట్ల లావాదేవీలు జరుపుతుండడంతో సోమవారం రాత్రి ఆ సంస్థ యజమానితో పాటు మరో ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో సంస్థలో పెట్టుబడులు పెట్టిన వారంతా ఆందోళన చెందుతున్నారు.

రైస్ మిల్లు గోడ కూలి తండ్రీకూతురు మృతి

మృతుల్లో నెల రోజుల పసికందు.. తల్లికి తీవ్ర గాయాలు



మహేశ్, గౌతమి మృతదేహాలు

రుద్రూర్: నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో రైస్ మిల్లు గోడ కూలి నిద్రలోనే తండ్రి, కూతురు మృతి చెందారు. కోటగిరికి చెందిన ఇందూర్ మహేశ్ (22), మహేశ్వరి దంపతులకు కూతురు గౌతమి (నెల రోజులు) ఉంది. మహేశ్ కుటుంబం దినసరి కూలీలుగా పనిచేస్తారు. మూతపడ్డ రైస్ మిల్లు పక్కనే వీరి నివాసం ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు రైస్ మిల్లు గోడ దెబ్బతింది. మంగళవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా కూలి మహేశ్ ఇంటిపై పడింది. దీంతో ఇటుకలు, మట్టి శిథిలాల కింద మహేశ్, మహేశ్వరి, శిశువు గౌతమి చిక్కుకుపోయారు. భారీ శబ్దానికి ముందు గదిలో నిద్రిస్తున్న మహేశ్ తండ్రి సాయన్న లేచి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి శిథిలాలను తొలగించారు. అప్పటికే మహేశ్, గౌతమి మృతి చెందారు. తీవ్ర గాయాలతో ఉన్న మహేశ్వరిని బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రజా సంఘాల నాయకులు ఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైస్‌మిల్లు శిథిలావస్థకు చేరినప్పటికీ యజమాని దానిని తొలగించనందునే రెండు ప్రాణాలు పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్సై సునీల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మిల్లు యజమానులు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

పెంపుడు కుక్క కరిచి.. రేబిస్‌తో యువకుడు మృతి




సందీప్ (ఫైల్)

పినపాక: కుక్క కరిచినా పెంపుడు శునకమే కదా అని వైద్యంపై నిర్లక్ష్యం చేయడంతో రేబిస్ సోకి యువకుడు మృత్యువాతపడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఈ-బయ్యారానికి చెందిన ముత్తుబోయిన సందీప్ (25) తండ్రిని నెలన్నర క్రితం పెంపుడు కుక్క కరిచింది. దీంతో తండ్రికి చికిత్స చేయించాక కుక్కను దూరంగా వదిలేద్దామని సందీప్ బస్తాలో తీసుకెళ్లాడు. ఈ క్రమంలో కుక్క కాలిగోటితో గీరగా.. ఆయన పట్టించుకోలేదు. ఆపై నరాల బలహీనత తదితర లక్షణాలు కనిపించడంతో సందీప్‌ను ఖమ్మంలో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లడంతో వైద్యులు పరీక్షించి రేబిస్‌గా నిర్ధారించారు. చికిత్స చేస్తుండగానే మంగళవారం సాయంత్రం సందీప్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

హైకోర్టునే ఆశ్రయించండి

పోలీస్ నియామకాలపై సుప్రీంకోర్టు ఆదేశం.. అభ్యర్థుల పిటిషన్ కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో పోలీస్ నియామకాలపై ఏమైనా అభ్యంతరాలుంటే రాష్ట్ర హైకోర్టునే ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు ఇటీవలే వెలువరించిన నేపథ్యంలో న్యాయ విచారణ ఆ కోర్టు పరిధిలోనే ఉంటుందని తేల్చి చెప్పింది. తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు వ్యతిరేకంగా కొందరు దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. 15,644 కానిస్టేబుల్ పోస్టుల నియామకానికి సంబంధించి 2023 ఏప్రిల్ 30న బోర్డు రాత పరీక్ష నిర్వహించగా, 12 ప్రశ్నలు తప్పుగా ఉన్నాయంటూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఆ ప్రశ్నలకు సంబంధించి ఉస్మానియా వర్సిటీ, రిక్రూట్‌మెంట్ బోర్డు సంయుక్తంగా ఏర్పాటు చేసే స్వతంత్ర నిపుణుల కమిటీకి నివేదిక సమర్పించాలని గతేడాది జనవరిలో హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నివేదికను కమిటీ నాలుగు వారాల్లో పరిశీలించి బోర్డుకు సిఫారసు చేయాలని, అలాగే, నియామక ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తీర్పు చెప్పింది. గతేడాది జనవరి 24న హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఏప్రిల్ 9న సుప్రీంకోర్టు తుది తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోలేమని, ఆ ఆదేశాల ప్రకారం 4 వారాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఆ మేరకు నివేదికను పరిశీలించి, నెల రోజుల్లోపే ప్రక్రియను పూర్తి చేసింది. అయితే కొందరు అభ్యర్థులు పోలీస్ ఉద్యోగాలకు ఎంపిక కాలేదని నియామక సంస్థ కొంతమందికి సమాచారం ఇచ్చింది. తమను ఎందుకు ఎంపిక చేయలేదో కారణం చెప్పలేదంటూ జి.సాయిప్రసాద్ సహా ఐదుగురు ఆగస్టు 1న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇదే క్రమంలో రిక్రూట్‌మెంట్ బోర్డు కూడా పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి ధర్మాసనం విచారించి ఉత్తర్వులు వెలువరించింది.



ఉత్త మాటలతో యుద్ధాలు ఆగవు

ఐక్యరాజ్యసమితి తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం

- ఏడు నెలల్లో ప్రపంచవ్యాప్తంగా ఏడు యుద్ధాలు ఆపేశా
- ఐరాస పని నేను చేయాల్సి రావడం బాధాకరం
- భారత్, పాకిస్తాన్ మధ్య శాంతికి నేనే చొరవ తీసుకున్నా
- ఉక్రెయిన్‌పై యుద్ధానికి భారత్, చైనాలే నిధులిస్తున్నాయి
- రష్యా నుంచి చమురు కొనడం నాటో దేశాలు ఆపాలి
- ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండడం అంగీకరించం
- అక్రమ వలసలకు ఐరాస వత్తాసు దురదృష్టకరం
- మా సార్వభౌమత్వం కాపాడుకోవడానికే టారిఫ్‌లు
- ఐరాస జనరల్ అసెంబ్లీ 80వ సమావేశంలో ట్రంప్

ఐక్యరాజ్యసమితి: ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశమైన అమెరికాకు సమీపంలోకి వచ్చే మరో దేశం లేనేలేదని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. భూగోళంపై వ్యాపారం, వాణిజ్యంలో అత్యుత్తమ దేశం తమదేనని స్పష్టంచేశారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా ఉందని, నానాటికీ మరింత బలం పుంజుకుంటోందని అన్నారు. అమెరికాకు గతంలో ఎన్నడూ దక్కనంత గౌరవం ఇప్పుడు దక్కుతోందని వివరించారు. తాను మొదటి పర్యాయం అధ్యక్షుడిగా ఉన్నప్పటి కంటే ఇప్పుడే తమ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ప్రపంచ చరిత్రలో ఇదొక పరిణామం అని అభివర్ణించారు. మంగళవారం ఐక్యరాజ్యసమితి సాధారణ సభ(జనరల్ అసెంబ్లీ) 80వ సమావేశంలో డొనాల్డ్ ట్రంప్ సుదీర్ఘంగా ప్రసంగించారు. పలు కీలక అంశాలు ప్రస్తావించారు. ఐక్యరాజ్యసమితి పనితీరుపై నేరుగా విమర్శలు గుప్పించారు. అదొక డొల్ల సంస్థగా మారిందని ఆక్షేపించారు. గొప్ప శక్తిసామర్థ్యాలు కలిగిన అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్యసమితి ఇప్పుడు దాదాపు నిర్వీర్యమైపోయిందని విమర్శించారు. ఆశించిన స్థాయిలో పని చేయడంలేదని, బలాన్ని ప్రదర్శించడం లేదని తప్పుపట్టారు. ఉత్త మాటలతో సమస్యలు పరిష్కారం అవుతాయా? యుద్ధాలు ఆగిపోతాయా? అని ట్రంప్ ప్రశ్నించడం గమనార్హం. ఘాటైన పదజాలంలో లేఖలు రాయడం తప్ప చేసిందేమైనా ఉందా? అని నిలదీశారు. ఐరాస ప్రధాన కార్యాలయానికి వస్తుండగా ఎస్కలేటర్ ఆగిపోవడం, టెలిప్రాంప్టర్ విఫలం కావడం గురించి మాట్లాడారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐరాస వేదికపై ప్రసంగించడం ఇదే తొలిసారి. డొనాల్డ్ ట్రంప్ ప్రసంగం ఆయన మాటల్లోనే...

ఐరాస నుంచి ఫోన్ కూడా రాలేదు

''అందరూ అసాధ్యం అన్నవి నేను సుసాధ్యం చేసి చూపించా. ఏడు నెలల్లో 'ముగింపు లేని' ఏడు యుద్ధాలు ఆపేశా. 36 ఏళ్లుగా, 31 ఏళ్లుగా జరుగుతున్న యుద్ధాలు కూడా ఇందులో ఉన్నాయి. కాంబోడియా–థాయ్‌లాండ్, కాంగో–రువాండా, భారత్–పాకిస్తాన్, ఇజ్రాయెల్–ఇరాన్, ఈజిప్టు–ఇథియోపియా, అర్మేనియా–అజర్‌బైజాన్, కొసావో–సెర్బియా యుద్ధాలకు ముగింపు పలికేశా. దీనివల్ల వేలాది మంది ప్రాణాలు నిలిచినట్లే. ఈ ఏడాది మే నెలలో భారత్, పాకిస్తాన్ మధ్య శాంతికి చొరవ తీసుకున్నా. కాల్పుల విరమణకు రెండు దేశాలను ఒప్పించా. ఐక్యరాజ్యసమితి చేయాల్సిన పని నేను చేయాల్సి రావడం నిజంగా బాధగా ఉంది. అసలు ఐక్యరాజ్యసమితి ఏర్పాటు వెనుక ఉద్దేశం ఏమిటి? యుద్ధాలు ఆపడానికి ఐక్యరాజ్యసమితి ఎలాంటి ప్రయత్నం చేయలేదు. యుద్ధాల్లో మునిగి తేలుతున్న దేశాల అధినేతలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపా. ఆ సమయంలో ఐక్యరాజ్యసమితి నుంచి నాకు కనీసం ఫోన్‌కాల్ కూడా రాలేదు. ఐక్యరాజ్యసమితి నుంచి వచ్చింది ఏమిటయ్యా అంటే ఎస్కలేటర్ మాత్రమే. అది కూడా మధ్యలోనే ఆగిపోయింది. నా భార్య మెలానియా ట్రంప్ చక్కటి ఆకారం(షేప్)లో ఉంది కాబట్టి కిందపడిపోలేదు. మేమిద్దరం చక్కటి ఆకారంలో ఉన్నాం. టెలిప్రాంప్టర్ కూడా సరిగ్గా పని చేయలేదు. టెలిప్రాంప్టర్ లేకుండా మాట్లాడడం ఇష్టం ఉండదు. ఎందుకంటే అది ఉంటే హృదయం లోతుల నుంచి మరింత ఎక్కువగా మాట్లాడొచ్చు.

రక్తపాతాన్ని ఆపేలా మా చర్యలుంటాయి

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి భారత్, చైనాలే నిధులు సమకూరుస్తున్నాయి. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తూ ఆ దేశానికి ఆర్థిక బలాన్నిస్తున్నాయి. కొనుగోళ్లు ఆపాలని చెబుతున్నా మొండిగా కొనసాగిస్తున్నాయి. నాటో దేశాలు సైతం రష్యా నుంచి చమురు ఉత్పత్తులు, పలు రకాల ఇంధనాలు కొనుగోలు చేస్తుండడం క్షమించరాని విషయం. ఇది నాకు చాలా అసంతృప్తి కలిగిస్తోంది. ఏమైనా ఆలోచిస్తున్నారా? మీపై యుద్ధానికి మీరే నిధులు అందిస్తారా? ఉక్రెయిన్‌పై దాడులు ఆపాలని చెబుతున్నా రష్యా వినడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే రష్యాపై మరిన్ని కఠిన ఆంక్షలు, టారిఫ్‌లు విధించక తప్పదు. రక్తపాతాన్ని ఆపేలా మా చర్యలుంటాయి. అవి కూడా అతిత్వరలోనే. రష్యాపై చర్యలు తీసుకొనే విషయంలో యూరప్ దేశాలు కూడా మాతో కలిసి రావాలి. ఎందుకంటే రష్యాకు యూరప్ దేశాలే దగ్గర. మాకు, రష్యాకు మధ్య సముద్రం ఉంది. ఒకవైపు రష్యాతో పోరాడుతూనే మరోవైపు అదే రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనడం సరైంది కాదు. ఇది నిజంగా కంపరం కలిగిస్తోంది. ఈ కొనుగోళ్లు తక్షణమే ఆపండి. ఇప్పటికే మనం చాలా సమయం వృథాచేశాం. యూరప్ దేశాల అధినేతలతో చర్చించడానికి సిద్ధంగా ఉన్నా. ఎప్పుడో ఎందుకు.. ఈ రోజే చర్చిద్దాం.


ఐరాస సమావేశంలో ప్రసంగిస్తున్న ట్రంప్

ఇజ్రాయెల్ బందీలను హమాస్ విడుదల చేయాలి

ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండటం మాకు ఆమోదయోగ్యం కాదు. అందుకు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోం. గాజాపై యుద్ధాన్ని ఆపాల్సిన అవసరం ఉంది. ఇజ్రాయెల్ బందీలందరినీ హమాస్ మిలిటెంట్లు ఇకనైనా విడుదల చేయాలి. యుద్ధం ఆగాలంటే ఇజ్రాయెల్‌తోపాటు హమాస్ ముందుకు రావాలి. నియంత్రణ లేని వలసలతో అమెరికా సహా యూరప్ దేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి అక్రమ వలసలకు ఐక్యరాజ్యసమితి వత్తాసు పలుకుతుండటం, కొన్నిసార్లు నిధులు కూడా ఇస్తుండటం దురదృష్టకరం. మరోవైపు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల పేరిట కొనసాగుతున్న వలసలు యూరప్ దేశాలకు మరణశాసనం రాస్తున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం లేదా? టారిఫ్‌ల విషయంలో విదేశాలు మమ్మల్ని తప్పుపడుతున్నాయి. మా సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికే విదేశీ ఉత్పత్తులపై టారిఫ్‌లు విధిస్తున్నాం. ఇందులో మరోమాటకు తావులేదు. ఇక పునరుత్పాదక ఇంధన వనరులు ఒక జోక్. శిలాజ ఇంధనాలకు సరైన ప్రత్యామ్నాయాలు ఉన్నాయా? మా రాజధాని వాషింగ్టన్ డీసీ భద్రత పట్ల కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమానాలు అక్కర్లేదు. మా రాజధాని భద్రంగా ఉంది'' అని డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు.

ప్రజారోగ్య విప్లవం ఆయుష్మాన్ భారత్

ఈ పథకంతో ప్రజలకు గౌరవప్రదమైన జీవితం: మోదీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ పథకానికి ఏడేళ్లు పూర్తయ్యాయి. ప్రజారోగ్య రంగంలో ఈ పథకం ఒక విప్లవం అని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. భవిష్యత్తు అవసరాలను ముందే ఊహించి ఆయుష్మాన్ భారత్‌ను తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య చికిత్సలను చౌకగా అందించడమే లక్ష్యమని వివరించారు. దీని వల్ల ఆర్థిక భారం తగ్గుతోందని, ఎంతో వెసులుబాటు లభిస్తోందని అన్నారు. దేశ పౌరులు గౌరవప్రదమైన జీవితం కొనసాగించడానికి ఆయుష్మాన్ భారత్ తోడ్పడుతున్నట్లు హర్షం వ్యక్తం చేశారు. నిధుల వ్యయంతోపాటు సాంకేతిక పరిజ్ఞానంతో మానవాభివృద్ధిలో మనం సాధిస్తున్న ప్రగతికి ఇదొక ప్రతీక అని ఉద్ఘాటించారు. దేశవ్యాప్తంగా 55 కోట్ల మందికిపైగా ప్రజలు ఈ పథకం పరిధిలోకి వచ్చారని తెలిపారు. ఇప్పటిదాకా 42 కోట్లకుపైగా ఆయుష్మాన్ కార్డులు జారీ చేశామని పేర్కొన్నారు. ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య భరోసా పథకంగా మారిందని స్పష్టంచేశారు. ఆయుష్మాన్ భారత్ అమలుతో ప్రజారోగ్య రంగంలో ప్రభుత్వం చేస్తున్న ఖర్చు 29 శాతం నుంచి 48 శాతానికి పెరిగిందని వెల్లడించారు. అదేసమయంలో ఆరోగ్య సంరక్షణ కోసం ప్రజలు చేస్తున్న 63 శాతం నుంచి 39 శాతానికి తగ్గిపోయినట్లు ప్రధానమంత్రి తెలియజేశారు. ఆర్థిక భారం నుంచి లక్షలాది కుటుంబాలకు ఉపశమనం లభించిందని పేర్కొన్నారు. అనారోగ్యం పాలైతే ఆయుష్మాన్ భారత్ ఆదుకుంటోందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం 2018 సెప్టెంబర్ 23న ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ పథకం కింద పేదలతోపాటు 70 ఏళ్లు దాటిన వృద్ధులకు రూ.5 లక్షల వార్షిక ఆరోగ్య బీమాను కేంద్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌తో ప్రతిఏటా ఆరు కోట్లకుపైగా కుటుంబాలు పేదరికంలోకి జారిపోకుండా లబ్ధి పొందుతున్నాయని కేంద్రం వెల్లడించింది.

హెచ్–1బీ ఎంపిక విధానంలో మార్పులు!

- అత్యధిక నైపుణ్యంతో అధిక వేతనాలతో వచ్చే వాళ్లకే ప్రాధాన్యత
- లాటరీ విధానానికి బదులు 'ప్రాధాన్యతా విధానం' అమలు

వాషింగ్టన్: అత్యంత నైపుణ్యమున్న విదేశీయులకే హెచ్–1బీ వీసా ప్రక్రియలో అధిక ప్రాధాన్యత కల్పించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే హెచ్–1బీ వీసా వార్షిక రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు పెంచిన ట్రంప్ సర్కార్ తాజాగా తక్కువ నైపుణ్యమున్న విదేశీయులకు హెచ్–1బీ వీసా దక్కకూడదనే కుట్రకు తెరతీసింది. ఏటా ఇచ్చే 85వేల హెచ్–1బీ వీసాల పరిమితిదాటాక సంస్థల నుంచి వచ్చే అభ్యర్థనల్లో అత్యధిక నైపుణ్యంతో అధిక వేతనాలు పొందగల వారికే హెచ్–1బీ వీసాలు జారీచేయాలని ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు పాత లాటరీ విధానానికి స్వస్తిపలికి అధిక నైపుణ్యం, అధిక వేతనం ఉన్న వాళ్లకే హెచ్–1బీ వీసాలను కట్టబెట్టాలని భావిస్తోంది. ఈ మేరకు మంగళవారం ఫెడరల్ రిజిస్టర్ నోటీస్ వెలువడింది. '' లాటరీ విధానానికి బదుల వెయిటేజీ విధానానికి ప్రాధాన్యత కల్పించాలి. అమెరికన్ సంస్థలు కోరే అభ్యర్థుల్లో అత్యధిక నైపుణ్యమున్న విదేశీ కార్మికులకు మాత్రమే హెచ్–1బీల జారీలో అధిక వెయిటేజీ ఇవ్వాలి. అమెరికాకు వచ్చాక 1,62,528 డాలర్ల వార్షిక వేతనం పొందబోయే అభ్యర్థులకే వెయిటేజీ పూల్‌లో నాలుగుసార్లు ప్రాధాన్యత ఇవ్వాలి. తక్కువ వేతన కార్మికులకు వెయిటేజీ పూల్‌లో ఒక్కసారే అవకాశం ఇవ్వాలి. కిందిస్థాయి ఉద్యోగాల ఎంపికలో అమెరికన్ పౌరులకు తగు ప్రాధాన్యత కల్పించాలి. అసంబద్ధమైన విదేశీ కార్మికుల జీతభత్యాల పోటీ నుంచి అమెరికన్లను కాపాడాలి అని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ తన ప్రతిపాదనల్లో పేర్కొంది. ఉద్యోగి వేతన స్థాయికి అనుగుణంగా రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యత కల్పించడం వంటి ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయి.

ఓట్ల చోరీతో నిరుద్యోగం

యువత కలలను మోదీ సర్కార్ ఛిద్రం చేసింది: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: దేశంలో ఓట్ల చోరీ జరుగుతున్నంత కాలం నిరుద్యోగం, అవినీతి పెరిగిపోతూనే ఉంటాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. ఓట్ల దొంగతనాన్ని, ఉద్యోగాల దొంగతనాన్ని యువత ఇక సహించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ మంగళవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. దేశవ్యాప్తంగా యువత నేడు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య నిరుద్యోగం అని వివరించారు. నిజంగా ప్రజల విశ్వాసం పొంది, వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వమైనా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తుందని తెలిపారు. కానీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నిజాయతీగా, ప్రజల మద్దతుతో అధికారంలోకి రాలేదని స్పష్టంచేశారు. ఓట్లను దొంగిలించి, వ్యవస్థలను శాసించి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అందుకే దేశంలో నిరుద్యోగంలో గరిష్ట స్థాయికి చేరిందని విమర్శించారు. ఇలాంటి పరిస్థితి రావడంతో గత 45 ఏళ్లలో ఇదే మొదటిసారి అని వెల్లడించారు. ఉద్యోగాల సంఖ్య నానాటికీ తగ్గిపోతోందని, నియామక ప్రక్రియ కుప్పకూలిందని, ఫలితంగా యువత భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తంచేశారు.

అదే అసలైన దేశభక్తి

చక్కటి భవిష్యత్తు కోసం, కలలు నిజం చేసుకోవడం కోసం యువత కష్టపడి పని చేస్తున్నారని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం వారిని పట్టించుకోకుండా ప్రచారాన్నే నమ్ముకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రముఖులు, బడా బాబుల నుంచి ప్రశంసలు, కీర్తనలు పొందుతూ మోదీ మురిసిపోతున్నారని విమర్శించారు. మోదీ పాలనలో ధనవంతులే మరింత బాగుపడుతున్నారని, సాధారణ ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆక్షేపించారు. నిరుద్యోగం, ఓట్ల చోరీ నుంచి భారత్‌కు విముక్తి కల్పించడమే అసలైన దేశభక్తి అని ఉద్ఘాటించారు.

కోల్‌కతా గజగజ

- నాలుగు దశాబ్దాల తర్వాత రికార్డు స్థాయి వర్షం
- 251.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- జల దిగ్బంధంలో రాజధాని నగరం
- విద్యుదాఘాతంతో 9 మంది, నీట మునిగి ఒకరు మృతి

కోల్‌కతా: ఎడతెరిపి లేని భీకర వర్షం ధాటికి పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాతోపాటు పొరుగు జిల్లాలు గజగజ వణికిపోయాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం దాకా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. పది మంది మృతిచెందారు. వీరిలో తొమ్మిది మంది విద్యుదాఘాతానికి బలయ్యారు. మరొకరు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. కోల్‌కతా నగరంలో గత నాలుగు దశాబ్దాల్లో ఇదే అతిపెద్ద వర్షం కావడం గమనార్హం. 24 గంటల కంటే తక్కువ వ్యవధిలో 251.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. 1986 తర్వాత ఈ స్థాయిలో భారీ వర్షం పడడం ఇదే తొలిసారి. గత 137 ఏళ్లలో ఇది ఆరో అతిపెద్ద వర్షంగా రికార్డుకెక్కింది. నగరంలో రహదారులు నదులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి. విమానాలు, రైళ్ల రాకపోకలు ఆగిపోయాయి. మంగళవారం విద్యా సంస్థలు మూసివేశారు. నవరాత్రుల సందర్భంగా దుర్గాపూజలకు అంతరాయం ఏర్పడింది. ఈ నెల 25 దాకా విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ నెల 27 దాకా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

దుర్గా మండపాల్లోకి నీరు

కోల్‌కతాలో దయనీయ దృశ్యాలు కనిపించాయి. గరియా జోధ్‌పూర్ పార్కు ప్రాంతాల్లో ఇళ్లు మునిగిపోయాయి. వంట సరుకులు పనికిరాకుండా పోవడంతో జనం ఆకలితో అలమటించారు. నగరమంతా జల దిగ్బంధంలో చిక్కుకుంది. మోకాలి లోతు నీటిలోనే జనం బయటకు వచ్చారు. దుకాణాల్లో వస్తువులు సైతం మునిగిపోవడంతో యజమానాలు లబోదిబోమన్నారు. భారీగా నష్టపోయామని చెప్పారు. కార్లు, ద్విచక్ర వాహనాలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. కాలువలు, నదులు ఉప్పొంగి ప్రవహించాయి. దుర్గా మండపాలు సైతం నీట మునిగాయి. విగ్రహాలతోపాటు అలంకరణ సామగ్రి దెబ్బతినే ప్రమాదం ఉండడంతో నీటిని బయటకు పంపించేందుకు కార్మికులు శ్రమించారు. సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. వర్షం కారణంగా పలు స్టేషన్ల మధ్య మెట్రో రైళ్లను నిలిపివేయాల్సి వచ్చింది. ప్రతికూల వాతావరణం వల్ల 30 విమానాలను రద్దుచేశాయి. 31 విమానాలు ఆలస్యంగా నడిచాయి. మరోవైపు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. పూర్వ మేదినీపూర్, పశ్చిమ మేదినీపూర్, జార్‌గ్రామ్, బంకూరా తదితర జిల్లాల్లో బుధవారం భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బంగాళాఖాతంలో ఈ నెల 25న మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.


కోల్‌కతాలో నీటమునిగిన రహదారిలోనే వాహనాలను తోసుకెళ్తున్న స్థానికులు

ఇంతటి వర్షం ఏనాడూ చూడలేదు: మమతా బెనర్జీ

ఇలాంటి కుండపోత వర్షం తాను ఏనాడూ చూడలేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. పది మంది మృతిచెందడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఆమె మంగళవారం ప్రజలను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. ప్రైవేట్ విద్యుత్ సరఫరా సంస్థ సీఈఎస్‌సీ ఎలాంటి రక్షణ లేకుండా కరెంటు వైర్లను వదిలేయడం వల్ల విద్యుత్ షాక్‌తో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా జరగడం చాలా దురదృష్టకరమని అన్నారు. కోల్‌కతాలో విద్యుత్ సరఫరా బాధ్యత ప్రభుత్వానికి కాదని, సీఈఎస్‌సీ కాంట్రాక్టు దక్కించుకుందని తెలిపారు. బాధిత కుటుంబాలకు సీఈఎస్‌సీ సంస్థ ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. అలాగే కనీసం రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సీఎం డిమాండ్ చేశారు.

మీకోసం ఆపేశారు

- నన్ను రోడ్డుపై నిలిపేశారు
- అమెరికా పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌కు చేదు అనుభవం
- ట్రంప్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పిన నేత

న్యూయార్క్: దేశాధ్యక్షుడి వాహన శ్రేణి వెళ్తోందంటే ఆ రహదారి మార్గంలో వెళ్లే వాహనాలను పక్కకు ఆపేసి అధ్యక్షుడి కాన్వాయ్‌కు మాత్రమే దారి వదులుతారు. అలా కాన్వాయ్ మొత్తం వెళ్లేంతవరకు ఆగిపోయిన ట్రాఫిక్‌లో సామాన్య ప్రజానీకం ఉసూరుమంటూ వేచి ఉండాల్సిందే. అదే సామాన్య ప్రజానీకం మధ్యలో మరో దేశ అధ్యక్షుడు చిక్కుకుపోవడం నిజంగా అరుదైన ఘటనే. ఈ అరుదైన ఘటనలో మరో అత్యంత అరుదైన ఘటన జరిగింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాన్వాయ్ వెళ్లేదాకా ఎంతటి దేశాధ్యక్షుడైనా రహదారిపై కారులో వేచి ఉండక తప్పదని అమెరికన్ పోలీసులు తేల్చిచెప్పారు. దీంతో తప్పని పరిస్థితుల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ నడిరోడ్డుపై కారులో వెయిట్ చేశారు. ఎంతకీ ట్రంప్ వాహనశ్రేణి క్రాసింగ్ పూర్తికాకపోవడంతో విసిగెత్తిన మేక్రాన్ కారు నుంచి బయటికొచ్చి అక్కడి పోలీసులతో అసలు విషయంపై ఆరాతీశారు. ఈ ఘటనకు సోమవారం రాత్రి న్యూయార్క్ వేదికైంది.

అసలేమైంది?

ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల్లో పాల్గొనేందుకు మేక్రాన్ అమెరికాకు వచ్చారు. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని రాత్రి బసచేసేందుకు ఫ్రాన్స్ రాయబార కార్యాలయానికి బయల్దేరారు. ఇలా తన సొంత కాన్వాయ్‌లో వెళ్తున్నప్పుడు న్యూయార్క్ నగర పోలీసులు ఈ కాన్వాయ్‌ను అడ్డుకుంది. ఇదే మార్గంలో ట్రంప్ కాన్వాయ్ వెళ్లబోతోందని, అది వెళ్లేదాకా పక్కకు ఆగి వేచి ఉండాలని వాహన శ్రేణి డ్రైవర్లను న్యూయార్క్ సిటీ పోలీసులు ఆదేశించారు. ఎదుట ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగిందేమోనని కాసేపు వేచిచూసిన మేక్రాన్ ఎంతకీ ట్రాఫిక్ ముందుకు కదలకపోవడంతో విసిగెత్తి కారు నుంచి కిందకు దిగి ఎదురుగా ఉన్న పోలీసుల వద్ద విషయం ఆరాతీశారు. వాళ్లు తాపీగా అసలు విషయం చెప్పారు. '' మీరు మమ్మల్ని క్షమించాలి. రహదారులపై సాధారణ ప్రజల వాహనాలన్నింటినీ ఆపేశాం. ఇదే మార్గంలో మా అధ్యక్షుడు ట్రంప్ కాన్వాయ్ రాబోతోంది'' అని మేక్రాన్‌కు ఒక పోలీస్ అధికారి వివరించారు. దీంతో చేసేదిలేక మేక్రాన్ రోడ్డు బారికేడ్ దగ్గర నిల్చుని సరదాగా అయినా మాట్లాడదామని నేరుగా ట్రంప్‌కు తన మొబైల్ నుంచి ఫోన్‌చేశారు. వెంటనే అటు వైపు నుంచి ట్రంప్ ఫోన్ ఎత్తారు. ''ఎలా ఉన్నారు? ఇక్కడ ఏం జరిగిందో ఊహించగలరా? మీ కాన్వాయ్ వెళ్తోందని రోడ్లపై కార్లను ఆపేశారు. దీంతో నేను నడిరోడ్డుపై ఆగిపోయా. మీ కాన్వాయ్ వెళ్లిన తర్వాత ఎంబసీకి వెళ్దామని వేచిచూస్తున్నా'' అని మేక్రాన్ నవ్వుతూ మాట్లాడారు. ఈ మాటలు విన్న ట్రంప్ ఫక్కున నవ్వారేమో మేక్రాన్ కూడా ఫోన్‌లో విపరీతంగా నవ్వుతూ కనిపించారు. ఈ తతంగాన్ని మీడియా ప్రతినిధులు తమ కెమెరాల్లో బంధించాయి.




కారు వదలి కాళ్లకు పనిచెప్పి..

ఇంత జరిగిన తర్వాత కొద్దిసేపటికి ట్రంప్ కాన్వాయ్ అదే మార్గంలో వేగంగా దూసుకెళ్లింది. ఆ తర్వాత వాహనాలకు పోలీసులు దారి విడవలేదు. పాదచారులకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇది చూసిన మేక్రాన్ ఇక కారు ఎక్కొద్దని నిర్ణయించుకుని తను కూడా నడుచుకుంటూ ముందుకెళ్లారు. నడుస్తున్నంతసేపూ ట్రంప్‌తో మేక్రాన్ మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. ఇదంతా చూసిన న్యూయార్క్ ప్రజలు ఒకింత ఆశ్చర్యం మరికొంత ఆనందానికి గురయ్యారు. అందివచ్చిన అవకాశాన్ని వృథాచేసుకోవద్దని వెంటనే కొందరు పాదచారులు మేక్రాన్‌తో సెల్ఫీలు దిగారు. మేక్రాన్ సైతం ఏమాత్రం అసహనం వ్యక్తంచేయలేదు. సరదాగా వాళ్లతో ఫొటోలు, సెల్ఫీలు దిగి వారి యోగక్షేమాలు అడిగి తెల్సుకున్నారు. ఒకావిడ ఏకంగా మేక్రాన్ నుదుటిపై ముద్దు పెట్టుకుందని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. ఒక జంటతో మేక్రాన్ ఫొటో దిగాల్సి ఉండగా అక్కడే ఉన్న ఐరాసలో ఫ్రాన్స్ శాశ్వత ప్రతినిధి, రాయబారి జెర్మీ బోనాఫాంట్ ఆ ఫొటో తీయడం విశేషం. మేక్రాన్ పాదయాత్ర వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతున్నాయి.

న్యూయార్క్ సెల్ నెట్‌వర్క్‌పై కుట్ర

- భగ్నంచేసిన న్యూయార్క్ పోలీసులు, సీక్రెట్ సర్వీస్ విభాగం
- నగరంలో ఐరాస సర్వసభ్య సమావేశం వేళ తెగించిన ఆగంతకులు

న్యూయార్క్: ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం కోసం ప్రపంచదేశాల అగ్రనేతలు న్యూయార్క్ నగరానికి విచ్చేసిన వేళ ఐరాస ప్రధాన కార్యాలయం చుట్టుపక్కల సెల్ నెట్‌వర్క్‌ను స్తంభింపజేసేందుకు చేసిన కుట్రను నగర పోలీసులు విజయవంతంగా భగ్నంచేశారు. న్యూయార్క్ నగరవ్యాప్తంగా సెల్‌ఫోన్ టవర్ల కార్యకలాపాలను స్తంభింపజేసి, ఎమర్జెన్సీ '911' నంబర్ సైతం పనిచేయకుండా చేయగలిగేంతటి భారీ అక్రమ ఎల్రక్టానిక్ ఉపకరణాల నెట్‌వర్క్ గుట్టును నగర పోలీసులు రట్టుచేశారు. 300కుపైగా కో–లొకేటెడ్ సిమ్ సర్వర్లు, ఏకంగా 1,00,000 సిమ్ కార్డులను స్వాధీనంచేసుకున్నారు. ఇవన్నీ ఐరాస ప్రధానకార్యాలయ భవనానికి చుట్టూతా 35 మైళ్లదూరంలో ఉండటం గమనార్హం. ఐరాస సమావేశాల కోసం ప్రధానకార్యాలయానికి విచ్చేసిన ప్రపంచనేతలను ఒకేసారి భయపెట్టి, బెదిరించే ఎత్తుగడలో భాగంగా ఆగంతకులు ఈ సెల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మన టెలీకమ్యూనికేషన్ వ్యవస్థను సవాల్ విసిరేలా ఈ సెల్ నెట్‌వర్క్‌ను ఆగంతకులు సిద్ధంచేశారని అమెరికా నిఘా విభాగమైన సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ సీన్ కర్రన్ వెల్లడించారు.



పోలీసులు స్వాధీనంచేసుకున్న సిగ్నల్ ఉపకరణాలు, సిమ్ బాక్సులు

నిమిషానికి 3 కోట్ల టెక్స్ మెసేజ్‌లు..

ఈ భారీ అక్రమ నెట్‌వర్క్ సామర్థ్యం చాలా పెద్దది. నిమిషానికి ఏకంగా 3 కోట్ల టెక్స్ట్ మెసేజ్‌లను దీని ద్వారా పంపొచ్చు. ఇంతటి భారీ స్థాయిలో నెట్‌వర్క్ రద్దీతో వ్యవస్థ హఠాత్తుగా క్రాష్ అవుతుంది. దీంతో సెల్‌ఫోన్ టవర్లు సామర్థ్యానికి మించి మెసేజ్‌ల రాకపోకలను తట్టుకోలేక చేతులెత్తేస్తాయి. అప్పుడు ఏమౌతుందో ఊహించుకోండి. సెల్ నెట్‌వర్క్ నిలిచిపోతుంది. కనీసం మీ సెల్‌ఫోన్‌ను ఉపయోగించలేరు. ఐరాస సర్వసభ్య సమావేశాల మీదా దీని ప్రత్యక్ష ప్రభావం పడుతుంది. యావత్ నగరంలో సెల్ ప్రపంచం ఆగిపోతుంది. ఇది మొత్తం గందరగోళానికి, ఒక కొత్త భయభ్రాంతులకు దారితీస్తుంది'' అని సీక్రెట్ సర్వీస్ న్యూయార్క్ ఫీల్డ్ ఆఫీస్‌లో స్పెషల్ ఏజెంట్ మ్యాట్ మెక్‌కూల్ వివరించారు. '' దీని విస్తృతి, తీవ్ర ప్రభావం, లొకేషన్‌పై మాకు సరైన సమయానికి ఉప్పందింది. దాంతో వెంటనే పలు చోట్ల ఆకస్మిక దాడులు చేసి వందల కొద్దీ ఉపకరణాలను షట్‌డౌన్ చేశాం'' అని ఆయన వెల్లడించారు. ఇటీవల ట్రంప్ ప్రభుత్వంలోని సీనియర్ ఉన్నతాధికారులపై టెలికమ్యూనికేషన్స్ ద్వారా బెదిరింపులు ఎక్కువవడంతో ఈ తరహా నేరాలపై నిఘాను పెంచారు. దీంతో తాజాగా ఈ సెల్ టవర్ నెట్‌వర్క్ రాకెట్ బయటపడింది. ఇప్పటికే 1,00,000 సిమ్‌కార్డులను క్రియాశీలం చేశారని, మరి కొన్నింటినీ యాక్టివేషన్ కోసం ఆగంతకులు సిద్ధంచేశారని పోలీసులు పేర్కొన్నారు.

కుట్ర కారకులు ఎవరు?

కుట్రదారులు ఎవరనేది ఇంకా నిర్ధారణ కాలేదు. నేరముఠాలు, డ్రగ్ కార్టెల్స్ ముఠాలు, ఉగ్రసంస్థలను పెంచి పోషించే దేశాలకు ఈ సెల్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉండి ఉంటుందని న్యూయార్క్ పోలీసులు భావిస్తున్నారు. ఇంతటి భారీ నెట్‌వర్క్‌ను నెలకొల్పాలంటే ఈ రంగంలో నిష్ణాతులైన వాళ్లకు సాధ్యం. అందుకే ఆ కోణంలోనూ దర్యాప్తు మొదలెట్టామని పోలీసులు తెలిపారు. కుట్రదారులు ఎవరనేది కనిపెట్టడం ఇప్పుడే కష్టమని, దీనికి చాలా సమయం పడు తుందని అంచనావేశారు. ''మేం దీని కోసం భారీ కసరత్తు చేయాల్సి ఉంటుంది. కనీసం 1,00,000 సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ బృందంతో తనిఖీచేయించి వాటిల్లోని సమాచారాన్ని క్రోడీకరించాల్సి ఉంది. ఈ సెల్‌ఫోన్ల నుంచి వెళ్లిన టెక్స్ట్ మెసేజ్‌లు, ఫోన్ సంభాషణలు అన్నింటినీ చెక్ చేయాలి. చివరకు ఏ పెద్ద తలకాయ బయటపడుతుందో చూడాలి మరి'' అని స్పెషల్ ఏజెంట్ మ్యాట్ మెక్‌కూల్ అన్నారు. '' ఖరీదైన ఇలాంటి పరికరాలను ఇన్నేసి చొప్పున అమర్చాలంటే చాలా ఖర్చు అవుతుంది. ఈ నైపుణ్యం చిన్న దేశాలకు అస్సలు ఉండదు. రష్యా, చైనా, ఇజ్రాయెల్ లాంటి సాంకేతికతతో రాటుదేలిన దేశాలకే ఇది సాధ్యం'' అని సెంటర్ ఫర్ యురోపియన్ పాలసీ అనాలసిస్ సంస్థలో సీనియర్ సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు జేమ్స్ ఎ.లేవిస్ వ్యాఖ్యానించారు.

సాక్షి
హైదరాబాద్
బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



'పహల్గాం ఎటాక్' పేరుతో..

డిజిటల్ అరెస్టు పేరుతో నిలువు దోపిడీ చేస్తున్న సైబర్ నేరగాళ్లు తాజాగా పహల్గాం ఉగ్రదాడినీ వాడేస్తున్నారు. నగరానికి చెందిన ఓ వృద్ధుడి నుంచి ఏకంగా రూ.26.06 లక్షలు కాజేశారు. -8లో



మిక్స్.. ఫిక్స్..

నగరంలో అప్పుడే కేక్ మిక్సింగ్, గ్రేప్ స్టాంపింగ్ సందడి మొదలైంది. కొన్ని ఫైవ్ స్టార్ హోటళ్లు ఈ కేక్ మిక్సింగ్‌ను ఇప్పుడే నిర్వహించి సోకింగ్ చేస్తున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
29.0/22.0

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. భారీ వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 29, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



చెర వీడి.. జల సవ్వడి!

ఈ జల సిరులను తిలకించారా.. ఈ పక్కనే ఎడారిని తలపిస్తున్న చిత్రాన్నీ చూశారుగా. ఇది అంబర్‌పేట్‌లోని ఒకప్పటి బతుకమ్మ కుంట. ఆక్రమణలు, పూడికలు, చెత్తా చెదారంతో నిలువెల్లా నిర్లక్ష్యానికి గురైన తటాకం. ఒకప్పుడు నీటి గలగలలతో నిండైన రూపాన్ని సంతరించుకున్న ఈ బతుకమ్మ కుంట అనంతర కాలంలో అన్యాక్రాంతానికి బలైంది. స్వార్థపరుల చేతుల్లో పడి తన అసలైన ఉనికినే కోల్పోయింది. హైడ్రా ఆవిర్భవించిన తర్వాత బతుకమ్మ కుంట కొత్త బతుకును పురుడుపోసుకుంది. కబ్జాకోరుల నుంచి విముక్తి కల్పించి.. చెరువు విస్తీర్ణాన్ని పెంచి హైడ్రా పునరుజ్జీవం పోసింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అకుంఠిత దీక్షతో కొత్త రూపును దాల్చింది. ఇలాగే నగరంలో చెర వీడిన పలు చెరువులు ప్రస్తుతం నీటితో కళకళలాడుతున్నాయి. తొలి దశలో వివిధ ప్రాంతాల్లోని ఆరింటిని కబ్జాల బారి నుంచి రక్షించి అభివృద్ధి చేస్తున్నారు. ఇలా.. సరస్సులు శిరస్సులు పైకెత్తి తాము బతికామంటూ జల వనరుల సాక్షిగా అలల సవ్వడులతో ఆనందిస్తున్నాయి. పునరుజ్జీవం పొందిన బతుకమ్మ కుంటను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నారు.

- వివరాలు 10లో▸



బిగ్ స్టోరీ

స్కైవాక్‌పై కదలిక

హుస్సేన్‌సాగర్ 2.0పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తావన



- 10 కి.మీ.మార్గంలో సైకిల్ ట్రాక్, స్కై వాక్
- గతంలోనే ప్రతిపాదనలు రూపొందించిన హెచ్ఎండీఏ
- సీఎం కోర్ అర్బన్ అభివృద్ధి ప్రణాళికలతో మార్గం సుగమం

సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్‌సాగర్ చుట్టూ స్కైవాక్ సైక్లింగ్ ప్రాజెక్టుపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. కోర్ అర్బన్ సుందరీకరణలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హుస్సేన్‌సాగర్ 2.0 అంశాన్ని ప్రస్తావించారు. దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులను ఆకట్టుకొనే విధంగా హుస్సేన్‌సాగర్ చుట్టూ స్కైవాక్, సైక్లింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, నైట్‌లైఫ్ షాపింగ్ వంటి సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) అనుబంధ హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (హుమ్టా) గతంలోనే ప్రణాళికలను సిద్ధం చేసింది. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రత్యేక ఎంటర్‌టైన్‌మెంట్ డిజైన్‌లను రూపొందించింది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపట్టాలని ప్రతిపాదించారు. కానీ అప్పట్లో ప్రభుత్వం నుంచి స్పందన లభించలేదు. తాజాగా సీఎం ఈ ప్రాజెక్టును ప్రత్యేకంగా ప్రస్తావించడంతో మరోసారి ఇది తెరపైకి వచ్చింది. స్కైవాక్ సైకిల్ ట్రాక్ ప్రాజెక్టు నిర్మిస్తే నెక్లెస్‌రోడ్డు, ట్యాంక్‌బండ్ ప్రాంతాలు మరిన్ని పర్యాటక హంగులతో ఆకట్టుకోనున్నాయి. శ్వేతసౌధం వంటి సచివాలయం, బాబా సాహెబ్ అంబేడ్కర్ భారీ విగ్రహం, ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీపార్కు, సంజీవయ్య పార్కు, లేక్‌వ్యూ పార్కులకు ఇది మణిహారంగా మారనుంది.

దేశంలోనే మొదటిది..

హుస్సేన్‌సాగర్ అందాలను ఆకాశంలోంచి వీక్షించేందుకు అనుగుణంగా సుమారు 10 కిలోమీటర్ల మార్గంలో స్కైవాక్, సైకిల్ ట్రాక్ నిర్మించాలనేది ప్రతిపాదన. ఖైరతాబాద్ మెట్రోస్టేషన్ నుంచి ఐమాక్స్ థియేటర్ మీదుగా నెక్లెస్‌రోడ్డు, పీపుల్స్‌ప్లాజా, ట్యాంక్‌బండ్, తదితర ప్రాంతాలను కలుపుతూ ఇందిరాపార్కు వరకు స్కైవాక్ నిర్మిస్తారు. దీంతో సాగరానికి అన్ని వైపులా రాకపోకలు సాగించవచ్చు. సంజీవయ్య పార్కు, పీపుల్స్‌ప్లాజా, జలవిహార్, ఎంఎంటీఎస్ స్టేషన్, లేక్‌వ్యూపార్కు, ఎన్టీఆర్ పార్కు, లుంబిని పార్కు, సెక్రటేరియట్, అంబేడ్కర్ విగ్రహం తదితర సందర్శనీయ స్థలాలను ఆకాశ నడకతోనే చేరుకోవచ్చు. దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా ఇలాంటి స్కైవాక్‌లు లేవని, హైదరాబాద్‌లో హుస్సేన్‌సాగర్‌పై ఏర్పాటు చేయనున్నదే మొట్టమొదటి స్కైవాక్ కానుందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో నగరానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించనుందని పేర్కొన్నారు.

సుమారు రూ.200 కోట్లతో అంచనాలు...

- హుస్సేన్‌సాగర్ చుట్టూ నిర్మించనున్న స్కైవాక్‌కు ఒక కిలోమీటర్‌కు రూ.20 కోట్ల చొప్పున మొత్తం 10 కిలోమీటర్ల మార్గానికి రూ.200 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా.
- ప్రాజెక్టులో భాగంగానే హుస్సేన్‌సాగర్‌లో నీటిపై తేలియాడే బాస్కెట్‌బాల్ కోర్టు, క్రికెట్ స్టేడియం వంటివి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా ఉంది. ప్రస్తుతం సింగపూర్‌లో ఈ తరహా వేదికలున్నట్లు అధికారులు తెలిపారు.
- ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉండేలా షాపింగ్ కేంద్రాలు, రెస్టారెంట్లు వంటివి కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.



వాకింగ్‌తో పాటే సైక్లింగ్..

- సాగర్ చుట్టూ సుమారు 10 కిలోమీటర్ల మార్గంలో నిర్మించనున్న స్కైవాక్‌పైకి చేరుకొనేందుకు, కిందకు దిగేందుకు వివిధ ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ దారులు ఉంటాయి. స్కైవాక్ మొత్తం 5.5 మీటర్ల వెడల్పు ఉంటుంది.
- ఇందులో 3 మీటర్లు సైకిల్ ట్రాక్ కోసం కేటాయిస్తారు. సైకిలిస్టులు ఈ మార్గంలో రాకపోకలు సాగించవచ్చు.
- 0.5 మీటర్ల వెడల్పుతో ఆహ్లాదకరమైన పచ్చదనంతో కూడిన సెంట్రల్ మీడియన్ ఉంటుంది. దానిని ఆనుకొని 2 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేస్తారు. దీంతో సందర్శకులు ఒకే ట్రాక్‌పైన నడిచేందుకు, సైకిలింగ్ చేసేందుకు అవకాశం ఉంటుంది.
- ట్రాక్‌కు రెండు వైపులా గ్రీనరీని ఏర్పాటు చేస్తారు.
- కేవలం పర్యాటకులు, సందర్శకులే కాకుండా ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేందుకు కూడా స్కైవాక్‌ను వినియోగించుకోవచ్చు.

కొత్త దరఖాస్తులు 6,457

జూబ్లీహిల్స్‌లో ఓటు కోసం..

- రేపు పరిశీలన పూర్తి
- 30న తుది జాబితా వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలకూ పరీక్షగా మారిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రతి ఓటూ కీలకమే. దీంతో ఇప్పటి వరకు ఓటర్లుగా నమోదు కాని స్థానికులపై రాజకీయ పార్టీలు ప్రధాన దృష్టి సారించాయి. వీరిని ఓటర్లుగా నమోదు చేయించేందుకు ప్రయత్నాలు పూర్తిచేశాయి. ఓటేయాలనే ఆసక్తితో స్వచ్ఛందంగానే నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారితో సహా స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రకటనకు అనుగుణంగా ఈ నెల 2 నుంచి 17 వరకు మొత్తం 6,457 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటి పరిశీలన చేపట్టిన జిల్లా ఎన్నికల అధికారులు గత వారం వరకు 2,200 (34.07 శాతం) దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. అర్హులైన 2,067 మందిని ఓటర్లుగా జాబితాలో పేర్లు నమోదు చేశారు. మొత్తం దరఖాస్తుల పరిశీలన ఈ నెల 25లోగా పూర్తిచేసి, నియోజకవర్గం ఓటర్ల జాబితాను 30న ప్రకటించనున్నారు.

ముసాయిదాలో 3.92 లక్షలు

ఈ ఏడాది జనవరి 6న వెలువడిన తుది జాబితా మేరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,89,954 మంది ఓటర్లున్నారు. హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ అత్యధిక ఓటర్లున్నది ఇక్కడే కావడం విశేషం. ఈ నెల 2న వెల్లడించిన ముసాయిదా జాబితా మేరకు అప్పటి వరకు కొత్తగా నమోదు చేసుకున్న వారితో కలిపి మొత్తం ఓటర్లు 3,92,669 మంది ఉన్నారు. వారిలో పురుషులు 2,04,288 మంది, మహిళలు 1,88,356 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు. 80 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వారు ఆరువేల మందికి పైగా ఉన్నారు.

ఆన్‌లైన్‌కే జై

ప్రస్తుతం ప్రతి పనికీ ఆన్‌లైన్‌నే వినియోగిస్తున్న ప్రజలు ఓటరుగా నమోదు కోసం సైతం ఆన్‌లైన్‌నే ఎక్కువమంది వినియోగించారు. ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న మొత్తం 6,457 మందిలో కేవలం 83 మంది మాత్రమే తమ దరఖాస్తుల్ని సంబంధిత అధికారులను కలిసి అందజేశారు. మిగతా 6,370 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుచేసుకున్నారు. ఇక చిరునామా మార్పులు, పేరు, ఫొటో, ఇతరత్రా వివరాల్లో పొరపాట్లు దొర్లినందున వాటిని సవరించేందుకు దరఖాస్తు చేసుకున్నవారు మరో 2,254 మంది ఉన్నారు.



ఓటర్లకు పండగే..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అన్ని పార్టీలకూ సవాల్, ప్రతిష్ఠాత్మకం, పరీక్షగా మారిన నేపథ్యంలో ప్రతి ఓటునూ ఆచితూచి పరిశీలిస్తున్నారు. రాజకీయ పార్టీలు సైతం బోగస్ ఓటర్లు లేకుండా ఉండేందుకు, ఓటర్లను తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నియోజవకర్గ ఓటర్లకు పండుగల కానుకలు కూడా అందజేస్తారనే ప్రచారాలు కూడా మొదలయ్యాయి.

బతుకమ్మ కుంటలో బోటు షికారు



అంబర్‌పేట్‌లోని బతుకమ్మ కుంటను మంగళవారం రాత్రి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తదితరులు సందర్శించారు. ఈ నెల 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ కుంటను నగర ప్రజలకు అంకితం ఇవ్వనున్న నేపథ్యంలో ఏర్పాట్లను రంగనాథ్ సమీక్షించారు. బతుకమ్మ కుంటతో పాటు పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వీహెచ్ సైతం బతుకమ్మ కుంటను సందర్శించి.. హైడ్రా పని తీరును ప్రశంసించారు. బతుకమ్మ కుంటను చూస్తుంటే.. ఇది కలా.. నిజమా..? అని అర్థం కావడంలేదని స్థానికులు ఈ సందర్భంగా ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం బతుకమ్మ కుంటలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తదితరులు బోటులో విహరించారు. - సాక్షి, సిటీబ్యూరో

భూ సేకరణ వేగవంతం చేయండి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్



భూసేకరణపై అధికారులతో చర్చిస్తున్న ఆర్వీ కర్ణన్

బంజారాహిల్స్: గ్రేటర్ పరిధిలో ట్రాఫిక్‌కు చెక్ పెట్టేలా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హెచ్-సిటీ పనులకు సంబంధించి భూసేకరణను వేగవంతం చేయాలని, పనుల గ్రౌండింగ్ సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, చీఫ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) భాస్కర్‌రెడ్డి, జూబ్లీహిల్స్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యతో కలిసి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-2 నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు కేబీఆర్ పార్కు ప్రాజెక్టు భూసేకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెచ్-సిటీలో కీలకమైన కేబీఆర్ పార్కు ప్రాజెక్టులో భాగంగా చుట్టుపక్కల ఏడు కీలక జంక్షన్లలో రాబోయే రోజుల్లో 4.6 కిలోమీటర్ల పొడవు ఫ్లైఓవర్లు, 2.8 కిలోమీటర్ల అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. వీటితో నగరంలో అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ప్రవాహం సులభతరం కావడంతో పాటు, రద్దీ గణనీయంగా తగ్గనుంది. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్వీ కర్ణన్ కేబీఆర్ పార్కు ప్రాజెక్టు గ్రౌండింగ్‌కు జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పనుల గ్రౌండింగ్ వేగంగా చేపట్టడంతో పాటు పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు.

ముంపు ముప్పు నుంచి కాపాడండి

- హైడ్రాకు విజ్ఞప్తి చేసిన పలువురు బాధితులు
- ప్రజావాణిలో ఒక్కరోజే 49 ఫిర్యాదులు

కబ్జాకు గురైన నాలాలనూ విస్తరించండి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నిత్యం భారీ వర్షాలు కురుస్తూ కాలనీలు, బస్తీలను వరద నీరు ముంచెత్తుతోంది. దీంతో నాలాల ఆక్రమణలపై హైడ్రాకు వరుస ఫిర్యాదులు వస్తున్నాయి. మంగళవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 49 ఫిర్యాదులు రాగా.. వీటిలో 30కి పైగా నాలా ఆక్రమణలు, వరద ముంపునకు సంబంధించినవే. చెరువుల తూములు మూసేయడంతో పైన ఉన్న కాలనీలు నీట మునుగుతున్నాయని పలువురు ఫిర్యాదులు చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ గ్రామంలో బందం కొమ్ము చెరువు నాలాను డైవర్ట్ చేయడం వల్ల వరద సాఫీగా సాగక దాదాపు ఎనిమిది కాలనీలు వరదతో ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు మొరపెట్టుకున్నారు. యూసుఫ్‌గూడ కృష్ణా నగర్‌లో మురుగు, వరద నీరు ముంచెత్తుతోందని, ఏమాత్రం వర్షం కురిసినా ఇంట్లోంచి బయటకు రాలేకపోతున్నామని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. నాలాల్లో పేరుకుపోయిన పూడికను తొలగించిన చోట ప్రవాహం బాగున్నా మిగిలిన చోట్ల సమస్య ఉందని, నాలాలను విస్తరించాలని కోరారు. మియాపూర్ వద్ద ఉన్న మయూరీనగర్‌లో వరద నీటి నాలాను అబ్బులు అనే వ్యక్తి ఆక్రమించి, కాంపౌండ్ వాల్ నిర్మించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ..

కూకట్‌పల్లి మాధవి నగర్‌లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని కొందరు కాజేయాలని చూస్తున్నారని, ఆ ప్రాంత వెల్ఫేర్ సొసైటీ ఆరోపించింది. ఆరు ఎకరాల మేర ఉన్న ఈ లేఔట్‌లో 500 కుటుంబాలు నివసిస్తున్నాయి. తట్టి అన్నారం మీదుగా ప్రవహించే నాలాకు అడ్డంగా ప్రహరీ నిర్మించడంతో వరద నీరు నిలిచిపోతోందని, తమ ఇంజినీరింగ్ కళాశాలకు వచ్చే విద్యార్థులు రాలేని పరిస్థితి ఉందని స్థానిక విద్యా సంస్థ నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక మున్సిపల్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశామని అయినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. సాహెబ్‌నగర్ కలాన్ చుట్టుపక్కల కాలనీలు నాగార్జున సాగర్ రోడ్డు వైపు నుంచి వచ్చే వరదతో నీట మునుగుతున్నాయని, కప్పల చెరువు పూర్తి స్థాయిలో నిండి ఎగువన ఉన్న కాలనీలు కూడా నీట మునుగుతున్నాయని పలువురు పేర్కొన్నారు. సాగర్ కాంప్లెక్స్ పేరిట మూడు దశల్లో నిర్మించిన నివాసాలు, హరిహరపురాలతో పాటు ఆయా కాలనీలకు వరద ముప్పు తప్పించాలని హైడ్రాను కోరారు.



రంగనాథ్‌కు మొర పెట్టుకుంటున్న బాధితులు

కుంగిన భారీ సీవర్ ట్రంక్‌లైన్

సుమారు 20 అడుగుల లోతుకు

- అత్యవసర మరమ్మతు పనులు
- పరిశీలించిన జలమండలి ఎండీ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వనస్థలిపురం ఓల్డ్ బాంబే- విజయవాడ హైవే వద్ద భారీ సీవర్ ట్రంక్ మెయిన్ పైపులైన్ సుమారు 20 అడుగుల లోతులో కుంగిపోయింది. భారీవర్షాలకు 900 ఎంఎం డయా ఆర్ సీసీ సీవర్ ట్రంక్ మెయిన్ పైపులైన్ కుంగి ధ్వంసమైంది. సుమారు పాతికేళ్ల క్రితం ట్రంక్ మెయిన్‌లైన్ నిర్మించిన జీహెచ్ఎంసీ ఆ తర్వాత నాలుగేళ్ల క్రితం సీవరేజ్ నిర్వహణ బాధ్యతలను జలమండలికి అప్పగించింది. తాజాగా సీవర్ లైన్ దెబ్బతినడంతో గాంధీనగర్, స్నేహమయి నగర్, పీవీఆర్ కాలనీ, పద్మావతి కాలనీ, వీరాంజనేయ కాలనీ, సామా నగర్, శారదా నగర్, శాంతినగర్, తెలంగాణ పద్మావతి కాలనీల పరిధిలోని సుమారు ఐదు కిలో మీటర్ల మేర అప్‌స్ట్రీమ్ సీవర్ లైన్‌లో లీకే జీ ఏర్పడింది. స్థానిక చెరువులు పొంగి, మురుగు నీటి సమస్య తలెత్తింది. దీంతో జలమండలి యు ద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతోంది.

పనుల తనిఖీ..

భారీ సీవర్ ట్రంక్ మెయిన్ పైపులైన్ అత్యవసర మరమ్మతుల పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. జలమండలి చేపట్టే మరమ్మతులు పైపు లైన్ విస్తరణ పనులు పూర్తయిన వెంటనే.. రోడ్డు మరమ్మతు పనులు నిర్వహించాలని ఆదేశించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, రహదారిలో పూడుకుపోయిన మ్యాన్‌హోళ్లను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

వర్షపు నీరు సీవరేజ్‌లో కలిసిపోకుండా..

వర్షపు నీరు సీవరేజీలో కలవకుండా చర్యలు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ హైవే క్రాసింగ్ వద్ద మురుగు సమస్యను ఆయన పరిశీలించారు. సాగర్ కాంప్లెక్స్ వద్ద తిరుమలానగర్, శ్రీశ్రీ హోమ్స్, మధురా నగర్, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌ల నుంచి వచ్చే మురుగు నీరు కలిసిపోవడంతో వర్షాకాలంలో స్థానికంగా సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించేందుకు, వర్షపు నీరు సీవరేజీలో కలిసిపోకుండా గ్యాప్ వర్క్ తక్షణమే చేపట్టాలని ఎండీ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఓఅండ్ఎం, ఎస్టీపీ, ప్రాజెక్టు అధికారులు అందరూ సమన్వయంతో సీవరేజ్ నేరుగా మూసీలో చేరకుండా స్థానిక ఎస్టీపీకి మళ్లించి, శుద్ధి చేసేలాగా పైపులైన్‌ల ప్రణాళికలు రూపొందించాలన్నారు. అశోక్‌రెడ్డి వెంట జలమండలి సీజీఎం నాగేందర్, జీఎంలు బలరామరాజు, మహేందర్ నాయక్ తదితరులు ఉన్నారు.



సీవర్ లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రశేఖర్

నగర కమిషనరేట్‌లో ఆరుగురు అధికారుల బదిలీ

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా కమతం చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈయనతో పాటు మొత్తం ఆరుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కొత్వాల్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం చంద్రశేఖర్ సీసీఎస్‌లో పనిచేస్తున్నారు. ఈయన స్థానంలోకి నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పసుల రాఘవేంద్రను బదిలీ చేశారు. వీరితో పాటు ఎస్.విష్ణువర్ధన్ రెడ్డిని బండ్లగూడ డీఐ, బి.శ్రీనివాసరావును చాదర్‌ఘాట్ డీఐ, డి.రాజేందర్‌గౌడ్‌ను ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్, సీహెచ్ సురేష్ బాబును యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు.

నెలల శిశువు శ్వాసనాళంలో కణితి తొలగింపు

సాక్షి, సిటీబ్యూరో: 8 నెలల శిశువుకు శ్వాస నాళంలో ఏర్పడిన కణితిని నగర వైద్యులు అతి కష్టంమీద తొలగించారు. ఏపీలోని రాజమండ్రికి చెందిన 8 నెలల శిశువు రెండు వారాలుగా దగ్గు, జలుబుతో బాధపడుతున్నాడు. ఊపిరి తీసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు. స్థానికంగా వైద్యులకు చూపించినా తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని లిటిల్ స్టార్స్, షీ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ సీటీ స్కాన్‌చేయగా శ్వాసనాళంలో కణితి ఉందని గుర్తించామని డా.సతీష్ ఘంటా తెలిపారు. సున్నితమైన ప్రాంతాన్ని సర్జరీ చేస్తే ప్రమాదకరంగా మారుతుందని భావించి థొరాకోస్కోపీ సాయంతో కణితిని తొలగించామన్నారు.

రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ అధికారి ఇంట్లో చోరీ

అమీర్‌పేట: రిటైర్డు ఎయిర్‌ఫోర్స్ అధికారి ఇంట్లో వస్తువులు చోరీకి గురైన సంఘటన ఎస్‌ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిటైర్డ్ వింగ్ కమాండర్ ప్రణయ్ గారా కుటుంబం అమీర్‌పేటలో నివాసం ఉంటోంది. ఈ నెల 20న పసుపు రంగు చీర కట్టుకున్న ఓ మహిళ అకస్మాత్తుగా ఇంట్లోకి ప్రవేశించి పూజగదిలో నుండి తులంన్నర బంగారు రుద్రాక్షలు, మూడు దీపపు కుందులు, ఇత్తడి వస్తువుల్ని ఎత్తుకెళ్లింది. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు..సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించి నిందితురాలని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

కాచిగూడ: ఒడిశాలోని బరంపుర నుంచి హైదరాబాద్‌కు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన చేసిన మీడియా సమావేశంలో రైల్వే డిప్యూటీ సూపరిటెండెంట్ ఎస్.ఎన్ జావేద్, కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తదితరులు వివరాలు వెల్లడించారు. సోమవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా మహేశ్వరం మండలం రావిర్యాల్ గ్రామానికి చెందిన మాడుగుల అర్జున్ అదే ప్రాంతానికి చెందిన వట్టి శ్రీనివాస్‌ల వద్ద గంజాయి లభించింది. వీరు ఒడిశాలోని బరంపుర అటవీ ప్రాంతంలో 10 కిలోల గంజాయి కొనుగోలు చేసి, దానిని ఏడు ప్యాకెట్లుగా విడదీసి రెండు బ్యాగులలో పెట్టుకొని కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్ చేరుకోగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరివద్ద 10.854 కిలోల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

‘పహల్గాం ఎటాక్’ పేరుతో డిజిటల్ అరెస్టు

- టార్గెట్‌గా మారిన నగరానికి చెందిన వృద్ధుడు
- నకిలీ అరెస్టు వారెంట్, కోర్టు ఉత్తర్వులూ షేరింగ్
- మొత్తం రూ.26.6 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- సిటీ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ అరెస్టు పేరుతో వృద్ధులతో సహా అనేక మందిని భయపెట్టి నిలువు దోపిడీ చేస్తున్న సైబర్ నేరగాళ్లు తాజాగా పహల్గాం ఉగ్రదాడినీ వాడేస్తున్నారు. నగరానికి చెందిన ఓ వృద్ధుడికి (68) ఫోన్లు చేసిన కేటుగాళ్లు ఏకంగా రూ.26.06 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హుమాయున్‌నగర్‌కు చెందిన బాధితుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి కేసులో ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఆ ఉగ్రవాదులకు నిధులు అందించిన ఆరోపణలతో వృద్ధుడిపై కేసు నమోదైనట్లు భయపెట్టారు. ఆపై వీడియో కాల్ చేసిన కేటుగాళ్లు నకిలీ అరెస్టు వారెంట్‌తో పాటు మరికొన్ని బోగస్ డాక్యుమెంట్లు కూడా చూపించారు. ఓ దశలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ), యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్), డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) పేర్లూ వాడేశారు. ఆ ఉగ్రవాదులతో, నిధులతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ బాధితుడు చెప్పగా..డిజిటల్ అరెస్టు చేశామని, నిర్దోషిత్వం నిరూపించుకోకపోతే అరెస్టు తప్పదని పేర్కొన్నారు. నిర్దోషిత్వం నిరూపించుకోవడానికి తాము చెప్పిన మొత్తం బదిలీ చేయాలని, కేసు ఎత్తేసిన తర్వాత దాన్ని రిఫండ్ ఇస్తామని నమ్మబలికారు. దీనికి సంబంధించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జారీ చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. ఈ వ్యవహారం తేలే వరకు డిజిటల్ అరెస్టులో ఉండాలని, విషయం ఎవరికీ చెప్పకూడదని షరతు విధించారు. సైబర్ నేరగాళ్ల నుంచి తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొన్న బాధితుడు కొటక్ మహీంద్ర, ఆర్‌బీఎల్ బ్యాంకుల్లో ఉన్న తన ఫిక్స్‌డ్ డిపాజిట్లు రద్దు చేసి రూ.6.06 లక్షలు కేటుగాళ్లు చెప్పిన ఖాతాల్లోకి బదిలీ చేశారు. అప్పటికీ వారి నుంచి ఒత్తిడి తగ్గకపోవడంతో తన భార్య ఖాతాలో ఉన్న రూ.20 లక్షలూ బదిలీ చేశారు. నగదు వెళ్లిన ఖాతా హెంట్రీ జోన్స్ పేరుతో ఉన్నాయి. అయినప్పటికీ వేధింపులు తప్పలేదు. ఎట్టకేలకు తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు టోల్ ఫ్రీ నెం.1930 ద్వారా సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

అక్కా తమ్ముళ్లు అదృశ్యం



అదృశ్యమైన శాంతి, ప్రదీప్

చిలకలగూడ: అక్కా తమ్ముళ్లు అదృశ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వారాసిగూడ ఇందిరానగర్‌కు చెందిన నాగినేని శాంతి (40), ప్రదీప్‌లు అక్కా తమ్ముళ్లు. ఈ ఏడాది ఆగస్టునెలలో శాంతికి రాజాతో వివాహమైంది. సోదరుడు ప్రదీప్ మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. వీరి తల్లికి కంటి ఆపరేషన్ జరగడంతో అందరూ కలిసి ఇందిరానగర్‌లోనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలకు శాంతి, ప్రదీప్‌లు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయారు. శాంతి సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ వస్తోంది. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో మరో సోదరుడు నాగినేని రాణాప్రతాప్ మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, అక్కాతమ్ముళ్ల ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని చిలకలగూడ పోలీసులు కోరారు.

భర్త అదృశ్యమయ్యాడని భార్య ఫిర్యాదు



రాజేష్ (ఫైల్)

మేడిపల్లి: భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిన వివరాల ప్రకారం జనగాం జిల్లా మొండ్రాయి గ్రామానికి చెందిన ధరావత్ రాజేష్, శిరీష దంపతులు బోడుప్పల్ శ్రీలక్ష్మి కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి పెళ్లయి మూడేళ్లయినా సంతానం కలగలేదు. ఈ విషయంలో భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరిగాయి. దీంతో మనస్తాపం చెందిన రాజేష్ ఈ నెల 20న ఉదయం భార్య బయటకు వెళ్లగానే..ఇంట్లోనుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో, తెలిసిన వారివద్ద వెతికినా ఫలితం కన్పించలేదు. ఈ మేరకు మంగళవారం భార్య శిరీష తన భర్త కన్పించడం లేదని ఫిర్యాదు చేరని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద రెడ్డి తెలిపారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్టు

నాంపల్లి: ఇటీవల హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్‌లో జరిగిన ఓ హత్య కేసులోని నిందితుడిని నాంపల్లి జీఆర్పీ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. హత్యకు పాల్పడి తప్పించుకుని తిరుగుతున్న అతడిని ఫతేనగర్ రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు. ఈ కేసును చేధించిన రైల్వే పోలీసులను రైల్వే డీఎస్పీ జావేద్ అభినందించారు. మంగళవారం నాంపల్లిలోని జీఆర్పీ రైల్వే పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జావేద్, నాంపల్లి జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. హఫీజ్‌పేటలో నివాసం ఉండే నీలం రాజేష్, బాలానగర్‌లో నివాసం ఉండే పి.రవి దినసరి కూలీలు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. మద్యానికి అలవాటు పడిన వీరిద్దరూ జులాయిగా తిరుగుతుంటారు. ఈ నెల 18న హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్‌లో మద్యం మత్తులో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. నీలం రాజేష్ తలపై రవి సిమెంటు ఇటుకతో కొట్టడంతో చనిపోయాడు. దీంతో నిందితుడు రవి అక్కడి నుంచి పారిపోయి తప్పించుకుని తిరుగుతున్నారు. మంగళవారం ఫతేనగర్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదస్థితిలో సంచరిస్తుండగా విధుల్లో ఉన్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నీలం రాజేష్‌ను చంపినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకోవడంతో రవిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బ్లాస్టింగ్‌లకు నిబంధనలు అమలు చేయండి

సర్కార్‌కు హైకోర్టు ఆదేశం..పిల్ విచారణ ముగింపు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో అభివృద్ధి పనుల్లో భాగంగా బ్లాస్టింగ్‌లకు అనుమతిచ్చే ముందు నిబంధనలు కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ అంశంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) సహా అన్ని పిటిషన్ల విచారణను ముగించింది. జూబ్లీహిల్స్ నివాస ప్రాంతంలోని కొండరాళ్ల తొలగింపునకు రాత్రి పగలు పేలుళ్లు నిర్వహిస్తున్నారని పత్రికల్లో వచ్చిన కథనంపై విచారణ జరపాలని జస్టిస్ భీమపాక నగేశ్ లేఖ రాయగా.. సుమోటో పిల్‌గా విచారణ చేపట్టాలని ప్రధాన న్యాయమూర్తి ఆదేశించిన విషయం విదితమే. ఈ పిల్‌పై ప్రధాన సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. ‘బ్లాస్టింగ్’లు చేపట్టడానికి నిర్మాణ సంస్థకు హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ ఇచ్చిన అనుమతుల వివరాలతో సమగ్ర అఫిడవిట్‌ను ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్ దాఖలు చేశారు. అనంతరం వాదనలు వినిపిస్తూ.. నగర పోలీసు చట్టం ప్రకారం బ్లాస్టింగ్‌లకు అనుమతిచ్చే అధికారం కమిషనర్‌కు ఉందన్నారు. అనుమతిచ్చే ముందు పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పీఈఎస్‌వో), పేలుడు పదార్థాల ముఖ్య నియంత్రణాధికారి (సీసీవోఈ) నుంచి వివరాలు తీసుకున్నారని, డిప్యూటీ పోలీస్ కమిషన్ కూడా గ్రౌండ్ రిపోర్టు అందజేశారని తెలిపారు. బ్లాస్టింగ్ జరిగే ప్రదేశానికి సమీపంలోని నివాస భవనాలపై దాని ప్రభావంపై తనిఖీ చేసిన తర్వాతే పీఈఎస్‌వో, సీసీవోఈ ఆమోదం తెలుపుతుందని చెప్పారు. అనుమతి పొందిన నిర్మాణ సంస్థ 2024లో బ్లాస్టింగ్‌లు ప్రారంభించగా, ఈ ఏడాది జూలై 9న నిలిపివేసిందని వెల్లడించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా అన్ని బ్లాస్టింగ్‌లు జరిగాయని సీపీ పేర్కొన్నట్లు వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. బ్లాస్టింగ్‌లు నిలిపివేసినందున విచారణ కొనసాగించడం అనవసరమని అభిప్రాయపడింది. అయితే, ఇకపై ఎలాంటి అనుమతులు ఇచ్చినా నిబంధనలు కఠినంగా పాటించాలని, సమీప ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించింది.

బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురై..

గుండెపోటుతో మహిళ దుర్మరణం



లక్ష్మి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురైన ఓ మహిళ గుండెపోటుతో మృతిచెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం, రంగాపురం గ్రామానికి చెందిన లక్ష్మి(66) ఆదిబట్లలోని టీసీఎస్ ఎదుట ఉన్న వెంకటేశ్వర హాస్టల్‌లో వంట మనిషిగా పని చేసేది. ఈనెల 21న హాస్టల్‌లో ఉండే మహిళలతో కలిసి బతుకమ్మ ఆడింది. ఈక్రమంలో అలసటగా ఉందంటూ గదిలోకి వెళ్లింది. ఎడమ చేయి లాగుతోందని చెప్పడంతో జండూబామ్ రాసి పడుకోబెట్టారు. ఛాతిలో కూడా నొప్పి వస్తోందని చెప్పడంతో ఆర్‌ఎంపీని పిలిపించారు. పల్స్ బాగా పడిపోవడంతో రాత్రి 12:30 గంటలకు అంబులెన్స్‌లో వనస్థలిపురం ఏరియా అస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. లక్ష్మి గతంలో సీపీఐఎంఎల్ పార్టీలో క్రియాశీలక సభ్యురాలిగా, ప్రగతిశీల మహిళా సమాఖ్య(పీఓడబ్ల్యూ) సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా పని చేశారు. లక్ష్మికి భర్త నాగయ్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు.

రూ.9 లక్షల సుపారీతో హత్యకు కుట్ర

- భగ్నం చేసిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు
- పాతకక్షలే కారణం..ముగ్గురి అరెస్టు



నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న కత్తులు, సెల్‌ఫోన్లు, నగదు

మైలార్‌దేవ్‌పల్లి: తొమ్మిది లక్షల రూపాయలు సుపారీ తీసుకుని ఒక వ్యక్తిని హత్య చేసేందుకు పన్నిన కుట్రను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు భగ్నం చేశారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి..వారి వద్ద రెండు కత్తులు, సెల్‌ఫోన్లు, బైక్‌లు, పది వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెల్పిన మేరకు..వట్టేపల్లికి చెందిన యాసిన్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్‌లు గతంలో పాత వాహనాల క్రయవిక్రయాల వ్యాపారం చేసేవారు. లావాదేవీలలో తేడాలు వచ్చి కొద్దికాలం తర్వాత విడిపోయారు. ఈ క్రమంలో గతేడాది ఇమ్రాన్‌ఖాన్‌ను చంపాలనే ఉద్దేశంతో షేక్ అమీర్, మహ్మద్ సోహైల్, మరికొందరు వ్యక్తులు అతని ఇంటిపై దాడి చేయగా..మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పట్లోనే షేక్ అమీర్, మహ్మద్ సోహైల్, ఇతరులను అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఇటీవల మళ్లీ తనపై హత్యాయత్నం జరుగుతుందని అనుమానించిన ఇమ్రాన్‌ఖాన్..ఏకంగా ఇందుకు సూత్రధారిగా భావిస్తూ తన పాతమిత్రుడు యాసిన్‌ఖాన్‌ను చంపేందుకు కుట్రపన్నాడు. ఈమేరకు తనకు తెలిసిన ఇబ్రహీం, సైఫ్, శ్రీరామ్, షాబాజ్, షోయబ్, బావజీర్‌లకు రూ.9 లక్షలు సుపారీ ఇస్తానని చెప్పి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముందుగా రూ.60 వేలు, నాలుగు కత్తులు, యాసిన్‌ఖాన్ ఫొటోను వారికిచ్చాడు. వారు అనుకున్న పథకం ప్రకారం ఈ నెల 22వ తేదీన యాసిన్‌ఖాన్ వట్టిపల్లిలోని నైస్ హోటల్‌కు వస్తాడని తెలుసుకుని అక్కడ కాపుకాశారు. కొద్దిసేపటికి అక్కడికి వచ్చిన పోలీసులను చూసి అందరూ పారిపోయేందుకు ప్రయత్నించగా...వెంబడించి మహ్మద్ సైఫ్, ఫలక్‌నూమా ఏసీపీ ఆఫీస్‌లో హోంగార్డుగా పని చేస్తున్న శ్రీరామ్‌లను పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద రెండు కత్తులు, రెండు సెల్‌ఫోన్లు, రెండు బైక్స్, రూ.పది వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సుపారీకి ప్రధాన సూత్రధారి అయిన ఇమ్రాన్‌ఖాన్‌ను అతడి ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

డ్రగ్స్ విక్రేతల అరెస్టు



నిందితులతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

రాజేంద్రనగర్: ఉన్నత చదువులు చదివి..దురలవాట్లకు బానిసై..డబ్బు అవసరాలు తీర్చుకునేందుకు మత్తు పదార్థాల విక్రేతలుగా మారిన ముగ్గుర్ని మంగళవారం బుద్వేల్ బన్సీలాల్‌నగర్ ప్రాంతంలో పట్టుకున్నారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..యాదాద్రి బీబీనగర్‌కు చెందిన మహ్మద్ అన్వర్, అచ్చంపేటకు చెందిన వాసు బీటెక్ విద్యార్థులు. చదువుకునేందుకు నగరానికి వచ్చి చాంద్రాయణగుట్ట ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరికి అదే ప్రాంతానికి చెందిన మజ్హర్ అలీతో స్నేహం ఏర్పడింది. వీరంతా దురలవాట్లకు బానిసయ్యారు. తమ అలవాట్లను తీర్చుకునేందుకు డబ్బు అవసరమై డ్రగ్స్ విక్రయించాలని నిర్ణయించుకున్నారు. బెంగళూరుకు వెళ్లి ఎండీఎంఏ మాత్రలు, వైజాగ్‌కు వెళ్లి గంజాయిని తీసుకొచ్చారు. వీటిని తమకు తెలిసిన వారికి విక్రయించడం ప్రారంభించారు. దీనిపై సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఉదయం బుద్వేల్ బన్సీలాల్‌నగర్ రోడ్డు గుండా వెళుతున్న సమయంలో పట్టుకొని సోదాలు చేశారు. నిందితుల వద్ద కిలోన్నర గంజాయి, 6.6 గ్రాముల ఎండీఎంఏ మాత్రలు లభించాయి. నిందితులను పట్టుకొని తదుపరి విచారణ నిమిత్తం శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

మద్యం తాగించి..‘హత్యా’చారం

- మహిళ హత్యకేసులో వెలుగులోకి నిజాలు
- సామూహిక లైంగిక దాడి జరిగినట్లు గుర్తింపు
- ముగ్గురు నిందితుల అరెస్టు

రాజేంద్రనగర్: తమకు సహకరించడం లేదని ఓ మహిళపై లైంగిక దాడికి పాల్పడి..అతి కిరాతకంగా హత్య చేసిన ఇద్దరు నిందితులతో పాటు మరో వ్యక్తిని రాజేంద్రనగర్ క్రైమ్ పోలీసులు పట్టుకొని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రెండు ఆటోలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..లంగర్‌హౌజ్ ప్రాంతానికి చెందిన మేక దుర్గారెడ్డి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సెప్టెంబర్ 14న రాత్రి హైదర్‌గూడ ప్రాంతంలోని కల్లు కంపౌండ్ వద్దకు వెళ్లి తన ఆటోలో నగరానికి చెందిన ఓ మహిళను తీసుకొని సాతంరాయి ప్రాంతానికి వెళ్లాడు. బీర్లతో పాటు బిర్యానీ తీసుకొని అక్కడే భుజించి మహిళపై లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆరాంఘర్ చౌరస్తా ప్రాంతానికి తీసుకొచ్చి వదిలి వెళ్లాడు. అక్కడే ఉన్న టౌలిచౌకి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ గులాం దస్తగిర్ ఖాన్, మహ్మద్ ఇమ్రాన్‌లు ఇది గమనించారు. వీరిద్దరిపై గచ్చిబౌలి, రాజేంద్రనగర్, టౌలిచౌకి పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనం కేసులు ఉన్నాయి. మద్యం మత్తులో ఉన్న మహిళను తమ ఆటోలో తీసుకొని కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. నిర్మానుష్యంగా ఉన్న ఈ ప్రాంతంలో దస్తగిర్, ఇమ్రాన్, మహిళలు కలిసి మద్యం తాగారు. అనంతరం దస్తగిర్, ఇమ్రాన్‌లు ఆమెపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ సమయంలో తమకు సహకరించడం లేదంటూ మహిళను చితకబాదారు. అతి కిరాతకంగా దాడి చేసి హత్య చేశారు. అనంతరం పారిపోయారు. రెండు రోజుల అనంతరం స్థానికులు మహిళ మృతదేహన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మహిళ వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరాలలో దుర్గారెడ్డి మొదట హైదర్‌గూడ కల్లు కంపౌండ్ నుంచి తీసుకెళ్లి ఆరాంఘర్ వద్ద వదిలి వెళ్లడం..అనంతరం దస్తగిర్, ఇమ్రాన్‌లు ఆటోలో తీసుకెళ్లడం కనిపించింది. సీసీ కెమెరాల ఆధారంగా వారం రోజుల పాటు నిందితుల కోసం గాలించి మంగళవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

మహిళాశక్తి చాటుతున్న తెలంగాణ మహిళలు



బతుకమ్మ ఆడుతున్న సినీనటి కుష్బూ

దూద్‌బౌలి: మహిళా శక్తి అంటే ఏంటో తెలంగాణ మహిళలు బతుకమ్మ ఉత్సవాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా చాటి చెబుతున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ప్రముఖ సినీనటి కుష్బూ అన్నారు. మంగళవారం చార్మినార్ వద్ద బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం చార్మినార్ వద్ద బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నటి కుష్బూ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ మహిళ అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణలోని బీజేపీ మహిళలు చేస్తున్న కృషిని ఢిల్లీలోని మోదీకి ఒక మంచి సందేశం ద్వారా తెలియజేయాలని ఆమె కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో నిర్వహించే బతుకమ్మ ఉత్సవాలకు దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో 5000 మందితో దుబాయిలో బతుకమ్మ సంబరాలు నిర్వహించబోతున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, బండ కార్తీకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి మృతికి కారణమైన యువకుల రిమాండ్

బోడుప్పల్: బీటెక్ విద్యార్థి మృతికి కారణమైన ఐదుగురు యువకులను మంగళవారం మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి తెలిపిన వివరాల ప్రకారం..నారపల్లిలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జాదవ్ సాయితేజను వేధింపులకు గురిచేయగా తీవ్ర మనస్తాపం చెందిన ఆత్మహత్య చేసుకున్న సంఘటన విదితమే. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు 9 మంది యువకుల మీద కేసు నమోదు చేశారు. ఈక్రమంలో మంగళవారం మేడిపల్లి పోలీసులు శివకుమార్ యాదవ్, గంగినేని ప్రశాంత్, బుర్రా రోహిత్, చిదారి మురళీధర్, వడ్డం సాయి ప్రసాద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. మిగతా నలుగురు నిందితులు పరారీలో ఉండగా గాలిస్తున్నట్లు తెలిపారు.

చంపటానికి యత్నించిందని భార్యపై భర్త ఫిర్యాదు

మూసాపేట: తనను చంపటానికి ప్రయత్నించిందంటూ భార్యపై భర్త కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్‌కు చెందిన దేశబోయిన భూపాల్, చంద్రకళ దంపతులు కూకట్‌పల్లి సంగీత్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఐదేళ్ల క్రితం పెళ్లవగా..సంతానం లేదు. ఈ క్రమంలో చంద్రకళ దుర్గయ్య అనే వ్యక్తితో సన్నిహితంగా ఉంటోందని, మంగళవారం ఉదయం చంద్రకళ పనికి వెళ్లిన తర్వాత ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి తనను తీవ్రంగా కొట్టారని, చంపేందుకు యత్నించారని భూపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుర్గయ్య, అతని స్నేహితుడు, భార్య చంద్రకళపై తనకు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై దాడి చేసి బంగారు గొలుసు చోరీ

మణికొండ: కారు చెడిపోయి..రోడ్డు పక్కగా నిల్చున్న ఓ యువకుడిపై ఆరుగురు వ్యక్తులు దాడి చేసి కొట్టి..అతని వద్ద ఉన్న 10 గ్రాముల బంగారు గొలుసు, ఐ ఫోన్‌ను చోరీ చేసిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట నియోపోలీస్ గుట్టపై సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన బి.సునిల్ భాస్కర్ సోమవారం రాత్రి 11.30 గంటలకు గౌలిదొడ్డి వైపు నుంచి కోకాపేట నియోపోలిస్ వెంచర్‌కు వెళ్లాడు. అక్కడ కారు చెడిపోవటంతో రోడ్డు పక్కన ఆపి అతని సోదరుడు శేఖర్‌కు సమాచారం ఇచ్చాడు. రాత్రి 11.55 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు అతన్ని కొట్టి మెడలోని బంగారు చైన్, జేబులోని ఐఫోన్‌ను లాక్కుని పారిపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పబ్‌లో ఘర్షణ.. బౌన్సర్లకు గాయాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని మ్యాడ్ పబ్‌లో కొంతమంది అతిగా మద్యం తాగి, బిల్లు ఎక్కువగా వచ్చిందని పబ్ సిబ్బందితో గొడవ పడ్డారు. బిల్లు తగ్గించాలని వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు అక్కడున్న సిబ్బంది, బౌన్సర్లపై ఖాళీ సీసాలు, చేతికి అందిన వస్తువులతో దాడి చేశారు. దీంతో బౌన్సర్లకు తీవ్ర గాయాలవగా.. కొండాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పబ్ ఓనర్ ప్రశాంత్ మాదాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని విద్యార్థిని మృతి

హయత్‌నగర్: కళాశాల బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్‌లో ఉంటున్న ఖుర్షీద్ అహ్మద్ కుమార్తె జమున అహ్మద్ (20) గీతం కళాశాలలో డిగ్రీ చదువుతుంది. రోజు మాదిరిగానే మంగళవారం కళాశాలకు వెళ్లేందుకు కృష్ణవేణి ఆసుపత్రి వద్ద జాతీయ రహదారిపై బస్సు కోసం రోడ్డు దాటుతుండగా పెద్ద అంబర్‌పేట్ వైపు నుంచి వేగంగా వచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీ కొట్టింది. దీంతో స్పృహ తప్పి పడిపోగా స్థానికులు ఆమెను వెంటనే కృష్ణవేణి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు మలక్‌పేట్ యశోదా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన కొత్తూరు పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరు నుంచి తిమ్మాపూర్ వెళ్లే మార్గంలో పెంజర్ల కూడలి సమీపంలో రోడ్డుపై ఓ మృతదేహాన్ని పెట్రోలింగ్ పోలీసులు గమనించినట్లు తెలిపారు. గుర్తు తెలియని వాహనం అతడ్ని ఢీకొట్టడంతో తీవ్రగాయాలై మృతి చెందినట్లు చెప్పారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో వైద్య శిబిరం



సమగ్ర ఆరోగ్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఆర్‌బీఎల్ బ్యాంక్, సీఎస్‌ఆర్ ధన్వంతరి సమన్వయంతో సిబ్బంది కోసం సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం మద్దతుతో విద్యార్థులు, విద్యావేత్తలలో క్రమం తప్పకుండా ఆరోగ్య పర్యవేక్షణ ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన జీవనశైలి పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, ప్రాథమిక రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాంచనవల్లి తదితరులు పాల్గొన్నారు.

లిటిల్‌స్టార్‌లో బతుకమ్మ వేడుకలు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–10 గాయత్రీహిల్స్‌లోని లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో మంగళవారం బతుకమ్మ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ అస్మతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

5న యువతకు ఉచిత ఉపాధి శిక్షణ శిబిరం

హిమాయత్‌నగర్: ఫ్యాషన్ డిజైన్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ తదితర సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కోర్సులపై వచ్చేనెల 5న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఉచిత అవగాహన శిక్షణ శిబిరాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి కోరారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్, యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొ.చంద్రదేవ్ వావ్దేతో కలసి గైబువల్లి ఆవిష్కరించి మాట్లాడారు. వివరాలకు ఫోన్: 93817 55509, 96767 05763.

ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి వాటర్ ప్లాంట్స్



వాటర్‌ప్లాంట్స్‌ను అందజేస్తున్న దివిస్ ల్యాబొరేటరీస్ ప్రతినిధులు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి దివిస్ ల్యాబొరేటరీస్ సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.58లక్షల విలువైన 12 వాటర్ ప్లాంట్స్‌ను మంగళవారం విరాళంగా అందజేసింది. రోగులు, సిబ్బంది, రోగుల బంధువులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే సదుద్దేశ్యంతోనే వాటర్‌ప్లాంట్స్ అందజేసినట్లు దివిస్ ల్యాబొరేటరిస్ సీఎస్‌ఆర్ హెడ్ నగేష్ తెలిపారు. మానసిక ఆసుపత్రిలో ఇటీవల జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా అత్యాధునిక టెక్నాలజీతో వాటర్‌ప్లాంట్స్ అందించడం సంతోషకరమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ హెడ్ డాక్టర్ శంకర్, ఆర్ఎంఓ డాక్టర్ కౌసర్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మహాగౌరి దేవి అలంకారంలో మాగంటి కాలనీ విజయకనకదుర్గ



బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో రాజరాజేశ్వరి దేవి



శ్రీగాయత్రి దేవి అలంకారంలో శ్రీనగర్‌కాలనీ భ్రమరాంబికా దేవి



బాలా త్రిపుర సుందరీ దేవిగా బంజారాహిల్స్ కనక దుర్గాదేవి

గాయత్రి దేవి అలంకారంలో అమ్మవారు



గాయత్రి దేవి అలంకారంలో పెద్దమ్మతల్లి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీనగర్‌కాలనీలోని శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారు శ్రీగాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, బంజారాహిల్స్‌లోని కనకదుర్గా దేవి అమ్మవారు మహా గౌరిదేవి రూపంలో దర్శనమిచ్చారు. బంజారాహిల్స్‌లోని విశ్వసాయి మందిరంలో కొలువుదీరిని కనకదుర్గగా దేవి అమ్మవారికి హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవీ దేవి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫిలింనగర్ దైవసన్నిదానంలో నిర్వహించిన చండీ హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు – బంజారాహిల్స్



బంజారాహిల్స్‌లోని కనకదుర్గాదేవి అమ్మవారి పూజల్లో హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవీ దేవి



గాయత్రి దేవి అలంకారంలో విజయ గణపతి స్వామి ఆలయంలో అమ్మవారు



దైవసన్నిదానంలో హోమంలో మహిళలు

జీతాలివ్వండి మహాప్రభో..



- ఏజెన్సీలు మారినా జీతాలు ఇస్తలేరు
- ఇలా అయితే ఎలా బతకాలి
- నిమ్స్ సెక్యూరిటీ గార్డుల నిరసన

లక్డీకాపూల్: జీతాలు ఇప్పించండి మహాప్రభో అంటూ నిమ్స్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు వేడుకుంటున్నారు. సెక్యూరిటీ ఏజెన్సీ ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలంటూ నిమ్స్ యాజమాన్యానికి మొర పెట్టుకున్నారు. ఓంసాయి ప్రొఫెషనల్ డిటెక్టివ్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్(ఓపీడీ) సంస్థకు చెందిన సెక్యూరిటీ గార్డులు మంగళవారం పెద్ద ఎత్తున విధులు బహిష్కరిస్తూ నిరసన తెలిపారు. నిమ్స్ సెక్యూరిటీ కార్యాలయం ఎదుట గార్డులు ధర్నా నిర్వహించారు. గతంలో సెక్యూరిటీ గార్డులను సరఫరా చేసిన కార్తికేయ సెక్యూరిటీ ఏజెన్సీ సెక్యూరిటీ గార్డులకు రెండు నెలలు బకాయి పడిందన్నారు. ఆ స్థానంలో వచ్చిన ఓపీడీ సంస్థ సైతం గార్డులకు నెలవారీ వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో నెలల తరబడి వేతనాలు బకాయిపడితే తాము ఎలా బతికేదని వాపోయారు. నిత్యం ఆస్పత్రికి పెద్ద సంఖ్యలో వచ్చే రోగులు, వారి సహాయకుల భద్రతతో పాటు నిమ్స్ ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి పని చేస్తున్న తమకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా భద్రతా సిబ్బంది జీతాలకు సంబంధించి బిల్లులను నెలవారీ సకాలంలో సమర్పించకపోవడం వల్లే సిబ్బంది వేతనాల చెల్లింపులో జాప్యం చోటు చేసుకుంటుందని నిమ్స్ ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా సెక్యూరిటీ గార్డులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ విరాళాలను కూడా వెంటనే చెల్లించకపోవడం వల్ల కూడా ఈ సమస్య తలెత్తుతోందని అంటున్నారు. వేతనాల చెల్లింపు విషయంలో ఏపీడీఎస్ నిర్వాహకులతో నిమ్స్ ఉన్నతాధికారులు అనేక సమావేశాలు నిర్వహించినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని నిమ్స్ సెక్యూరిటీ గార్డుల సంఘం ప్రతినిధి వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఓపెన్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ సైకాలజీ సబ్జెక్టు మార్చుకోవాలి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025–26 విద్యా సంవత్సరానికి ఎమ్మెస్సీ సైకాలజీ కోర్సును దూర విద్యా పద్ధతిలో నిర్వహించేందుకు దేశంలో అన్ని యూనివర్సిటీలకు ఈ విద్యా సంవత్సరం నుంచి యూజీసీ అనుమతి నిరాకరించినట్లు యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం సైకాలజీ కోర్సులో చేరిన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును రీఫండ్ చేస్తామని చెప్పారు. విద్యార్థులు సైకాలజీ సబ్జెక్టు నుంచి అర్హత కలిగిన వేరొక పీజీ సబ్జెక్టుకు మార్చుకోవాలనుకున్న వారు యూనివర్సిటీ విద్యార్థి సేవల విభాగంలో దరఖాస్తు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

కాలనీల అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేశాం

వెంగళరావునగర్: అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని కార్పొరేటర్ దేదీప్య అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీ జి–బ్లాక్‌లో రూ.18 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో కాలనీలో కోట్లాది రూపాయల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. కాలనీ అసోసియేషన్ నేతలు కోడె సాంబశివరావు, మనోహర్, కమలాకర్‌రావు, పూజారి బాలు, పవన్ ముదిరాజ్, సత్యనారాయణ, కృష్ణ తదితరులు ఉన్నారు.



మధురానగర్‌లో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

అనంతరం జీటీఎస్ టెంపుల్‌లో నిర్వహించిన హోమంలో ఆమె పాల్గొని పూజలు నిర్వహించారు.

జీఎస్టీ తగ్గింపుతో పెరగనున్న వస్తు ఉత్పత్తి

పంజగుట్ట: జీఎస్టీ తగ్గింపు, ఎంఎస్ఎంఈ తీసుకువచ్చిన కొత్త పాలసీలు చిన్న, మధ్యతరగతి పారిశ్రామికవేత్తలకు ఉపయోగకరమని లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడు వసంతం వెంకటేశ్వర్లు అన్నారు. భారీగా పన్నులు తగ్గించడం ద్వారా ప్రభుత్వానికి రూ.వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని కొందరు అంటున్నారు. కానీ ధర తక్కువ కావడంతో వస్తు ఉత్పత్తి పెరిగి రెండు, మూడు నెలల్లోనే విపరీతమైన లాభాలు చూడవచ్చని పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ ఈసీ సభ్యులు అనీల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నరేంద్రనాథ్ దత్‌తో కలిసి మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గడం వల్ల నిత్యావసరాల ధరలు గతంలో 18, 12 శాతం ఉన్నా ప్రస్తుతం 5 శాతం కావడంతో ధరలు తగ్గుతాయని, కేన్సర్ సహా 33 రకాల ఔషధాలకు జీరో జీఎస్టీతో వ్యాధిగ్రస్తులకు ఉపశమనం లభిస్తుందన్నారు.

'మరియమ్మ కుమారుడు శేఖర్‌పై తప్పుడు కేసు'

హిమాయత్‌నగర్: వరంగల్ జిల్లాలోని మీల్స్ కాలనీలో రెడ్ బకెట్ నిర్వహిస్తున్న మరియమ్మపై గతనెల 22న అర్ధరాత్రి అకారణంగా దాడి చేసిన ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుల్ రాజును తక్షణమే సస్పెండ్ చేయాలని తెలంగాణ దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ నకిరికంటి సంజీవరావు డిమాండ్ చేశారు. మరియమ్మ కుమారుడు శేఖర్‌పై తప్పుడు కేసు నమోదు చేసి ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం సంజీవరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. తక్షణమే ఎస్సీ, ఎస్టీ కమిషన్ గ్రామస్థాయికి వెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు హుస్సేన్, చింత వెంకన్న, లాలు, సైదులు, ఎల్లమ్మ, మడుపల్లి బుజ్జి, దుర్గమ్మ, సలేంద్ర, నిర్మలమ్మ పాల్గొన్నారు.

వాహనాల దొంగ అరెస్టు

పంజగుట్ట: ఆటోలు, ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న నిందితులను అరెస్టు చేయడంతో పాటు వాహనాలు కొనుగోలు చేసిన వారిపై కేసు నమోదు చేశారు. పంజగుట్ట పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 13వ తేదీన ఉదయం తన ద్విచక్రవాహనం చోరీ అయినట్లు ఓ వాహనదారుడు పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితుడు బోరబండకు చెందిన షేక్ ఇమ్రాన్(22), అదే ప్రాంతానికి చెందిన ఎండీ షాహిద్‌ఖాన్(21), సయ్యద్ సాదిక్ అలీ(22), సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన షేక్ షానవాజ్(29), అదే ప్రాంతానికి చెందిన నాసర్ ఖాన్(21)గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పంజగుట్టతో పాటు సైబరాబాద్ పరిధిలోని మాదాపూర్, సూరారం, జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు ఆటోలు, ఒక బైక్ చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వాటన్నింటినీ స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని కొనుగోలు చేసిన వారిపై కేసులు నమోదు చేశారు.

మీడియాపై కృత్రిమ మేధస్సు ప్రభావం

- అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి



సెమినార్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: మీడియాపై కృత్రిమ మేధస్సు గణనీయమైన ప్రభావాన్ని చూపే అనేక సాంకేతిక పురోగతిని తీసుకువచ్చిందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో వచ్చేనెల 17, 18 తేదీల్లో 'కృత్రిమ మేధస్సు యుగంలో జర్నలిజం భవిష్యత్తు: అవకాశాలు–సవాళ్లు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సెమినార్ బ్రోచర్‌ను మంగళవారం వైస్ చాన్స్‌లర్ ఘంటా చక్రపాణి ఆవిష్కరించి మాట్లాడారు. పదేళ్లలో మీడియాపై కృత్రిమ మేధస్సు గణనీయమైన ప్రభావాన్ని చూపేవిధంగా అనేక సాంకేతిక పురోగతులను తీసుకువచ్చిందన్నారు. ఫలితంగా మీడియాలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. సోషల్ మీడియా, ఫేక్ వార్తల వ్యాప్తి, జర్నలిస్ట్ నిబద్ధత, మారిన పరిస్థితులు, మీడియా సంబంధాలు, కంటెంట్‌తో సహా జర్నలిజంలోని అన్ని కోణాలు మారుతున్నాయని వెల్లడించారు. ఆసక్తి గల విద్యావేత్తలు, పరిశోధన విద్యార్థులు, పరిశోధన పత్రాలను పంపించాలని సెమినార్ డైరెక్టర్ కోరారు. కార్యక్రమంలో సెమినార్ డైరెక్టర్, సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ డీన్ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఎల్.విజయకృష్ణారెడ్డి, సెమినార్ కో–డైరెక్టర్ యాదగిరి కంభంపాటి, కో–ఆర్డినేటర్ డాక్టర్ సునీల్‌కుమార్ పోతన, వేణుగోపాల్ రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి శ్రీనివాస్, ఈఎంఆర్‌ఆర్‌సీ డైరెక్టర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేసి గులాబీ జెండా ఎగురవేయాలి

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కార్యకర్తలు, బూత్‌కమిటీలు సమష్టిగా పనిచేసి గులాబీ జెండా ఎగురవేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ రమణ అన్నారు. గణపతి కాంప్లెక్స్ వద్ద ఉన్న బీఆర్‌ఎస్ కార్యాలయంలో శ్రీనగర్‌కాలనీ శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ గెలుపు కేటీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, భారీ విజయంతో దివంగత మాగంటి గోపీనాథ్‌కు ఘన నివాళులర్పించాలని కోరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు ఇక్కడ ముఖ్యమని, మనం గెలిచిన చోట మరోసారి అత్యధిక మెజారిటీతో గెలవాలని, కార్యకర్తలు కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించి, బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన హైదరాబాద్ అభివృద్ధి, మాగంటి సేవలను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనగర్‌కాలనీ నేతలు అప్పుఖాన్, మధుయాదవ్, అభిగౌడ్, మహిళా నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

యాభై ఏళ్ల నాటి విద్యుత్ లైన్లు మార్చండి

వెంగళరావునగర్: యాభై ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లను తక్షణమే తొలగించాలని గురు ద్వార్‌నగర్ ప్రజలు అధికారులను వేడుకున్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని గురుద్వార్‌లో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు బస్తీబాటలో భాగంగా పర్యటించారు. స్థానిక బస్తీ ప్రజలతో మాట్లాడి విద్యుత్ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. 50 ఏళ్ల క్రితం 33 కేవీ లైన్లు నిర్మించారని, ప్రస్తుతం అత్యంత ప్రమాదకరంగా మారాయని, మూడు ఎల్‌టీ పోల్స్ మార్చాలని, ఇంటర్నెట్ కేబుల్స్, సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని స్థానికులు అధికారులను కోరారు. టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ నరసింహులు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సీజీఎం ప్రభాకర్, బంజారాహిల్స్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కరుణాకర్‌బాబు, డివిజనల్ ఇంజినీర్ హనుమంత రెడ్డి, అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్ బాలకృష్ణ, ఏఈ తిరుపతిరావు పాల్గొన్నారు.



గురుద్వార్ గల్లీలో పర్యటిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

ఆయుర్వేదం గురించి గొప్పగా చెప్పుకోవాలి

- ఆయుర్వేద కళాశాలల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాలి
- ఆయుష్ కమిషనర్ డాక్టర్ శ్రీకాంత్‌బాబు



మాట్లాడుతున్న ఆయుష్ కమిషనర్ శ్రీకాంత్‌బాబు

వెంగళరావునగర్: ఆయుర్వేద కళాశాలల్లోనూ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాలని కోరుకుంటున్నామని ఆయుష్ కమిషనర్ డాక్టర్ శ్రీకాంత్ బాబు అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ కార్యాలయం ఆడిటోరియంలో మంగళవారం 10వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ ఆయుష్ డిపార్ట్‌మెంట్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెరగాలని అన్నారు. ఈ మేరకు అన్ని విభాగాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులతో చర్చించనున్నట్లు చెప్పారు. ఆయుర్వేద విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఆయుర్వేదం, వైద్యుల గురించి రోగులు గొప్పగా చెప్పాలని, ఇదే లక్ష్యంగా ప్రతి వైద్యుడు పని చేయాలన్నారు. నేషనల్ ఆయుష్ డే పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా మెగా హెల్త్ క్యాంపులను నిర్వహిస్తున్నామని చెప్పారు. తాను సాధారణ కుటుంబంలో పుట్టి ఆయుర్వేదం పట్ల ఆసక్తితో ఈ విద్యను అభ్యసించి కమిషనర్ వరకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో అతి సాధారణ పరిస్థితులను చూశానని, ప్రతి ఒక్కరూ ఇలాంటి పరిస్థితులను సైతం అర్థం చేసుకుంటూ ఆయుర్వేదాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుర్వేదం, హోమియో, యునానీ అదనపు సంచాలకులు డాక్టర్ పరమేశ్వర్ నాయక్, డాక్టర్ లింగరాజు, డాక్టర్ వసంతరావు, ఆయుష్ ఉప సంచాలకులు స్వరూప రాణి, ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమత కస్తూరి, విద్యార్థుల సలహాదారులు డాక్టర్ నరసింహ, సీనియర్ వైద్యులు డాక్టర్ యశోద, డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ పృథ్వీరాజ్, వైద్యేతర సిబ్బంది, పీజీ, యుజీ విద్యార్థులు పాల్గొన్నారు.

కేబీఆర్ వద్ద హైడ్రా బృందం పర్యటన

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద సోమవారం రాత్రి సీఎం కాన్వాయ్ నిలిచిపోయి కొద్దిసేపు ట్రాఫిక్‌లో ఇరుక్కున్న నేపథ్యంలో హైడ్రా అధికారుల బృందం మంగళవారం ఈ ప్రాంతంలో పర్యటించింది. హైడ్రా కన్సల్టెంట్ యూనస్ ఇరిగేషన్ రిటైర్డ్ సీఈ దేవేందర్‌రెడ్డి, హైడ్రా అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు, జీహెచ్ఎంసీ ఇంజినీర్లు కేబీఆర్ పార్కు లోపల నిండుకుండలా ఉన్న చెరువును పరిశీలించారు. వర్షపు నీటిని స్టోర్ చేసే అవకాశాలను పరిశీలించారు. పార్కు బయట రోడ్లపై మోకాలు లోతు వరద నీరు నిలిచిపోతుండటం వల్లనే ట్రాఫిక్ సజావుగా సాగడం లేదని, వాహనాలు స్తంభించిపోతున్నాయని, సీఎం కాన్వాయ్ ఆగిపోవడానికి కూడా వరదే కారణమని గుర్తించారు. ఈ వరదనీరు అన్నపూర్ణ స్టూడియో వైపు వెళ్లే మార్గాలను పరిశీలించగా ఇక్కడ వరద నీరు వెళ్లే మార్గం రోడ్డుకు ఒకవైపు మాత్రమే ఉందని, అవతలి వైపు లేదని తేల్చారు. ఇక్కడ వరదనీటి కాలువ నిర్మాణంతోనే సమస్య పరిష్కారం అవుతుందని గుర్తించిన అధికారులు ఇందిరానగర్, గ్రీన్‌బావర్చి, కమలాపురికాలనీ వరకు వరద వెళ్లే మార్గాలు చూశారు. త్వరగా కేబీఆర్ పార్కు వైపు నుంచి వరదనీరు వెళ్లే విధంగా చూడాలని నిర్ణయించారు.

ఇదిలా ఉండగా కేబీఆర్ పార్కు వద్ద రోడ్లపై వరద నీరు ఎందుకు నిలుస్తోంది.. ఇందుకు గల కారణాలు ఏమిటి.. పైప్‌లైన్ నాలాలు ఎందుకు మూసుకుపోయాయి.. నివేదిక ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జీహెచ్ఎంసీకి ఆదేశాలు జారీ అయ్యాయి. జీహెచ్ఎంసీ అధికారులు కూడా ఇక్కడ పర్యటించి పరిస్థితిని పరిశీలించారు.

పునరుజ్జీవం..
పునర్వైభవం!





బిగ్ స్టోరీ

కబ్జాల బారి నుంచి బయటపడిన ఆరు చెరువులు

ఏకంగా 75 ఎకరాలు పెరిగిన విస్తీర్ణం | బెంగళూరు తరహాలో పర్యావరణహిత అభివృద్ధి | శుక్రవారం 'కొత్త బతుకమ్మ కుంట'ప్రారంభం

ఈ ఏడాది చివరినాటికి మిగిలిన ఐదు కూడా...

ఆక్రమణలు, పూడికలతో కుంచించుకుపోయిన చెరువులకు పునర్వైభవం వస్తోంది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) అధికారులు వాటిని రక్షించి పునరుజ్జీవం పోస్తున్నారు. దీంతో చెరువుల విస్తీర్ణం పెరిగింది. చెర వీడిన చెరువులు కళకళలాడుతున్నాయి. తొలిదశలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆరింటిని కబ్జాల బారి నుంచి రక్షించి అభివృద్ధి చేస్తున్నారు. జనావాసాలను మినహాయిస్తూ వీటిలోని మిగతా ఆక్రమణలు తొలగించగా విస్తీర్ణం ఏకంగా 75 ఎకరాల మేర పెరిగింది. ఇదే పంథాలో నగరంలో ఉన్న అన్ని చెరువులకు విముక్తి కల్పిస్తే వందల ఎకరాల జలవనరులుగా విస్తరిస్తాయని హైడ్రా అధికారులు చెప్తున్నారు. పునరుజ్జీవంతో అభివృద్ధి చేసిన బతుకమ్మకుంటను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



కూకట్‌పల్లి నల్ల చెరువు

హైడ్రా ఏర్పాటైన తర్వాత మాదాపూర్‌లోని తమ్మిడికుంటతోనే జలవనరుల పరిరక్షణ ప్రారంభమైంది. చుట్టూ ఉన్న అనేక నిర్మాణాలను కూల్చేసిన అధికారులు దాని పరిధిని పూర్వస్థితికి తేవడంపై దృష్టి పెట్టారు. ఇలా ఇప్పటి వరకు హైడ్రా అధికారులు వివిధ చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో ఉన్న దాదాపు 233 ఎకరాల్లోని ఆక్రమణల్ని తొలగించారు. తొలినాళ్లల్లో కేవలం కూల్చివేతలపైనే దృష్టి పెట్టిన అధికారులు 'హైడ్రా 2.0'విధానాలతో చెరువులకు పునరుజ్జీవం కల్పించాలని నిర్ణయించుకున్నారు. ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి అయిన 130 చెరువుల్లోని ఆక్రమణల కూల్చివేతలతో సరిపెట్టకుండా వాటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు.

పూర్తి పర్యావరణ హితంగా అభివృద్ధి...

ఈ చెరువుల్ని అభివృద్ధి చేసే విషయంలో హైడ్రా ఆద్యంతం పర్యావరణహిత విధానం అమలు చేయాలని విమోస్ సంస్థకు స్పష్టం చేసింది. దీంతో ఆ సంస్థ తొలుత ఆ చెరువుల నుంచి గరిష్టంగా మూడు మీటర్ల మేర పూడిక తొలగిస్తోంది. ఇందులో ప్లాస్టిక్ సహా అనేక వ్యర్థాలు ఉన్నాయి. చెరువు అడుగుభాగం అలుగు వైపునకు ఏటవాలుగా ఉండేలా చేస్తున్నారు. చెరువు చుట్టూ ఫుట్‌పాత్‌తోపాటు పార్కులు అభివృద్ధి చేస్తున్నారు. చెరువులోకి మురుగునీరు ప్రవేశించకుండా నీటి వనరును మూడు భాగాలుగా విభజిస్తున్నారు. వరదతో కలిసి మురుగు తొలుత మొదటి భాగంలోకి చేరుతుంది. అక్కడ ఆ నీటిని వడగట్టే గడ్డి, మొక్కలు ఉంటాయి. ఇలా రెండు చోట్ల వడపోత తర్వాత మూడో కుంటలోకి చేరుతుంది. ప్రతి చెరువుకు ప్రత్యేక ఇన్‌లెట్, ఔట్‌లెట్ ఏర్పాటు చేస్తున్నారు.

తొలిదశలోఆరు చెరువుల ఎంపిక...

హైడ్రా తొలిదశలో ఆరు చెరువుల్ని ఎంపిక చేసుకుంది. తమ్మిడికుంటతోపాటు అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, సున్నం చెరువు, ఉప్పల్ నల్లచెరువు, కూకట్‌పల్లి నల్లచెరువు, బమ్‌రుఖ్ నుద్దౌలా చెరువులపై దృష్టి పెట్టింది. వీటి అభివృద్ధికి ప్రభుత్వం రూ.58.4 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఒక్కో చెరువు కోసం దాదాపు రూ.10 కోట్ల చొప్పున వెచ్చిస్తున్న హైడ్రా బెంగళూరు నమూనాతో ముందుకు వెళ్తోంది. ఈ చెరువుల్లో పునరుజ్జీవం కల్పించే బాధ్యతల్ని ఆ నగరానికే చెందిన విమోస్ టెక్నాలజీస్ సంస్థకు అప్పగించింది. ఈ సంస్థ అక్కడ దాదాపు 130 చెరువులను అభివృద్ధి చేసింది. అక్కడ పర్యటించి వచ్చిన హైడ్రా అధికారులు వాటి పనితీరుపై పూర్తి సంతృప్తి చెందారు.



తమ్మిడి కుంట

ఎన్నార్సెస్సీ డేటా సాయంతో నిర్ధారణలు...

హైడ్రా పరిధి ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్) వరకు విస్తరించి ఉంది. జీహెచ్ఎంసీ విస్తరించి ఉన్న 650 చదరపు కిలోమీటర్ల పరిధిలో 185 చెరువులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 7,257 చదరపు కిలోమీటర్ల పరిధిలోని హెచ్ఎండీఏలో మొత్తం 58 వేల ఎకరాల్లో 2,912 చెరువులు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. ఈ చెరువులు ఏడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్నాయి. ఓ చెరువుకు సంబంధించిన ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లను గుర్తించడానికి వివిధ మ్యాపులతోపాటు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్నారెస్సీ) నుంచి తీసుకున్న డేటాను వినియోగిస్తున్నారు. ఏదైనా ఓ చెరువులోని ఆక్రమణలు తొలగించాలంటే దాని పరిధికి సంబంధించి ప్రిలిమినరీ, ఫైనల్ నోటిఫికేషన్లు జారీ కావాలి. ఈ ఏడాది అక్టోబర్ నాటికి ఫైనల్ నోటిఫికేషన్లు పూర్తి కానున్నాయి. ఇప్పటికీ హెచ్ఎండీఏ పరిధిలో 962, జీహెచ్ఎంసీలో 130 చెరువులకు మాత్రమే తుది నోటిఫికేషన్ వెలువడింది.


బతుకమ్మకుంట ప్రహరీ, ముఖద్వారం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రెండో దశలో 14 చెరువులు..



తొలిదశలో ఆరు చెరువుల్ని ఎంపిక చేసుకున్నాం. వీటిలో బతుకమ్మకుంటను శుక్రవారం ముఖ్యమంత్రి ప్రజలకు అంకితం చేయనున్నారు. ఈ ఆరు చెరువుల విస్తీర్ణం తొలుత 105 ఎకరాల్లో ఉండగా అభివృద్ధి చేసిన తర్వాత అది 180 ఎకరాలకు చేరింది. మిగిలిన చెరువుల అభివృద్ధి, పునరుజ్జీవం డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. రెండో దశలో మరో 14 చెరువులను అభివృద్ధి చేయనున్నాం. ఈ మేరకు ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి పంపించాం. ఈ ఏడాది అక్టోబర్ నుంచి చెరువులకు సంబంధించిన ఫైనల్ నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

– ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

ఆ ఆరు చెరువుల 'పెరుగుదల'ఇలా.. (ఎకరాల్లో)...

చెరువు	వాస్తవ విస్తీర్ణం	కబ్జాల్లో ఉండగా..	విముక్తి తర్వాత..	పెరిగిన విస్తీర్ణం
సున్నం చెరువు	32.2	16.41	30.5	14.09
తమ్మిడికుంట	29.26	16.24	29.26	13.02
నల్ల చెరువు (ఉప్పల్)	67.31	52.5	67.31	14.81
బమ్‌రుఖ్‌నుద్దౌలా	19.04	4.5	17.04	12.54
నల్ల చెరువు (కూకట్‌పల్లి)	29.58	14.32	29.58	15.26
బతుకమ్మకుంట	14.02	0	5	5

హెచ్ఎండీఏ పరిధిలో చెరువులు నోటిఫై ఇలా...

జిల్లా	హైదరాబాద్	మేడ్చల్	రంగారెడ్డి	యాదాద్రి	సిద్దిపేట	మెదక్	సంగారెడ్డి
ప్రిలిమినరీ నోటిఫికేషన్	26	531	865	238	282	483	487
ఫైనల్ నోటిఫికేషన్	18	205	255	33	155	112	184

నగరంలో నేడు

- తెలంగాణ సాహిత్య అకాడమి, స్పార్గ్ సంయుక్త నిర్వహణలో 'బతుకమ్మ తిరిగొస్తారు'పుస్తక ఆవిష్కరణ, ఏకపాత్రాభినయ ప్రదర్శనలు రవీంద్రభారతి ఆడిటోరియంలో సాయంత్రం 6 గంటల నుంచి జరుగుతాయి.
- సైఫాబాద్‌లోని విద్యారణ్య హైస్కూల్‌లో 'ఇండియన్ ఎమర్జెన్సీ 50 ఇయర్స్ – లెసెన్స్ ఫర్ డెమోక్రసీ'పుస్తకావిష్కరణ సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నాదబ్రహ్మోత్సవ్ 2025ను పురస్కరించుకుని సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు ప్రముఖ కళాకారులచే అన్నమాచార్య సంకీర్తనలతో నాదనైవేద్యం కార్యక్రమం జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఉద్యానవన శాఖ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హార్టికల్చర్ షో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో దసరా పండుగ ప్రత్యేకంగా హ్యాండ్‌లూమ్ ఇండియా పేరిట స్వచ్ఛమైన ఫైబర్ సిల్క్ ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కల్పర్స్, స్టికిడ్ స్టోరీస్, డీప్ ఇంటీరియల్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ గఫార్ ఖాన్ కాలనీలోని లేబుల్స్ ది పాప్ అప్ స్పేస్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఖిజార్ స్కిల్స్ సోలో ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మరోసారి ఆగిన మెట్రోరైలు

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రైలు మరోసారి ఉన్నట్టుండి ఆగిపోయింది. భరత్‌నగర్ మెట్రోస్టేషన్‌లో సుమారు 8 నిమిషాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సాంకేతిక కారణాల వల్లే మెట్రో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. మరమ్మతుల అనంతరం మెట్రో సేవలను పునరుద్ధరించారు. భరత్‌నగర్‌లో మెట్రో నిలిచిపోవడంతో ఎల్‌బీనగర్–మియాపూర్ మధ్య మెట్రోరైళ్లు ఆలస్యంగా నడిచాయి. నిత్యం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోయే ఈ రూట్‌లో మెట్రో నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు.

వాటర్‌షెడ్‌పై జాతీయ వర్క్‌షాప్


ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో వాటర్‌షెడ్‌పై జాతీయ వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధికారులు

ఏజీ వర్సిటీ: జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో వాటర్‌షెడ్ కార్యక్రమాలపై జాతీయ వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ వర్క్‌షాప్ ఎన్ఐఆర్‌డీపీఆర్, భూవనరుల విభాగం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ఒంగోల్ ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వీసీ డీవీఆర్ మూర్తి పాల్గొని వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. పేదరికాన్ని తగ్గించడం, వ్యవసాయ వ్యవసాయేతర జీవనోపాధిని సృష్టించడం, భూగర్భజలాలు పెంచడం వాటర్‌షెడ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

24 నుంచి 27 వరకు కౌన్సెలింగ్

ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 24 నుంచి 27 వరకు ప్రత్యేక కోటా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. ఈ కౌన్సెలింగ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరగనుందని, పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను చూడాలని పేర్కొన్నారు.

ఈవీ ఆవిష్కరణలే లక్ష్యంగా ఎంఓయూ



సాక్షి, సిటీబ్యూరో: భారత ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) రంగంలో ప్రతిభను పెంపొందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా మల్లారెడ్డి డీమ్డ్ టు బీ యూనివర్సిటీ, ఈవీ చార్జింగ్ సొల్యూషన్లలో అగ్రగామి సంస్థ థండర్ ప్లస్‌తో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. ఈ సహకారం ద్వారా ప్రత్యేకమైన అకాడమిక్ ప్రోగ్రామ్‌లు రూపొందించడంతోపాటు విద్యార్థులకు పరిశ్రమ అనుభవాన్ని కల్పించడంతోపాటు సస్టైనబుల్–గ్రీన్ టెక్నాలజీలపై పరిశోధనలకు అవకాశాలను కల్పించనుంది. యూనివర్సిటీ, థండర్ ప్లస్ కలిసి ఈవీ అంశంపై ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు, కోర్సులు ప్రారంభించనున్నట్లు మల్లారెడ్డి గ్రూప్ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి తెలిపారు. విద్యార్థులకు ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్‌లతో ఇతర అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. భారత ఈవీ ఎకోసిస్టంను ముందుకు తీసుకెళ్లడంలో విశేష కృషి చేస్తున్న థండర్ ప్లస్ సీఈఓ రాజీవ్ వై.ఎస్.ఆర్‌ను యూనివర్సిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

సిటీలో 22.6 శాతం మంది రక్తపోటు బాధితులు



సాక్షి, సిటీబ్యూరో: భారతదేశంలో 20 కోట్ల మంది వయోజనులు రక్తపోటుతో బాధపడుతున్నారనే అంచనాలుండగా, వీరిలో దాదాపు 2 కోట్ల మంది మాత్రమే నియంత్రణలో ఉంచుకుంటున్నారని వైద్యులు వెల్లడించారు. ఇండియా హైపర్ టెన్షన్ కంట్రోల్ ఇనిషియేటివ్, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే– 5 ప్రకారం నగరంలో హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) ప్రాబల్యం 22.6%గా తేలిందని తెలిపారు. హైపర్ టెన్షన్‌పై నగరంలోని ఏఐజీ హాస్పిటల్‌లో మంగళవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో వైద్య నిపుణులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా చికిత్సలను సమర్థంగా తిప్పికొడుతున్న రెసిస్టెంట్ హైపర్ టెన్షన్‌గా పేర్కొనే సీరియస్ సమస్యపై కూడా చర్చించారు. ఈ సమస్యను పరిష్కరించడంలో ఆశాజనక ఫలితాలు అందిస్తున్న రెనల్ డెనర్వేషన్ చికిత్సా విధానంపై నిపుణులు మాట్లాడారు. వర్క్‌షాప్‌లో వైద్యనిపుణులు డాక్టర్ రాజీవ్ మీనన్, డా.అనుజ్ కపాడియా, డా.స్వరూప్ జి భరది, డా. ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

'గాంధీ'ని సందర్శించిన గుజరాత్ వైద్య బృందం


గుజరాత్ వైద్య బృందంతో సూపరింటెండెంట్ వాణి, గాంధీ పాలన యంత్రాంగం సిబ్బంది

గాంధీఆస్పత్రి: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నేతృత్వంలో గుజరాత్ రాష్ట్ర వైద్య బృందం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిని సందర్శించింది. మాతా, శిశు సంరక్షణ విభాగంలో సాధారణ డెలివరీలు, అందిస్తున్న వైద్యసేవలు, ఫెర్టిలిటీ, ఓపీ విభాగాలను పరిశీలించి పలు అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. గాంధీ ఆస్పత్రిలో చేపట్టిన పద్ధతులు ఉత్తమ ఫలితాలు ఇస్తున్నాయని సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి వివరించారు. గాంధీలో అమలు చేస్తున్న విధివిధానాలు, శాస్త్రీయ, సాంకేతిక వైద్యపద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాతాశిశు మరణాల శాతం తగ్గింపు తదితర అంశాలను గుజరాత్ బృందం పరిశీలించింది. ఇక్కడ చేపట్టిన విధానాలు ఎంతో బాగున్నాయని, ప్రత్యేక నివేదిక రూపొందించి గుజరాత్ ప్రభుత్వానికి అందిస్తామని గుజరాత్ వైద్యబృందంలోని వీణ అయ్యర్, నేతల్ పటేల్, మౌనిక అన్నారు. కార్యక్రమంలో గాంధీ పాలనా యంత్రాంగం రజనీ, కళ్యాణ్, సుధార్‌సింగ్, తరుణం, గైనకాలజీ విభాగ వైద్యులు పాల్గొన్నారు.

చిత్రపురి కార్మికులకు తీన్మార్ మల్లన్న మద్దతు


తీన్మార్ మల్లన్నను కలిసిన చిత్రపురి సాధన సమితి సభ్యులు

బంజారాహిల్స్: చిత్రపురిలో అవినీతి చోటు చేసుకుందంటూ చిత్రపురి సాధన సమితి చేస్తున్న పోరాటానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మద్దతు తెలిపారు. చిత్రపురి సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భద్ర, శ్రీనివాస్, రమేష్ వర్మల ఆధ్వర్యంలో మంగళవారం తీన్మార్ మల్లన్నను కలిసి తమ డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తమ పార్టీ పేద సినిమా కార్మికులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటుందన్నారు. తెలుగు సినిమా మరో డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికల్లో కనీసం నామినేషన్ కూడా వేయించకుండా తెలంగాణ బిడ్డలను గదిలో నిర్బంధించి దాడి చేయడం యావత్ తెలంగాణ మీదనే కాదని, తెలుగు జాతిపై దాడి జరిగినట్టుగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ సమాజంపై సీమాంధ్ర పెట్టుబడిదారి రౌడీమూకలు చేస్తున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.

హెచ్‌సీయూను సందర్శించిన అలబామా బృందం

రాయదుర్గం: భవిష్యత్తులో పలు అంశాల్లో భాగస్వామ్యం నెలకొల్పడానికి ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు అమెరికాలోని అలబామా రాష్ట్ర బృందం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌ను మంగళవారం సందర్శించింది. ఈ బృందం విద్య, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం(స్టెమ్) పరిశోధన, అంతర్జాతీయ కార్యక్రమాల్లో సహకారాల గురించి చర్చించడానికి 11 మందితో కూడిన బృందం ఈ పర్యటన చేపట్టింది. ఈ బృందం మొదట హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావుతో సమావేశమైంది. అనంతరం అంతర్జాతీయ వ్యవహారాల కార్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ బ్రహ్మానందం మానవతితో భేటీ అయ్యారు. విద్యామార్పిడి, ఉమ్మడి డిగ్రీ కార్యక్రమాలు, పరిశోధనలపై పరస్పరం సహకరించుకోవడంపై ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అలబామా రాష్ట్ర విద్యాశాఖ సూపరింటెండెంట్ డాక్టర్ ఎరిక్ మెక్కే తెలిపారు. హెచ్‌సీయూతో దీర్ఘకాలిక భాగస్వామ్యం వైపు ముఖ్యమైన అడుగుగా ఈ పర్యటన ఉంటుందన్నారు. ఆవిష్కరణ, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించుకోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అలబామా రాష్ట్ర బృందం సభ్యులు, హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, అధికారులు పాల్గొన్నారు.

25న నగరానికి షహీదీ శతాబ్ది నగర్ కీర్తన్ యాత్ర


యాత్ర కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: సిక్కుల తొమ్మిదో గురువు, హిందూ మతం కోసం ప్రాణత్యాగం చేసిన గురు తేజ్ బహదూర్ సాహిబ్‌జీ 350వ అమరత్వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న 350వ షహీదీ శతాబ్దిన గర్ కీర్తన్ యాత్ర ఈ నెల 25వ తేదీన నగరానికి చేరుకోనున్నట్లు ఆల్ తెలంగాణ గురుద్వార కమిటీ చైర్మన్ గురుచరణ్ సింగ్ బగ్గా తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం యాత్ర కరపత్రాన్ని ప్రధాన కార్యదర్శి మన్‌జీత్ సింగ్ పాలా, ఉపాధ్యక్షుడు హర్బన్ సింగ్, రిటైర్డ్ ఎస్పీ ప్రీతంసింగ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల అస్సాంలోని ధుబ్రి గురుద్వారలో ప్రారంభమైన యాత్ర దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల మీదుగా సాగుతోందన్నారు. 25వ తేదీన సాయంత్రం 4 గంటలకు ఘట్‌కేసర్ నుంచి యాత్ర బయలుదేరి రాత్రి 7:30 గంటలకు కిషన్‌బాగ్ ఎక్స్ రోడ్డు నుంచి అత్తాపూర్‌లోని బరమ్ బల, సిక్కు ఛావనియత్ వరకు సాగుతుందని తెలిపారు. గౌలిగూడ గురుద్వార అధ్యక్షుడు ఇందర్ సింగ్, సికింద్రాబాద్ గురుద్వార అధ్యక్షుడు బల్దేవ్ సింగ్, అత్తాపూర్ బరమ్ బల గురుద్వార అధ్యక్షుడు చేతన్ సింగ్, బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు జగ్ మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అలబామాలో భారతీయులకు 'స్టెమ్' అవకాశాలపై చర్చ

'వన్ విండో' ఆధ్వర్యంలో సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: ఉన్నత విద్యారంగంలో అంతర్జాతీయ సహకారాలను ప్రోత్సహించే లక్ష్యంతో 'వన్ విండో' సంస్థ ఆధ్వర్యంలో నగరం వేదికగా 'భారత్–అమెరికా ఉన్నత విద్యపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. ఐటీసీ కాకతీయ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమెరికా నుంచి 11 మంది విద్యారంగ ప్రముఖులు, అలబామా రాష్ట్ర సెనేటర్లు ఆర్థర్ వూటెన్ ఆర్, గెరాల్డ్ ఆస్కార్ డయల్ పాల్గొన్నారు. 'ఇండియా–యూఎస్ఏ అకాడెమిక్ సినర్జీస్ – ట్రాన్స్‌నేషనల్ ఎడ్యుకేషన్, స్టీమ్ టీచర్స్' అనే అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఐఐటీ హైదరాబాద్, కాకతీయ యూనివర్సిటీ, ఐసీఎఫ్ఏఐ, విజ్ఞాన్ వర్సిటీ, చైతన్య వర్సిటీ, గోకరాజు రంగరాజు, విశ్వవిశ్వాని, వాగ్దేవి, సెయింట్ పాల్, సెయింట్ పీటర్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ప్రతినిధులు భాగమయ్యారు. ఉమ్మడి డిగ్రీలు, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు, అధ్యాపకుల మార్పిడి, పరిశోధన సహకారాలతోపాటు అలబామాలో భారతీయ విద్యావేత్తలకు 'స్టెమ్'(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్) రంగాల్లో ఉన్న అవకాశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ భారతీయ విద్యార్థులను ప్రపంచస్థాయి ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేయడంలో అంతర్జాతీయ సహకారం కీలకమని అన్నారు. వన్ విండో ఐఆర్‌ఓ కార్యక్రమం ద్వారా భారతీయ విద్యాసంస్థలు అంతర్జాతీయ సహకారాన్ని సులభంగా పొందవచ్చని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 24, సెప్టెంబర్, 2025





హైదరాబాద్ నగరంలో అప్పుడే కేక్ మిక్సింగ్, గ్రేప్ స్టాంపింగ్ సందడి మొదలైంది. సాధారణంగా కేక్ మిక్సింగ్ కార్యక్రమాలు డిసెంబర్‌లో విరివిగా జరుగుతుండటం విదితమే. కానీ ట్రెడిషనల్ పద్ధతిలో కనిసం రెండు నెలల ముందుగానే ఈ కేక్ మిక్సింగ్ నిర్వహించి ఆల్కహాల్స్‌తో సోకింగ్ చేస్తారు. ఇలా చేసిన కేక్ మిక్సింగ్‌తో డిసెంబర్ మొదటి వారం నుంచి ప్లమ్ కేక్ తయారు చేస్తుంటారు. అంతే కాకుండా ఫ్రాన్స్ సంస్కృతిలో భాగమైన గ్రేప్ స్టాంపింగ్ చేసి సోకింగ్ చేస్తారు. ఈ సంస్కృతి గత కొన్ని సంవత్సరాలుగా నగరంలో కూడా పాత పద్ధతులతోనే నిర్వహిస్తున్నారు. సంప్రదాయం, వినోదం, గ్లామర్ మేళవించిన ఈ కేక్ మిక్సింగ్, గ్రేప్ స్టాంపింగ్ ఈవెంట్స్ హైదరాబాద్ నగరానికి కొత్త అనుభూతిని జోడిస్తున్నాయి. నగరంలోని కొన్ని ఫైవ్ స్టార్ హోటల్స్ ఈ కేక్ మిక్సింగ్‌ను ఇప్పుడే నిర్వహించి సోకింగ్ చేస్తున్నాయి.

-సాక్షి, సిటీబ్యూరో

- డిసెంబర్ నెల వేడుకలకు ఇప్పటి నుండే ప్రిపరేషన్
- యేటా నగరంలో కేక్ మిక్సింగ్ సందడి తెలిసిందే
- పాశ్చాత్య సంస్కృతిలో భాగంగా 2 నెలల ముందే మిక్సింగ్, సోకింగ్
- విభిన్న రకాల డ్రై ఫ్రూట్స్, ఆల్కహాల్ మిశ్రమం తయారీ
- గత కొంత కాలంగా వైన్ తయారీకి గ్రేప్ స్టాంపింగ్
- స్టార్ హోటల్స్, ప్రముఖ రిసార్ట్స్‌లో స్టాంపింగ్ సందడి

మిక్స్.. ఫిక్స్..

పాశ్చాత్య దేశాల్లోనే కాదు నగరంలోనూ సెప్టెంబర్ మధ్య నుంచి డిసెంబరు వరకు నిర్వహించే కేక్ మిక్సింగ్, గ్రేప్ స్టాంపింగ్ విరివిగా చేస్తున్నారు. ముఖ్యంగా స్టార్ హోటళ్లు, లగ్జరీ రిసార్ట్స్ ఈ ఈవెంట్స్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాయి. నగరంలోని నోవోటెల్ ఎయిర్ పోర్ట్ ఈ కేక్ మిక్సింగ్, గ్రేప్ స్టాంపింగ్ కార్యక్రమాన్ని మొట్ట మొదటగా చేసి ఈ ఏడాది సంబరాలకు నాంది పలికింది. సంప్రదాయం, ఆధునికత మేళవించిన ఈ మిక్సింగ్, స్టాంపింగ్ ఈవెంట్స్‌లో ఆరోగ్య సూత్రాలు కూడా దాగున్నాయి. ముఖ్యంగా కేక్ మిక్సింగ్‌లో ఆల్మండ్, కిస్‌మిస్, పిస్తా, ఆప్రికాట్, బ్లాక్ రెసిన్, యెల్లో రెసిన్, క్యాష్యూనట్స్ వంటి విభిన్న రకాల డ్రై ఫ్రూట్స్‌తో ఆల్కహాల్ కలిపి కేక్ మిక్సింగ్ చేస్తారు. వీటికి పలు రకాల స్పైసెస్ కూడా కలుపుతారు. ఈ మిశ్రమాన్ని దాదాపు 2 నెలల వరకూ సోకింగ్ (నిల్వ) చేస్తారు. ఈ పద్ధతిలో ఆల్కహాల్‌తో డ్రై ఫ్రూట్స్ కలిసి అద్భుతమైన ఫ్లేవర్ అందిస్తుంది. ఈ సోకింగ్ ద్వారా తయారైన మిశ్రమంతో చేసేదే అసలైన ప్లమ్ కేక్. దీనికి డిసెంబర్ నెలలో ముఖ్యంగా క్రిస్మస్, న్యూ ఇయర్ సీజన్‌లో ప్రత్యేక ఆహార పదార్థంగా స్వీకరిస్తారు.

నగరంలో కేక్ మిక్సింగ్ సందడి మొదలు

సరికొత్త ట్రెండ్..

ఫ్రాన్స్‌లో ప్రసిద్ధి చెందిన గ్రేప్ స్టాంపింగ్ పద్ధతిని గత కొన్ని సంవత్సరాలుగా భాగ్యనగరంలోనూ వైన్ తయారికి సరికొత్త సంస్కృతిగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన ద్రాక్షపళ్లను పెద్ద చెక్క బుట్టలో వేసి కేవలం మనుషులు మాత్రమే పాదాలతో తొక్కి ఒక వేడుకలా నిర్వహిస్తారు. ఈ స్టాంపింగ్‌లో భాగంగా వచ్చిన ద్రాక్ష రసాన్ని సోకింగ్ చేసి వైన్‌గా తయారు చేస్తారు. నగరంలో సందడిగా జరుగుతున్న ఇలాంటి కార్యక్రమాలు హైదరాబాద్‌కు వస్తున్న అంతర్జాతీయ ప్రతినిధులను విశేషంగా అలరిస్తున్నాయని స్టార్ హోటల్ యాజమాన్యం తెలుపుతోంది.



సోషల్ మీడియా ప్రభావం..

గతంలో పాశ్చాత్య దేశాల్లో ప్రత్యేకంగా జరుపుకునే ఈ సంబరాలు సోషల్ మీడియా ప్రభావంతో ట్రెండింగ్‌లోకి వస్తున్నాయి. ఈ తరహా ట్రెండ్స్ హైదరాబాద్ నగర వాసుల జీవితాల్లో భాగం అయ్యేందుకు సామాజిక మాధ్యమాలు కారణమవుతున్నాయి. ముఖ్యంగా స్టార్ హోటళ్లు, లగ్జరీ రిసార్ట్స్ ఈ ఈవెంట్స్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాయి. ఇది కేవలం ఫెస్టివల్ ముందస్తు శుభారంభమే కాదు, సంస్కృతి, కమ్యూనిటీ స్పిరిట్‌కి నిదర్శనంగా నిలుస్తోంది. రానున్న రోజుల్లో ఈ ఈవెంట్స్ మరింత విస్తృతమవుతాయని, మరింత మందిని ఆకట్టుకుంటాయని నోవోటెల్ హోటల్ ప్రధాన చెఫ్ అమన్న రాజు చెబుతున్నారు.



వేవ్ ఆఫ్ హ్యాపీనెస్..

కేక్ మిక్సింగ్ అనేది క్రిస్మస్ సెలబ్రేషన్స్‌కి ముందుగా నిర్వహించే సంప్రదాయం. ఇందులో డ్రై ఫ్రూట్స్, నట్స్, కాండీడ్ ఫ్రూట్స్, మసాలాలు, వైన్స్ కలిపి ఒక ప్రత్యేకమైన మిక్స్ తయారు చేశాం. దీనిని సోకింగ్ చేయడం వల్ల దీని రుచి, సుగంధం ఎక్కువవుతుంది. ఆ మిశ్రమం డిసెంబర్‌లో జరిగే కేక్ బేకింగ్‌కు ఉపయోగిస్తాం. దాదాపు 160 కిలోల ఈ మిశ్రమం సోకింగ్ తరువాత 250 కిలోల ప్లమ్ కేక్ తయారీకి సరిపోతుంది. దీనిని సిగ్నేచర్ క్రిస్మస్ కేక్‌ల కోసం వినియోగిస్తాం. ప్రముఖ పేస్ట్రీ చెఫ్ దివ్య గోప్పనగారి ఆధ్వర్యంలో ఈ మిక్సింగ్ చేశాం. అంతే కాకుండా వేవ్ ఆఫ్ హ్యాపీనెస్ పేరుతో 25 అడుగుల పొడవైన కేక్ కూడా తయారు చేశాం. దీంతో పాటు గ్రేప్ స్టాంపింగ్ కూడా నిర్వహించాం. వైన్ తయారీకి నిర్వహించే ఈ పద్ధతిలో మనుషులు మాత్రమే తమ పాదాలతో ద్రాక్షా పళ్లను తొక్కుతూ, డ్యాన్స్ చేస్తారు. ఇదొక ఫన్-ఫొటోజెనిక్ సందడి. స్టాంపింగ్ కోసం పెద్ద తొట్లను ద్రాక్షాలతో నింపి మంచి మ్యూజిక్‌తో పెద్దలు చిన్నారులతో ఓ వేడుకలా నిర్వహించాం.

– సుఖ్‌బీర్ సింగ్, జనరల్ మేనేజర్, నోవోటెల్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్.




సిటీలో యానిమెట్రానిక్

ఏలియన్స్..

సాక్షి, సిటీబ్యూరో: నగర వేదికగా దక్షిణాదిలోనే మొదటి యానిమెట్రానిక్ ఏలియన్స్ ప్రదర్శన విశేషంగా అలరిస్తోంది. నగరంలోని నెక్సస్ హైదరాబాద్ మాల్లో 'సిటీ అండర్ సీజ్' పేరుతో ఏర్పాటుచేసిన ఈ యానిమెట్రానిక్ ఎలియన్స్.. లైఫ్-సైజ్ ఏలియన్స్, ఏలియన్ ఫ్లోరా, సిటీ స్కైలైన్‌లపై దాడులు, డిస్ట్రక్షన్ జోన్‌లు, ఏలియన్ రైడ్ వంటి వినోద కార్యక్రమాలు అలరిస్తున్నాయి. అక్టోబర్ 31 వరకూ 'సిటీ అండర్ సీజ్' అందుబాటులో ఉండనుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందులో ఫేస్ పెయింటింగ్, 'మేక్ యువర్ ఓన్ ప్లానెట్', కీచైన్ మేకింగ్, క్లే పెయింటింగ్, కాన్వాస్ పెయింటింగ్ థీమ్ వర్క్‌షాపులతో పాటు 11 రోజుల షాపింగ్ ఫెస్టివల్ కూడా కొనసాగుతోంది.

యువ ఆవిష్కరణ.. హంగర్ క్రాఫ్ట్స్

సాక్షి, సిటీబ్యూరో : ఆహార విభాగంలో కొత్త వ్యాపార అవకాశాలను అందించడంతో పాటు జీరో రాయల్టీ ఫ్రాంచైజీ విభాగంలో దేశంలో తొలి స్టార్టప్‌గా 'హంగర్ క్రాఫ్ట్స్' నగరానికి చెందిన 25 ఏళ్ల యువకుడు ప్రారంభించారు. నగర కేంద్రంగా బీ2బీ కార్పొరేట్ క్యాటరింగ్, బీ2సీ మీల్ సర్వీసులను ఒకే వేదికపై ఈ హంగర్ క్రాఫ్ట్స్ సమగ్రంగా అందించనుంది. దీంతోపాటు 'తిండిఫై' పేరుతో నూతన పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పించనుంది. కార్పొరేట్ పార్కులు, రెసిడెన్షియల్ కమ్యూనిటీలు, ఈవెంట్ల లక్ష్యంగా భారీ స్థాయిలో క్యాటరింగ్ సేవలను సరికొత్తగా అందించడమే కాకుండా ఈ రంగంలో అడుగుపెట్టే వ్యాపారవేత్తలకు అడ్డంకులను తొలగించనుంది. ప్రారంభ దశలో రాయల్టీ వసూలు చేయకుండా, కొత్త ఔట్‌లెట్లకు సగం అద్దె అందించడం ఈ రంగంలో సరికొత్త ప్రయాణమని పారిశ్రామిక నిపుణులు సూచిస్తున్నారు.



దేశవ్యాప్తంగా ఫుడ్‌ప్రెన్యూర్స్ నెట్‌వర్క్..

వినూత్న ప్రయత్నంగా ప్రారంభించిన 'హంగర్ క్రాఫ్ట్స్' కేవలం కిచెన్లను మాత్రమే కాదు, అవకాశాలను సృష్టించనుంది. ఈ వేదికలో ఉద్యోగాల కల్పన, ఆహార పారిశ్రామికవేత్తల పెంపు, నాణ్యమైన ఆహారాన్ని అందించడం వంటి లక్ష్యాలతో దీనిని రూపొందించాం. తిండిఫై-జీరో రాయల్టీ ఫ్రాంచైజ్ విభాగం.. తొలిసారి ఆహార రంగంలో అడుగుపెట్టే వారికి సులభమైన, సుస్థిరమైన ఫ్రాంచైజ్ సదుపాయాలను డిజైన్ చేశాం. మార్కెట్ ఫ్రెండ్లీ కాంబో మోడల్స్ అందించడమే కాకుండా, రాయల్టీ ఫీజులు లేకుండా కొత్త ఔట్‌లెట్లకు 50 శాతం అద్దె చెల్లిస్తుంది. దీనిపై శిక్షణ అందించి ఆపరేటర్లకే తోడ్పాటును అందిస్తుంది. 2027 నాటికి 100 మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు రానున్న 24 నెలల్లో దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో కార్యకలాపాలు విస్తరించనున్నాం.

– వినీత్ మెదిడి, హంగర్ క్రాఫ్ట్స్ వ్యవస్థాపకుడు.



వారెవ్వా గర్బా..

కనువిందు చేస్తున్న గర్బా నృత్యం..

సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకుంటున్న యువత




దేవీ నవరాత్రులను పురస్కరించుకుని దాండియా, కోలాటం, గర్బా నృత్యాలతో ప్రాంగణాలు ఉల్లాసంగా, ఉత్సాహంగా మారాయి. విస్టా కన్వెన్షన్ అండ్ రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన 'రంగ్ థాలి' ఆకట్టుకుంటోంది. ఇందులో గుజరాతీ సంప్రదాయ గర్బా నృత్యాలు కనువిందు చేస్తున్నాయి. రంగురంగుల దుస్తులు, ఆకట్టుకునే వేషధారణలో యువతీ యువకులు చేస్తున్న దాండియా, కోలాటాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఫిఫ్త్ అవెన్యూ ఈవెంట్ మేనేజ్‌మెంట్, రంగోలి మార్కెటింగ్, అగర్వాల్స్ ప్యాకర్స్ మూవర్స్, డీఆర్ఎస్ స్కూల్, దోడియా ఆగ్రోటెక్ సంస్థల ఆధ్వర్యంలో 'రంగ్ థాలి' సీజన్-4 కనువిందు చేస్తోంది. అక్టోబర్ 1 వరకూ రాత్రి 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించే నృత్యాలు అహూతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సుమారు నాలుగు వేల మంది ప్రతిరోజూ సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక నృత్యరీతులను ప్రదర్శిస్తున్నారు.

– బంజారాహిల్స్



భిన్న సంస్కృతులు, భిన్న ఆచార వ్యవహారాలతో మినీ భారత్‌ను తలపిస్తోంది హైదరాబాద్ నగరంలోని పాతబస్తీ. విభిన్న ప్రాంతాలకు చెందిన వారు విభిన్న రీతుల్లో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వేర్వేరు రాష్ట్రాలకు చెందిన ప్రజలంతా ఒక్కచోట చేరి కలసికట్టుగా నవరాత్రులు జరుపుకుంటున్నారు. నగరంలో స్థిరపడిన రాజస్థాన్, గుజరాత్, హర్యాణ, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు చెందిన ప్రజలు అగర్వాల్ కుటుంబీకులు, మరాఠాలు, కన్నడిగులు, బెంగాలీలు తమతమ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా ఉత్సవాలు జరుపుకుంటున్నారు.

– చార్మినార్




సంప్రదాయం.. సమ్మిళితం..

- మినీ భారత్‌ను తలపిస్తున్న పాతబస్తీ
- విభిన్నంగా దసరా వేడుకల నిర్వహణ
- భిన్న సంస్కృతులు, భిన్న ఆచార వ్యవహారాలు
- నవ ధాన్యాలతో కన్నడిగుల నవరాత్రి పూజలు

నగరంలో స్థిరపడిన కన్నడిగులు దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. జియాగూడ, అత్తాపూర్, సికింద్రాబాద్, గుల్జార్‌హౌజ్, మామ జుమ్లా పాటక్, చార్‌కమాన్, కోకర్ వాడీ, చెలాపురా, ఘాన్సీబజార్, జూలా, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో కన్నడిగులు దసరా వేడుకను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దుర్గామాత చిత్రపటం వద్ద నల్లరేగడి మట్టిలో నవధాన్యాల విత్తనాలను వేస్తారు. ఇవి మొలకెత్తడంతో తొమ్మిది రోజుల పాటు వాటికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నవధాన్యాల మొలకలు పెరిగిన ఎత్తు అమ్మవారి కటాక్షానికి కొలమానంగా భావిస్తారు.

కన్నడిగుల అష్టమి కడాయి..

దుర్గాష్టమి సందర్భంగా గోధుమ పిండితో అమ్మవారి ఆభరాలను తయారు చేస్తారు. వీటిని కడాయిలో వేసి వేపుతారు. అమ్మవారి పుస్తె, మట్టెలు, జడ వంటి ఆభరణాలను తయారుచేసి అమ్మవారి విగ్రహం చుట్టు వేలాడదీస్తారు. పండుగ సందర్భంగా ఇంటికి వచ్చే బంధు మిత్రులకు వీటిని అందజేసి దసరా శుభాకాంక్షలు చెబుతారు.

ఉపవాసం అనంతరం..

తొమ్మిది రోజుల ఉపవాసం అనంతరం విజయ దశమినాడు జమ్మి చెట్టు పూజతో పాటు చెరుకుగడ, బంగారం ఇస్తూ ఆలింగనం చేసుకుంటారు. పాలపిట్టను చూడటంతో కన్నడిగుల దసరా ఉత్సవాలు ముగుస్తాయి.

ఐక్యతకు నిదర్శనం..



మేము ఉత్తర భారతీయులమైనప్పటికీ దశాబ్దాలుగా నగరంలో జీవిస్తూ కలసిమెలసి ఉత్సవాలు చేసుకుంటున్నాం. దసరా వేడుకను ఘనంగా జరుపుకుంటాం. ఇది శక్తి, ఐక్యతకు నిదర్శనం. శ్రీరాముని విజయమైనా, దుర్గామాత పూజ అయినా రెండూ శక్తి ఆరాధన రూపాలే.

– పంకజ్ కుమార్ అగర్వాల్, హైదరాబాద్ కుంభమేళా అగర్వాల్ సమితి అధ్యక్షులు

కోల్‌కతా మాదిరిగానే..



దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలను కోల్‌కతాలో నిర్వహించినట్లుగానే ఇక్కడా నిర్వహిస్తాం. ఐదు రోజులపాటు బెంగాలీ మాతను పూజించి, అనంతరం హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేస్తాం. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు, అన్న ప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– జగన్నాథ్ అడక్, బెంగాలీ యంగ్ స్టార్ అసోసియేషన్ అధ్యక్షులు

బెంగాలీలకు ఐదు రోజులే..

పశ్చిమబెంగాల్‌కు చెందిన బెంగాలీలు దసరా ఉత్సవాలను ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు. ఇదే వారి ప్రధాన పండుగ. దుర్గామాతను ప్రతిష్ఠించిన నాటి నుంచి నాలుగు రోజుల వరకూ ప్రత్యేక పూజలు నిర్వహించి విజయ దశమి రోజు నిమజ్జనం చేస్తారు. కోల్‌కతాలో దుర్గామాత వద్ద మేకలను బలిస్తామని.. ఇక్కడ మాత్రం తొమ్మిది రకాల వేర్వేరు ఫలాలను ప్రసాదంగా పెడతామని తెలిపారు. మొదటి రెండు రోజులు శాకాహారం, మిగిలిన రెండు రోజులు మాంసాహారం భుజిస్తారు.



అగర్వాల్ ఉపవాస దీక్షలు..

ఉత్తర భారతీయులైన అగర్వాల్ కుటుంబీకులు తొమ్మిది రోజులపాటు ఉపవాస దీక్షలు చేస్తారు. గోడకు పటం వేసి గోధుమలు, జొన్నలు మట్టి కుండలో పెడతారు. మొలకెత్తిన విత్తనాల ఆకులను విజయదశమి రోజు తలపాగలో, చెవులపై ధరించి పాదాభివందనం చేస్తారు. విజయ దశమి నాడు 2-8 ఏళ్ల వయసున్న తొమ్మిది మంది బాలికలను ప్రత్యేకంగా పూజించి తాంబూలం సమర్పిస్తారు. ఈ సందర్భంగా పూజా తాలీ పోటీలు నిర్వహిస్తారు.

కలిసి మెలిసి ఉత్సవాలు



ఏన్నో ఏళ్ల క్రితం నగరానికి వచ్చిన మేమంతా ఇక్కడ కలిసి మెలసి ఉత్సవాలు చేసుకుంటాం. ఇది నిజాం కాలం నుంచి వస్తోంది. రాష్ట్రాలు, ప్రాంతాలు వేరైనా..ఉత్సవాలను మాత్రం మా ఆచార వ్యవహారాలకు అనుగుణంగా నిర్వహించుకుంటున్నాం. ఇక దసరా వేడుకలను కర్ణాటక రాష్ట్రంలో ఎలా నిర్వహిస్తారో..అదే పద్ధతిలో ఇక్కడా నిర్వహిస్తున్నాం. పాలపిట్టను చూడటంతో కన్నడిగుల దసరా ఉత్సవాలు ముగుస్తాయి.

– డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి, టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షులు

క్లుప్తంగా...

పరిశోధన సంస్థలను వినియోగించుకోవాలి

● ప్రభుత్వానికి కోదండరెడ్డి సూచన



సాక్షి, హైదరాబాద్: రాజేంద్రనగర్‌లోని జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థలను సక్రమంగా వినియోగించుకోవాలని రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి ప్రభుత్వానికి సూచించారు. రైతులకు, వ్యవసాయ అధికారులకు ఉపయుక్తమైన అనేక అంశాలకు సంబంధించిన శిక్షణ జాతీయ పరిశోధన కేంద్రాల్లో లభిస్తుందన్నారు. మంగళవారం రైతు కమిషన్ సభ్యులు, అధికారులతో కలిసి కోదండరెడ్డి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ సెంటర్ (ఐఐఆర్ఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ పరిశోధన సంస్థలను సందర్శించారు. అక్కడ వ్యవసాయ శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలు, శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఏటా రాష్ట్రంలో వరి సాగు పెరుగుతోందని, ఉద్యాన పంటల సాగు తగ్గుతోందని వరి పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలతో చర్చించారు. రైతులు యూరియా వాడకం తగ్గించాలని కోరారు. శాస్త్రవేత్తలు, అధికారులు వ్యవసాయంలో వస్తున్న మార్పులు, అనుసరించాల్సిన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని కోదండరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, చెవిటి వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు అండగా ఉంటాం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర, జాతీయ రోడ్డు ప్రాజెక్టులతోపాటు ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణం సందర్భంగా భూములను కోల్పోయే బాధితులకు సీపీఎం అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి చేసి నిర్వాసితులకు న్యాయం జరిగేలా ఉద్యమాలు, పోరాటాలు చేపడతామని ప్రకటించారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆర్ఆర్ఆర్ ప్రభావిత జిల్లాలు, మండలాల సీపీఎం నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పార్టీ నేత సారంపల్లి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఆయా ప్రాజెక్టులు, పథకాలను అమలుచేస్తున్న సందర్భంగా అత్యధికంగా భూసేకరణ చేస్తున్నాయన్నారు. దీని మూలంగా పేద ప్రజలు, రైతులు తమకున్న కొద్దిపాటి భూములను కోల్పోవాల్సి వస్తోందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ ప్రయోజనాల కోసం చూస్తున్నాయని విమర్శించారు. సమావేశానికి ఆర్ఆర్ఆర్ భూసేకరణ బాధిత 8 జిల్లాల నుంచి సీపీఐ (ఎం) నాయకులు హాజరయ్యారు.

సింగరేణిని దివాలా తీయించే కుట్ర

● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



బతుకమ్మ పేర్చుతున్న ఎమ్మెల్సీ కవిత

శ్రీరాంపూర్: కాంగ్రెస్ సర్కార్ సింగరేణి సంస్థను దివాలా తీయించే కుట్ర చేస్తోందని ఎమ్మెల్సీ, హెచ్ఎంఎస్ సింగరేణి విభాగం గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. తన రాజకీయ భవిష్యత్ ఏంటనేది సింగరేణి కార్మికులే నిర్ణయిస్తారన్నారు. మొదటి నుంచి కార్మికుల మధ్యనే ఉన్నానని, వారి నిర్ణయం మేరకే నడుచుకుంటానని స్పష్టం చేశారు. జాగృతి రాజకీయ పార్టీగా అవతరిస్తుందా అని మీడియా అడిగిన ప్రశ్నకు ఈమేరకు స్పందించారు. మంగళవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో హెచ్ఎంఎస్, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. ఏటా 5 కొత్త గనులు తేవాలని కేసీఆర్ ప్రణాళికలు సిద్ధం చేశారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఒక్క గనిని కూడా తెరవలేదని మండిపడ్డారు. ఉన్న గనులను వేలం వేసి పెద్ద పెద్ద కంపెనీలకు అప్పగించాలనే ఆలోచన కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. తెలంగాణ తల్లి చేతుల్లో ఉన్న బతుకమ్మను తీసేసిన కాంగ్రెస్‌కు బతుకమ్మ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

బీజేపీలో చేరిన వరుణ్ సందేశ్ తల్లి

సాక్షి, హైదరాబాద్: మంగళవారం బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సమక్షంలో సినీనటుడు వరుణ్ సందేశ్ మాతృమూర్తి డా.రమణి పార్టీలో చేరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డా.రమణికి రాంచందర్‌రావు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. తనకు సామాజిక సేవ, హిందూత్వ ఎజెండాతో పనిచేయడం ఇష్టమని రమణి తెలిపారు. బీజేపీకి మంచిపేరు తీసుకురావడానికి పనిచేస్తానని, ఎన్ఆర్ఐ విభాగం ద్వారా మరి కొందరు పార్టీలో చేరే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



సొమ్మసిల్లి పడిపోయిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నల్లగొండ జిల్లా పెద్దవూరలో యూరియా కోసం బారులు తీరిన మహిళలు..



సూర్యాపేట జిల్లా నెమ్మికల్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు దీరిన రైతులు

యూరియా కోసం తోపులాట

సొమ్మసిల్లి పడిపోయిన మహిళా రైతులు

పెద్దవూర: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని రైతులు యూరియా కోసం మంగళవారం ఉదయం పీఏసీఎస్ వద్దకు అధిక సంఖ్యలో వచ్చి క్యూలో నిల్చున్నారు. ఒకే కౌంటర్ ఉండడంతో ఒకవైపు మహిళలు, మరోవైపు పురుషులు క్యూ కట్టారు. రెండువైపుల నుంచి రైతులు కౌంటర్ వద్దకు ఒకేసారి తోసుకోవడంతో శ్వాస ఆడక ముగ్గురు మహిళా రైతులు సొమ్మసిల్లి పడిపోయారు. పోలీసులు, వ్యవసాయ సిబ్బంది వారిని పక్కకు తీసుకొచ్చి ముఖంపై నీళ్లు చల్లి సపర్యలు చేయడంతో ఇద్దరు మహిళలు స్పృహలోకి వచ్చి మరలా క్యూలైన్‌లోకి వెళ్లారు. గేమ్యానాయక్‌తండాకు చెందిన లక్ష్మి కొంత ఇబ్బంది పడటంతో 108లో పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ చొరవ తీసుకుని పీఏసీఎస్‌కు పక్కనే ఉన్న పాత సీడీపీఓ కార్యాలయం వద్ద మహిళలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయించారు.

రైతుపై చేయిచేసుకున్న హోంగార్డు!

యూరియా కోసం క్యూలో నిల్చున్న ఓ రైతుపై హోంగార్డు చేయిచేసుకున్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో నాగార్జునసాగర్ సీఐ శ్రీనునాయక్ పెద్దవూరకు వచ్చి బాధిత రైతుతో మాట్లాడారు. తనను హోంగార్డు ఏమీ కొట్టలేదని, తాను వేకువజామునే వచ్చి క్యూలో నిల్చున్నట్టు మూత్రం రావడంతో బయటకు వెళ్లి వచ్చానని, తిరిగి క్యూలో నిల్చుండగా ఈ క్రమంలో తన వెనకాల ఉన్న రైతులు గొడవ చేశారని, దీంతో హోంగార్డు వచ్చి తనను బయటకు లాగే ప్రయత్నం చేశాడని, తాను ఉన్న విషయాన్ని చెప్పడంతో వెళ్లిపోయాడని చెప్పాడు.

● సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్‌లోని మనగ్రోమోర్ సెంటర్ వద్ద రైతులు యూరియా కోసం పెద్ద సంఖ్యలో బారులు దీరారు.

మామిడి, నారింజ రైతులకు భారీ ప్రోత్సాహం

● రూ.3,745 కోట్ల పెట్టుబడి, 1,518 మందికి ఉపాధి కల్పించే మూడు కంపెనీలకు గ్రీన్ సిగ్నల్

● ఇండస్ట్రియల్ ప్రమోషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, చిత్రంలో మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ బాబు

సాక్షి, హైదరాబాద్: భారీగా పెట్టుబడులు పెడుతూ యువతకు ఉపాధి, వివిధ రకాల పండ్లు సాగు చేసే రైతులకు ప్రోత్సాహం కలిగించే పద్ధతుల్లో బహుళ జాతి కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయని డిప్యూటీ సీఎం, కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మంగళవారం సచివాలయంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో కేబినెట్ సబ్‌కమిటీ సభ్యులైన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అన్ని విధాలా ఆసక్తి చూపుతున్న జేఎస్‌డబ్ల్యూ యూఏవీ లిమిటెడ్ మహేశ్వరంలో కొత్త యూనిట్ ప్రారంభించడానికి, తోషిబా ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం, గ్యాస్ ఇన్సులేటివ్ స్విచ్‌గేర్, బుషింగ్స్ పరిశ్రమ ఏర్పాటుకు, హిందుస్తాన్ కోకాకోలా బేవరేజెస్ కంపెనీ ఏర్పాటుకు కేబినెట్ సబ్‌కమిటీ ఆమోదం తెలిపింది.

● రూ.2,398 కోట్లతో ఏర్పాటు చేస్తున్న కోకాకోలా బేవరేజెస్ పరిశ్రమ ఏర్పాటు ద్వారా 600 మందికి ఉపాధి లభిస్తుందని, రూ.785 కోట్ల పెట్టుబడితో వస్తున్న జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ద్వారా 364 మందికి ఉపాధి లభిస్తుందని, రూ.562 కోట్ల పెట్టుబడితో వస్తున్న తోషిబా కంపెనీ ద్వారా 554 మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు మంత్రులకు వివరించారు.

● కోకాకోలా వంటి కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో మామిడి, నారింజ సాగు చేసే రైతులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం ఏర్పడుతుందని భట్టి విక్రమార్క చెప్పారు. బేవరేజెస్ పరిశ్రమల ఏర్పాటుతో పెద్దఎత్తున ఉద్యాన పంటల ఉత్పత్తులు ఆయా కంపెనీలకు అవసరమవుతాయని, తద్వారా రాష్ట్రంలో మామిడి, నారింజ వంటి పంటలు సాగు ఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడి రైతులకు గణనీయంగా ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ సంజయ్‌కుమార్, కమర్షియల్ ట్యాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిత్తల్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి , కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై సంతకాల సేకరణ

● బీజేపీ కుయుక్తులను ప్రజలకు వివరించండి

● జూమ్ సమావేశంలో మీనాక్షీ నటరాజన్



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓట్ల చోరీ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా తెలంగాణలోనూ సంతకాల సేకరణ చేపట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. బీజేపీ కుయుక్తులను ప్రజలకు వివరించి అక్టోబర్ 15 కల్లా గ్రామాల్లో లక్షలాది సంతకాలు తీసుకోవాలని సూచించారు. ఓట్ల చోరీ వ్యతిరేక ఉద్యమ కార్యాచరణపై మంగళవారం జూమ్ ద్వారా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యమంలో భాగంగా రాహుల్, ఏఐసీసీకి పార్టీ రాష్ట్ర శ్రేణులు అండగా నిలవాలని కోరారు. డిజిటల్ సభ్యత్వంలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ.. సంతకాల సేకరణలోనూ ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు. సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు డీసీసీ అధ్యక్షులు, ఆఫీసు బేరర్లు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

జీఎస్టీ పేరుతో పేదల రక్తం తాగిన కేంద్రం

● ఇప్పుడు జీఎస్టీ 2.0తో ప్రజలకు ఒరిగేదేం లేదు: మంత్రి పొన్నం



సాక్షి, హైదరాబాద్: ఎనిమిదేళ్ల పాటు జీఎస్టీ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద ప్రజల రక్తం తాగిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. శవపేటికలపై, పసి పిల్లల తినుబండారాలపై కూడా జీఎస్టీ వసూలు చేసిన కేంద్రం.. ఆ డబ్బుతో దేశానికి ఏదైనా చెప్పుకోవడానికి ఒక్క మంచి పని చేసిందా? అని ప్రశ్నించారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుజరాత్, బిహార్‌లాంటి రాష్ట్రాలను తప్ప జీఎస్టీ పేరుతో మిగిలిన రాష్ట్రాల నడ్డి విరిచారని విమర్శించారు. ప్రజల నుంచి రూ.కోట్లు దోచుకున్న తర్వాత ఇప్పుడు జీఎస్టీ–2.0 పేరుతో పేద ప్రజల డబ్బులు ఆదా అవుతాయని చెపుతున్నారని ఎద్దేవా చేశారు. జీఎస్టీ శ్లాబుల తగ్గింపు కారణంగా నిజంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ఒరిగేదేం లేదని, జీఎస్టీ కారణంగా రాష్ట్ర ఖజానాకు వచ్చే ఆదాయ లోటును ఎలా పూడుస్తారో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త జీఎస్టీ కారణంగా తెలంగాణకు ఏటా రూ.7 వేల కోట్ల నష్టం వస్తోందని, ఈ నష్టాన్ని కేంద్రమే భరించాలని పొన్నం కోరారు.

రేషన్ డీలర్ల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

● మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రేషన్ డీలర్ల కమీషన్ చెల్లించకపోవడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలల తరబడి రేషన్ కమీషన్ చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్ల జీవితాలతో చెలగాటం ఆడటం దుర్మార్గమని అన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో రేషన్ డీలర్లతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల తీరుతో డీలర్లు పస్తులుండే పరిస్థితి రావడం శోచనీయమన్నారు. రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించిన కమీషన్ అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దారుణం. అభయహస్తం పేరిట విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు రూ. 5 వేల గౌరవ వేతనంతో పాటు కమీషన్ పెంచుతామని ప్రకటించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ డీలర్లకు మెట్రిక్ టన్నుకు ఇచ్చే కమీషన్‌ను రూ. 900 నుంచి రూ. 1400 రూపాయలకు పెంచామని, ప్రభుత్వంపై 139 కోట్ల అదనపు భారం పడినా రేషన్ డీలర్ల సంతోషం కోసం కేసీఆర్ ఆ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు రూ.5వేల గౌరవ వేతనం, కమీషన్ పెంపు ప్రకటించాలని హరీశ్ డిమాండ్ చేశారు.

'అక్టోబర్ 1 నుంచి రేషన్ షాపులు బంద్ చేస్తాం'

సాక్షి, హైదరాబాద్: ఉచిత బియ్యం పంపిణీకి సంబంధించి ఐదు నెలల కమీషన్ బకాయిలు ఈ నెల 30 వరకు విడుదల చేయకుంటే అక్టోబర్ 1 నుంచి రేషన్ షాపులు బంద్ చేస్తామని రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాయికోటి రాజు ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదు నెలల నుంచి కమీషన్ డబ్బులు విడుదల చేయడం లేదని ఆవేదన వ్యకం చేశారు. రేషన్ షాపులు బంద్ చేయడమే కాకుండా కమిషనరేట్ ముందు ఆందోళనకు దిగుతామని ప్రకటించారు.

మాకు దక్కాల్సిన వాటా 763 టీఎంసీలు

▶ మొదటి పేజీ తరువాయి

811 టీఎంసీలు, 65 శాతం డిపెండబులిటీలో 49 టీఎంసీలు, సగటు ప్రవాహాల్లో 145 టీఎంసీలతోపాటు గోదావరి మళ్లింపు జలాల్లో 45 టీఎంసీలు కలిపి మొత్తంగా 1050 టీఎంసీలు కేటాయించింది. ఇందులో 70శాతం నీటిని తెలంగాణకు కేటాయించాలని కోరుతున్నాం. అందులో 75శాతం డిపెండబులిటీ కింద 555 టీఎంసీలు, 65 శాతం డిపెండబులిటీ కింద 43 టీఎంసీలు, సగటు ప్రవాహాల కింద 120, గోదావరి మళ్లింపు జలాల్లో 45 టీఎంసీలు కలిపి మొత్తంగా 763 టీఎంసీలు కోరుతున్నాం'అని ఉత్తమ్ తెలిపారు. మంగళవారం మొదలైన ట్రిబ్యునల్ విచారణకు మంత్రి స్వయంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఏపీకి జరిగిన 811 టీఎంసీలను ఎక్కువగా బేసిన్ బయట ఉన్నవాటికే కేటాయించారని, ఈ నీటిని తెలంగాణలోని కరువు పీడిత ప్రాంతాలకు అందించేలా న్యాయం చేయాలని ట్రిబ్యునల్‌ను కోరుతున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు ఇవ్వాలని లిఖిత పూర్వకంగా రాసిచ్చారని, ఈ అన్యాయాన్ని సవరించాలని తాము కోరుతున్నామని చెప్పారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా దక్కే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు.

అల్మట్టిపై సుప్రీంలో కొట్లాడతాం

కర్ణాటక నిర్ణయించిన అల్మట్టి ఎత్తు పెంపును సైతం తాము అడ్డుకుంటామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ విషయమై త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా, ఏపీలో టీడీపీ, మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం ఉన్నా నీటి వాటాల విషయంలో తెలంగాణ రాజీపడదని, ఎవరితోనైనా కొట్లాడతామని స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వాతావరణ హెచ్చరికలు

● వడ్లు తడవకుండా ముందస్తుగా రైతులను అప్రమత్తం చేసే దిశగా చర్యలు

● తొలిసారిగా ఈ సీజన్ నుంచే వడ్లు ఆరబెట్టే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులోకి

● 8,332 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు.. 75 ఎల్ఎంటీ కొనుగోలు అంచనా

● మీడియా సమావేశంలో పౌర సరఫరాల కమిషనర్ డీఎస్.చౌహాన్



సాక్షి, హైదరాబాద్: ఈ వానాకాలం సీజన్ నుంచే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టెక్నాలజీని వినియోగిస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వారీగా వాతావరణ హెచ్చరికలను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. ఒక జిల్లాలోని మండల పరిధిలో ఉన్న ఓ గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో వర్షాలు, పిడుగులు పడే పరిస్థితులు ఉంటే ముందే సదరు కేంద్రం సిబ్బందిని అలర్ట్ చేయడం ద్వారా రైతులు తీసుకొచ్చిన వడ్లు తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ప్రణాళికను మంగళవారం పౌరసరఫరాల భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా చౌహాన్ మాట్లాడుతూ రైతులకు ఏమాత్రం నష్టం జరగకుండా ధాన్యం కొనుగోళ్లు జరపాలని క్షేత్రస్థాయి వరకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

ధాన్యం తడవకుండా డ్రయ్యర్లు.. ప్యాడీ క్లీనర్లు

దేశంలోనే తొలిసారిగా ధాన్యం ఆరబెట్టే యంత్రాలతోపాటు ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లను వినియోగంలోకి తీసుకొస్తున్నట్టు చౌహాన్ తెలిపారు. వాతావరణ పరిస్థితులు, వడ్లు తడిసిన ప్రాంతాలకు తొలుత ఈ యంత్రాలను పంపించి రైతులకు తోడ్పాటు అందిస్తామన్నారు. వీటికి ప్రస్తుతం ఎలాంటి చార్జీలు వసూలు చేయడం లేదని, భవిష్యత్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంటే, డీజిల్‌కు అయ్యే ఖర్చును భరించేలా ప్రణాళిక రూపొందించే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్నబియ్యాన్ని గుర్తించేందుకు డిజిటల్ మిషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సీజన్‌లో 18.75 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం అని అంచనా వేయగా, ఇప్పటి వరకు 11.63 కోట్ల బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. సన్న, దొడ్డు ధాన్యం సంచులను కుట్టేందుకు వినియోగించే దారం రంగులు వేర్వేరుగా ఉంటాయని తెలిపారు. వరికోతకు వినియోగించే హార్వెస్టర్లకు సంబంధించి పూర్తి వివరాలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏఈవోలకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. పూర్తిగా కోతకు రాని పంటలను ముందుగా కోయడం వల్ల వరి గింజ నాణ్యత దెబ్బ తింటుందని, బ్లోయర్‌ను యాక్టివ్ మోడ్‌లో పెట్టకుండా డీజిల్ ఆదా చేసే పరిస్థితిని నిరోధించాలని వ్యవసాయ శాఖ అధికారులకు స్పష్టం చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో పండించిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసు

75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ అంచనా

రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో 65.96 లక్షల ఎకరాల్లో వరి సాగు అయ్యిందని, ఉత్పత్తి అంచనా 159.15 లక్షల మెట్రిక్ టన్నులుగా చౌహాన్ పేర్కొన్నారు. ఇందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేసినట్టు తెలిపారు. అక్టోబర్ ఒకటో తేదీ కల్లా కొనుగోళ్లకు సిద్ధంగా ఉంటామని, అయితే అక్టోబర్‌లో 6.89 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం (9%) మాత్రమే సేకరిస్తామన్నారు. అత్యధికంగా నవంబర్‌లో 32.95 లక్షల మెట్రిక్ టన్నులు (44%), డిసెంబర్‌లో 27.03 లక్షల మెట్రిక్ టన్నులు (36%) సేకరించనున్నట్టు తెలిపారు. రైతుల సౌకర్యార్థం రాష్ట్రంలో 8,332 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. జిల్లాల వారీగా అత్యధికంగా నిజామాబాద్ నుంచి 6.80 లక్షల మెట్రిక్ టన్నులు, జగిత్యాల నుంచి 5 లక్షల మెట్రిక్ టన్నులు, నల్లగొండ నుంచి 4.76 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించనున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ హనుమంతు కొండిబా, అదనపు డైరెక్టర్ బి.రోహిత్‌సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొచ్చేలా రాష్ట్ర సరిహద్దుల్లో 17 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, అక్కడ సీసీ టీవీలు కూడా ఉంటాయన్నారు.

పట్నాకు సీఎం, పీసీసీ చీఫ్

● నేడు జరిగే సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరు





సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌లు మంగళవారం సాయంత్రం బిహార్ రాజధాని పట్నాకు బయలుదేరివెళ్లారు. పట్నాలో బుధవారం జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి వారు హాజరు కానున్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ముందే పాట్నా వెళ్లగా, ఈ సమావేశానికి హాజరయ్యే సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ తదితరులు ఒకే విమానంలో బయలుదేరి వెళ్లారు. కాగా, ఈ సమావేశం ముగిసిన అనంతరం వారంతా తిరిగి హైదరాబాద్ చేరుకుంటారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

'అల్మట్టి'పై రేవంత్ నోరెందుకు మెదపరు?

● బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ప్రభుత్వం అల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచాలనే నిర్ణయం దక్షిణ తెలంగాణ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. దీనిని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఈ డ్యామ్ ఎత్తు పెంచడంపై సుప్రీంకోర్టు స్టే ఉన్నప్పటికీ అక్కడి ప్రభుత్వం ఎత్తును పెంచే ప్రయత్నాలు చేయడం అన్యాయమన్నారు. కర్ణాటకలో ఇక్కడా కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నప్పటికీ... కృష్ణా జలాల్లో రైతులకు అన్యాయం జరగకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చొరవ తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో తనకు ప్రాధాన్యత ఉన్నా, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు రేవంత్ రెడ్డి నోరెందుకు మెదపడం లేదని ఆయన నిలదీశారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకే నీరు ఆగిపోతే ఎందుకు మిన్నకుండిపోయారని ప్రశ్నించారు. కర్ణాటక చర్యలతో దక్షిణ తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల వాటా కేవలం 299 టీఎంసీలు మాత్రమే సరిపోతాయని సంతకం చేసిన కారణంగానే నదీజలాల వాటాలో తెలంగాణకు నష్టం జరుగుతోందన్నారు. అందువల్లే ఈ విషయంలో మాట్లాడే నైతిక అర్హతను బీఆర్ఎస్ కోల్పోయిందన్నారు.

కొత్తగా అనుమతులు తెచ్చినట్టు గొప్పలు!

● సమ్మక్క బరాజ్‌కు అనుమతులపై మంత్రి ఉత్తమ్‌పై వినోద్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: సమ్మక్క సారక్క బరాజ్‌కు కొత్తగా అనుమతులు సాధించినట్టు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డబ్బా కొట్టుకుంటున్నారని మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఛత్తీస్‌గఢ్‌తో 50 ఎకరాల ముంపునకు సంబంధించి అంగీకారం కుదిరితే ఏదో సాధించినట్టు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... '2001లో కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి భయపడి అప్పట్లో చంద్రబాబు దేవాదుల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రూ.811 కోట్ల వ్యయంతో దేవాదులకు జీవో ఇచ్చారు. 2009లో గానీ ఆ ప్రాజెక్టు పూర్తి కాలేదు. రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లు ఖర్చు పెట్టినా ఆ ప్రాజెక్టు నుంచి సరిగ్గా నీళ్లు తోడలేకపోయారు. ఇన్‌టేక్‌వెల్ కూడా సరిగా ఏర్పాటు చేయలేదు. 170 రోజులు నీళ్లు తోడాల్సి ఉండగా 110 రోజులు కూడా దేవాదులతో నీళ్లు రాలేదు. ఫుట్‌వాల్ కూడా సరిగా పెట్టకుండా దేవాదుల డిజైన్ చేశారు. కానీ, కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించకుండా దేవాదుల ప్రాజెక్టును సరిదిద్దారు. దేవాదులను పటిష్టం చేసేందుకు ఏడు టీఎంసీల సామర్థ్యంతో సమ్మక్క సారక్క బరాజ్‌ను కేసీఆర్ నిర్మించారు. 2023 ఎన్నికల సందర్భంగా ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఇక్కడి కాంగ్రెస్ నాయకులు అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కేసీఆర్‌కు అనుమతులు దక్కకుండా చేశారు'అని వినోద్‌కుమార్ అన్నారు.

'తాల్ హెల్త్‌ఫెస్ట్'కు కేటీఆర్‌కు ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలో జరగనున్న ప్రతిష్టాత్మక 'తాల్ హాస్పిటల్స్ హెల్త్‌ఫెస్ట్ 2025'కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆయనకు ఆహ్వానం అందింది. ఈ ఆహ్వానాన్ని తాల్ హాస్పిటల్స్ సీఈవో సాయి గుండవెల్లి.. ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్–చాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్‌తో కలిసి హైదరాబాద్‌లో కేటీఆర్‌కు స్వయంగా అందజేశారు. అక్టోబర్ 24న కాలిఫోర్నియాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో (యూసీఎస్‌డీ)లో ఈ 'హెల్త్‌ఫెస్ట్'నిర్వహించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య నిపుణులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, భవిష్యత్ ఆరోగ్య సంరక్షణపై చర్చించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో కేటీఆర్ కీలకోపన్యాసం ఇవ్వనున్నారు.

'బనకచర్ల'లో 64.75 టీఎంసీల వాటా

● ఏపీ మొత్తం 423 టీఎంసీలను తరలించనున్నందున అందులో 112 టీఎంసీలు మావే

● కేంద్ర జలశక్తి శాఖకు లేఖలో కర్ణాటక

సాక్షి, హైదరాబాద్: పోలవరం–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు ద్వారా రోజుకు రెండు టీఎంసీల చొప్పున మొత్తం 243 టీఎంసీల గోదావరి జలాలను తరలించుకుంటామని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన నేపథ్యంలో ఆ జలాల్లో తమకు 64.75 టీఎంసీల వాటాను కేటాయించాలని కర్ణాటక డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రాజెక్టుపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ ఆ రాష్ట్ర జలవనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తా ఈ నెల 17న కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాశారు. కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పులోని 14 (బీ) నిబంధనకు అనుగుణంగా ఇతర బేసిన్ల నుంచి కృష్ణా బేసిన్‌కు నీటి మళ్లింపు జరగాల్సి ఉంటుందని లేఖలో కర్ణాటక స్పష్టం చేసింది. 1978 ఆగస్టు 4న గోదావరి ట్రిబ్యునల్ సమక్షంలో జరిగిన అంతర్రాష్ట్ర ఒప్పందంలోని నిబంధన 5 (సీ)లోని పేరా–7 (ఎఫ్) ప్రకారం కృష్ణా బేసిన్‌కు మళ్లించే మిగులు జలాల్లో బేసిన్‌లోని ఇతర రాష్ట్రాలకు సమాన వాటా ఇవ్వాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించుకోవడానికి ఏపీకి అనుమతులిచ్చిన సమయంలో ఈ నిబంధనల ఆధారంగానే తమ రాష్ట్రానికి 21 టీఎంసీల కృష్ణా జలాలను అదనంగా వాడుకోవడానికి అవకాశం కల్పించారని గుర్తుచేసింది. పోలవరం ప్రాజెక్టు ద్వారా ఏపీ 80 టీఎంసీలకు అదనంగా మరో 100 టీఎంసీలను ఇప్పటికే వాడుకుంటోందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో తేలిన విషయాన్ని లేఖలో కర్ణాటక ప్రస్తావించింది. ఈ 100 టీఎంసీల్లోనూ తమ రాష్ట్రానికి 26.25 టీఎంసీల వాటా కేటాయించాలని కోరింది. పోలవరం ద్వారా 80 టీఎంసీలు, అదనంగా మరో 100 టీఎంసీలతోపాటు పోలవరం–బనకచర్ల అనుసంధానం ద్వారా మరో 243 టీఎంసీలు కలిపి మొత్తం 423 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు ఏపీ తరలించుకోనుండగా.. అందులో తమ రాష్ట్రానికి నిబంధనల ప్రకారం 112 టీఎంసీల వాటా కేటాయించాలని కోరింది.

పింఛన్ల పెంపునకు మరో ఉద్యమం

● మంద కృష్ణమాదిగ పిలుపు



హాలియా: పింఛన్‌దారులంటే ప్రభుత్వాలకు ఎప్పుడూ చిన్నచూపేనని, అందుకే పింఛన్ల పెంపు, కొత్త పింఛన్ల సాధనకు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా హాలియా పట్టణంలోని లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో నిర్వహించిన నాగార్జునసాగర్ నియోజకవర్గ చేయూత పింఛన్‌దారుల సన్నాహక సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలలు గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. పింఛన్లు పెంచేదాకా తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 6వ తేదీ నుంచి నవంబర్ 6వ తేదీ వరకు నెల రోజులపాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు.

చేసిందంతా చంద్రబాబే

ఓటుకు కోట్లు కేసులో ఆయనదే కీలకపాత్ర..

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు నిందితుడు మత్తయ్య లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: 'అంతా ఏపీ సీఎం చంద్రబాబే చేశారు.. ఓటుకు కోట్లు కేసులో అతనూ కీలక నిందితుడే. నన్ను స్టీఫెన్‌సన్ వద్దకు పంపడంలో రేవంత్‌తోపాటు ఆయనదీ కీలకపాత్ర. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటేసేలా ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను ఒప్పించాలని బలవంతం చేశారు. రూ. 5 కోట్లు ఆశ చూపాలని చెప్పారు. కేసు నమోదయ్యాక పోలీసులకు దొరకకుండా నన్ను లోకేశ్ విజయవాడ తరలించారు. అతని సన్నిహితుల సహకారంతో ఆరేడు నెలలు నిర్బంధించారు. ఈ కేసులో బాబు, లోకేశ్, ఏబీ వెంకటేశ్వరరావు సహా మరికొందరిని నిందితులుగా చేర్చి.. విచారణ చేపట్టాలి' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కి నిందితుడు మత్తయ్య లేఖ రాశారు. చంద్రబాబు, లోకేశ్.. ఈ కేసులో చేసిన దారుణాలను వివరించారు. మంగళవారం ఆ లేఖను ఢిల్లీలోని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రిజిస్ట్రార్ (ఇన్‌వార్డ్)కు అందజేశారు. సుప్రీంకోర్టు లేదా మరేదైనా హైకోర్టులో కేసు విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. 17 అంశాలతో రాసిన లేఖలో ఆయన పేర్కొన్న వివరాల మేరకు..



చంద్రబాబు, రేవంత్‌లే పంపారు..

'ఓటుకు కోట్లు వ్యవహారంలోకి ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌లే నన్ను పంపారు. తీర్పును ప్రకటించే ముందు మరోసారి కేసుకు సంబంధించి పూర్తి వివరాలను క్షుణ్ణంగా చదవాలని కోరుతున్నా. కేసులో నా ప్రమేయంతోపాటు నేరానికి ప్రోత్సహించిన చంద్రబాబు, అతని కుమారుడు, మంత్రి లోకేశ్‌ను కూడా నిందితులుగా చేర్చాలి. ఈ వ్యవహారంలో టీడీపీ నేతలు, పోలీసు అధికారులు, జడ్జీలు, న్యాయవాదులు, వారికి సహకరించిన ప్రతి ఒక్కరినీ నాతోపాటు సమగ్రంగా విచారించాలి. ఏసీబీ పోలీసుల దర్యాప్తులో అధికారిక సాక్ష్యాలు, చంద్రబాబు మాట్లాడిన రికార్డు.. దీని ఫోరెన్సిక్ నివేదిక, రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రూ. 50 లక్షల నగదుపై దర్యాప్తు జరగాలి. చంద్రబాబు, రేవంత్ ప్రోద్బలంతోనే సెబాస్టియన్‌ను ఒప్పించా. 2016లో జరిగిన మహానాడులో చంద్రబాబు, రేవంత్‌లు నన్ను పిలిపించి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలపై మాట్లాడారు. టీడీపీ అభ్యర్థికి ఓటు వేసేలా రూ. 5 కోట్లకు నాటి టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను ఒప్పించాలన్నారు. ఈ వ్యవహారంలో నన్ను ప్రోత్సహించి, నాతో నేరం చేయించిన చంద్రబాబు, రేవంత్‌తోపాటు భాగస్వాములైన వారందరిపై దర్యాప్తు చేసేలా ఆదేశాలు జారీ చేయండి' అని మత్తయ్య విజ్ఞప్తి చేశారు.

రేవంత్‌ను సీఎంగా తప్పించండి..

'ఈ కేసు విచారణ సజావుగా సాగి, నిజానిజాలు బయటకు రావాలంటే రేవంత్‌ను ముఖ్యమంత్రి హోదా నుంచి తప్పించాలి. నాతో సహా, నిందితులందరినీ విచారించేలా మళ్లీ విచారణకు ఆదేశించాలి. రేవంత్, వేం నరేందర్‌రెడ్డి, వేం కీర్తన్, ఉదయ్‌సింహా తదితరులు ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వంలో అధికార పదవుల్లో ఉన్నారు. వారు ఏసీబీ అధికారులను ప్రభావితం చేసే అవకాశమే ఎక్కువ. కేసులో వారి పాత్ర లేకుండా చేసేలా ఒత్తిడి తెస్తారు. దర్యాప్తులో వారి ప్రమేయం ఉండకుండా, తప్పుదోవ పట్టకుండా, ఏసీబీ అధికారులను ప్రభావితం చేయకుండా ఉండాలంటే.. ముందుగా వారిని పదవుల నుంచి తప్పించాలి. విచారణ ముగిసే దాకా పదవులకు దూరంగా ఉండేలా ఉత్తర్వులు జారీ చేయాలి. అంతేకాదు, ఈ కేసు సుప్రీంకోర్టు లేదా ఏపీ, తెలంగాణేతర హైకోర్టులకు బదిలీ చేసి విచారణ చేపట్టాలి' అని మత్తయ్య కోరారు.

లోకేశ్, అతని సన్నిహితులే నిర్బంధించారు

ఈ కేసు నమోదైనప్పుడు తెలంగాణ పోలీసులకు నన్ను దొరకకుండా చేసేందుకు ప్రస్తుత ఏపీ మంత్రి నారా లోకేశ్ విశ్వప్రయత్నం చేశారు. ఆయన సన్నిహితులు కిలారి రాజేశ్, రేవంత్ అనుచరుడు జిమ్మీ బాబు, మరికొందరు కారులో నిర్బంధించారు. బలవంతంగా హైదరాబాద్ నుంచి విజయవాడకు తరలించారు. ఆ సమయంలో కాళ్లు, చేతులూ కట్టేయడంతోపాటు ఎక్కడికి తీసుకెళ్తున్నారో తెలియకుండా ఉండేందుకు కళ్లకు గంతలు కట్టారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో సుమారు ఆరేడు నెలలు అజ్ఞాతంలో ఉంచారు. నా భార్య, పిల్లలకు, తల్లిదండ్రులకు చూపించకుండా.. నా కుటుంబానికి దూరం చేశారు. ఏపీలోని పలు ప్రదేశాల్లో చీకటి గదిలో బంధించి, అడవుల్లో తిప్పుతూ అప్పటి పోలీసులు, లోకేశ్ సన్నిహితులు తీవ్ర వేధింపులకు గురిచేశారు. నేను ఎక్కడికీ వెళ్లకుండా కాపలాగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఇంటెలిజెన్స్ నాటి అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, అప్పటి డీజీపీ, టాస్క్‌ఫోర్స్ బృందాలు, కృష్ణా జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా సహకరించారు. వారందర్నీ నిందితులుగా చేర్చి, విచారించాలి. విజయవాడలోని సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై ఫోన్ ట్యాపింగ్ కేసులో నాతో బలవంతంగా ఫిర్యాదు చేయించారు. 164 స్టేట్‌మెంట్‌పై బలవంతంగా సంతకం పెట్టించారు. వందకు పైగా తెల్ల కాగితాలపై బలవంతంగా సంతకాలు చేయించుకున్నారు. నా భార్యకు నామినేటెడ్ పదవి ఇస్తామని, అమరావతిలో ఇల్లు, వ్యాపారాభివృద్ధికి సహకరిస్తామని, పిల్లల చదువు, భవిష్యత్‌కు సహకరిస్తామని నమ్మించారు. అలా 164 స్టేట్‌మెంట్‌పై సంతకం చేయించారు. టీడీపీ న్యాయవాదులు కనకమెడల, దమ్మలపాటి, మరికొందరు ఏపీ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయవాదులు వారికి సహకరించారు. లోకేశ్ టీం, టీడీ జనార్దన్, చంద్రబాబు పీఏ శ్రీనివాస్, కేబినెట్ మంత్రులు, అందరినీ ఈ కేసులో నిందితులుగా చేర్చి పూర్తిగా విచారణ చేయాలి. నేను ఈ లేఖలో పేర్కొన్న విషయాలన్నీ హైకోర్టులో లేదా సుప్రీంకోర్టు విచారణలో ప్రత్యక్షంగా చెప్పేందుకు సిద్ధంగా ఉన్నా. నాలుగేళ్ల క్రితం సుప్రీంకోర్టులో ''పార్టీ ఇన్ పర్సన్''గా పిటిషన్ వేశా. ఒక బాధ్యతగల పౌరుడిగా, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన ఓటుకు కోట్లు కేసు నిందితుడిగా ఉన్నాను. చేసిన తప్పుకు సిగ్గుపడి పశ్చాత్తాపపడుతున్నా. తప్పు తెలుసుకొని నిజాలు చెప్పి ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నా. నన్ను అప్రూవర్‌గా అనుమతించండి' అంటూ మత్తయ్య సీజేఐని అభ్యర్థించారు.

పీజేటీఏయూకు బీసీ గురుకుల వ్యవసాయ కళాశాలలు

అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలో ఉన్న వ్యవసాయ డిగ్రీ కాలేజీలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కరీంనగర్, వనపర్తిలో ఉన్న ఈ రెండు డిగ్రీ కాలేజీల నిర్వహణ బాధ్యతలు ఇప్పటివరకు బీసీ గురుకుల సొసైటీ నిర్వహిస్తుండగా.. ఇకపై వాటిని అగ్రి యూనివర్సిటీ పర్యవేక్షించనుంది. ఈమేరకు అవగాహన కుదిరింది. మంగళవారం సచివాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్, వనపర్తిలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే వ్యవసాయ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ద్వితీయ, తృతీయ, చివరి సంవత్సరం విద్యార్థులకు వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకుల సమక్షంలో విద్యా బోధన నిర్వహిస్తామన్నారు. ఈ సంవత్సరం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలోనే ఈ రెండు డిగ్రీ కాలేజీల అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందన్నారు.

నాణ్యతతో విద్యనందించేందుకే: చిన్నారెడ్డి

వ్యవసాయ డిగ్రీ కాలేజీల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకే ఈ రెండు కళాశాలలను వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోకి తెచ్చామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి అన్నారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారికి అష్టలక్ష్మీ చంద్రవంక కంఠి విరాళం





తిరుమల: తిరుమల శ్రీవారికి తెలంగాణ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి రూ.60 లక్షలు విలువైన 535 గ్రాముల అష్టలక్ష్మీ చంద్రవంక కంఠిని మంగళవారం విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఏఈవో వెంకయ్య చౌదరికి ఆభరణాన్ని అందజేశారు.

రిజర్వేషన్లు 50 శాతానికి మించడం చట్టవిరుద్ధం

> పంచాయతీ రాజ్ చట్ట ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి
>
> బీసీలకు 42% రిజర్వేషన్ సవాల్ చేస్తూ పిటిషన్
>
> నేడు విచారణ చేపట్టనున్న జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా.. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడం చట్టవిరుద్ధమని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. వెనుకబడిన తరగతులకు 42% రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త బుట్టెంగారి మాధవరెడ్డితో మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు 26%, ఎస్సీలకు 15%, ఎస్టీలకు 9 రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తే.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించిపోతాయి. ఇది చట్ట ఉల్లంఘనేకాదు.. కె.కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన తీర్పునకు విరుద్ధం. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 ఏ కింద రిజర్వేషన్ల ప్రకారం పంచాయతీ (స్థానిక సంస్థ) ఎన్నికలను నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలి. ఆ మేరకే గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌లలో సీట్లు కేటాయించేలా ఉత్తర్వులివ్వాలి' అని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టనుంది.

వారాంతంలోగా స్థానిక నోటిఫికేషన్!

▶ మొదటి పేజీ తరువాయి

చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో అర్ధరాత్రి దాకా జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దీనికి సంబంధించిన కసరత్తు పూర్తి చేసిన అధికారులు, సిబ్బంది.. ఆ మేరకు నివేదికలను సీల్డ్‌కవర్లలో జిల్లా కలెక్టర్లకు అందజేసినట్టు సమాచారం. ఖరారు చేసిన రిజర్వేషన్లను ఎట్టిపరిస్థితుల్లోనూ బయటికి వెల్లడించవద్దని అధికారులకు హెచ్చరికలు జారీ అయ్యాయి. దీంతో వీటిపై వివరాలు చెప్పడానికి పీఆర్‌ఆర్‌డీ అధికారులు, సిబ్బంది నిరాకరిస్తున్నారు. కాగా క్షేత్రస్థాయిలో వార్డులు, సర్పంచ్‌ల రిజర్వేషన్ల ప్రక్రియను జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉండడంతో వీటి ఖరారుకు అధిక సమయం పట్టినట్టు తెలుస్తోంది.

వార్డు సభ్యులు, సర్పంచ్‌ల రిజర్వేషన్లు కూడా..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం జీవో జారీ చేశాక.. జిల్లాల్లో ఇప్పటికే సిద్ధం చేసిన రిజర్వేషన్ల జాబితాలను పరిశీలిస్తారు. ఏమైనా మార్పుచేర్పులుంటే సరిచేయాలని నిర్ణయించినట్లు సమాచారం. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు చేయాలని కలెక్టర్లకు ఉన్నతాధికారులు సూచించారు. అయితే వీటితో పాటు వార్డు సభ్యులు, సర్పంచ్‌ల రిజర్వేషన్లు కూడా పూర్తి చేయాలనే ఆదేశాలతో.. వాటిని కూడా జిల్లా, మండల, గ్రామ అధికారులు పూర్తి చేసినట్టు తెలుస్తోంది. జిల్లా పరిషత్ ఛైర్మన్ల రిజర్వేషన్లను పంచాయతీరాజ్ కమిషనర్ ఖరారు చేయాల్సి ఉండగా, అది కూడా పూర్తయినట్టు ప్రచారం జరుగుతోంది.

రాజకీయంగా ప్రయోజనం పొందేందుకు...

ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున.. దీని ద్వారా అధికార పార్టీకి ఈ ఎన్నికల్లో పూర్తి లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెజారిటీ జెడ్పీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాల్లో గెలుచుకునేందుకు వీలుగా ముందుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ వారం లోగా నోటిఫికేషన్ వెలువడితే.. మూడు వారాల వ్యవధిలో రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తిచేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇవి ముగిశాక కొన్నిరోజుల అంతరంతో గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఆ తర్వాత మూడు వారాల వ్యవధిలోనే ఆ ప్రక్రియ ముగించాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ నెలాఖరులోగా నోటిఫికేషన్ సాధ్యం కాని పక్షంలో..కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇంతవరకు జరిపిన కసరత్తుకు సంబంధించిన వివరాలు హైకోర్టుకు తెలియజేసి మరింత సమయం కోరే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది.

రిజర్వేషన్లు ఇలా..!

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం చూస్తే..జిల్లా ప్రజా పరిషత్‌లు (జెడ్పీలు) 31, జెడ్పీటీసీ స్థానాలు 565 , మండల ప్రజాపరిషత్‌లు 565, ఎంపీటీసీ స్థానాలు 5,763, గ్రామపంచాయతీలు- 12,760, వార్డుల సంఖ్య 1,12,534గా ఖరారు అయ్యాయి. తెలంగాణ ఏర్పాటయ్యాక 2019లో పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానా లు 570, ఎంపీటీసీలు 5,817, గ్రామపంచాయతీలు 12,848గా ఉన్నాయి. అయితే ఇప్పుడు 1 జెడ్పీపీ, 5 జెడ్పీటీసీ, 5 ఎంపీపీలు, 54 ఎంపీటీసీ స్థానాలు, 185 గ్రామ పంచాయతీలు తగ్గాయి. మేడ్చల్- మల్కాజిగిరిలోని మెజారిటీ గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో గ్రామీణ జిల్లా ఉనికి లేకుండా పోయింది. ఒక జెడ్పీపీ, 4 జెడ్పీటీసీల సంఖ్య తగ్గుదలకు ఇది కారణంగా నిలుస్తోంది.



సచివాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయంలో మంగళవారం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. సచివాలయ మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో భారీఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు. సచివాలయం ప్రధాన ద్వారం ముందు 'ఒక్కేసి పువ్వేసి చందమామ'అంటూ బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. దీంతో సచివాలయంలో పండుగ వాతావరణం నెలకొంది.

మావోల రక్షణ దళంలో కోవర్టులు



మావో అగ్రనేతలకు ముప్పుగా బాడీగార్డులు

నంబాల నుంచి నేటి ఎన్‌కౌంటర్ వరకు ఇదే పరిస్థితి

అకస్మాత్తుగా పోలీసులకు లొంగిపోతున్న రక్షణ దళ సభ్యులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీని కోవర్టుల సమస్య మరోసారి పట్టిపీడిస్తోంది. ఆ పార్టీ అగ్ర నేతల వద్ద పనిచేస్తున్న రక్షణ దళ సభ్యులే కోవర్టులుగా మారుతున్నారు. పార్టీ వ్యూహాలు, నేతల కదలికలకు సంబంధించిన సమాచారాన్ని భద్రతా దళాలకు చేరవేస్తున్నారు. అంతేకాదు ఎన్‌కౌంటర్లకు మార్గనిర్దేశం చేస్తున్నారు. ఇటీవల జరిగిన వరుస ఘటనలపై మావోయిస్టు పార్టీ స్పందించిన తీరును పరిశీలిస్తే ఈ విషయాలన్నీ వాస్తవమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నంబాల కన్నుగప్పి...

మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు మే 21న చనిపోయారు. అంతకంటే 4 రోజుల ముందు మే 17న నంబాల రక్షణ దళంలోని ఓ జంట అకస్మాత్తుగా దళాన్ని వీడింది. ఆ వెంటనే మే 19న భద్రతా దళాలు నంబాల బృందం బస చేసిన క్యాంప్‌ను చుట్టుముట్టాయి. అప్పటి నుంచి మే 21వరకు దట్టమైన అడవిలో సుమారు నలభై కిలోమీటర్లకు పైగా నంబాల బృందాన్ని భద్రతా దళాలు దారి తప్పకుండా వెంబడించాయి. నంబాల టీమ్‌ను వీడి వెళ్లిన జంట మావోయిస్టులే భద్రతా దళాలకు నంబాల బృందం జాడను పక్కాగా తెలిపింది. అందుకే ఆపరేషన్‌లో పార్టీ చీఫ్ చనిపోయాడు.

కర్రిగుట్టల దగ్గర అంతా

దేశంలోనే అతి పెద్ద యాంటీ నక్సల్ ఆపరేషన్ ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులోని కర్రిగుట్టల దగ్గర ఏప్రిల్ 21న మొదలైంది. సుమారు 20 వేల మంది బలగాలు 21 రోజుల పాటు ఈ గుట్టలను చుట్టుముట్టాయి. హెలికాప్టర్లు వినియోగించినా ఆశించిన పురోగతి సాధించలేకపోయాయి. ఈ ఆపరేషన్‌పై మావోయిస్టులు స్పందిస్తూ తమ పార్టీకే చెందిన ఓ వ్యక్తి ఆపరేషన్ మొదలైన రెండు వారాలకు పోలీసులకు లొంగిపోవడంతో తమకు స్వల్పంగా నష్టం జరిగిందని వెల్లడించారు. అప్పటి వరకు తమ దగ్గరకు భద్రతా దళాలు చేరుకోలేకపోయాయంటూ సెప్టెంబర్‌లో జారీ చేసిన లేఖలో పేర్కొన్నారు.

ఉదయ్ విషయంలోనూ..

అల్లూరి సీతారామరాజు జిల్లాలో జూలైలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల గణేశ్ అలియాస్ ఉదయ్ చనిపోయాడు. ఈ ఎన్‌కౌంటర్ జరగడానికి రెండు వారాల ముందే గాజర్ల టీమ్‌లో కీలకంగా ఉన్న ఇద్దరు మావోయిస్టులు తెలంగాణలో లొంగిపోయారు. గాజర్ల కదలికలకు సంబంధించి కీలక సమాచారం చేరవేశారు. దీని ఆధారంగా అర్ధరాత్రి వేళ ట్యాబ్‌ను ఓపెన్ చేసి మావోయిస్టు పార్టీకి సంబంధించిన సమాచారాన్ని గాజర్ల ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాడనే విషయం భద్రతాదళాలకు తెలిసింది. దీని ఆధారంగానే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ పక్కాగా ఉదయ్‌ను చుట్టుముట్టడంతో ఆయనతో పాటు మరో కీలక మావోయిస్టు చైతే కూడా చనిపోయింది. దీంతో ఏఓబీలో పార్టీ పెద్ద దిక్కును కోల్పోయినట్టయ్యింది.

అక్కడా అంతే

జార్ఖండ్‌లో ఏప్రిల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు ప్రయాగ్ మాంఝీతో పాటు ఇద్దరు డివిజనల్ సభ్యులు, సెప్టెంబర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సహదేవ్ సోరెన్‌తో పాటు ఇద్దరు డివిజనల్ కమిటీ సభ్యులు చనిపోయారు. ఈ రెండు ఘటనల్లో కేవలం అగ్రనాయకులే చనిపోవడం వెనుక కోవర్టు ఆపరేషన్ జరిగిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అంతకు ముందు జూన్‌లో ఇంద్రావతి నేషనల్ పార్కులో కేంద్ర కమిటీ సభ్యులు తెంటు లక్ష్మీనరసింహాచలం అలియాస్ సుధాకర్‌తో పాటు మైలారపు ఆడెళ్లు అలియాస్ భాస్కర్ తో పాటు మరో 8మంది మద్దేడు ఏరియా కమిటీ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారంటూ తెలంగాణలోని పౌర హక్కుల సంఘం నేతలు ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను పోలీసులు ఖండించారు. కానీ ఆ తర్వాత వరుసగా 2 రోజుల్లో సుధాకర్, భాస్కర్ ఎన్‌కౌంటర్ అయ్యారు. దీంతో పౌర హక్కుల సంఘం నేతలు చేసిన ఆరోపణలు నిజమేనన్న పరి స్థితి ఏర్పడింది. చలపతి, బాలన్న ఎన్‌కౌంటర్ల విషయంలోనే బలమైన ఆరోపణలు రాలేదు.

ఆ 1,521 ఎకరాలు దేవుడి మాన్యమే..

దేవరయాంజాల్ భూములపై హైకోర్టుకు ప్రభుత్వం నివేదిక

300లకు పైగా పిటిషన్లను కొట్టివేయాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం దేవరయాంజాల్‌లోని 1,521 ఎకరాలు శ్రీ సీతారామ స్వామి ఆలయ భూములేనని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక సమర్పించింది. సర్వే నంబర్ 688 నుంచి 712 వరకు, 716లోని ఆలయ భూమిని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నిషేధిత జాబితాలో చేర్చుతూ 2014లో జారీచేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన సుమారు 300కుపైగా పిటిషన్లను కొట్టివేయాలని విజ్ఞప్తి చేసింది. ప్రైవేట్ వ్యక్తులతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కవడమే ఈ అన్యాక్రాంతానికి కారణమని పేర్కొంది. చట్ట ప్రకారమే భూములను నిషేధిత జాబితాలో చేర్చామని స్పష్టం చేసింది. దేవరయాంజాల్‌లోని భూములు తమవేనంటూ ప్రైవేట్ వ్యక్తులు 300లకు పైగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది మురళీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 2014లో ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్ చట్టబద్ధమేనని తెలిపారు. పిటిషనర్ల వద్ద ఆర్‌ఓఆర్ ప్రొసీడింగ్స్, పట్టాదార్ పాస్ పుస్తకాలు లేవని, సేత్వార్ కూడా తప్పుగా ఉందని, 1354 సేత్వారి (1944లో) ప్రభుత్వ భూమిగా ఉందని వివరించారు. 1925–26 పహాణీలో ఆలయ భూమిగానే ఉందని, ఆలయ ట్రస్టీగా రాముడి పుల్లయ్య పేరు ఉందని చెప్పారు. తర్వాత కొడుకు పేరు, అనంతరం అక్రమంగా ఇతరుల పేర్లు వచ్చాయని తెలిపారు. 1954–55లో ప్రైవేట్ వ్యక్తులు కొందరు అధికారులతో కుమ్మక్కై చట్టవిరుద్ధంగా పట్టాగా చూపించారని వెల్లడించారు. ఆక్రమణదారులు రైతు సమాఖ్య పేరుతో ప్రభుత్వానికి ఇచ్చిన వినతిపత్రం, ఇతర అంశాలపై సీసీఎల్ఏ విచారిస్తే 1,400 ఎకరాలు ఆలయానివేనని తేలిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం పిటిషన్లను కొట్టేయాలని కోరారు. దేవాదాయ శాఖ తరఫున న్యాయవాది మంగీలాల్ నాయక్ వాదనలు వినిపిస్తూ.. ఆలయ భూములను కాపాడాలని, పిటిషన్లను కొట్టేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ దసరా సెలవుల తర్వాతకు వాయిదా వేశారు.

ఎగ్జిబిషన్ సొసైటీకి మరోసారి

మంత్రి శ్రీధర్‌బాబు ఏకగ్రీవ ఎన్నిక



అబిడ్స్ (హైదరాబాద్): ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా మరోసారి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎగ్జిబిషన్ సొసైటీకి ఈ నెల 26వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. మంగళవారం ఎగ్జిబిషన్ సొసైటీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ అనంతరం సొసైటీ అధ్యక్షుడిగా మంత్రి శ్రీధర్ బాబుకు పోటీ లేకపోవడంతో ఆయన మూడోసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక మిగతా పదవులకు మాత్రం పోటీ ఉండటంతో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ సొసైటీకి ప్రతి ఏటా కొత్త పాలక వర్గం సెప్టెంబర్ నెలలో ఎన్నుకుంటారు. ఈ సంవత్సరం ఎగ్జిబిషన్ సొసైటీ కార్యవర్గం ఎన్నుకునేందుకు ఎన్నిక అనివార్యం అయ్యింది. ఇందులో భాగంగా 26న నూతన కార్యవర్గం కోసం ఎన్నికలు నిర్వహిస్తున్నారు.



బాలంరాయిలో దేవాలయానికి అంటించిన నోటీసు



డీఈఓ కార్యాలయం ఆవరణలో రోడ్డుపై నూతనంగా నిర్మించిన దేవాలయం

రక్షణ స్థలంలోని గుడులు ఖాళీ చేయండి

నోటీసులు జారీ చేసిన డిఫెన్స్ ఎస్టేట్స్ అధికారులు

ఆగ్రహం వ్యక్తంచేస్తున్న స్థానికులు

కంటోన్మెంట్: రక్షణ శాఖకు చెందిన స్థలాన్ని ఆక్రమించి గుడులు నిర్మించారని, తక్షణమే వాటిని ఖాళీ చేయాలంటూ డిఫెన్స్ ఎస్టేట్స్ కార్యాలయ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు కొందరు వ్యక్తులను బాధ్యులుగా పేర్కొంటూ ఆక్రమణ వివరాలతో ఆలయ ప్రధాన ద్వారం వద్ద నోటీసులు అంటించడం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని జనరల్ ల్యాండ్ రికార్డ్స్ (జీఎల్ఆర్) సర్వే నంబర్ 606లో మొత్తం 2.71 ఎకరాల బీ–4 కేటగిరి స్థలం ఉంది. ఈ భూమికి కేంద్ర ప్రభుత్వం యజమానిగా ఉంది. ఇందులో 1,306 చదరపు మీటర్ల స్థలం ఆక్రమణకు గురైంది. ఇందులో మతపరమైన/కమర్షియల్ నిర్మాణాలు వెలిశాయి. పోచమ్మ దేవాయలం, పెద్దమ్మ దేవాలయం, బీరప్ప దేవాలయం, ఎల్లమ్మ దేవాలయం, ప్రధాన దేవాలయంలతోపాటు మోడల్ డెయిరీ పార్లర్, హరియాణా స్పెషల్ జిలేబీ షాపు, అక్రమ వాహనాల పార్కింగ్ ఉన్నాయి. తక్షణమే వీటిని తొలగించాలంటూ పబ్లిక్ ప్రెమిసెస్ (ఎవిక్షన్ ఆఫ్ అనాథరైజ్డ్ ఆక్యుపెంట్స్) యాక్ట్ –1971 ప్రకారం నోటీసు జారీ చేశారు. ఇందుకు బాధ్యులుగా సుదర్శన్, యాదగిరి, పి.కె.కుంటయ్య, నర్సింహ గౌడ్, మల్లేశ్ యాదవ్, అచ్యుత్ శర్మ, సి.వెంకటేశ్వర్లు, ఆర్. అగర్వాల్ అనే వ్యక్తులను పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోపు డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్, తెలంగాణ– ఏపీ సర్కిల్, సికింద్రాబాద్‌లో వివరణ ఇవ్వాలని సూచించారు. లేని పక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో తెలిపారు. నోటీసుతోపాటు 1956 నాటి జీఎల్ఆర్ ప్లాన్ కూడా అంటించారు. ఈ నోటీసులపై ఆయా దేవాలయాల నిర్వాహకులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ పార్టీల నేతలను కలిసి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ అంశంపై సమష్టి ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

డీఈఓ కార్యాలయానికి వాస్తు దోషం

గుడులను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసిన డిఫెన్స్ ఎస్టేట్స్ అధికారులు.. తమ కార్యాలయం ఆవరణలో కొత్తగా చిన్నపాటి గుడిని నిర్మించడం గమనార్హం. కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం, నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయాల మధ్య నుంచి వచ్చే దారి నేరుగా డీఈఓ కార్యాలయానికి దారితీస్తుంది. దీన్ని వీధిపోటుగా భావించే దారికి ఎదురుగా భారీ వినాయక ప్రతిమతో గుడి నిర్మాణం చేపట్టినట్లు సిబ్బంది చర్చించుకుంటున్నారు. దీనికి తోడు డీఈఓ కార్యాలయ ఆవరణలోని ఈశాన్య భాగంలో నూతనంగా బాక్స్ క్రికెట్ నిర్మించారు. ఇది కూడా వాస్తుదోషాన్ని కలిగిస్తోందని భావించి నైరుతి మార్గంలో వందలాది ట్రాక్టర్ల మట్టితో ఎత్తు పెంచారు. ఇటీవల డీఈఓ కార్యాలయంలో సీబీఐ దాడులు జరగడంతోనే అధికారులు వాస్తు దోషంగా భావించి ఈ చర్యలు చేపడుతున్నట్లుగా సిబ్బంది చర్చించుకుంటున్నారు.



ఐఎల్‌టి20లో అశ్విన్... వేలం కోసం పేరు నమోదు

దుబాయ్: భారత మాజీ ఆఫ్ స్పిన్నర్, ఇటీవలే ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన రవిచంద్రన్ అశ్విన్ ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు లీగ్‌లలో ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. ఇందులో భాగంగా అతను ముందుగా ఇంటర్నేషనల్ లీగ్ (ఐఎల్) టి20 టోర్నీ కోసం జరిగే వేలంలో తన పేరు నమోదు చేసుకున్నాడు. లీగ్‌లో అందరికంటే ఎక్కువగా రూ.1 లక్షా 20 వేల డాలర్లు (సుమారు రూ. 1.06 కోట్లు) కనీస విలువతో అశ్విన్ వేలంలోకి రానున్నాడు. అక్టోబర్ 1న దుబాయ్‌లో వేలం జరుగుతుంది. దాదాపు 800 మంది ప్లేయర్లు ఐఎల్‌టి20లో తమ పేర్లు నమోదు చేసుకోగా... వీరిలో 24 మంది భారత ఆటగాళ్లు ఉన్నారు. ఆరు జట్లతో కూడిన ఈ లీగ్ డిసెంబర్ 2 నుంచి జనవరి 4 వరకు జరుగుతోంది. తాను టోర్నీ మొత్తానికి అందుబాటులో ఉంటానని కూడా అశ్విన్ స్పష్టం చేశాడు. ఈ టోర్నీ తర్వాత అశ్విన్ ఆస్ట్రేలియాలోని బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) కూడా ఆడాలని భావిస్తున్నాడు. డిసెంబర్ 14 నుంచి జనవరి 25 వరకు జరిగే బిగ్‌బాష్ లీగ్ చివరి దశలో అతను ఆడవచ్చు. అశ్విన్‌ను ఏదైనా జట్టు ఎంచుకుంటే... భారత్ తరఫున అంతర్జాతీయ క్రికెట్ ఆడి బిగ్‌బాష్‌లో ఆడిన తొలి టీమిండియా పురుష క్రికెటర్‌గా అతను గుర్తింపు పొందుతాడు.

గట్టెక్కిన పాకిస్తాన్

5 వికెట్లతో శ్రీలంకపై గెలుపు ● ఫైనల్ అవకాశాలు సజీవం


నవాజ్

అబుదాబి: ఆసియా కప్ టి20 టోర్నీ సూపర్–4 దశలో పాకిస్తాన్‌కు కీలక విజయం దక్కింది. తొలి మ్యాచ్‌లో ఓడిన ఆ జట్టు ఫైనల్ అవకాశాలు నిలిచి ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన పోరులో పైచేయి సాధించింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో పాక్ 5 వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. కమిందు మెండిస్ (44 బంతుల్లో 50; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. అనంతరం పాకిస్తాన్ 18 ఓవర్లలో 5 వికెట్లకు 138 పరుగులు చేసి గెలిచింది. మొహమ్మద్ నవాజ్ (24 బంతుల్లో 38 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), హుస్సేన్ తలత్ (30 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లతో పాక్‌ను గెలిపించారు. సూపర్–4 దశలో వరుసగా రెండో ఓటమితో లంక ఫైనల్ అవకాశాలకు తెర పడినట్లే!

ఇన్నింగ్స్ రెండో బంతికి కుశాల్ మెండిస్ (0)ను అవుట్ చేసిన షాహిన్ అఫ్రిది తన తర్వాతి ఓవర్లో నిసాంక (8)ను కూడా వెనక్కి పంపాడు. కుశాల్ పెరీరా (15)ను రవూఫ్ అవుట్ చేయడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 53/3కి చేరింది. ఎనిమిదో ఓవర్లో తలత్ వరుస బంతుల్లో అసలంక (20), షనక (0)లను డగౌట్ చేర్చగా, కొద్ది సేపటికే హసరంగ (15) కూడా అవుట్ కావడంతో లంక 80/6 వద్ద నిలిచింది. ఈ దశలో కమిందు, చమిక కరుణరత్నే (17 నాటౌట్) కలిసి ఏడో వికెట్‌కు 39 బంతుల్లో 43 పరుగులు జోడించారు. పాక్ బౌలర్లలో షాహిన్ అఫ్రిది 28 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... తలత్, రవూఫ్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో పాక్‌కు సరైన ఆరంభం లభించింది. ఫర్హాన్ (24; 1 ఫోర్, 2 సిక్స్‌లు), ఫఖర్ జమాన్ (17) తొలి వికెట్‌కు 33 బంతుల్లో 45 పరుగులు జత చేశారు. అయితే ఆ తర్వాత ఆట ఒక్కసారిగా మలుపు తిరిగింది. 12 పరుగుల వ్యవధిలో పాక్ 4 వికెట్లు కోల్పోయింది. తీక్షణ ఒకే ఓవర్లో ఇద్దరు ఓపెనర్లను వెనక్కి పంపించగా... హసరంగ తన వరుస ఓవర్లలో అయూబ్ (2), సల్మాన్ (5)లను అవుట్ చేశాడు. హారిస్ (13) కూడా నిలవలేకపోయాడు. ఈ దశలో పాక్ ఓటమి దిశగా వెళుతున్నట్లు అనిపించింది. అయితే తలత్, నవాజ్ కలిసి జట్టును గట్టెక్కించారు. వీరిద్దరు 41 బంతుల్లో అభేద్యంగా 58 పరుగులు జోడించారు.

మెయిన్ ‘డ్రా’కు మేఘన రెడ్డి



కావోసియుంగ్ సిటీ (చైనీస్ తైపీ): కావోసియుంగ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి మారెడ్డి మేఘన రెడ్డి మెయిన్ ‘డ్రా’కు అర్హత సాధించింది. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో మేఘన వరుసగా రెండు విజయాలు నమోదు చేసి ముందంజ వేసింది. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో మేఘన రెడ్డి 21–6, 21–18తో పె చు చెన్ (చైనీస్ తైపీ)ను ఓడించి... రెండో రౌండ్‌లో 21–19, 22–20తో రిరీనా హిరామోటో (జపాన్)పై గెలిచింది. నేడు జరిగే మెయిన్ ‘డ్రా’ తొలి రౌండ్‌లో టాన్‌రుగ్ సెహెంగ్ (థాయ్‌లాండ్)తో తలపడుతుంది.



భారత్‌కు ఎదురుందా!

నేడు ‘సూపర్–4’ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో ‘ఢీ’

● రాత్రి 8 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

దుబాయ్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో భారత జట్టు అలవోక విజయాలతో దూసుకెళుతోంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో సైతం ఎలాంటి పోటీ ఎదురవలేదు. లీగ్ దశ, సూపర్–4లోనూ పాక్‌పై టీమిండియా దాదాపు ఏకపక్ష విజయాల్నే సాధించింది. ఇపుడు బంగ్లాదేశ్ వంతు వచ్చింది. భారత్ ప్రస్తుతమున్న ఫామ్‌కు, జోరుకు బంగ్లాదేశ్ బ్రేక్ వేయడం అసాధ్యమనుకోవాలి. అయితే ఫలితాన్ని పక్కనబెట్టి పోటీ ఏమాత్రం ఇస్తుందనేదే వేచి చూడాలి. మరోవైపు ‘సూపర్–4’లో శ్రీలంకను ఓడించిన బంగ్లాదేశ్ కూడా రెట్టించిన ఉత్సాహంతో దుర్భేద్యమైన భారత్‌తో తలపడేందుకు సిద్ధమైంది. **‘సూపర్–4’లో బోణీ కొట్టిన ఇరు జట్ల మధ్య ఈ పోరు జరుగుతుండటంతో పైచేయి సాధించేందుకు భారత్ తహతహలాడుతోంది.**

ఆల్‌రౌండ్ సత్తాతో...

బ్యాటింగ్, బౌలింగ్‌లో టీమిండియా ఆటగాళ్లకు ఎదురేలేదు. పాక్‌తో గత మ్యాచ్‌లో ఫీల్డింగ్ లోపాలు మినహా ఏ విభాగంలో మెరుగవ్వాల్సిన అవసరమైతే లేనేలేదు. బాల్య మిత్ర ద్వయం శుబ్‌మన్, అభిషేక్ శర్మలు అలవోకగా పరుగులు బాదేస్తున్నారు. సారథి సూర్యకుమార్, తిలక్ వర్మ, సంజూ సామ్సన్, హార్దిక్ పాండ్యాల నుంచి శివమ్ దూబే, ఎనిమిదో స్థానంలో అక్షర్ పటేల్ వరకు పరుగులు సాధించగలరు. ఇక బౌలింగ్‌లో భారత్ స్పిన్‌కు ప్రత్యర్థులే చిత్తవుతున్నారు. కుల్దీప్, వరుణ్, అక్షర్‌లతో పాటు పార్ట్ టైమ్ బౌలర్ దూబే కూడా ప్రత్యర్థి బ్యాటర్ల పనిపడుతున్నాడు. ఇలా అన్ని విభాగాల్లోనూ అగ్రశ్రేణిగా ఉన్న టీమిండియాను ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎదుర్కోవడం ముమ్మాటికి కష్టమనే చెప్పాలి. దీంతో ఈ టోర్నీలో భారత్‌కు వరుసగా ఐదో విజయం ఏమంత కష్టం కానేకాదు!

సర్వశక్తులు ఒడ్డినా...

టి20ల్లో అజేయమైన శక్తిగా ఎదిగిన భారత్‌ను ఓడించడం బంగ్లాదేశ్ లాంటి జట్లకైతే అసాధ్యం. సర్వశక్తులు ఒడ్డినా సరే పాక్ కంటే మెరుగైన పోటీ ఇవ్వగలదేమో కానీ గెలుపుపై మాత్రం ఆశలైతే పెట్టుకోలేదు. బ్యాటింగ్‌లో టాపార్డర్ బ్యాటర్లు సైఫ్ హసన్, తంజిద్ హసన్, కెప్టెన్ లిటన్ దాస్‌లు రాణిస్తున్నారు. తౌహిద్ హృదయ్, షమీమ్ హొస్సేన్, జాకిర్ అలీలు మిడిలార్డర్‌లో చెప్పుకోదగ్గ ప్రదర్శన ఇవ్వగలరు. ఇక బౌలింగ్‌లో ముస్తఫిజుర్ కీలకం. మెహదీ హసన్, షోరిఫుల్ ఇస్లామ్, నసుమ్ అహ్మద్‌లు కూడా పిచ్ సహకరిస్తే ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలరు.

16 భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య ఇప్పటి వరకు 17 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు జరిగాయి. 16 మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొందగా... ఒక్క మ్యాచ్‌లో మాత్రమే బంగ్లాదేశ్ నెగ్గింది. 2019లో ఢిల్లీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్‌పై బంగ్లాదేశ్ ఏకైక విజయాన్ని అందుకుంది.

మాజీ అంపైర్ డికీ బర్డ్ కన్నుమూత



లండన్: అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ అంపైర్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న హెరాల్డ్ ‘డికీ’ బర్డ్ మంగళవారం మృతి చెందారు. ఆయన వయసు 92 సంవత్సరాలు. తన కెరీర్‌లో 66 టెస్టులు, 69 వన్డేల్లో ఆయన అంపైర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మూడు వన్డే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లలో అంపైర్‌గా పని చేసిన డికీ బర్డ్... 1996లో భారత్, ఇంగ్లండ్ మధ్య లార్డ్స్ మైదానంలో జరిగిన టెస్టులో చివరిసారి అంపైర్‌గా వ్యవహరించారు. దీనికి ముందు టాపార్డర్ బ్యాటర్‌గా యార్క్‌షైర్, లీసెస్టర్‌షైర్ జట్ల తరఫున 93 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన రికార్డు డికీ బర్డ్ సొంతం. వివాదరహితమైన చక్కటి అంపైరింగ్‌తో పాటు ఆత్మీయ స్వభావం గల వ్యక్తిగా క్రికెట్ వర్గాల్లో అందరితో బర్డ్‌కు మంచి సన్నిహిత సంబంధాలు ఉండేవి. అంపైర్‌గా పని చేసిన సమయంలో ఎల్బీడబ్ల్యూ నిర్ణయాలు అస్సలు ఇచ్చేవారు కాదని, ప్రతీసారి ‘బెనిఫిట్ ఆఫ్ డౌట్’గా బ్యాటర్‌గా సానుకూలంగా వ్యవహరించేవారని బర్డ్‌కు పేరుంది. బ్రిటిష్ ప్రభుత్వం నుంచి రెండు పౌర పురస్కారాలు (ఎంబీఈ, ఓబీఈ) అందుకున్న బర్డ్ గౌరవార్థం ఆయన స్వస్థలం బార్న్‌స్లే (యార్క్‌షైర్)లో 2009లోనే ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. అవివాహితుడైన బర్డ్... క్రికెట్‌నే తాను పెళ్లాడానని తరచూ చెప్పుకునేవారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

● 71వ జాతీయ అవార్డుల ప్రదానోత్సవం

‘‘కళలు, సినీ రంగాల్లో మహిళలు ప్రతిభ చాటుకుంటున్న ఉదాహరణలు చాలా ఉన్నాయి. ఈ తరుణంలో మహిళల ప్రతిభకు తగిన గుర్తింపు లభించాలి. జ్యూరీ, కేంద్ర, ప్రాంతీయ ప్యానెల్‌లలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం లభించాలి. విద్యాసంస్థల అవార్డుల ప్రదానోత్సవాల్లో ఎక్కువ సంఖ్యలో అమ్మాయిలు ఉండటం అనేది దేశ అభివృద్ధిని ప్రతిబింబిస్తుంది. ఇలాంటి ప్రయత్నం, కృషి సినిమా అవార్డుల్లోనూ ఉండాలి. సినిమాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే అసాధారణ విజయాలు సాధిస్తారని నమ్ముతున్నాను’’ అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుండి అవార్డు స్వీకరిస్తున్న మోహన్‌లాల్
షారుక్ ఖాన్
విక్రాంత్
రాణీ ముఖర్జీ
విధు వినోద్


అనిల్ రావిపూడి
సాహు గారపాటి
ప్రశాంత్ వర్మ
నిరంజన్ రెడ్డి
సాయి రాజేశ్
పీవీఎస్ఎన్ రోహిత్
జెట్టీ వెంకట్‌కుమార్
హర్షవర్ధన్ రామేశ్వర్
కాసర్ల శ్యామ్

ప్రతిష్ఠాత్మక జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో వైభవంగా జరిగింది. 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలను కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 1న ప్రకటించిన సంగతి తెలిసిందే. 2023 ఏడాదికిగాను ఎంపికైన ఉత్తమ చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ వేడుకలో ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్ ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్నారు. విజేతలకు పురస్కారాలు అందజేసిన అనంతరం ద్రౌపది ముర్ము మాట్లాడుతూ – ‘‘సినిమా కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదు... దేశాన్ని, సమాజాన్ని మేల్కొల్పే శక్తిమంతమైన మాధ్యమం. పౌరులను ప్రభావితం చేసే సాధనం. ఒక సినిమాకు ప్రజాదరణ లభించడం మంచి విషయమే కావొచ్చు. కానీ ప్రజా ప్రయోజనాలు, ముఖ్యంగా ఈ తరం యువతకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉండటం ఇంకా గొప్ప అంశం. ఈ రోజు అవార్డులు పొందిన చిత్రాల్లో తల్లులు తమ పిల్లలను తీర్చిదిద్దే కథలు, ధైర్యవంతమైన స్త్రీల కథలు, మంచి కుటుంబ కథలు, సామాజిక సంక్లిష్టతలను ఎదుర్కొంటూ పితృస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా తమ గొంతును లేవనెత్తేటువంటి చిత్రాలు ఉండటం మంచి విషయం. ‘గాంధీ తాత చెట్టు’ అనే తెలుగు సినిమాలో ఓ చిన్నారి ఒక చెట్టును సంరక్షించేందుకు సత్యాగ్రహ ఆందోళన చేస్తుంది. ఇలాంటి కథలు బాలల్లో చైతన్యాన్ని, పర్యావరణం పట్ల సామాజిక స్పృహను కలిగిస్తాయి’’ అని చెప్పారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుగ్రహీత మోహన్‌లాల్‌ను ‘‘పరిపూర్ణ నటుడు’’ అని కూడా ద్రౌపది ముర్ము ప్రశంసించారు.


● సుకృతి వేణి

ఈ వేడుకలో ఉత్తమ నటులుగా హీరో షారుక్ ఖాన్ (‘జవాన్’), విక్రాంత్ మస్సే (‘ట్వల్త్ ఫెయిల్’), నటిగా రాణీ ముఖర్జీ (‘మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే’), ఉత్తమ చిత్రదర్శకుడు విధు వినోద్ చోప్రా (‘ట్వల్త్ ఫెయిల్’) అవార్డులు అందుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి ఉత్తమ చిత్రం ‘భగవంత్ కేసరి’కిగానూ దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి అవార్డు స్వీకరించారు. ‘హనుమాన్’ మూవీకి బెస్ట్ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో దర్శకుడు ప్రశాంత్ వర్మ, నిర్మాత నిరంజన్ రెడ్డి, ఇదే విభాగంలో వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్ జెట్టీ వెంకట్‌కుమార్, ‘బేబీ’ సినిమాకిగాను స్క్రీన్‌ప్లే విభాగంలో సాయి రాజేశ్, ఇదే చిత్రానికి నేపథ్య గాయకుడుగా పీవీఎన్ఎస్ రోహిత్, ‘బలగం’కి పాట రచయితగా కాసర్ల శ్యామ్, ‘యానిమల్’ (హిందీ)కి నేపథ్య సంగీతానికి హర్షవర్ధన్ రామేశ్వర్, ‘గాంధీ తాత చెట్టు’ సినిమాకి ఉత్తమ బాల నటిగా సుకృతి వేణి బండ్రెడ్డి అవార్డులు అందుకున్నారు.

సినిమా నా ఆత్మ హృదయ స్పందన

– నటుడు మోహన్‌లాల్

"మలయాళ పరిశ్రమ నుంచి ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం పొందిన రెండో వ్యక్తిని నేను. అతి చిన్న వయసులో ఈ అవార్డు అందుకోవడం గౌరవంగా ఉంది. ఈ పురస్కారం మలయాళ పరిశ్రమ మొత్తానికి చెందుతుంది. మలయాళ సినీ పరిశ్రమ సృజనాత్మకత, స్థిరత్వం, సమష్టి కృషికి ప్రతీకగా నేను ఈ అవార్డును భావిస్తున్నాను. ఈ అవార్డుని కలలో కూడా ఊహించలేదు. అందుకే ఏదో మ్యాజిక్ జరిగినట్లుగా ఉంది. కేరళ ప్రేక్షకులకు ఈ అవార్డును అంకితం ఇస్తున్నాను. ఒక నటుడిగా ఈ అవార్డు నా అంకితభావాన్ని, నా నిబద్ధతను, సంకల్పాన్ని మరింత బలపరుస్తుంది. భారత ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. గౌరవనీయులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముగారికి, భారత ప్రధాని నరేంద్ర మోదీగారికి, కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌గార్లకు, జ్యూరీ సభ్యులకు ధన్యవాదాలు. సినిమా అనేది నా ఆత్మ హృదయ స్పందన... జై హింద్.

ప్రతి పాటనూ మరింత బాధ్యతగా రాస్తా

– రచయిత కాసర్ల శ్యామ్

"ఇకపై ఏ పాట రాసినా నన్ను జాతీయ అవార్డుగ్రహీత స్థాయిలో చూస్తారు కాబట్టి మరింత బాధ్యతగా పాటలు రాయాల్సి ఉంటుంది. అవార్డు తెచ్చిన గౌరవాన్ని నిలుపుకుంటూ ప్రతి పాటనూ మరింత బాధ్యతగా రాస్తాను" అని కాసర్ల శ్యామ్ అన్నారు. ‘బలగం’లోని ‘ఊరు పల్లెటూరు...’ పాటకు జాతీయ అవార్డు అందుకున్న అనంతరం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ– "రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ అవార్డు తీసుకోవడం ఓ మధురానుభూతి. ఇది నాకు, నా కుంటుంబానికే కాదు.. తెలుగు చిత్ర పరిశ్రమకు కూడా గర్వకారణం. ‘బలగం’ సినిమాలోని ప్రేక్షకుల హృదయాలను బాగా ప్రభావితం చేసిన ‘బలరామ నర్సయ్యో’ పాటకు అవార్డు వస్తుందని భావించాను. కానీ ‘ఊరు పల్లెటూరు..’కు రావడం కొంత ఆశ్చర్యానికి గురిచేసింది. మా నాన్న రంగస్థల, టీవీ నటుడు. సుమారు 25కు పైగా సినిమాల్లో పాత్రలు వేశారు. కానీ బలమైన పాత్రలు రాక నిరాశతో వెనక్కి వచ్చేశారు. ఆ ప్రభావం నాపైన పడింది. ‘లై’ సినిమాకు రాసిన ‘బొమ్మోలె ఉన్నదిరా పోరీ’ పాట నా జీవితాన్ని మార్చేసింది. ఇప్పుడు జాతీయ అవార్డు సాధించి మా నాన్న ఆశయాన్ని నెరవేర్చాననే సంతృప్తి కలిగింది" అని చెప్పారు.

– సాక్షి, న్యూఢిల్లీ

కొత్త అధ్యాయం ప్రారంభం


● కత్రినా, విక్కీ

బాలీవుడ్ స్టార్ కపుల్ కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ తల్లిదండ్రులు కాబోతున్నారు. ఈ విషయాన్ని వారు అధికారికంగా వెల్లడించడంతో పాటు కత్రినా బేబీ బంప్‌తో ఉన్న ఫొటోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ‘మా జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది’ అంటూ క్యాప్షన్‌ని జోడించారు. కొన్నాళ్ల పాటు డేటింగ్ చేసిన కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ 2021 డిసెంబర్ 9న వివాహం చేసుకున్నారు. పెళ్లయిన కొన్ని నెలల తర్వాతి నుంచి కత్రినా ప్రెగ్నెన్సీపై పలుమార్లు వార్తలు నెట్టింట హల్‌చల్ చేశాయి. అయితే ఆ వార్తలపై గతంలో కత్రినా, విక్కీ స్పందిస్తూ... ‘‘ఏ జంటకి అయినా తల్లిదండ్రులు కావడం అనేది అదృష్టం. అలాంటి శుభవార్తని ఎవరూ దాచాలనుకోరు. నిజంగా ఆ శుభవార్త ఉంటే మేమే స్వయంగా అందరితో పంచుకుంటాం’’ అని పేర్కొన్న సంగతి తెలిసిందే. అన్నట్లుగానే వారు తల్లిదండ్రులు కానున్న విషయాన్ని తాజాగా ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ట్రైలర్ చాలా బాగుంది

- ‘అల్లరి’ నరేశ్

‘‘విద్రోహి’ సినిమా ట్రైలర్ చాలా బాగుంది. ఈ చిత్రంలో పని చేసినవారు నాకు చాలా దగ్గరివారు. వారికి ఈ సినిమా మంచి సక్సెస్ ఇవ్వాలి. అలాగే చిత్ర దర్శక–నిర్మాతలు, నటీనటులు, సాంకేతిక నిపుణుల కెరీర్‌లో ఈ మూవీ ఓ మంచి హిట్‌గా నిలవాలని కోరుకుంటున్నాను’’ అని హీరో ‘అల్లరి’ నరేశ్ తెలిపారు. రవిప్రకాశ్, శివ కుమార్, చరిష్మా శ్రీఖర్, సాయికి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘విద్రోహి’. వీఎస్‌వీ దర్శకత్వంలో వెంకట సుబ్రహ్మణ్యం విజ్జన నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం ‘అల్లరి’ నరేశ్ విడుదల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వీఎస్‌వీ మాట్లాడుతూ– ‘‘ఇప్పటివరకు రాని సరికొత్త పాయింట్‌తో సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందించాం. రవిప్రకాశ్, శివ కుమార్ అద్భుతంగా నటించారు. ప్రతి పాత్ర ఆకట్టుకునేలా ఉంటుంది’’ అని చెప్పారు. ‘‘త్వరలోనే మా చిత్రం విడుదల తేదీని ప్రకటిస్తాం’’ అన్నారు వెంకట సుబ్రహ్మణ్యం.


● రవిప్రకాశ్, చరిష్మా, నరేశ్

సొగసు చూడతరమా...


● సిద్ధు, శ్రీనిధి

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన తాజా సినిమా ‘తెలుసు కదా’. రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో వైవా హర్ష కీలక పాత్ర పోషించారు. నీరజ కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 17న విడుదల కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ‘సొగసు చూడతరమా...’ అంటూ సాగే రెండో పాటని హీరోయిన్ నయనతార మంగళవారం లాంచ్ చేశారు. కృష్ణ కాంత్ సాహిత్యం అందించిన ఈ పాటని కార్తీక్ పాడారు. ‘‘సొగసు చూడతరమా...’ పాటలో సిద్ధు, శ్రీనిధి మధ్య కెమిస్ట్రీ అదిరిపోతుంది. సిద్ధు స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకుంటాయి. వైరల్ ట్యూన్, అద్భుతమైన విజువల్స్‌తో ఈ పాట మ్యూజిక్ చార్ట్‌లలో టాప్‌లోకి వెళ్లింది’’ అని చిత్రబృందం పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	58	82,102
నిఫ్టీ ▽	33	25,169

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,577	▽	213
డోజోన్స్	46,255	△	127
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,232	△	5
డాక్స్	23,632	△	105
షాంఘై	3,821	▽	7
నికాయ్ (సోమవారం ముగింపు)	45,494	△	448

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.80	88.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.23	121.22
€	యూరో	ఎస్‌బీఐ	102.23	105.02
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	60.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	58.29	59.57
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.27	69.97
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.60	24.10
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.09	24.35
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.50	13.32



- ఏడాదిగా పసిడి నాన్ స్టాప్ ర్యాలీ
- ఐదేళ్లలో రెట్టింపునకు పైగా పెరుగుదల
- రూ.2 లక్షలకు చేరుతుందని అంచనా

'కనక' వర్షం!

ఆభరణ ప్రియులకే కాదు, ఇన్వెస్టర్లు, చివరికి సెంట్రల్ బ్యాంకులకు సైతం పసిడిపై మక్కువ పెరిగింది. ఫలితంగా ఇటీవలి కాలంలో బంగారం ధరలు ఆకాశమే హద్దు అన్న రీతిలో ఎప్పటికప్పుడు కొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. ముఖ్యంగా 2025లోనే పసిడి ధర 50 శాతం, వెండి ధర 55 శాతం చొప్పున పెరిగాయి. బంగారం ధర గత డిసెంబర్ చివరికి ఉన్న రూ.78,950 నుంచి చూస్తే 10 గ్రాములపై నికరంగా రూ.39,950 ర్యాలీ చేసింది. వెండి సైతం కిలోకి నికరంగా రూ.49,900 మేర ఈ ఏడాది పెరిగింది. ఈక్విటీ, డెట్.. ఇలా ఏ ఇతర సాధనంతో పోల్చి చూసినా గడిచిన ఏడాది కాలంలో బంగారం, వెండి ముందు వెలవెలబోయాయి.

గత ఐదేళ్లలో ఎంసీఎక్స్ మార్కెట్లో 24క్యారట్ బంగారం 112 శాతం ర్యాలీ చేసింది. 2020 సెప్టెంబర్ 19న రూ.51,169 వద్ద ఉంటే, ఇప్పుడు రూ.1,09,388కి చేరుకుంది. ఈ ర్యాలీ చూసి మరింత మంది ఇన్వెస్టర్లు బంగారం, వెండిలో పెట్టుబడులకు ముందుకు వస్తుండడం, సెంట్రల్ బ్యాంకులు సైతం డాలర్ స్థానంలో బంగారానికి వెయిటేజీ పెంచడం ధరలకు మరింత ఆజ్యం పోస్తోంది. గత ఏడాది కాలంలో డాలర్‌తో రూపాయి విలువ 83.48 నుంచి 88.73కు (6 శాతానికి పైన) పడిపోయింది. బంగారం దిగుమతులపై ఆధారపడడంతో రూపాయి బలహీనత దేశీయంగా అధిక ధరలకు కారణమవుతోంది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

పసిడి @ రూ.1,18,900



ఢిల్లీ మార్కెట్లో పసిడి, వెండి సరికొత్త జీవిత కాల గరిష్టాలను నమోదు చేశాయి. సోమవారం 10 గ్రాములకు పసిడి (99.9 శాతం స్వచ్ఛత) రూ.2,200 లాభపడగా, మంగళవారం మరో రూ.2,700 పెరిగి రూ.1,18,900 స్థాయికి చేరింది. డాలర్‌తో రూపాయి బలహీనత నేపథ్యంలో బంగారంలో పెట్టుబడుల డిమాండ్ పెరిగినట్టు ట్రేడర్లు చెబుతున్నారు. ఢిల్లీ మార్కెట్లో వెండి కిలోకి రూ.3,220 పెరిగి రూ.1,39,600 స్థాయిని తాకింది. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్ ఫ్యూచర్స్‌లో పసిడి ఔన్స్‌కు 36 డాలర్ల వరకు పెరిగి 3,811 డాలర్లకు చేరుకుంది.

టార్గెట్ 2 లక్షలు!



వచ్చే ఏడాది కాలంలో బంగారం ధరలు 15–20 శాతం మేర పెరగొచ్చని త్రివేష్ అంచనా వేశారు. ''ఫెడ్ వడ్డీ రేట్ల కోతను కొనసాగిస్తే, డాలర్ బలహీన పడుతుంది. ఇది బంగారం ధరలు పెరిగేందుకు మద్దతునిస్తుంది''అని పేర్కొన్నారు. తక్కువ వడ్డీ రేట్లు ఎక్కువ కాలం కొనసాగితే, ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులకు డిమాండ్ సంస్థాగతంగా కొనసాగుతుందని, అటువంటి పరిస్థితుల్లో వచ్చే ఐదేళ్లలో 10 గ్రాముల పసిడి ధర రూ.1.7 లక్షలకు చేరుకోవచ్చని మనీష్ శర్మ అంచనా వేశారు. 2026 మధ్య నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 4,000 డాలర్లను అధిగమించొచ్చన్నారు. 2–5 ఏళ్లలో 5,000 డాలర్లకు వెళ్లొచ్చని (రూ.1,50,000–1,70,000) చెప్పారు. జెఫరీస్ ఈక్విటీ స్ట్రాటజీ గ్లోబల్ హెడ్ క్రిస్టోఫర్ ఉడ్ సైతం బంగారం ధరలు ఇక్కడి నుంచి మరింత పెరగొచ్చని అభిప్రాయపడ్డారు. రానున్న కాలంలో ఔన్స్‌కు 6,600 డాలర్లకు చేరుకోవచ్చని (ఇక్కడి నుంచి 70 %కి పైన, అంటే మన దగ్గర రూ. 2 లక్షలు) అంచనా వేశారు.

అంతర్జాతీయ అనిశ్చితుల ఆజ్యం..

కరోనా విపత్తు నుంచి పుత్తడి ధరల పెరుగుదల మొదలైంది. ఆ తర్వాత ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలు పెట్టడం, మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్–పాలస్తీనా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇవన్నీ భౌగోళికంగా అనిశ్చితులను రాజేశాయి. గతేడాది రెండో పర్యాయం అమెరికా అధ్యక్ష పీఠమెక్కిన డోనాల్డ్ ట్రంప్ సుంకాల పోరుకు తెరతీయడం విలువైన లోహాలకు డిమాండ్‌ను మరింత పెంచింది. సంప్రదాయ డెట్, ఈక్విటీల స్థానంలో ఇన్వెస్టర్లు సురక్షిత సాధనమైన బంగారంలోకి పెట్టుబడులను పెంచుతూ రావడం ధరలకు మద్దతుగా నిలుస్తోంది. అమెరికా రుణ భారం భారీగా పెరిగిపోయిన తరుణంలో డాలర్‌కు బదులు సెంట్రల్ బ్యాంకుల బంగారం కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇస్తుండడంతో పసిడి ధరలు దిగొస్తాయన్న అంచనాలు తలకిందులవుతున్నాయి. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు ధరలకు ప్రేరణనిస్తున్నట్టు ఆనంద్‌రాఠి షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ కమోడిటీ విభాగం ఏవీపీ మనీష్ శర్మ చెప్పారు. '2005లో 24క్యారట్ బంగారం ధర (10 గ్రాములు) రూ.7,000 వద్ద ఉంది. 2010 నాటికి రూ.18,500కు పెరిగింది. 2015లో రూ.26,300 వద్ద ఉంది. 2025 సెప్టెంబర్‌లో రూ.1,18,000కు చేరుకుంది. ఈ ఏడాది ఆగస్ట్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు 36 శాతం పెరిగాయి. ఈ ట్రాక్ రికార్డును పరిశీలిస్తే దీర్ఘకాలంలో బంగారం బలంగా నిలబడుతుంది' అని చెప్పారు. యూఎస్‌లో లిస్టెడ్ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు 215 బిలియన్ డాలర్లకు చేరినట్టు శర్మ తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

రూపాయి క్షీణతతో ఎగుమతులు ఖుషీ	ర్యాపిడోలో స్విగ్గీ వాటా విక్రయం

మూడో రోజూ మార్కెట్ డీలా

- హెచ్1–బీ వీసా రుసుము పెంపు
- విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాల ప్రభావం



ముంబై: అమెరికా హెచ్–1బీ వీసా ఫీజు పెంపు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మూడోరోజూ నష్టపోయాయి. ఐటీతో పాటు అధిక వెయిటేజీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 58 పాయింట్లు నష్టపోయి 82,102 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 33 పాయింట్లు కోల్పోయి 25,169 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే బలహీనంగా మొదలయ్యాయి. రోజంతా లాభ, నష్టాల మధ్య ట్రేడయ్యాయి. సెన్సెక్స్ 81,777 – 82,370 శ్రేణిలో ట్రేడవ్వగా, నిఫ్టీ 25,085 వద్ద కనిష్టాన్ని, 25,262 వద్ద గరిష్టాన్ని తాకింది. ఆటో షేర్లు, కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు రాణించి భారీ నష్టాలకు అడ్డుకట్ట వేశాయి. ఆసియాలో హాంగ్‌కాంగ్, చైనా సూచీలు నష్టపోగా, కొరియా ఇండెక్స్ అరశాతం లాభపడింది. సెలవు కారణంగా జపాన్ మార్కెట్ పనిచేయలేదు. యూరప్ మార్కెట్లు 0.50% లాభపడ్డాయి.

■ కొత్త హెచ్–1బీ వీసాలపై అమెరికా ప్రభుత్వం లక్ష డాలర్ల పెంపు నిర్ణయంతో ఐటీ కంపెనీల షేర్లు రెండో రోజూ డీలా పడ్డాయి. హెక్సావేర్ 5%, ఎంఫసిస్ 3%, మాస్టెక్ 2.50 నష్టపోయాయి.

■ లిస్టింగ్ లాభాలు కోల్పోయిన యూరో ప్రతీక్ సేల్స్ షేరు చివరికి స్వల్ప లాభంతో రూ.248 వద్ద స్థిరపడింది. ఇష్యూ ధర రూ.247తో పోలిస్తే బీఎస్‌ఈలో 11% ప్రీమియంతో రూ.273 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 13% ర్యాలీ చేసి రూ.280 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది.



సరికొత్త కనిష్టానికి రూపాయి

డాలర్ మారకంలో రూపాయి విలువ 45 పైసలు క్షీణించి సరికొత్త జీవితకాల కనిష్టం 88.73 వద్ద స్థిరపడింది. అమెరికా హెచ్–1బీ ఫీజు పెంపుతో విదేశాల నుంచి వచ్చే రెమిటెన్స్‌లు సైతం భారీగా క్షీణించవచ్చనే ఆందోళనలు రూపాయి కోతకు కారణమయ్యాయి. ఒక దశలో 54 పైసలు క్షీణించి 88.82 వద్ద రికార్డు కనిష్టాన్ని తాకింది.

పండగ బ్లాక్‌బస్టర్!

- ఉత్పత్తుల అమ్మకాలకు జీఎస్‌టీ తగ్గింపు జోష్
- రికార్డు స్థాయిలో విక్రయాలు
- ఆశావహంగా వాహన, ఎలక్ట్రానిక్స్ సంస్థలు



న్యూఢిల్లీ: పండగ సీజన్‌లో జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అమల్లోకి రావడంతో పలు ఉత్పత్తుల అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఈ పండగ సీజన్‌లో అమ్మకాలు భారీగా ఉంటాయని వాహనాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, కన్జూమర్ డ్యూరబుల్స్ తయారీ సంస్థలు, రిటైలర్లు ఆశిస్తున్నారు. ఇదే తీరు పండుగ సీజన్ మొత్తం కొనసాగుతుందని భావిస్తున్నాయి. ఇప్పటికే దసరా నవరాత్రుల సందర్భంగా తొలిరోజే కొన్ని వాహనాలు, ఏసీల తయారీ సంస్థలు రికార్డు స్థాయి విక్రయాలు నమోదు చేశాయి. మొదటి రోజున 10,000 ప్యాసింజర్ వాహనాలను విక్రయించినట్లు టాటా మోటార్స్ వెల్లడించింది. దీనితో పాటు దేశవ్యాప్తంగా 25,000 పైచిలుకు కస్టమర్ల ఎంక్వైరీలు వచ్చినట్లు తెలిపింది. గత అయిదేళ్లలో తొలిసారిగా ఒకే రోజున అత్యధికంగా మారుతీ సుజుకీ 30,000 యూనిట్లు, హ్యుందాయ్ 11,000 వాహనాలను విక్రయించినట్లు వెల్లడించాయి. కన్జూమర్ సెంటిమెంటు, సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ తగ్గింపుతో పండగ సీజన్ అమ్మకాల ధోరణిపై స్పందిస్తూ 'వాహనాల కొనుగోలు కోసం కస్టమర్లు పెద్ద ఎత్తున షోరూంలకు వస్తున్నారు' అని ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ల సమాఖ్య ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు.

'ఈ పండగ సీజన్ చాలా సానుకూలంగా ప్రారంభమైంది. జీఎస్‌టీ తగ్గింపు, ఆకర్షణీయమైన ప్రత్యేక ఆఫర్లతో కొనుగోళ్లపై కస్టమర్లలో అసాధారణంగా ఆసక్తి పెరిగింది' అని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఎండీ, సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర చెప్పారు. నవరాత్రుల తొలి రెండు రోజుల్లో దేశవ్యాప్తంగా డీలర్‌షిప్‌లను సందర్శించే కస్టమర్ల సంఖ్య, ఎంక్వయిరీలు, వాహనాల డెలివరీలు రికార్డు స్థాయిలో పెరిగాయని ఆయన పేర్కొన్నారు.

ఇతర కంపెనీలు ఏమన్నాయంటే..

- 'సాధారణంగా సోమవారం నాడు కస్టమర్ల సంఖ్య తక్కువగా ఉంటుంది. కానీ ఈసారి మాత్రం భారీగా పెరిగింది. రోజువారీగా కన్నా డెలివరీల పరిమాణం రెట్టింపు పెరిగింది' అని విజయ్ సేల్స్ డైరెక్టర్ నీలేష్ గుప్తా చెప్పారు.
- ఏసీలపై జీఎస్‌టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గడం, ఆకర్షణీయమైన ఆఫర్ల దన్నుతో పండగ సీజన్ ప్రారంభంలోనే తమ ఏసీల విక్రయాలు రికార్డు స్థాయిలో నమోదైనట్లు పానసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా బిజినెస్ హెడ్ (ఏసీ గ్రూప్) అభిషేక్ వర్మ తెలిపారు.
- అమ్మకాలపై జీఎస్‌టీ తగ్గింపు ప్రభావం ఎంత ఉందనేది ఇప్పుడే అంచనా వేయలేకపోయినా, మొత్తం మీద విక్రయాలు మాత్రం చాలా సానుకూలంగా ఉన్నాయని గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ బిజినెస్ హెడ్ (అప్లయెన్సెస్ బిజినెస్) కమల్ నంది తెలిపారు. కొన్ని స్టోర్స్ సుదీర్ఘ సమయం పాటు తెరిచి ఉంటున్నాయని చెప్పారు.
- కొనుగోలుదారుల సెంటిమెంటు సానుకూలంగా, అమ్మకాల ధోరణులు ప్రోత్సాహకరంగా కనిపిస్తున్నాయని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రతినిధి తెలిపారు. ఇక ముందు కూడా ఇదే తీరు కొనసాగవచ్చని వివరించారు.
- జీఎస్‌టీ రేట్ల సవరణతో అమ్మకాలకు ఊతం లభిస్తుందని క్రోమా రిటైల్ చెయిన్ నిర్వహించే టాటా గ్రూప్ సంస్థ ఇన్ఫినిటీ రిటైల్ సీఈవో శిబాశీష్ రాయ్ తెలిపారు.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–కెమిస్ట్రీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– జనరల్ ఇంగ్లిష్



జామ్ 2026

జామ్‌లో జయం సాధించేలా!

ఐఐటీల్లో చదవాలనే కలను నిజం చేసుకునేందుకు మరో మార్గం ఉంది.. అదే ద జాయింట్ అడ్మిషన్ టెస్ట్(జామ్) ఫర్ మాస్టర్స్! ఈ పరీక్షలో ప్రతిభ ద్వారా దేశంలోని టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో సైన్స్ కోర్సుల్లో ప్రవేశం పొందొవచ్చు. తద్వారా సైన్స్ రంగంలో ఉజ్వల కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు. వచ్చే విద్యా సంవత్సరానికి (2026-27) సంబంధించి ఇటీవల జామ్ 2026 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఈ పరీక్షతో ప్రయోజనాలు, ప్రవేశం కల్పించే కోర్సులు-ఇన్‌స్టిట్యూట్‌లు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» జామ్ 2026 నోటిఫికేషన్ విడుదల
» ఐఐటీల్లో పీజీ, పీహెచ్‌డీలో ప్రవేశాలు
» సైన్స్ గ్రాడ్యుయేట్లకు చక్కటి అవకాశం

జామ్‌తో దేశంలోని 22 ఐఐటీల్లో మూడు వేలకు పైగా పీజీ సీట్లను భర్తీ చేస్తారు. ఐఐటీలతో పాటు ఐఐఎస్సీ, నిట్‌లు, ఐఐఎస్‌టీ, ఐఐఎస్ఈఆర్ పుణె, భోపాల్ క్యాంపస్‌లు, డీఐఏటీ, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్ఆర్, ఎస్ఎల్ఐఈటీ తదితర టాప్ ఇన్‌స్టిట్యూట్‌లోనూ ప్రవేశం పొందొచ్చు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మంచి పేరున్న విద్యాసంస్థలు. వీటిలో పలు ఇన్‌స్టిట్యూట్‌లు ప్రవేశం పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు సైతం అందిస్తున్నాయి. ఈ ఏడాది జామ్ పరీక్షను ఐఐటీ బాంబే నిర్వహించనుంది.

కోర్సులు ఇవే

జామ్‌లో ప్రతిభ ఆధారంగా బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్‌లో పీజీ, పీహెచ్‌డీ స్థాయి కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. ముఖ్యంగా ఐఐటీల్లో ఎమ్మెస్సీ, ఎంఎస్ రీసెర్చ్, ఎమ్మెస్సీ–ఎంటెక్ డ్యుయెల్ డిగ్రీ, జాయింట్ ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ డ్యుయల్ డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ(ఐ–పీహెచ్‌డీ) కోర్సుల్లో అడ్మిషన్‌లు పొందవచ్చు.

అర్హతలు

సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో కొన్ని కోర్సులకు సైన్స్ గ్రాడ్యుయేట్లు అందరూ పోటీ పడే అవకాశముంది. మరికొన్ని ఎమ్మెస్సీ కోర్సులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధనలేదు.

పరీక్ష విధానం

- జామ్ 2026 పరీక్షను మొత్తం ఏడు టెస్టు పేపర్‌లలో నిర్వహిస్తారు. అవి.. బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్.
- మొత్తం ఏడు పేపర్లకు కూడా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రశ్నలు ర్యాండమ్‌గా కనిపిస్తాయి. పరీక్ష సమయం మూడు గంటలు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్‌లో మాత్రమే ఉంటుంది.
- ప్రతి పేపర్ నుంచి 60 ప్రశ్నలు వంద మార్కులకు ఉంటాయి. ప్రశ్న పత్రాన్ని ఏ, బీ, సీ మూడు సెక్షన్‌లుగా విభజిస్తారు.
- సెక్షన్ ఏలో మొత్తం 30 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు (ఎంసీక్యూస్) ఉంటాయి. వీటిల్లో ఒక మార్కు ప్రశ్నలు 10, రెండు మార్కుల ప్రశ్నలు 20 అడుగుతారు. ప్రతి ఎంసీక్యూ కింద నాలుగు ఆప్షన్లు ఇస్తారు. అభ్యర్థులు సరైన సమాధానాన్ని గుర్తించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ఒక మార్కు ప్రశ్నల్లో ప్రతి తప్పు సమాధానానికి 1/3 మార్కును తగ్గిస్తారు. రెండు మార్కుల ప్రశ్నల్లో ప్రతి తప్పు సమాధానానికి 2/3 మార్కును తగ్గిస్తారు.
- సెక్షన్ బీలో మొత్తం 10 మల్టిపుల్ సెలక్ట్ ప్రశ్నలు (ఎంఎస్‌క్యూస్) ఉంటాయి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. ఈ ప్రశ్నలకు కూడా నాలుగు ఆప్షన్లు ఇస్తారు. అయితే వీటిల్లో ఒకటి కంటే ఎక్కువ ఆప్షన్లు సరైన సమాధానాలు గా ఉంటాయి. అన్ని సరైన ఆప్షన్/ఆప్షన్లు గుర్తిస్తేనే సరైన సమాధానంగా భావించి మార్కులు ఇస్తారు. పాక్షిక సమాధానానికి మార్కులు ఉండవు.
- సెక్షన్ సీలో మొత్తం 20 న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు (ఎన్ఏటీ) ఉంటాయి. వీటిల్లో ఒక మార్కు ప్రశ్నలు 10, రెండు మార్కుల ప్రశ్నలు 10 అడుగుతారు. వీటికి ఆప్షన్లు ఉండవు. వీటికి సమాధానం రియల్ నంబర్‌గా(వాస్తవసంఖ్యల) ఉంటుంది. దీన్ని కంప్యూటర్ కీబోర్డు ద్వారా ఎంటర్ చేయాల్సి ఉంటుంది. వీటికి నెగిటివ్ మార్కులు ఉండవు.

ప్రిపరేషన్ ఇలా

- సాధారణ గ్రాడ్యుయేట్లు సైతం కొద్దిగా కష్టపడితే జామ్‌లో మంచి స్కోర్ సాధించేందుకు అవకాశం ఉంటుంది. ఐఐటీ జేఈఈతో పోల్చినప్పుడు దీనికి పోటీ కూడా తక్కువే. అంతేకాకుండా జామ్ పరీక్షను సబ్జెక్టుల వారీగా నిర్వహిస్తారు. కాబట్టి ఆయా సబ్జెక్టులో పట్టు సాధిస్తే ఐఐటీ కలను నిజం చేసుకోవచ్చు.
- రెండు సెషన్‌లుగా పరీక్ష నిర్వహిస్తారు. సెషన్1లో కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్.. సెషన్ 2లో బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ ఉంటాయి. అభ్యర్థులు తమ ఆసక్తి, అర్హతలకు అనుగుణంగా ఒకటి లేదా గరిష్టంగా రెండు పేపర్లకు హాజరయ్యే అవకాశం ఉంది. రెండు పేపర్లకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు సెషన్1లోని ఒక సబ్జెక్టు, సెషన్2లోని ఒక సబ్జెక్టును ఎంచుకోవాలి.

వెబ్‌సైట్‌లో సిలబస్, ప్రీవియస్ పేపర్స్

- జామ్ వెబ్‌సైట్‌లో టెస్ట్ పేపర్లవారీ సిలబస్, మాక్ టెస్టులు, టెస్ట్ ప్యాట్రన్, ప్రీవియస్ పేపర్లను పొందుపరచారు.
- అభ్యర్థులు తొలుత సిలబస్‌ను అధ్యయనం చేయాలి. ఆ తర్వాత ప్రీవియస్ పేపర్లను పరిశీలించి.. ప్రశ్నలు అడుగుతున్న తీరు, ప్రశ్నల స్థాయి, పరీక్షలో ఆయా అంశాలకు లభిస్తున్న వెయిటేజీ పై ఒక అంచనాకు రావచ్చు. దీనికి అనుగుణంగా ప్రిపరేషన్‌ను ప్రారంభించాలి.
- జామ్‌లో ప్రశ్నలు అప్లికేషన్ ఓరియెంటేషన్‌లో ఉంటాయి. అభ్యర్థికి సబ్జెక్టుపై ఉన్న పట్టుతోపాటు అనువర్తన సామర్థ్యం, విశ్లేషణాత్మక ప్రతిభను పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి సబ్జెక్టుపై పట్టు సాధించేలా కృషి చేయాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ : 12.10.2025
- జామ్ అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్: 05.01.2026
- పరీక్ష తేదీ: 15.02.2026
- ఫలితాల వెల్లడి: 20.03.2026
- వెబ్‌సైట్ : https://jam2026.iitb.ac.in

జాబ్ పాయింట్

ఎయిమ్స్ బీబీనగర్‌లో 77 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్), బీబీనగర్ ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 77.
» **విభాగాలు:** అనెస్తీషియా, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, మెడికల్ ఆంకాలజీ, న్యూరో సర్జరీ అండ్ పీడియాట్రిక్, ఆర్థోపెడిక్స్, రేడియోథెరపి, యూరాలజీ, ఈఎన్‌టీ, డెంటిస్ట్రీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్/డీఎన్‌బీ/ఎండీ/ఎంసీహెచ్, ఎంఎస్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు మెడికల్ అభ్యర్థులకు రూ.67,700, నాన్ మెడికల్ అభ్యర్థులకు రూ.56,100.
» **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి స్క్రీనింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 03.10.2025
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://aiimsbibinagar.edu.in/

ఎస్‌వీఎన్ఐటీ, సూరత్‌లో వివిధ ఉద్యోగాలు

సూరత్‌లోని సర్దార్ వల్లభాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్‌వీఎన్ఐటీ).. తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **పోస్టుల వివరాలు:** ఫైర్ సేఫ్టీ ఆఫీసర్–01, సీనియర్ స్టేషన్ ఆఫీసర్–01, జూనియర్ స్టేషన్ ఆఫీసర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు సేఫ్టీ ఫైర్ ఆఫీసర్‌కు రూ.60,000, సీనియర్ స్టేషన్ ఆఫీసర్‌కు రూ.30,000, జూనియర్ స్టేషన్ ఆఫీసర్‌కు రూ.25,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సర్దార్ వల్లభాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సూరత్, గుజరాత్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 01.10.2025.
» **వెబ్‌సైట్:** https://www.svnit.ac.in/

హాల్ బెంగళూరులో టెక్నీషియన్ పోస్టులు

బెంగళూరులోని హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్).. ఒప్పంద ప్రాతిపదికన టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** డిప్లొమా టెక్నీషియన్(మెకానికల్)–01, టెక్నీషియన్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా(మెకానికల్ ఇంజనీరింగ్), ఐటీఐతోపాటు నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
» **వేతనం:** నెలకు డిప్లొమా టెక్నీషియన్‌కు రూ.23,000, టెక్నీషియన్‌కు రూ.22,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది చీఫ్ మేనేజర్, రిక్రూట్‌మెంట్ సెల్, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఎల్‌సీఏ తేజాస్ డివిజన్, బెంగళూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.10.2025.
» **వెబ్‌సైట్:** http://www.hal-india.co.in/

హెచ్‌వోసీఎల్, ఎర్నాకులంలో 11 పోస్టులు

ఎర్నాకులం(కేరళ)లోని హిందూస్తాన్ ఆర్గానిక్ కెమికల్స్ లిమిటెడ్ (హెచ్‌వోసీఎల్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
» **పోస్టులు:** మెడికల్ ఆఫీసర్, ప్లాంట్ ఇంజనీర్, సైంటిఫిక్ ఆఫీసర్, ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్, ఎలక్ట్రికల్ ఇంజనీర్, ఇన్‌స్ట్రుమెంట్ ఇంజనీర్, మెకానికల్ ఇంజనీర్, సివిల్ ఇంజనీర్, జూనియర్ టెక్నీషియన్(ఎలక్ట్రికల్), జూనియర్ టెక్నీషియన్(మెకానికల్), జూనియర్ టెక్నీషియన్(ఇన్‌స్ట్రుమెంటేషన్), జూనియర్ టెక్నీషియన్(యుటిలిటీస్), జూనియర్ అసిస్టెంట్ టెక్నీషియన్(యుటిలిటీస్), జూనియర్ రిగ్గర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఎంఎస్సీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు మెడికల్ ఆఫీసర్‌కు రూ.65,000, జూనియర్ టెక్నీషియన్‌కు రూ.25,000, జూనియర్ అసిస్టెంట్ టెక్నీషియన్‌కు రూ.23,000, జూనియర్ రిగ్గర్‌కు రూ.22,000, ఇతర పోస్టులకు రూ.35,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.10.2025.
» **వెబ్‌సైట్:** https://www.hoclindia.com/

ఆర్‌జీఐపీటీలో 25 నాన్ టీచింగ్ పోస్టులు

అమేథి(ఉత్తరప్రదేశ్)లోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ.. రెగ్యులర్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 25.
» **పోస్టుల వివరాలు:** రిజిస్ట్రార్–01, ఫైనాన్స్ ఆఫీసర్–01, డిప్యూటీ రిజిస్ట్రార్–02, మెడికల్ ఆఫీసర్–01, అసిస్టెంట్ రిజిస్ట్రార్–04, సూపరింటెండెంట్(గ్రేడ్–1)–04, టెక్నికల్ సూపరింటెండెంట్(గ్రేడ్–1)–05, అసిస్టెంట్(గ్రేడ్–1)–04, టెక్నీషియన్(గ్రేడ్–1)–02, సిస్టమ్ సూపరింటెండెంట్(గ్రేడ్–1)–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, బీకాం, బీఎస్సీ, బీటెక్/బీఈ, ఎంబీబీఎస్, పీజీ, ఐసీడబ్ల్యూఏ, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ, పీజీడీఎం, ఎంసీఏ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** రిజిస్ట్రార్, ఫైనాన్స్ ఆఫీసర్‌లకు 57 ఏళ్లు, డిప్యూటీ రిజిస్ట్రార్, మెడికల్ ఆఫీసర్‌కు 50 ఏళ్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు 45 ఏళ్లు, టెక్నీషియన్, అసిస్టెంట్‌లకు 30 ఏళ్లు, ఇతర పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి రాతపరీక్ష/ఇంటర్వ్యూ/ప్రజంటేషన్/కంప్యూటర్/ట్రేడ్/స్కిల్ టెస్ట్ తదితరాల ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2025,
» **వెబ్‌సైట్:** https://rgipt.ac.in/



అమ్మాయిల ఆశలపై నీళ్లు





హెచ్‌-1బి లబ్ధిదారుల్లో పురుషుల కంటే స్త్రీలు తక్కువే

కొత్త దరఖాస్తులకు కంపెనీలు విముఖత చూపొచ్చు

దీంతో యువతులపైనే ప్రభావం ఉండొచ్చంటున్న నిపుణులు

కొత్త హెచ్‌-1బీ వీసా దరఖాస్తులపై ఒకేసారి లక్ష డాలర్ల రుసుము విధిస్తున్న అమెరికా ప్రభుత్వ తాజా నిర్ణయం భారతీయ యువ మహిళా ఔత్సాహికులను దెబ్బతీసే అవకాశం ఉంది. నిజానికి హెచ్‌-1బీ వీసా అందుకుంటున్న భారతీయుల్లో అత్యధికులు పురుషులే. 2023-24లో తమ ఉద్యోగాలను కొనసాగించడానికి (రెన్యువల్‌) ఆమోదం పొందిన నిపుణుల్లో 74% మంది పురుషులు, 26% మంది మహిళలు ఉన్నారు. హెచ్‌-1బీ కొత్త దరఖాస్తులకు (ప్రారంభ ఉపాధికి) ఆమోదం లభించిన నిపుణుల్లో మహిళల వాటా 37%.

కొత్త 'వన్‌టైమ్‌ రుసుము' ప్రభావంతో నూతన దరఖాస్తుదారులు.. ముఖ్యంగా, పురుషులతో పోలిస్తే తక్కువ వేతనాలు ఉండే మహిళల అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ఉద్యోగుల లేదా కార్మికుల వార్షిక జీతంలో అధిక భాగం లేదా అంతకు మించి కొత్త హెచ్‌-1 బీ వీసా ఫీజు ఉంది. అందువల్ల, ప్రారంభ ఉపాధి లబ్ధిదారులను స్పాన్సర్‌ చేయడం కంపెనీలకు ఆర్థికంగా లాభదాయకం కాకపోవచ్చు. ఈ అంశం హెచ్‌-1బీ వీసాలు ఆశిస్తున్న ఔత్సాహికుల భవిష్యత్తు గురించి ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఉదాహరణకు ఒక కంపెనీ కొత్త లబ్ధిదారునికి నూతన వీసా ఫీజు ప్రకారం స్పాన్సర్‌ చేస్తే.. మొదటి సంవత్సరంలో మొత్తం ఖర్చు.. రెన్యువల్‌ కోరుకునే అనుభవజ్ఞుడైన ఉద్యోగికి అయ్యే వ్యయం కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రభావం ముఖ్యంగా మహిళా లబ్ధిదారులపై ఉంటుందన్నది నిపుణుల మాట. ఎందుకంటే వారు సాధారణంగా హెచ్‌-1బీ హోల్డర్లలో పురుషుల కంటే తక్కువ సంపాదిస్తున్నారు.

– సాక్షి, స్పెషల్‌ డెస్క్‌

విద్యార్హతలు ఉన్నప్పటికీ..


అమెరికా పౌరసత్వ, ఇమ్మిగ్రేషన్‌ సేవల విభాగం గణాంకాల ప్రకారం.. 2023–24లో హెచ్‌–1బీ ద్వారా కొత్త ఉద్యోగాలకు ఆమోదం పొందిన మహిళల్లో 35 సంవత్సరాల కంటే తక్కువ వయసు గలవారు 75% మంది ఉన్నారు. పురుషుల విషయంలో ఇది 65%గా ఉంది. దీని అర్థం.. కెరీర్‌ను ప్రారంభించే వయసులో ఉన్న మహిళల్లో ఎక్కువ మందిని హెచ్‌–1బీ వీసా కొత్త ఫీజు ప్రభావితం చేయనుందని పరిశీలకులు అంటున్నారు. 2023–24లో కొత్త ఉద్యోగాలకు ఆమోదం పొందిన మహిళల్లో 44% మంది మాస్టర్స్‌ డిగ్రీ పూర్తి చేశారు. పురుషుల విషయంలో ఇది కేవలం 39% మాత్రమే. డాక్టరేట్, ప్రొఫెషనల్‌ డిగ్రీ స్థాయిల్లో సైతం మహిళలదే ఆధిపత్యం. కొత్త రుసుము నూతన దరఖాస్తుదారులకు మాత్రమే వర్తిస్తుంది కాబట్టి పురుషులతో పోలిస్తే ఉన్నత విద్యార్హతలు ఉన్నప్పటికీ ఇది మహిళలపై ప్రభావం చూపనుందని నిపుణులు చెబుతున్నారు.

2023–24లో హెచ్‌–1బీ దరఖాస్తుల ఆమోదం

	ప్రారంభ ఉపాధి దరఖాస్తు	రెన్యువల్‌ దరఖాస్తు
పురుషులు	63%	74%
మహిళలు	37%	26%

అట్టడుగు 25% మందికి తక్కువే

2023-24లో హెచ్‌-1బీ హోల్డర్ల వేతనాలు పరిశీలిస్తే.. సగటున 100 మందిలో అట్టడుగు 25 మంది వేతనాలతో పోలిస్తే, టాప్‌ 25 మందికీ వేతనాలు సుమారు రెట్టింపు ఉన్నాయి.



టాప్‌ 25% మందికే ఎక్కువ జీతం

హెచ్‌-1బీ పొందిన తొలి మూడేళ్లలో (ప్రారంభ ఉపాధి) వేతనం (డాలర్లలో)

	స్త్రీలు	పురుషులు
అట్టడుగు 25% మంది	71,000	80,000
మధ్యలో 50% మంది	91,000	99,000
టాప్‌ 25% మంది	1,25,000	1,31,000

యువతే కీలకం

2023-24లో హెచ్‌-1బి ఆమోదం పొందిన లబ్ధిదారుల వయసు

వయసు	స్త్రీలు	పురుషులు
45+	3.8	6.1
40-44	6.2	10.5
35-39	14.4	19.1
30-34	29.3	27.8
25-29	38.7	31.2
20-24	7.3	5.1

'మాస్టర్స్‌' హవా

హెచ్‌-1బి వీసా ఆమోదం పొందిన దరఖాస్తుదారుల విద్యార్హతలు

విద్యార్హతలు	స్త్రీలు	పురుషులు
ప్రొఫెషనల్‌ డిగ్రీ	5.8	3.9
డాక్టరేట్‌	12.4	12.3
మాస్టర్స్‌ డిగ్రీ	43.8	38.9
బ్యాచిలర్స్‌ డిగ్రీ	30	36.5

స్పీకర్‌ రూలింగ్‌ను చట్ట విరుద్ధంగా ప్రకటించండి

నాకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేలా ఆదేశాలివ్వండి

హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ పక్ష నేత వైఎస్‌ జగన్‌

సాక్షి, అమరావతి : శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు తిరస్కరిస్తూ స్పీకర్‌ అయ్యన్న పాత్రుడు ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఇచ్చిన రూలింగ్‌ను సవాలు చేస్తూ వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ రూలింగ్‌ను రద్దు చేయాలని కోరుతూ పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ రూలింగ్‌ను ఆంధ్రప్రదేశ్‌ జీత భత్యాలు, పెన్షన్లు మరియు అనర్హతల తొలగింపు చట్టానికి విరుద్ధంగా ప్రకటించాలని కోరారు. తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టును కోరారు. ఈ వ్యాజ్యంలో శాసనసభ కార్యదర్శి, స్పీకర్‌ కార్యదర్శి, న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శితో పాటు స్పీకర్‌ అయ్యన్న పాత్రుడు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌లను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై బుధవారం హైకోర్టు విచారణ జరపనుంది. వైఎస్‌ జగన్‌ పిటిషన్‌లో ఏం చెప్పారంటే..

ముందే నిర్ణయించుకున్నారు..

గత ఏడాది మే 21న కొత్తగా ఎన్నికైన శాసనసభ సభ్యులకు ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టారు. శాసనసభలో అనుసరిస్తున్న ఆనవాయితీ ప్రకారం మొదటగా శాసనసభ పక్ష నేత లేదా అధికార కూటమి పార్టీ నాయకుడు ప్రమాణం చేస్తారు. ఆ తర్వాత ప్రతిపక్షాల నుంచి ప్రతిపక్ష నేతగా పరిగణించే సభ్యుడి ప్రమాణ స్వీకారం జరగాలి. కానీ ఆ రోజు అనుసరించిన విధానం ఈ ఆనవాయితీకి విరుద్ధంగా ఉంది. మొదట శాసనసభ పక్ష నేత అయిన సీఎం ప్రమాణం చేశారు. ఆ తర్వాత మంత్రివర్గ సభ్యులు చేశారు. ఆ తర్వాతే నా వంతు వచ్చింది. తద్వారా ప్రతిపక్ష నేత పదవిని వైఎస్సార్సీపీ శాసనసభ పక్షానికి ఇవ్వకూడదన్న నిర్ణయానికి ముందుగానే వచ్చేశారు. రాష్ట్ర ప్రజల తరఫున ప్రశ్నలు లేవనెత్తే ప్రతిపక్ష స్వరాన్ని అణచివేయాలనే ఉద్దేశంతోనే ఇలా చేశారన్నది నాకు స్పష్టంగా అర్థమైంది. తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమికి వ్యతిరేకంగా ఉన్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమే. ఎన్నికల అనంతరం కూడా వైఎస్సార్‌సీపీ ఒక్కటే ప్రతిపక్ష పార్టీగా శాసనసభలో ఉంది. కాబట్టి, వైఎస్సార్‌సీపీనే అసలైన ప్రతిపక్షం. అయినప్పటికీ 2024 జూన్‌ 21న అనుసరించిన సంప్రదాయ విరుద్ధ విధానాన్ని బట్టి చూస్తే అధికార కూటమి నేతలు ముందుగానే నాకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకూడదని నిర్ణయించుకున్నట్లు తేటతెల్లమవుతోంది. ప్రతిపక్ష హోదా ఇచ్చేది లేదని పయ్యావుల చెప్పారు

గత ఏడాది జూన్‌ 24న నేను స్పీకర్‌కు లేఖ రాశాను. ప్రతిపక్ష నేత హోదా, ప్రజా సమస్యలపై మాట్లాడే విషయంలో తగినంత సమయం కల్పించాలని కోరాను. అంతేకాక గతంలో 10% సీట్లు కూడా పొందని రాజకీయ పార్టీలకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చిన ఉదంతాలను లేఖలో వివరించాను. అయితే స్పీకర్‌ నా లేఖ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌ మీడియాతో మాట్లాడుతూ అధికార కూటమి ఉద్దేశాన్ని బహిరంగపరిచారు. వైఎస్సార్సీపీకి 10% సీట్లు రాకపోవడంతో నాకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వడం అసాధ్యం అని, నేను వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌ లీడర్‌ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, వైఎస్సార్‌సీపీకి అసలు ప్రతిపక్ష హోదా రావాలంటే పదేళ్లు పడుతుందని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే ఆయన్ను వ్యాజ్యంలో వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్చాను.

పిటిషన్‌ పెండింగ్‌లో ఉండగానే రూలింగ్‌

నాకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వక పోవడంపై గత ఏడాది జూలై 23న హైకోర్టులో పిటిషన్‌ దాఖ లు చేశాను. ఏపీ జీతభత్యాలు, పెన్షన్లు మరియు అనర్హతల తొలగింపు చట్టం, 1953లోని 12-బి ప్రకారం నన్ను ప్రతిపక్ష నేతగా ప్రకటించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరాను. ఈ పిటిషన్‌లో పెండింగ్‌లో ఉండగానే శాసనసభ స్పీకర్‌ అయ్యన్న పాత్రుడు ఓ రూలింగ్‌ ఇచ్చారు. నన్ను ప్రతిపక్ష నేతగా గుర్తించాలన్న అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆ రూలింగ్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే నేను ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశాను. స్పీకర్‌ రూలింగ్‌ అనేక చట్టాల ప్రకారం తప్పు. ఆ రూలింగ్‌లో అయ్యన్న ఉపయోగించిన శైలి, పదజాలాన్ని మొదటి నుండి చివరి వరకు పరిశీలిస్తే, నా చట్టబద్ధమైన హక్కును నిరాకరించాలని ముందే నిర్ణయించుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

రూలింగ్‌ వెనుక రాజకీయ వైరం, పక్షపాతం

- అధికార పార్టీ సభ్యులు తరచూ మీడియాతో మాట్లాడుతూ, నాకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వబోమని బహిరంగంగానే ప్రకటించారు. దీని బట్టి స్పీకర్‌ రూలింగ్‌ వెనకున్న అంతరార్థం ఏమిటో స్పష్టమవుతోంది. ఇది స్పీకర్‌ మాత్రమే తీసుకున్న నిర్ణయం కాదు. అధికార పార్టీ సమష్టి నిర్ణయం. స్పీకర్‌ రూలింగ్‌ వ్యక్తిగత, రాజకీయ, శత్రుత్వ పూరితమైన వ్యాఖ్యలతో నిండిపోయింది. ఈ రూలింగ్‌ ఇవ్వడం వెనుక రాజకీయ వైరం, పక్షపాతం ఉన్నాయన్న విషయం స్పష్టమవుతోంది.
- ప్రతిపక్ష నేత హోదా విషయంలో అధికరణ 208 కింద నిర్దిష్టమైన నియమావళి ఉంది. దీని ప్రకారం నాకు ఆ హోదాను అధికారికంగా ఇవ్వాలి. సీట్ల సంఖ్య ఆధారంగా ప్రతిపక్ష హోదా నిబంధన ఏ చట్టంలోనూ లేదు. శాసనసభలోని మొత్తం సీట్లలో 10 శాతం సీట్లు సాధించకపోయినా ఆ పార్టీలు ప్రధాన ప్రతిపక్ష హోదా పొందిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. అలాగే ఆ పార్టీ నేత ప్రధాన ప్రతిపక్ష నేతగా నియమితులైన ఉదంతాలున్నాయి. ఇది పార్లమెంట్‌లోనే కాక దేశంలోని పలు శాసనసభల్లో జరిగింది.
- 1994లో మొత్తం 294 సీట్లలో కాంగ్రెస్‌ పార్టీ 26 సీట్లే గెలుచుకున్నప్పటికీ, ఆ పార్టీ నేత పి.జనార్దన్‌రెడ్డికి ప్రతిపక్ష నేత హోదా దక్కింది. 2015లో ఢిల్లీలో బీజేపీకి 3 సీట్లే వచ్చినప్పటికీ, పార్టీకి ప్రతిపక్ష పార్టీ హోదానిచ్చారు.
- గత ఏడాది జూన్‌ 4 నుండి ఈ రోజు వరకు రాష్ట్రంలో కొనసాగుతున్న హింసాత్మక సంఘటనల పట్ల కార్యనిర్వాహక శాఖ మౌనంగా ఉండిపోయింది. అధికార యంత్రాంగమంతా పాలక కూటమి రాజకీయ ప్రయోజనాలకు మడుగులొత్తుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రజల తరఫున మాట్లాడే, ప్రశ్నించే వేదిక శాసనసభే అవుతుంది. సభలో నేనే ఏకైక ప్రతిపక్ష గొంతుక అన్నది విస్మరించలేని నిజం. కాబట్టి, సభలో నా పార్టీ స్థానాల సంఖ్య ఆధారంగా కాకుండా, ప్రజల సమస్యలను ప్రతిబింబించే ప్రతిపక్ష స్వరం అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకొని నాకు మాట్లాడే హక్కును ఇవ్వాలి.
- పాలక పక్షం మా పార్టీ నేతలు, కార్యకర్తలపై జరిపిన క్రమబద్ధమైన హింస ప్రతిపక్షం, ప్రతిపక్ష నాయకుడి ప్రాముఖ్యతను మరింత స్పష్టం చేస్తోంది. ఈ హింస విషయంలో నేను 2024 జూన్‌ 7, 2024 జూలై 20వ తేదీల్లో కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశాను. అధికార కూటమి రాజకీయ ప్రయోజనాల కోసం అధికార యంత్రాంగం ముఖ్యంగా పోలీసులు పని చేస్తున్నారు. తద్వారా ప్రజల సమస్యలపై గళమెత్తే హక్కును నిరాకరిస్తున్నారు. స్పీకర్‌ రూలింగ్‌ కూటమి నేతల శతృత్వ భావాలకు, ఎన్నికల ఫలితాల తర్వాత పాలకవర్గ ప్రవర్తనకు అనుగుణంగా ఉంది. వ్యక్తిగత, రాజకీయ ద్వేషంతో కూడుకుని ఉంది. ఇది రాజ్యాంగ సూత్రాలకు, చట్టానికి విరుద్ధం. అందువల్ల దీన్ని రద్దు చేసి నాకు ప్రతిపక్ష హోదా ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
బుధవారం | 24-9-2025

పూర్తయ్యే దారేది?



నేషనల్ హైవేల నిర్మాణ పనుల్లో జాప్యం

- భూసేకరణే అసలు సమస్య ● దేశంలో రూ.6.53 లక్షల కోట్లతో జాతీయ రహదారులు
- 2028 నాటికి అన్ని రోడ్లు పూర్తి చేయడం లక్ష్యం ● తెలంగాణ ఎన్‌హెచ్‌లకు సుమారు రూ.33 వేల కోట్లు
- గ్రీన్‌ఫీల్డ్, ఎన్‌హెచ్ రోడ్లకు అటవీ అనుమతుల అడ్డంకి ● ఉమ్మడి వరంగల్ నుంచి కొత్తగా ఆరు జాతీయ రహదారులు
- ఆగస్టు పార్లమెంట్ సమావేశాల్లోనూ చర్చ

సాక్షి ప్రతినిధి, వరంగల్: జాతీయ రహదారుల నిర్మాణ పనులు ఆశించినంత వేగంగా సాగడం లేదు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని.. అయిదారేళ్లుగా కేంద్రం జాతీయ రహదారులపై దృష్టి పెట్టింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులకు అనుసంధానం చేసేలా.. అనేక పథకాల కింద నాలుగు, ఆరు, ఎనిమిది లేన్ల రహదారులకు రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలను కలుపుకొని ప్రధానమంత్రి భారత్‌మాల యోజన, గతిశక్తి జాతీయ మాస్టర్‌ప్లాన్ తదితర స్కీంల కింద దశల వారీగా.. 1,46,204 కి.మీ.ల మేర ఎన్‌హెచ్‌లకు ప్రతిపాదనలు చేసింది. నాలుగు, ఆరు, ఎనిమిది లేన్లతో కొత్త ఎన్‌హెచ్‌లు, ఇప్పటికే ఉన్న రహదారుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. తెలంగాణలో 22 వరకు ఈ స్కీంల కింద ఎంపికవగా.. ఉమ్మడి వరంగల్ నుంచి వెళ్లేలా ఆరు జాతీయ రహదారులకు డిజైన్ చేసి నిధులు కేటాయించారు.

రహదారుల నెట్‌వర్క్, ఆర్థిక కారిడార్లు లక్ష్యం

భారత్‌మాల యోజన కింద దేశంలో ప్రధాన రహదారుల నెట్‌వర్క్‌ను మెరుగుపరచడం, ఆర్థిక కారిడార్లను అభివృద్ధి చేయడం, సరుకు రవాణాను వేగవంతం చేయడం, ఉద్యోగాలను సృష్టించడం ప్రధాన ఉద్దేశం. ఇందుకు మొదటి దశలో దేశవ్యాప్తంగా 51,000 కిలోమీటర్ల రహదారుల నెట్‌వర్క్ అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులోనే రింగ్ రోడ్లు, ఆర్థిక కారిడార్లు కూడా ఉన్నాయి. భారత్‌మాల ప్రాజెక్ట్ ఆర్థిక కారిడార్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చింది. ఇది వాణిజ్య కార్యకలాపాలకు ప్రయోజనకరంగా ఉంటుందనేది ఉద్దేశం. ఈ ప్రాజెక్ట్ అమలుతో రాబోయే కొన్నేళ్లలో లక్షలాది ఉద్యోగాలు ఏర్పడతాయని అంచనా. మొదటి దశలో దేశంలోని 28 నగరాలను కలుపుతూ రింగ్ రోడ్ల అభివృద్ధికి కూడా ప్రణాళికలు రూపొందించగా.. అందులో గ్రేటర్ వరంగల్, కరీంనగర్, రామగుండంలు కూడా ఉన్నాయి. కాగా ప్రస్తుతం, దేశంలో రూ.6.35 లక్షల కోట్ల వ్యయంతో 16,422 కి.మీ. పొడవునా నాలుగు / ఆరు / ఎనిమిది లేన్ల 636 ఎన్‌హెచ్ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో 8,852 కి.మీ. పొడవునా పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టులు 2028–29 ఆర్థిక సంవత్సరం నాటికి దశలవారీగా పూర్తయ్యే వివిధ దశల నిర్మాణంలో ఉన్నాయని.. గత నెల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర రహదారులు, రవాణాశాఖ వెల్లడించింది.

తెలంగాణలో అటవీ అనుమతులు, భూసేకరణే సమస్య

రాష్ట్రంలోని 4,926 కిలోమీటర్ల మేర 30 జాతీయ రహదారుల విస్తరణ లక్ష్యం. ప్రస్తుతం రెండు వరుసలున్న రహదారులను 4 వరసలుగా అభివృద్ధి చేయనున్నారు. మొత్తంగా రూ.33,690 కోట్ల వ్యయమయ్యే ఈ పనులకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాదిలో జూలైలో స్పష్టత ఇచ్చింది. తెలంగాణ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఉన్న పలు జాతీయ రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్ వేలను అనుసంధానించడం, ఇప్పటికే ట్రాఫిక్ అధికంగా ఉన్నట్లు గుర్తించిన పలు జాతీయ రహదారుల విస్తరణకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. తమ పరిధిలోని జాతీయ రోడ్లను విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో కేంద్రానికి విజ్ఞప్తి చేస్తే, వాటిలో కొన్నింటిని మాత్రమే మంజూరు చేసేది. ఇప్పుడా నిబంధనను తొలగించి, రాష్ట్రాల పరిధిలోని జాతీయ రోడ్ల విస్తరణకు ఎలాంటి ఆంక్షలు లేకుండా, రాష్ట్ర ప్రభుత్వాలు విజ్ఞప్తి చేసిన మేరకు మంజూరు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ రహదారుల అభివృద్ధికి అవసరమైన భూసేకరణ, అటవీ ప్రాంతాల మీదుగా పనులు చేయాల్సి ఉంటే అటవీ అనుమతులతో పాటు పర్యావరణ అనుమతులను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలి. వాటితో పాటు సమగ్ర నివేదికను సమర్పించాలి. అన్ని వివరాలు సమగ్రంగా అందినట్లు కేంద్రం భావిస్తే వెంటనే ఆయా పనులకు అనుమతులు ఇస్తుంది. వాటికయ్యే మొత్తం ఖర్చును కేంద్రమే భరించనుంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. తెలంగాణలోని పలు జిల్లాల్లో అటవీ అనుమతులు, భూసేకరణలే అసలు సమస్యలుగా మారాయి. ఎన్‌హెచ్‌ల నిర్మాణ పనులు ఆశించిన మేరకు పురోగతిలో లేవు. ఉమ్మడి వరంగల్‌లోనూ జేఎస్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలో ఇంకా లభించని అటవీ అనుమతులు అడ్డంకిగా మారాయి. మంచిర్యాల నుంచి విజయవాడ వయా వరంగల్ గ్రీన్‌ఫీల్డ్‌తో పాటు ఆరు ఎన్‌హెచ్‌ల నిర్మాణానికి సుమారు 2,129 ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉన్నట్లు ఇటీవల అధికారులు ప్రకటించిన గణాంకాలు చెబుతున్నాయి.

దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల లెక్క ఇదీ..

ప్రతిపాదించిన నేషనల్ హైవేలు	670
ఎన్‌హెచ్‌ల పొడవు	1,46,204 కి.మీ.లు
ఇప్పటికే పూర్తయిన రహదారులు	8,852 కి.మీ.లు
నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్‌లు	16,422 కి.మీ.లు
ఎన్‌హెచ్‌ల వ్యయం (సుమారుగా..)	రూ.6.53 లక్షల కోట్లు

‘మంథనిలో ఏం జరిగినా నన్నే బాధ్యున్ని చేస్తున్నారు’

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

సాక్షి, హైదరాబాద్: మంథనిలో ఏం జరిగినా తననే బాధ్యున్ని చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఓ సామాన్య కుటుంబం నుంచి వచ్చి రాజకీయాల్లో ఎదుగుతుంటే ఓర్వలేకపోతున్నారన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రోద్బలంతో కొన్ని మీడియా సంస్థలు తనకు వ్యతిరేకంగా కథనాలు నడుపుతున్నాయని ఆరోపించారు. 40 ఏళ్లుగా మంథనిని ఏలుతున్న శ్రీధర్‌బాబు కుటుంబం నియోజకవర్గానికి ఓ పరిశ్రమను కూడా తీసుకురాలేక పోయిందని విమర్శించారు. శ్రీధర్‌బాబుకు చేతనైతే ధన్వాడ స్కూల్లో పిల్లల సంఖ్యను పెంచాలని మధు డిమాండ్ చేశారు.

ఎన్నికలు నిర్వహించి ప్రజల తీర్పు కోరాలి

క్యామ మల్లేశ్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఓడిపోతామనే భయంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలేదని, స్థానిక ఎన్నికలతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల తీర్పు కోరాలని బీఆర్‌ఎస్ నేత క్యామ మల్లేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మరో నేత వై.సతీశ్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల గడువు ముగిసినా ఎన్నికలు నిర్వహించడంలేదని, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని మంత్రి సీతక్క రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ, మేడారం సమ్మక్క సారక్కల మీద ప్రమాణం చేసి మాటతప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. ఆగస్టు 15లోగా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని రామప్ప శివుడి సాక్షిగా రేవంత్ మాట ఇచ్చారని గుర్తుచేశారు. మళ్లీ ఏ మొహం పెట్టుకుని సీఎం మేడారం వెళ్తున్నారని ప్రశ్నించారు.

బీఆర్‌ఎస్, బీజేపీలు నిరుద్యోగులను మోసం చేశాయి

టీపీసీసీ నేతలు రియాజ్, దయాకర్

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన బీఆర్‌ఎస్, బీజేపీలకు వారి గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి.రియాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ ప్రశ్నించారు. గత పాలకుల కారణంగానే నిరుద్యోగులు ఆత్మహత్యల పాలయ్యారని విమర్శించారు. మంగళవారం గాంధీభవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ అశోక్ దీక్ష వెనుక బీఆర్‌ఎస్ కుట్ర ఉందనే అంశం రుజువు అయిందని చెప్పారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి రాజకీయం కోసమే గాంధీ ఆసుపత్రికి వెళ్లాడని, పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజైనా జగదీశ్‌రెడ్డి నిరుద్యోగుల గురించి మాట్లాడాడా అని వారు ప్రశ్నించారు. రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి.. మాటతప్పిన బీజేపీ నేతలకు నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత కూడా లేదన్నారు. నిరుద్యోగులకు మేలు చేయాలని, లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలనే చిత్తశుద్ధితో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ప్రవీణ్‌కుమార్, రాకేశ్‌రెడ్డి, రాంచందర్‌రావు, అంజిరెడ్డి... ఇలా రోజుకో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుడు గ్రంథాలయాలను రాజకీయాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. ఆ పార్టీల నేతలను నిరుద్యోగులు గ్రంథాలయాల దరిదాపులకు కూడా రానీయొద్దని రియాజ్, దయాకర్‌లు పిలుపునిచ్చారు.

ఆటల్లో మెరికలు.. దుమాల ఏకలవ్య విద్యార్థులు

బరిలో దిగితే గెలవాల్సిందే..

- రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు ● 47 మంది జాతీయస్థాయికి ఎంపిక
- బాల, బాలికలకు ప్రత్యేకంగా పీఈటీలు ● ఒలింపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యంగా శిక్షణ

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల):

బరిలో దిగితే పతకం ఖాయం.. బాక్సింగ్ రింగ్‌లో ఉంటే పంచ్ పడాల్సిందే.. వాలీబాల్ టీమ్ పాల్గొంటే ఎదుటి టీమ్ బేజార్ కావాల్సిందే.. కుస్తీ పడితే ప్రత్యర్థి లొంగిపోవాల్సిందే.. ఇదంతా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య గురుకుల విద్యార్థుల క్రీడా నైపుణ్యానికి నిదర్శనం. ఏకలవ్య గురుకుల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారు. టోర్నమెంట్‌లో పాల్గొంటే పతకం పట్టుకొస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. ఇటీవల కోనరావుపేట మండలం మరిమడ్ల, మహబూబాద్ జిల్లా కొత్తగూడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాల పంట పండించారు. ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన 47 మంది క్రీడాకారులు ఒడిశాలో అక్టోబర్ రెండో వారంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడల్లో రాణిస్తున్న దుమాల గురుకుల ఏకలవ్య విద్యార్థులపై ప్రత్యేక కథనం.

మైదానంలో చిరుతల్లా..

దుమాల ఏకలవ్య గురుకులంలోని విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ఇద్దరు పీఈటీల ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ బ్యాడ్మింటన్, రెజ్లింగ్ (కుస్తీ), తైక్వాండో, జూడో, యోగా, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్, షాట్‌పుట్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హాకీ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. ఒలింపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యంగా విద్యార్థులను తయారు చేస్తున్నారు. బాల, బాలికలకు ప్రత్యేకంగా ఇద్దరు పీఈటీలు ఉంటూ.. నిత్యం పర్యవేక్షిస్తున్నారు. దుమాల గురుకులంలోని మైదానంలో నిత్యం శిక్షణ ఇస్తూ మెరికల్లా తయారు చేస్తున్నారు. వీరి శిక్షణలో రాటుదేలిన విద్యార్థులు పాల్గొన్న ప్రతీ పోటీలో విజేతలుగా నిలుస్తున్నారు.

జాతీయస్థాయికి ఎంపిక

ఇటీవల కోనరావుపేట మండలం మరిమడ్ల, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలోని ఏకలవ్య గురుకులాల్లో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దుమాల గురుకుల విద్యార్థులు 160 మందికి పైగా పోటీల్లో తలపడి పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్‌లో అకీరా, ఆంజనేయులు గోల్డ్, కుస్తీలో సాయిచరణ్ గోల్డ్‌మెడల్, బాక్సింగ్‌లో హరి, బబ్లూ గోల్డ్, కుస్తీలో చైతన్య గోల్డ్, బాక్సింగ్‌లో శిరీష గోల్డ్, కుస్తీలో పూజిత, అక్షయ మొదటి స్థానం, అథ్లెటిక్స్‌లో నిఖిత మొదటి స్థానం, యోగాలో వర్షిణి మొదటి స్థానం, ఖోఖోలో మొదటి స్థానాలు సాధించారు. వీటితో పాటు ఆయా క్రీడల్లో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన 47 మంది క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఒడిశాలో అక్టోబర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు.



పతకాలతో క్రీడాకారులు, ఉపాధ్యాయులు



పతకాలే లక్ష్యంగా శిక్షణ

దుమాల ఏకలవ్య గురుకుల విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. విద్యార్థుల ఆసక్తిని గమనించి ఆయా క్రీడల్లో శిక్షణ ఇస్తున్నాం. నిత్యం ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్ చేయిస్తున్నాం. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించడంతోపాటు జాతీయస్థాయి పోటీలకు 47 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒడిశాలో జరిగే పోటీల్లో పతకాలు సాధించడమే లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నాం.
– కవిత్‌సింగ్, పీఈటీ, ఈఎంఆర్‌ఎస్, దుమాల

అథ్లెటిక్స్‌లో ప్రతిభ

నిజామాబాద్ జిల్లా ఇందల్వాయికి చెందిన ఎల్. నిఖిత దుమాల ఏకలవ్య గురుకులంలో చదువుతోంది. అథ్లెటిక్స్‌లో తనకున్న ఆసక్తిని గమనించిన పీఈటీలు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో 100, 200 మీటర్లలో రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయస్థాయికి ఎంపికైంది.



కుస్తీలో బంగారం

వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన ఎల్.అక్షయ దుమాల ఏకలవ్య గురుకులం విద్యార్థిని. కుస్తీలో తలపడితే పతకం ఖాయం చేసుకుంటుంది. మరిమడ్లలో జరిగిన పోటీల్లో కుస్తీలో సత్తాచాటి గోల్డ్‌మెడల్ సాధించి జాతీయస్థాయికి ఎంపికైంది.



పంచ్ పడాల్సిందే..



మహబూబాబాద్ జిల్లా కద్దాలీకు చెందిన ఎస్.హరికి చిన్నపటి నుంచి బాక్సింగ్‌పై ఆసక్తి. దీన్ని గమనించిన స్థానిక పీఈటీ శిక్షణ ఇవ్వడంతో మెరికల్లా తయారయ్యాడు. ఇటీవల కొత్తగూడలో జరిగిన పోటీల్లో బాక్సింగ్‌లో ప్రథమస్థానంలో నిలిచాడు. ఒడిశాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు.

బాక్సింగ్ చాంపియన్



మోతితండాకు చెందిన ఎస్.బబ్లూకు బాక్సింగ్ అంటే ప్రాణం. పీఈటీ పర్యవేక్షణలో బాక్సింగ్‌పై పట్టుసాధించిన బబ్లూ ఇటీవల కొత్తగూడలో జరిగిన పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు.

షటిల్‌లో గోల్డ్

దుమాల గురుకులంలో 8వ తరగతి చదువుతున్న ఎస్.ఆంజనేయులు షటిల్, బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చూపుతున్నాడు. కొత్తగూడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించాడు.



బాక్సింగ్‌లో చిరుతలా..



8వ తరగతి చదివే బి.శిరీషకు బాక్సింగ్ అంటే ఆసక్తి. పీఈటీ పర్యవేక్షణలో నైపుణ్యం సాధించిన శిరీష మరిమడ్లలో జరిగిన పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. ఒడిశాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది.


మరిమడ్లలో గెలిచిన పతకాలతో క్రీడాకారిణులు


హాకీ క్రీడాకారులు

'కులగణన సామాజిక న్యాయం' పుస్తకావిష్కరణ

సాక్షి, అమరావతి: కులగణన సామాజిక న్యాయం పుస్తకాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత నెల్లూరు నర్సింహారావు, ప్రచురణకర్త కోయ చంద్ర మోహన్, తోట నర్సింహులు పాల్గొన్నారు. జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న బీసీలకు ఏ విధంగా న్యాయం జరగాలో 'కులగణన సామాజిక న్యాయం' పుస్తకంలో విపులంగా వివరించడం అభినందనీయమని మంత్రి అన్నారు.

సమస్యల పరిష్కారంలో సర్కారు 'జీరో'


జీరో అవర్‌లో ఏకరువు పెట్టిన ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సమస్యల పరిష్కారంలో సర్కారుకు 'జీరో' మార్కులే పడతాయని అధికార కూటమి ఎమ్మెల్యేలు చెప్పకనే చెప్పారు. మంగళవారం శాసనసభ జీరో అవర్‌లో సభ్యులు రాష్ట్రంలో తిష్ట వేసిన సమస్యల్ని ఏకరువుపెట్టారు. ప్రభుత్వం చేసే ప్రకటనలకు ఆచరణకు పొంతన ఉండట్లేదని మండిపడ్డారు. ముఖ్యంగా రైతుల సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి చూపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంక్షోభంలో సజ్జ సాగు

- ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.రూ.2,775.
- తగ్గించి కొంటున్న వ్యాపారులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతు
- మద్దతు ధరకు కొనుగోలు చేయాలంటూ అన్నదాతల ఆందోళన





ఉదయగిరి: కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి వివిధ పంటలకు కనీస మద్దతు కరువై అన్నదాతలు కన్నీళ్లు పెడుతున్నారు. ఇప్పటికే వరి, పత్తి, వేరుశనగ, బత్తాయి, టమాట, ఉల్లి సాగు చేసిన రైతులకు కనీస మద్దతు ధర కరువైంది. చిరుధాన్యాల పరిస్థితి ఇందుకు మినహాయింపు కాదు. సజ్జ, రాగికే ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించి.. కొర్ర, అండుకొర్ర, సామ, వరుగు పంటలను వదిలేసింది. దీంతో చిరుధాన్యాలను సాగు చేసే రైతులు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సెప్టెంబర్ పది నాటికి 55,471 ఎకరాల్లో సజ్జను సాగు చేశారు. సాధారణ సాగు 61,775 ఎకరాలు కాగా, ఈ ఏడాది వివిధ కారణాల రీత్యా సాగు విస్తీర్ణాన్ని తగ్గించారు. కర్నూలులో 14,258, నంద్యాలలో 12,066, అనంతపురంలో 8,389, ప్రకాశంలో 7,210, తిరుపతిలో 5,045, నెల్లూరులో 2,292, కడప జిల్లాల్లో 2,008 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సజ్జ తర్వాత రాగి 44,478, కొర్ర, సామ, వరుగు తదితర చిరుధాన్యాలను రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

రైతు కుదేలు

సజ్జ సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టాల పాలవుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2,775. ఇంతకంటే తక్కువ ధరకు మార్కెట్లో కొనుగోలు చేయకూడదు. అయితే ప్రస్తుతం రూ.1,800 నుంచి రూ.2,000 లోపు మాత్రమే చెల్లిస్తుండటంతో రైతులు రూ.800 నుంచి రూ.1000 వరకూ నష్టపోతున్నారు. రాగులకు కనీస ధరను రూ.4,886గా ప్రకటించగా, మార్కెట్‌లో మాత్రం రూ.3,000కే కొంటున్నారు. చిరుధాన్యాల్లో సామ, వరుగు, కొర్రకు కనీస మద్దతు ధర ప్రకటించనే లేదు. దీంతో వీటి ధర ఎంతుంటుందో చెప్పలేని పరిస్థితి. పెరిగిన పెట్టుబడులు, తగ్గిన దిగుబడులు, లభించని మద్దతు ధరలతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరిలో సజ్జలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఇటీవల ఆందోళన చేపట్టారు. వ్యాపారులు సజ్జలను ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే అది అమలు జరగడం లేదు.

రైతులకు గిట్టుబాటు కావడం లేదు..



సజ్జ పంటకు కనీస మద్దతు ధరను రూ.5000కు పెంచాలి. ప్రస్తుతం ఇస్తున్న మద్దతు ధర రూ.2,775 రైతుకు గిట్టుబాటు కాదు. ఈ ధరకు మార్కెట్లో కొనుగోలు చేయడం లేదు.

– వెంకటసుబ్బారెడ్డి, రైతు, సీతారామపురం, నెల్లూరు జిల్లా

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

ప్రస్తుతం మార్కెట్లో ధరలు తక్కువగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో మద్దత ధరకి కొనుగోలు చేస్తా.

– సత్యవాణి, జేడీ వ్యవసాయ శాఖ, నెల్లూరు

సైబర్ వల.. చిక్కితే విలవిల..!



- ఖాతాల నుంచి క్షణాల్లో మాయమవుతున్న డబ్బులు
- జిల్లాలో ఏడాది కాలంలో 94 సైబర్ కేసులు నమోదు
- ఇప్పటివరకు రూ. 94 లక్షలు ఫ్రీజ్
- అచ్యుతాపురం కేంద్రంగా నకిలీ కాల్ సెంటర్
- డిజిటల్ అరెస్ట్ చేస్తామని భయపెట్టి కోట్లలో దోపిడీ
- అప్రమత్తతే ఆయుధమంటున్న పోలీసులు

సాక్షి, అనకాపల్లి:

ఇలా ఒకరిద్దరు కాదు చాలామంది సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోతున్నారు. అవగాహన లేకపోవడంతో కొందరు, అవగాహన ఉండి నిర్లక్ష్యంతో మరికొందరు నష్టపోతున్నారు. పార్ట్‌టైం, ఫుల్‌టైం ఉద్యోగాలు, వర్క్ ఫ్రమ్ హోం అంటూ ఆన్‌లైన్‌లో ఫేక్ లింక్‌లు పెట్టి వాటిని క్లిక్ చేసేలా ఆశ చూపించి మోసం చేస్తారు. ఎక్కువగా ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు కల్పిస్తామంటూ యువతను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారు. ఫేక్ యాప్‌లు, ఫేక్ లింక్‌ల ద్వారా డేటాని తస్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలపై జిల్లా వ్యాప్తంగా పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో మోసం...



అనకాపల్లిలో గవరపాలేనికి చెందిన మణికంఠ అమెజాన్‌లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేశాడు. ఈ ఏడాది జనవరి 31న వాట్సాప్‌లో కంపెనీ పేరుతో ఒక లింక్ వచ్చింది. ఇది పార్ట్‌టైమ్ ఉద్యోగమని.. ఇంటిలో కూర్చునే డబ్బు సంపాదించుకోవచ్చని చెప్పడంతో రిజిస్ట్రేషన్ కోసం రూ.1,000లు ఫోన్‌పే చేశాడు. కొద్ది రోజుల్లోనే మణికంఠ ఖాతాలో రూ.1,400 జమ అయ్యాయి. దీంతో పార్ట్‌టైమ్ ఉద్యోగం బావుందని నమ్మిన ఆ యువకుడు నిర్వాహకులు చెప్పిన విధంగా దపదఫాలుగా రూ.1.80 లక్షలు పంపించాడు. తర్వాత అటునుంచి ఒక్క రూపాయి రాలేదు. దీంతో మోసపోయానని గమనించి ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే స్పందించి మణికంఠ ఖాతా నుంచి వెళ్లిన డబ్బులో రూ.1.20 లక్షలు ఫ్రీజ్ చేశారు.

అచ్యుతాపురం కేంద్రంగా సైబర్‌డెన్...



అచ్యుతాపురంలో సైబర్ నేరగాళ్ల అరెస్ట్ (ఫైల్)

అచ్యుతాపురంలో ఒక అపార్ట్‌మెంట్‌లో సైబర్ డెన్‌ను ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేస్తున్న 33 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ కాల్ సెంటర్‌ను నడుపుతూ ప్రజల వ్యక్తిగత బ్యాంక్ వివరాలు మోసపూరితంగా సేకరించి, ఖాతాల్లోని డబ్బులను మాయం చేసే ముఠాను పోలీసులు పట్టుకున్నారు. స్వదేశంలోనే కాకుండా విదేశాల్లో ఉన్నవారిని కూడా టార్గెట్ చేసే ఆ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులను సీఐడీకి అప్పగించారు.

సురక్షితమైన డిజిటల్ లావాదేవీలు...

- బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్, యూపీఐ పిన్, ఓటీపీ, ఏటీఎం, డెబిట్‌కార్డు, క్రెడిట్‌కార్డు వివరాలు ఎవరితోనూ పంచుకోకపోవడమే మంచిది.
- డిజిటల్ లావాదేవీలకు బార్‌కోడ్‌లు, క్యూఆర్ కోడ్‌లు స్కానింగ్ లేదా ఎంపిన్ లేకుండా ఉన్నవే ఎంచుకోవాలి.
- ఏదైనా ఫోన్‌కాల్, ఈ-మెయిల్ చేసి మీ కేవైసీ అప్డేట్ చేయాలని వివరాలు అడిగినా చెప్పరాదు. ఒకవేళ అలాంటి అనుమానాలుంటే బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా చెక్ చేసుకోవాలి. హోం బ్యాంక్ శాఖను సంప్రదించాలి.
- ఈమెయిళ్లు, ఎస్ఎంఎస్‌లలో యూఆర్ఎల్, డొమైన్ పేర్లను స్పెల్లింగ్ లోపాలుంటే జాగ్రత్తగా తనిఖీ చేయండి. ఆన్‌లైన్ బ్యాంకింగ్ కోసం అధికార వెబ్‌సైట్‌లనే ఉపయోగించాలి.
- ఏదైనా వెబ్‌సైట్, అప్లికేషన్‌లో మీ ఈమెయిల్‌ను యూజర్ ఐడీగా నమోదు చేస్తున్నప్పుడు మీ ఈ-మెయిల్ పాస్‌వర్డ్‌ను 'పాస్‌వర్డ్' అని పెట్టుకోవద్దు.

ఆన్‌లైన్ లింక్‌లు క్లిక్ చేయవద్దు..

బ్యాంకుల నుంచి వ్యక్తిగత వివరాలు ఎప్పుడూ అడగరు. అలా అడిగితే అది సైబర్ నేరగాళ్ల పనే. ఆన్‌లైన్ లింక్‌లు వస్తే వాటిని క్లిక్ చేయొద్దు. ఒకవేళ క్లిక్ చేస్తే వెంటనే మీ మొబైల్‌కి ఓటీపీ వస్తుంది. దానికి ఎట్టి పరిస్థితుల్లో ఎంటర్ చేయొద్దు. ఒకవేళ చేశారంటే మీ బ్యాంక్ ఖాతా వివరాలు సైబర్ నేరగాళ్లకు చేరినట్టే. ఫేస్‌బుక్కుల్లో కూడా అందమైన అమ్మాయిల పేరిట హనీ ట్రాప్, లింక్‌లు పెట్టి మోసం చేస్తారు. అలా జరిగితే వెంటనే సైబర్ పోలీసులకు తెలియజేయాలి.

– సత్యనారాయణ, లీడ్ బ్యాంక్ మేనేజర్

నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ వలలో పడొద్దు



సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేస్తే బ్యాంక్ ఖాతాల్లో నగదు ఫ్రీజ్ చేస్తాం. అలా ఫ్రీజ్ చేసిన సొమ్మును అనేక కేసుల్లో బాధితులకు ఇప్పటికే అప్ప గించాం. పండగల సమయాల్లో నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌ల ద్వారా ఆఫర్‌లు ఇస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటారు. వాటి విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలి.

– తుహిన్ సిన్హా, ఎస్పీ

డిజిటల్ అరెస్ట్ చేస్తామంటూ భయపెట్టారు..

నర్సీపట్నానికి చెందిన ఒక వృద్ధుడు సైబర్ మోసానికి గురయ్యారు. ముంబై పోలీసులమంటూ ఫోన్ చేసి.. మీ బ్యాంక్ ఖాతాలో అనాథరైజ్డ్‌గా రూ.2 కోట్ల వరకు నగదు బదిలీ అయిందని, తక్షణమే రిటర్న్ కొట్టకపోతే అరెస్ట్ చేస్తామంటూ బెదిరించారు. తక్షణమే బ్యాంక్ ఖాతా వివరాలన్నీ చెప్పండి చెక్ చేస్తాం.. లేదంటే మిమ్మల్ని అరెస్ట్ చేయాల్సి ఉంటుందంటూ బెదిరించారు. వారి మాటలకు భయపడి బ్యాంక్ ఖాతా వివరాలు చెప్పడంతో రూ.కోటి 43 లక్షల వరకు తస్కరించారు. దీంతో ఆ వృద్ధుడు అప్రమత్తమై సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే సైబర్ నేరగాళ్ల బ్యాంక్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి, బాధితుడు పోగొట్టుకున్న నగదును రికవరీ చేశారు.

జిల్లాలో గత ఆరేళ్లుగా సైబర్ కేసుల వివరాలు

- 2021లో 128
- 2022లో 217
- 2023లో 310
- 2024 జూన్ వరకు 201
- 2024 జూన్ నుంచి నేటి వరకు 94 కేసులు

94 కేసుల్లో రూ.93.74 లక్షలు ఫ్రీజ్

జిల్లాలో జూలై 1 నుంచి నేటి వరకు 94 సైబర్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఇప్పటివరకు రూ.93,78,304 మొత్తాన్ని ఫ్రీజ్ చేశారు. అలాగే రూ.15,45,234 మొత్తాన్ని 17 కేసుల్లో బాధితులకు తిరిగి చెల్లించారు.

ఒక్క హౌసింగ్ లోనైనా ఇవ్వలేదు

- శాసనసభలో కూటమి ఎమ్మెల్యేల ఆవేదన
- పేదల ఇళ్ల నిర్మాణం కల్లగానే మిగిలిపోయిందని వ్యాఖ్య

సాక్షి, అమరావతి: 'కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎక్కడా ఒక్క హౌసింగ్ లోన్ ఇవ్వలేదు. పేదల ఇళ్ల నిర్మాణం నిలిచిపోయింది. సొంత డబ్బులు, అప్పులతో పునాది వేసుకుంటామంటే హౌసింగ్ అధికారులు ఒప్పుకోవడం లేదు' అని రాజానగరం జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రభుత్వాన్ని నిలదీశారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తన నియోజకవర్గంలోని 36 గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవడానికి 'మిషన్ ఇంప్లిమెంటేషన్ సిస్టమ్' ఓపెన్ కావట్లేదన్నారు. వెలుగుబందలో 266 ఎకరాలు, పల్లా కడియంలో 301 ఎకరాలు సేకరిస్తే ఆ స్థలాలు ఖాళీగా ఉన్నాయని.. వాటిని పేదలకు అలాట్ చేయలేదని చెప్పారు. ఉచిత ఇసుక ఇస్తున్నా, ఎక్కడా ఇళ్ల నిర్మాణం కనిపించట్లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులు సైతం పనిలేకుండా ఖాళీగా ఉండిపోతున్నారన్నారు. 2014–19లో రూ.6.90 కోట్ల గృహ నిర్మాణం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. తమ ప్రాంతంలో కొందరు రైతుల నుంచి పొలాలు సేకరించి ఒరిజినల్ డాక్యుమెంట్లు అధికారులు తీసుకున్నారన్నారు. ఆ సేకరణను ఏటూ తేల్చకుండా వ్యవసాయానికి పనికిరాకుండా నష్టపరిహారం ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు టీడీపీ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ.. సొంత భూమిలో ఇళ్లు నిర్మించుకునేందుకు పేదలు దరఖాస్తు చేసుకుంటే పొజిషన్ సర్టిఫికెట్ తెచ్చుకుంటే తప్ప హౌసింగ్ శాంక్షన్ ఇవ్వడం లేదన్నారు. గత ప్రభుత్వంలో కార్పొరేషన్ పరిధిలో పేదలకు సెంటు పట్టా భూములు ఇచ్చారన్నారు. కానీ, ప్రజలు అక్కడకు వెళ్లట్లేదని, వారికి మూడు సెంట్లు భూమి ఇస్తామన్న ప్రభుత్వ హామీపై చర్యలు తీసుకోవాలన్నారు. రాజమహేంద్రవరం రూరల్ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ.. రాజమహేంద్రవరం రూరల్, సిటీల్లోని పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు వృథాగా పడి ఉన్నాయన్నారు. వాటిని పరిశ్రమలకు మార్చు చేసి ఇస్తారా? అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో లక్షకు పైగా పెండింగ్ కేసులు

ఎమ్మెల్సీ నాగేంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కోర్టుల్లో పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయని.. లక్షకు పైగా కేసులు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని ఎమ్మెల్సీ కె.నాగేంద్రబాబు అన్నారు. మంగళవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న వ్యక్తులు రాజకీయ దురుద్దేశంతో ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని పెడుతున్న ఇబ్బందుల వల్ల అమాయకులు నలిగిపోతున్నారన్నారు. అలాంటి వ్యక్తులు న్యాయం చేయాలంటూ కోర్టు మెట్లు ఎక్కినప్పుడు వాళ్లకు సత్వర న్యాయం అందాలన్నారు. లేదంటే న్యాయవ్యవస్థపై వారికి నమ్మకం పోతుందని అన్నారు. గుంటూరు జిల్లాలో రోజువారీ కూలీ చోరీ కేసులో అరెస్ట్ కాగా.. లాయర్‌ను పెట్టుకునే స్థోమతలేక ఆరేళ్ల జైలులో ఉండాల్సి వచ్చిందన్నారు. చివరకు అతడు నిర్దోషి అని కోర్టు తీర్పు ఇచ్చిందని, కానీ ఆరేళ్ల జైలులో మగ్గిపోయిన అతడికి కలిగిన ఇబ్బందులను, నష్టాలను ఎలా భర్తీ చేయగలమని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న కొందరు వ్యవస్థల్ని స్వలాభం కోసం వాడుకుంటూ చట్టాలను, న్యాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఇదంతా తాను ఒక పార్టీని ఉద్దేశించి మాట్లాడటం లేదన్నారు.

మీడియా పాయింట్

జీఎస్టీ కోల్పోతున్నాం

మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్సీ



సాక్షి, అమరావతి: రాష్ట్ర అప్పుల మీద ప్రశ్నకు ఆర్థికమంత్రి సరైన సమాధానం చెప్పకుండా దాటవేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అప్పులు ఎంత అని అడిగితే రూ.3.72 లక్షల కోట్లు అని చెప్పారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసిందంటూ కూటమి నేతలు అబద్ధాలు చెప్పేవారు. ఆఖరికి గవర్నర్ చేత కూడా అబద్ధం చెప్పించారు. జీఎస్టీ 2.0 ర్యాటిఫికేషన్‌లో భాగంగా రాష్ట్రం రూ.8 వేల కోట్లను కోల్పోతోంది. దానిని మాఫీ చేయమని కేంద్రాన్ని ఎందుకు అడగడం లేదు. ఏడాదికి చేయాల్సిన అప్పుల్లో 70 శాతం ఈ ఐదు నెలల్లోనే చేశారు. తెచ్చిన అప్పులను దేనికి వాడుతున్నారని అడిగాం. గత ప్రభుత్వంతో పోల్చితే జీఎస్టీ వసూళ్లు తక్కువగా ఉన్నాయి. అంటే ఆర్థికాభివృద్ధి లేదు. ఈ డబ్బంతా కూటమి నేతల జేబుల్లోకి వెళుతోంది.

నాలుగేళ్లలో దాదాపు రూ.21 లక్షల కోట్ల అప్పు



సంపద సృష్టించి, జగన్ ఇస్తున్నదానికి మిన్నగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు ప్రచారం చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ సంపద సృష్టించకపోగా అప్పులు చేసి రాష్ట్ర ఖజానాను సంక్షోభంలోకి నెడుతున్నారు. 15 నెలల్లో ఏ రాష్ట్రం చేయని విధంగా కూటమి ప్రభుత్వం రూ.2,09,085 కోట్లు అప్పుచేయడం సిగ్గుచేటు. ఆర్థికమంత్రి సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారు. రాజధాని నిర్మాణమా, అమరావతి నిర్మాణమా అనేది ప్రభుత్వం స్పష్టం చేయాలి.

– కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ


ఎస్-టాక్స్, పి-టాక్స్, ఎల్-టాక్స్ వేశారా?



తల్లికి వందనం ఎంతమందికి ఇచ్చారని అడిగితే విద్యాశాఖ మంత్రి సరైన సమాధానం చెప్పలేదు. నాడు-నేడు కింద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తే, కూటమి ప్రభుత్వం స్కూళ్లను నాశనం చేస్తోంది. కేంద్రం లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎంతమంది పిల్లలు పాఠశాల్లో చదువుతున్నారనేదానిపై మంత్రి సమాధానం చెప్పలేదు. 20 లక్షల మందికి పైగా తల్లులకు తల్లికి వందనం ఎగనామం పెట్టారు. ఎస్-టాక్స్, పి-టాక్స్, ఎల్-టాక్స్ కట్ చేసి మిగిలిన డబ్బులు ఇస్తున్నారా? ఎందుకు తల్లికి వందనం డబ్బులు తక్కువ వేశారు అని అడుగుతున్నాం.

– రమేశ్ యాదవ్, ఎమ్మెల్సీ

రాష్ట్రంలోనూ తిరుగుబాటు వస్తుంది



అప్పులపై అన్నీ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు.
ఎవరు రాష్ట్రాన్ని శ్రీలంక చేస్తున్నారనేది ఇప్పుడు ప్రజలకు అర్థమైంది. సంపద సృష్టిస్తామన్నవారు అప్పులు ఎందుకు చేస్తున్నారంటే సమాధానం లేదు. కూటమి నేతలు చెప్పేదొకటి చేసేదొకటి. రాష్ట్రాన్ని మరో బంగ్లాదేశ్, నేపాల్‌లా చేసేలా ఉన్నారు. అక్కడ జరిగినట్లుగానే ఇక్కడ కూడా విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. త్వరలోనే ఈ తిరుగుబాటు ఉధృతమై ప్రభుత్వాన్ని గద్దె దించే రోజు వస్తుంది.

– భరత్, ఎమ్మెల్సీ

సమాధానాలేవీ సంతృప్తికరంగా లేవు



మండలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు సంధించిన ప్రశ్నలకు మంత్రులు చెప్పిన సమాధానాలు సంతృప్తికరంగా లేవు. విద్యార్థులకు రూ.15 వేలు ఇచ్చే అమ్మ ఒడి కాదని, తల్లికి వందనం అని విద్యా శాఖ మంత్రి చెబుతున్నారు. 66 లక్షల మంది పేద విద్యార్థులకు గత ప్రభుత్వం అమ్మ ఒడి అందిస్తే, ఈ ప్రభుత్వం 50 లక్షల మందికే ఇచ్చింది. ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. 'సాక్షి' మీడియాను ఇబ్బంది పెడుతున్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెట్టారు. ఎన్ని కేసులంటే హోం మంత్రి సరిగ్గా సమాధానం చెప్పడం లేదు. విద్యుత్ కోతలు ఈ ప్రభుత్వంలో అమలులో ఉన్నాయి. జిల్లాల వారీగా ఎన్ని పరిశ్రమలు తీసుకువచ్చి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించారో ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలి.

– డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ

'ఆర్డీటీ'ని రక్షించుకుంటాం

- రాయలసీమ ప్రాంతంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సేవలు కీలకం
- ఆ సంస్థ రెన్యూవల్‌కు సమష్టిగా కృషి చేస్తున్నాం
- ఉమ్మడి అనంతపురం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: రాయలసీమ అభివృద్ధిలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) కీలక పాత్ర పోషించిందని ఉమ్మడి అనంతపురం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. 50 ఏళ్లుగా రాయలసీమ ప్రాంతంలో ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్యా, వైద్య, మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్డీటీ సంస్థ ఎంతో కృషి చేసిందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆ సంస్థ రెన్యూవల్‌కు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు అందరం సమష్టిగా కృషి చేస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. ఢిల్లీ వెళ్ళి కేంద్ర మంత్రి అమిత్ షా, ఇతర మంత్రులను కలిసి ఆసంస్థ రెన్యూవల్ కోసం విజ్ఞప్తి చేశామన్నారు. ఆర్డీటీ సంస్థ రెన్యూవల్ విషయంలో రాయలసీమ ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి పరిటాల సునీత స్పష్టం చేశారు. ఆర్డీటీ సంస్థ రాయలసీమలో 70 వేలకుపైగా గృహాలను నిర్మించి, కోటి మొక్కలు నాటిందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వివరించారు. సేవ్ అనంతపురం-సేవ్ ఆర్డీటీ అనే నినాదంతో ఆ సంస్థ పరిరక్షణలో తామంతా వెన్నుదన్నుగా ఉంటామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చెప్పారు.

సాగుబడి

ఉత్తర కార్తె: సెప్టెంబర్ 26 వరకు
హస్త కార్తె: సెప్టెంబర్ 27 నుంచి

చాలా రకాల పంటలు రైతుకు ఒకే ఆదాయాన్ని ఇస్తుంటాయి. కానీ, 5 రకాలుగా ఆదాయాన్నిచ్చే పంట ఒకటుంది. మరో విశేషం ఏమిటంటే... దీన్ని సాగు చెయ్యటానికి సారం కోల్పోయిన, కరువు ప్రాంతాల్లో బంజరైనా భేషుగ్గా పనికొస్తుంది. ఆ పంట పేరు ముళ్లు లేని బ్రహ్మజెముడు (స్పైన్‌లెస్ కాక్టస్). క్షీణించిన భూమిలో '5 ఎఫ్ మోడల్' పంటగా కాక్టస్‌ను పండించడం అంటే.. ఎడారీకరణను సమర్థవంతంగా ఎదుర్కొంటూనే రైతు కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధిని సృష్టించటం. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో నిస్సారమైన కరువు ప్రాంత భూముల్లో దీన్ని సాగు చేస్తున్నారు.

ఇంతకీ '5ఎఫ్ మోడల్' పంట అంటే ఏమిటి?.. చదవండి...



ఒక్కటే పంట... 5 ఆదాయాల పెట్టు!

ముళ్లలేని బ్రహ్మజెముడు ఒకటే పంట.. 5 ప్రయోజనాలు చేకూర్చుతోంది. రైతులకు బహుళ ఉత్పాదనలు, బహుళ ఆదాయ మార్గాలను అందిస్తున్నది. ఆ ఐదు 'ఎఫ్'లు ఏవంటే.. ఫుడ్, ఫాడర్, ఫ్యూయల్, ఫర్టిలైజర్, ఫ్యాషన్! ఈ ఐదు ఆంగ్ల పదాలు ఎఫ్‌తో ప్రారంభం అవుతాయి కాబట్టి '5 ఎఫ్ మోడల్ పంట' అని దీనికి పేరొచ్చింది. ఆహారం, పశుల మేత, ఇంధనం, ఎరువులు, ఫ్యాషన్ రంగాల్లో ముళ్లలేని బ్రహ్మజెముడు పంట ఉపయోగపడుతోంది. ఆ విధంగా కరువును పారదోలుతోంది!

1. ఆహారం: దీని పండ్లను కాక్టస్ పియర్ (ఓపుంటియా ఫికస్-ఇండికా) అంటారు. ఈ పండ్లు తియ్యగా, జ్యూసీగా ఉంటాయి. తాజాగా తినవచ్చు లేదా జామ్‌లు, జ్యూస్‌లు, సిరప్‌లుగా ప్రాసెస్ చేయవచ్చు. ముళ్లలేని బ్రహ్మజెముడు మొక్కల ఆకులను ముక్కలుగా కత్తిరించి కూర వండుకొని తీసుకుంటారు.

2. పశువుల మేత: ముళ్లలేని బ్రహ్మజెముడు మొక్కల ఆకులను క్యాక్టస్ ప్యాడ్లు లేదా క్లాడోడ్‌లు అంటారు. ఇవి పశువులకు పచ్చిమేతగా ఉపయోగపడతాయి. నమ్మకమైన, తక్కువ ఖర్చుతో సమకూర్చుకోగల పచ్చి మేత. ముఖ్యంగా ఇతర రకాల మేతకు కొరత ఉన్న కరువు పీడిత ప్రాంతాల్లో ఇవి పశువులకు ప్రాణం నిలిపేందుకు ఉపయోగపడుతున్నాయి. ఇందులో నీరు అధిక పాళ్లలో ఉంటుంది.

3. ఇంధనం: ముళ్లలేని బ్రహ్మజెముడు ఆకులను (కాక్టస్ బయోమాస్‌ను) బయోగ్యాస్ ఉత్పత్తికి మూల వనరు (ఫీడ్ స్టాక్)గా ఉపయోగిస్తున్నారు. 10% ఆవు పేడతో 90% కాక్టస్ బయోమాస్‌ను ఉపయోగించడం వల్ల 65% వరకు మీథేన్ కంటెంట్‌తో బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయవచ్చని ఒక పైలట్ అధ్యయనం నిరూపించింది. ఈ గ్యాస్‌తో వంటకు, ఇతర ఉపయోగాలకు స్వచ్ఛమైన శక్తి వనరుగా పనికొస్తుంది.

4. ఎరువులు: బయోగ్యాస్ ఉత్పత్తి తర్వాత మిగిలిపోయే పోషకాలతో కూడిన స్లర్రీని సేంద్రియ ఎరువుగా ఉపయోగించి నేలను సారవంతం చేసుకోవచ్చు. పంట ఉత్పాదకతను మెరుగుపరుచుకోవచ్చు. ఇది ఖరీదైన రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తుంది. పొలంలో పండే మొక్కల ఆకులతోనే ఎరువుగా వాడటం ద్వారా వృత్తాకార ఆర్థిక వ్యవస్థను సృష్టించుకోవచ్చు.

5. ఫ్యాషన్: బూట్లు, బ్యాగులు, ఇతర ఉపకరణాల కోసం బయో-లెదర్ (మొక్కలకు సంబంధించిన తోలు) ఉత్పత్తి చేయడానికి ముళ్లలేని బ్రహ్మజెముడు ఆకులను ఉపయోగించవచ్చని మన దేశంలోని భూ వనరుల శాఖ, ఇతర పరిశోధకులు నిరూపించారు. 3 కిలోల దీని ఆకుల ద్వారా 3 చదరపు అడుగుల కంటే ఎక్కువ బయో-లెదర్‌ను ఉత్పత్తి చేయగలదని ఒక పైలట్ అధ్యయనంలో తేలింది.

దీన్ని సాగు చేస్తే భూమికి మేలు...

నిస్సారమైన ఇసుక దువ్వలాగా మారిపోయిన భూమికి జవ జీవాలను అందించి పునరుద్ధరించడానికి అనేక విధాలుగా బ్రహ్మజెముడు పెంపకం అనువైనదని నిపుణులు చెబుతున్నారు:

కరువు నిరోధకత... వాతావరణం నుంచి నీటిని పీల్చుకొని తనలో నిల్వ చేసుకోవటం బ్రహ్మజెముడు మొక్క లక్షణం. అందువల్లే ఇది కరువును గట్టిగానే తట్టుకోగలుగుతుంది. ఈ మొక్క జీవించడానికి, ఎక్కువ ఆకులను ఉత్పత్తి చేయడానికి చాలా తక్కువ నీరు సరిపోతుంది.

నేలకు మేలు... బ్రహ్మజెముడును పెంచడం వల్ల మట్టి వానకు, గాలికి కొట్టుకుపోకుండా ఆపటం ద్వారా నేల సారాన్ని పునరుద్ధరించవచ్చు. ఈ మొక్కలు మట్టికి సేంద్రియ పదార్థాన్ని అందిస్తాయి.


కర్బన స్థిరీకరణ... బ్రహ్మజెముడు మొక్క కర్బనాన్ని వాతావరణం నుంచి సంగ్రహించి తన ఆకులు, కాండంతో పాటు నేలలో నిల్వ చేయడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ఈ కర్బన స్థిరీకరణ ప్రక్రియ సహాయపడుతుంది.

అధిక దిగుబడి సామర్థ్యం... కఠినమైన వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ముళ్లలేని బ్రహ్మజెముడు చక్కగా పెరుగుతుంది. సంవత్సరానికి హెక్టారులో 80-100 టన్నుల బరువైన ముళ్లలేని బ్రహ్మజెముడు ఆకులను పండించవచ్చు.

అమలుకు అవకాశాలు... ఈ 5 రకాల ప్రయోజనాలను పొందే ముళ్లలేని బ్రహ్మజెముడు పంట నమూనాను స్వీకరించడానికి ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా సంస్థలు, ప్రైవేటు సంస్థలు, వ్యక్తుల సహకారం అవసరం. ముళ్లలేని బ్రహ్మజెముడు నాణ్యమైన ఆకులు నాటుకుంటే చాలు. అవి వేరుపోసుకొని ఎత్తయిన మొక్కగా ఎదుగుతాయి. కరువు ప్రాంతాల్లో జీవనోపాధులను మెరుగుపరిచేందుకు రైతులకు నాణ్యమైన ఆకులను అందించటం, సాంకేతిక మార్గదర్శకత్వం అందించడం ముఖ్యమైన విషయం. మార్కెట్ లింకేజీలను ఏర్పాటు చేయడం, ఈ ఆకులను 5 రకాలుగా ఉపయోగించేందుకు వీలుగా ప్రాసెస్ చేయడానికి మౌలిక సదుపాయాలను నిర్మించడం అవసరం.

ఈ 5 రకాల ప్రయోజనాలనిచ్చే పంట నమూనాను సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రజల్లో అవగాహన పెంచడం, సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారించాలి.

ఈ పంట నమూనా ముఖ్యంగా కరువు, ఎడారి ప్రాంతాలకు బాగా సరిపోతుంది. భారతదేశం, పాకిస్తాన్, ఇథియోపియా, మొరాకోతో సహా ఎడారీకరణను ఎదుర్కొంటున్న అనేక దేశాల్లో దీనిపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ పంట సాగు చేస్తున్నారు. బహుళ ఆదాయ మార్గాలను అందించడం, పనిలో పనిగా భూమిని తిరిగి సారవంతం చేయటం ద్వారా 5 రకాలుగా ప్రయోజనకరమైన బ్రహ్మజెముడు పంట నమూనా బడుగు రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. మెరుగైన ఆహార భద్రతనిస్తుంది. అదే సమయంలో పర్యావరణాన్ని మెరుగుపరిచేందుకు ఒక మార్గాన్ని అందిస్తుంది.







మొదటి ఏడాది మొక్కకు 8-10 కిలోల ఆకుల దిగుబడి

● ముళ్లలేని బ్రహ్మజెముడు సాగుపై ఐసీఏఆర్‌డీఏ పరిశోధకురాలు డాక్టర్ నేహా తివారీ

ఎడారిగా మారిపోతున్న ప్రదేశాలు, కరువు పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న ప్రాంతాల్లో భూములు నిస్సారమైపోయి ఉంటాయి. అయితే, అటువంటి కఠిన పరిస్థితుల్లో మనుగడ సాగించగలిగే జాతుల పంటలను గుర్తించి, పరిశోధనలు చేయటం.. ఆయా పంటలను సాగు చేయించటంలో తోడ్పాటునందించటం ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమం. ఇటువంటి పని చేస్తున్న ఒకానొక అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ ఐసీఏఆర్‌డీఏ. ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్ ద డ్రై ఏరియాస్. దీని ప్రధాన కార్యాలయం లెబనాన్‌లో ఏభయ్యేళ్లుగా పని చేస్తోంది. దక్షిణాసియా, చైనాలకు కలిపి ప్రాంతీయ కార్యాలయాన్ని 2008లో న్యూఢిల్లీలో నెలకొల్పారు. ఐసీఏఆర్‌డీఏ మన దేశంలోకి 67 రకాల ముళ్లలేని బ్రహ్మజెముడు రకాలను ప్రవేశపెట్టి, భారతీయ సంస్థల సహకారంతో పరిశోధనలకు మార్గదర్శకత్వం వహించింది. ఆ కృషి ఫలితంగానే దేశంలో రైతులకు ఇప్పుడు తమ జీవనోపాధిని పెంచుకునే, కరువును ఎదుర్కొనే ఆశాజనకమైన ముళ్లలేని బ్రహ్మజెముడు అనే కొత్త పంట అందుబాటులోకి వచ్చింది. ఐసీఏఆర్‌డీఏ ఇండియా ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లోని అమ్లహాలో ఫుడ్ లెగ్యూమ్ రీసెర్చ్ ప్లాట్‌ఫామ్‌లో డాక్టర్ నేహా తివారీ పరిశోధకురాలిగా పనిచేస్తున్నారు. మన దేశంలో ఎడారీకరణను, కరువును ఎదుర్కొంటున్న ప్రాంతాల అభ్యున్నతికి 'కాక్టి రాణి'గా ప్రసిద్ధి చెందిన ముళ్లలేని బ్రహ్మజెముడు ఎంత అవసరమో ఆమె ఒక ఇంటర్వ్యూలో చర్చించారు. ముఖ్యాంశాలు..

ముళ్లలేని బ్రహ్మజెముడు పంటను సాగు చేయటానికి తగిన వ్యవసాయ పరిస్థితులు ఏమిటి?

ముళ్లలేని బ్రహ్మజెముడు పంట తక్కువ తేమతో కూడిన వేడి వాతావరణంలో పెరుగుతుంది. ఇసుక నేలలు, కంకర నేలలకు ఇది అనువైనది. ముళ్లలేని బ్రహ్మజెముడు నిస్సారమైన నేలల్లో స్థిరంగా పెరిగే పంట అయినప్పటికీ, ముఖ్యంగా దాని పెరుగుదల దశలో, దానికీ కొంత తేమ అవసరం. ముళ్లలేని బ్రహ్మజెముడు బాగా పెరగాలన్నా, పండ్ల కాపు రావాలన్నా ప్రతిరోజూ కనీసం ఆరు గంటల ప్రత్యక్ష సూర్యకాంతి అవసరం. ఈ మొక్క ఉదజని సూచిక కొద్దిగా ఆమ్ల లేదా తటస్థంగా ఉన్న నేలలను ఇష్టపడుతుంది. సాధారణంగా 6.0 నుండి 7.5 వరకు పీహెచ్ ఉండాలి. మొక్కల మధ్య దూరం ఎక్కువగా ఉండాలి.

మన దేశంలోని మెట్ట ప్రాంతాలలో కఠినమైన వ్యవసాయ-వాతావరణ పరిస్థితులు ముళ్లలేని బ్రహ్మజెముడుకు అద్భుతమైన అనుకూలంగా ఉంటాయి.



ఇతర పంటలేవీ పండించలేని ప్రదేశాలలో ఇది పెరుగుతుంది. వాస్తవానికి, ఐసీఏఆర్‌డీఏ భారతదేశంలో అరవై ఏడు కాక్టస్ రకాలను ప్రవేశపెట్టింది. ఈ రకాలను పెంచే మదర్ నర్సరీలు అమలహాలోని ఐసీఏఆర్, ఐసీఏఆర్‌డీఏ సంస్థల్లో ఏర్పాటయ్యాయి. ముళ్లలేని బ్రహ్మజెముడు పంట సాగును ప్రోత్సహించడానికి డిసెంబర్ 2023లో ఐసీఏఆర్‌డీఏ భారత ప్రభుత్వం ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి.

దేశంలో ముళ్లలేని బ్రహ్మజెముడు మార్కెటింగ్ వ్యవస్థ అభివృద్ధి చెందిందా?

చిన్న రైతులు స్థానికంగా ముళ్లలేని బ్రహ్మజెముడు పండ్ల కోసం, పశుగ్రాసం కోసం పండిస్తున్నారు. ఇతర దేశాలతో పోలిస్తే ఇక్కడ కొంచెం తక్కువే. మార్కెటింగ్ ప్రయత్నాలను మెరుగుపరచడానికి ఐసీఏఆర్‌డీఏ కేంద్ర భూ వనరుల శాఖతో కలిసి పనిచేస్తున్నది. ఆహారంగా, ఇంధనంగా, పశుగ్రాసంగా, ఎరువుగా, కార్బన్ క్రెడిట్స్, ఫ్యాషన్ రంగాల్లో రైతులకు ఆకర్షణీయమైన ప్రయోజనాలను చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఉదాహరణకు.. ముళ్లలేని బ్రహ్మజెముడు ఆకులతో 61% మీథేన్‌తో కూడిన బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేశాం. అలాగే చౌకగా, సమృద్ధిగా లభించే బయోఫెర్టిలైజర్‌ను ఉత్పత్తి చేసే సాంకేతికతలను అభివృద్ధి చేశాం. అదనంగా, ప్రైవేట్ రంగం భాగస్వామ్యంతో బయో-లెదర్‌ను రూపొందించే కార్యక్రమాన్ని ప్రారంభించాం. కేరళలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్ డిసిప్లినరీ సైన్స్ అండ్ టెక్నాలజీలో జరిగిన ప్రాథమిక పరీక్షలు ఆశాజనకమైన ఫలితాలిచ్చాయి. 3 కిలోల ముళ్లలేని బ్రహ్మజెముడు ఆకులతో 3.38 చదరపు అడుగుల బయో లెదర్‌ను ఉత్పత్తి చేశాం. ఇది 2 జతల చెప్పులు, 3 చిన్న బ్యాగులు లేదా 2 జతల బూట్లను తయారు చేయడానికి సరిపోతుంది. బయోలెదర్ ఉత్పత్తులను మరింత అభివృద్ధి చేయడానికి అనేక జాతుల ముళ్లలేని బ్రహ్మజెముడు రకాలపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. బయో లెదర్ రైతులకు కొత్త మార్కెట్ అవకాశాలను కల్పిస్తుంది. అదే సమయంలో, రైతులకు ప్రయోజనం చేకూరుస్తూనే ప్రైవేట్ రంగాన్ని శక్తివంతం చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటున్నది. బ్రహ్మజెముడు ఉత్పత్తుల ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌ను పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముళ్ల లేని బ్రహ్మజెముడు పంట నిరూపిత సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని దేశంలో ఈ పంట సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని పెంపొందించడానికి ఐసీఏఆర్‌డీఏ ప్రభుత్వ సంస్థలకు సహకరిస్తున్నది. ముఖ్యంగా ఎడారీకరణ ముప్పును ఎదుర్కొంటున్న ప్రాంతాలు, కరువు ప్రాంతాల్లో ఆహార భద్రత, జీవనోపాధులను పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం.

ఒక రైతు ముళ్లలేని బ్రహ్మజెముడు పంటను ఎలా పండించవచ్చు?

ముళ్ల లేని బ్రహ్మజెముడు సాగులో గమనించాల్సిన అనేక అంశాలు ఉన్నాయి. నీరు నిలవని నేలలు, తగినంత సూర్యకాంతి ఉన్న ప్రదేశాల్లో పెంచాలి. దీనికి కూడా ఎండా కాలంలో నీరందించాలి. జంతువుల నుంచి రక్షణకు కంచెను ఏర్పాటు చేసుకోవాలి. దున్నిన తర్వాత నాటుకోవాలి. వాన నీరు బయటకు వెళ్లిపోవటానికి ఏర్పాట్లు చేసుకోకపోతే వేరుకుళ్లు సమస్య వస్తుంది. ముళ్ల లేని బ్రహ్మజెముడు ఆకులనే నాటుకోవాలి. వీటిని ఐసీఏఆర్‌డీఏ, ఇండియన్ గ్రాస్‌ల్యాండ్ అండ్ ఫాడర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, సెంట్రల్ అరిడ్ జోన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, భారతీయ ఆగ్రో ఇండస్ట్రీస్ ఫౌండేషన్ వంటి ప్రసిద్ధ నర్సరీల నుంచి ఆరోగ్యకరమైన, ముదురు ముళ్ల లేని బ్రహ్మజెముడు ఆకులను తెచ్చుకొని రైతులు నాటుకోవాలి.

వరుసలలో తగినంత దూరంలో నాటుకోవాలి. ముళ్ల లేని బ్రహ్మజెముడు రకాన్ని, దాని పెరుగుదల అలవాటును బట్టి ఎంత దూరం పెట్టాలన్నది ఆధారపడి ఉంటుంది. ఈ ఆకులను తెచ్చిన 10 నుండి 15 రోజులు వాడబెట్టిన తర్వాత నాటుకోవాలి. వరుసల మధ్య 2 మీటరు, మొక్కల మధ్య 1 మీటరు దూరంలో నాటాలి. ఆకు 1/3 వంతు నేలలోకి ఉండేలా నాటాలి. వ్యాధి నివారణ కోసం కార్బెండజిమ్ (2 గ్రాములు/లీటరు) ద్రావణంలో ముంచి నాటుకోవాలి.

నాటిన తర్వాత మొదటి 10 రోజులు నీరు పెట్టవద్దు. తరువాత 15 రోజుల వ్యవధిలో మొక్కకు 1-2 లీటర్ల నీరు ఇవ్వండి. అది వేరుపోసుకొని మొలకెత్తిన తర్వాత అంత తరచుగా నీరు పెట్టనవసరం లేదు. నేల పరీక్ష నిర్వహించి తగినంత ఎరువు వేయాలి. నాటేటప్పుడు మొక్కకు బాగా కుళ్ళిన పశువుల ఎరువు 2 కిలోలు వెయ్యండి. పండ్లు, ఆకులు కోసిన ప్రతి సారీ ఎరువులు వేయాలి. పిండినల్లి, శిలీంధ్ర తెగుళ్లు, ఇతర పురుగుల నుంచి రక్షణకు చర్యలు తీసుకోవాలి. ఒక సంవత్సరం తర్వాత, అడుగున రెండు ఆకులు వదిలి, పైన పూర్తిగా ఎదిగిన ఆకులను కోసి ఉపయోగించుకోవాలి. మొదటి సంవత్సరంలో మొక్కకు 8-10 కిలోల ఆకుల దిగుబడి వస్తుంది. మేకలు, గొర్రెలు, పశువులు, గేదెలకు మేతగా వీటిని వేసుకోవచ్చు. ఇతర పచ్చి మేతకు 25% ప్రత్యామ్నాయంగా ఉపయోగించండి. వసంతకాలం చివరిలో లేదా వేసవి ప్రారంభంలో ముళ్లలేని బ్రహ్మజెముడు పండ్లు కోతకు వస్తాయి.

ముళ్లలేని బ్రహ్మజెముడు పంట నాటే ఆకులను ఎలా సేకరించుకోవాలి?

ఐసీఏఆర్‌డీఏ, ఐజీఎఫ్‌ఆర్ఐ, సీఏజెడ్ఆర్ఐ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆరిడ్ హార్టికల్చర్, బీఏఐఎఫ్ వంటి పరిశోధనా సంస్థల్లో ముళ్లలేని బ్రహ్మజెముడు నర్సరీలు ఉన్నాయి. వారి నుంచి విత్తన ఆకులను తీసుకొని నాటుకోవచ్చు. ఇప్పటికే ఈ పంట సాగు చేస్తున్న రైతుల పొలాల నుంచి ఆరోగ్యకరమైన ఆకులు లేదా కాండం ముక్కలను తెచ్చి నాటుకోవచ్చు. ముళ్లలేని బ్రహ్మజెముడు మొక్క 3-4 సంవత్సరాలలో పూర్తి పరిపక్వతకు చేరుకుంటుంది. కొందరు గ్రీన్ హౌస్‌లో కూడా పెంచుతున్నారు. చదరపు మీటరుకు రూ. 500 నుండి 600 వరకు ఆదాయాన్ని పొందవచ్చని అంచనా. రూపాయి ఖర్చుకు 3 రూపాయల ఆదాయాన్ని పొందవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. ఇతర వివరాలకు.. www.icarda.org

– నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

బిజినెస్ రీల్

సీఆర్‌పీఎఫ్‌కు ఐకామ్-కారకాల్ రైఫిల్స్ సరఫరా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కేంద్ర సాయుధ బలగాల సంస్థ సీఆర్‌పీఎఫ్‌కు రెండు వందల సీఎస్ఆర్ 338 స్నైపర్ రైఫిళ్లను సరఫరా చేసే కాంట్రాక్టును ఐకామ్ కారకాల్ దక్కించుకుంది. వీటిని హైదరాబాద్‌లోని ప్లాంటులో తయారు చేయనుంది. దేశీయంగా తొలిసారిగా ఉత్పత్తి చేసిన ఈ రైఫిల్‌ను ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో అందించనుంది. భారత్-యూఏఈ రక్షణ రంగ సహకారానికి సంబంధించి ఈ తరహా చిన్న ఆయుధాల సాంకేతిక పరిజ్ఞానం బదిలీ ఒక కీలక పరిణామం అని కారకల్ సీఈవో హమద్ అలమెరి తెలిపారు. దేశీయంగా రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్న తమ దీర్ఘకాలిక వ్యూహానికి ఈ కాంట్రాక్టు దోహదపడుతుందని ఐకామ్ టెలీ డైరెక్టర్ సుమంత్ పాతూరు వివరించారు. చిన్న ఆయుధాల తయారీ సాంకేతికత కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన ఎడ్జ్ గ్రూప్ సంస్థ కారకాల్ ఇంటర్నేషనల్‌తో మౌలిక రంగ దిగ్గజం మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) గ్రూప్ సంస్థ ఐకామ్‌కి ఒప్పందం ఉంది. ఇరు సంస్థలు కలిసి ఈ ఏడాది ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో అధునాతన చిన్న ఆయుధాల తయారీ కేంద్రాన్ని ప్రారంభించాయి. ఇక్కడి నుంచి కారకాల్ వివిధ ఆయుధాలను ఎగుమతి కూడా చేయనుంది.

మార్కెట్లోకి మ్యాటర్ 'ఎరా' ఈవీ మోటర్‌సైకిల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ మ్యాటర్ తాజాగా తమ ఎరా మోటర్‌సైకిల్‌ను హైదరాబాద్ మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఎరా 5000ప్లస్ వెర్షన్ ప్రారంభ ధర రూ. 1,93,826గా (హైదరాబాద్ ఎక్స్‌షోరూం) ఉంటుంది. ఒక్కసారి చార్జ్ చేస్తే 172 కి.మీ. రేంజి, బ్యాటరీపై లైఫ్‌టైమ్ వారంటీ తదితర ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి. ప్రస్తుతమున్న 15 డీలర్‌షిప్‌లను మరింతగా విస్తరిస్తున్నామని, హైదరాబాద్‌లో ఒకటి ఉండగా, ఖమ్మంలో మరొకటి ప్రారంభిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకుడు, సీటీవో కుమార్ ప్రసాద్ తెలికెపల్లి చెప్పారు. త్వరలో మరో 200 మిలియన్ డాలర్లు సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలిపారు. కొత్త ప్లాంటు ఏర్పాటు, ఇతరత్రా అవసరాలకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు ప్రసాద్ చెప్పారు. ఇప్పటివరకు సుమారు 75 మిలియన్ డాలర్లు సమీకరించగా, కంపెనీకి ప్రస్తుతం సాణంద్‌లో 1.2 లక్షల వాహనాల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఓ ప్లాంటు ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-9-2025

విశాఖ	540-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	560-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	755	2.82
AXISBANK	1,170.00	2.24
BAJFINANCE	1,025.90	1.93
JSWSTEEL	1,137.90	1.87
MARUTI	16,083.00	1.69

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,472.90	-2.16
TRENT	4,905.00	-2.11
SBILIFE	1,820.30	-2.01
HINDUNILVR	2,524.90	-1.84
NESTLEIND	1,167.90	-1.72

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,664
ఎన్ఎస్ఈ	1,05,317
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,97,258
ఎఫ్ఐఐ	- 3,551
డీఐఐ	+ 2,671

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	63.29	$	62.66
బ్రెంట్	67.66	$	66.28

రూపాయి క్షీణతతో ఎగుమతులు ఖుషీ

- స్వల్ప కాలంలో దేశీ ఉత్పత్తులకు దన్ను
- మరోవైపు దిగుమతుల బిల్లు మరింత భారం

న్యూఢిల్లీ: దేశీ కరెన్సీ యూఎస్ డాలరుతో మారకంలో తాజాగా చరిత్రాత్మక కనిష్టం 88.75ను తాకడంతో ఎగుమతులు పుంజుకునేందుకు వీలు చిక్కుతుంది. రూపాయి బలహీనపడటంతో అంతర్జాతీయ మార్కెట్లలో దేశీ ప్రొడక్టులు చౌకగా మారి పోటీలో బలపడనున్నాయి. దీంతో ఎగుమతిదారులకు లబ్ధి చేకూరనుంది. అయితే కరెన్సీ మారకంలో హెచ్చుతగ్గుల కారణంగా దిగుమతులకు సవాళ్లు ఎదురుకానున్నట్లు ఎగుమతిదారులు పేర్కొంటున్నారు. ముడివ్యయాలు పెరిగిపోవడంతో ప్రధానంగా రత్నాలు, బంగారు ఆభరణాలు, పెట్రోలియం, ఎలక్ట్రానిక్స్ తదితర దిగుమతి ఆధారిత రంగాలపై ప్రతికూల ప్రభావం పడనున్నట్లు తెలియజేశారు. మంగళవారం(23న) ఫారెక్స్ మార్కెట్లో డాలరుతో మారకంలో రూపాయి 47 పైసలు పతనమై 88.75 వద్ద నిలిచింది. విదేశీ ఫండ్స్ పెట్టుబడులు వెనక్కిమళ్లడానికితోడు.. హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడంతో దేశీ ఐటీ సర్వీసుల ఎగుమతులకు దెబ్బతగలనున్నట్లు ఫారెక్స్ వర్గాలు అభిప్రాయపడ్డాయి. రూపాయి పతనం స్వల్పకాలంలో ఎగుమతిదారులకు లబ్ధిని చేకూర్చనున్నట్లు భారత ఎగుమతిదారుల సమాఖ్య(ఎఫ్ఐఈవో) ప్రెసిడెంట్ ఎస్‌సీ రాల్హన్ పేర్కొన్నారు. అయితే డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ విలువ స్థిరత్వాన్ని సాధించవలసి ఉన్నట్లు తెలియజేశారు.

టారిఫ్‌ల నేపథ్యంలో..

యూఎస్ అధిక టారిఫ్‌లు అమలు చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో రూపాయి బలహీనత దేశీ ఎగుమతులకు దన్నుగా నిలవనున్నట్లు ముంబై సంస్థ టెక్నోక్రాఫ్ట్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపక చైర్మన్ ఎస్‌కే సరఫ్ పేర్కొన్నారు. రానున్న 4-5 నెలల్లో డాలరుతో మారకంలో రూపాయి విలువ 100ను చేరనున్నట్లు అంచనా వేశారు. డాలరుతో రూపాయి మారక విలువ 100కు చేరడం సాధారణ విషయంగా మారిపోవచ్చని అభిప్రాయపడ్డారు. కాగా.. రూపాయి పతనం ముడిచమురు, బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులతోపాటు.. విదేశీ చదువు, పర్యాటకాన్ని భారంగా మార్చనున్నట్లు మరొక ట్రేడర్ వివరించారు. ఎగుమతిదారులకు లబ్ధి చేకూర్చనున్నప్పటికీ, దిగుమతిదారులు అదే పరిమాణంలోని వస్తువులకు అధిక ధరను చెల్లించవలసి వస్తుందని తెలియజేశారు. దేశీ అవసరాలకు వినియోగించే చమురులో 85 శాతంవరకూ దిగుమతులనుంచి సమకూరుతున్న సంగతి తెలిసిందే. దీంతో చమురు, బంగారంతోపాటు.. ఎలక్ట్రానిక్స్, కోల్, ప్లాస్టిక్ మెటీరియల్స్, కెమికల్స్, ఫెర్టిలైజర్స్, మెషీనరీ తదితర దిగుమతులకు అధికంగా చెల్లించవలసి వస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం(2025-26) ఏప్రిల్- ఆగస్ట్ మధ్య కాలంలో ఎగుమతులు 184 బిలియన్ డాలర్లను అధిగమించగా.. దిగుమతులు 306.52 బిలియన్ డాలర్లను తాకాయి. వెరసి ఈ అంతరం వాణిజ్య లోటుకు దారితీస్తున్నట్లు ఆర్థికవేత్తలు తెలియజేశారు.



మరో పావు శాతం రేట్ల కోత

- సెప్టెంబర్ భేటీలో రెపో రేటు తగ్గించొచ్చు
- ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ తదుపరి ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపో రేటును పావు శాతం మేర (25 బేసిస్ పాయింట్లు) తగ్గించే అవకాశం ఉందని ఎస్‌బీఐ పరిశోధన విభాగం (ఎస్‌బీఐ రీసెర్చ్) అంచనా వేసింది. రెపో రేటు తగ్గింపునకు కీలకమైన ద్రవ్యోల్బణం సమీప కాలంలోనే కాకుండా వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ నియంత్రణలోనే ఉంటుందని పేర్కొంది. ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయికి దిగిరావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ ఎంపీసీ రెపో రేటును ఒక శాతం తగ్గించడం తెలిసిందే. ఆగస్ట్‌లో జరిగిన చివరి సమీక్షలో మాత్రం రేట్లను యథాతథంగా కొనసాగించింది. ఈ నెల 29 నుంచి మూడు రోజుల పాటు ఆర్‌బీఐ ఎంపీసీ సమీక్షా సమావేశం జరగనుంది. అక్టోబర్ 1న నిర్ణయాలు వెలువడనున్నాయి. తదుపరి సమీక్షలోనూ రేట్ల కోతకు వెళ్లేందుకు హేతుబద్ధత ఉన్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ఆ సందర్భంగా ఆర్‌బీఐ ఎంపీసీ వ్యక్తం చేసే అభిప్రాయాలు భవిష్యత్తు మానిటరీ పాలసీకి కీలకమవుతాయని, ఈల్డ్స్‌పై ప్రభావం చూపుతాయని తెలిపింది. ద్రవ్యోల్బణం నియంత్రణల్లో ఉన్నందున, తటస్థ విధానంతో మరో విడత రేటు కోతను చేపట్టకపోవడం వల్ల ఒనగూరే ప్రయోజనం ఉండదని పేర్కొంది. జీఎస్‌టీలో రేట్లను క్రమబద్ధీకరించడం ఫలితంగా ద్రవ్యోల్బణం మరో 65-75 బేసిస్ పాయింట్లు తగ్గుతుందని అధ్యయన నివేదికను రూపొందించిన, ఎస్‌బీఐ గ్రూప్ ముఖ్య ఆర్థిక సలహాదారు సౌమ్యకాంతి ఘోష్ అంచనా వేశారు. కొత్త సీపీఐ సిరీస్‌తో ద్రవ్యోల్బణం మరో 20-30 బేసిస్ పాయింట్లు దిగొస్తుందని చెప్పారు. దీంతో 2025-26లో, 2026-27లో ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్షిత స్థాయిలో దిగువనే ఉండొచ్చని (4 శాతానికి మైనస్, ప్లస్ 2 శాతం.. అంటే 2 శాతం) పేర్కొన్నారు.

రేపటి నుంచి వరల్డ్ ఫుడ్ ఇండియా ఈవెంట్

ప్రారంభించనున్న ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: నాలుగో విడత వరల్డ్ ఫుడ్ ఇండియా కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 25న (రేపు) ప్రారంభించనున్నారు. దేశీయంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి భారీగా పెట్టుబడులను ఆకర్షించడం, కొత్త ఆవిష్కరణలకు గ్లోబల్ హబ్‌గా భారత్‌ను తీర్చిదిద్దడం లక్ష్యంగా ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ తెలిపారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో రష్యన్ ఫెడరేషన్ ఉప ప్రధాని దిమిత్రీ ప్యాట్రిషెవ్‌తో పాటు కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తదితరులు పాల్గొనున్నారు. న్యూజిలాండ్, సౌదీ అరేబియా భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 21 దేశాలు పాల్గొంటున్నాయి. 2023లో నిర్వహించిన ఈవెంట్‌లో రూ. 33,000 కోట్ల విలువ చేసే అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) కుదిరాయి. 2024లో ప్రధానంగా టెక్నాలజీ బదలాయింపు ఒప్పందాలపై దృష్టి పెట్టారు. గత ఎడిషన్ల దన్నుతో ఈసారి మరింత భారీగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నట్లు పాశ్వాన్ తెలిపారు. ప్రాసెస్డ్ ఆహారం వల్ల స్థూలకాయం, ఇతరత్రా అనారోగ్యాలు వస్తాయనే అపోహలను పారద్రోలేందుకు ఉద్దేశించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.

ర్యాపిడోలో స్విగ్గీ వాటా విక్రయం


డీల్ విలువ రూ. 2,400 కోట్లు

న్యూఢిల్లీ: బైక్ ట్యాక్సీ అగ్రిగేటర్ ర్యాపిడోలోగల వాటాను విక్రయించేందుకు బోర్డు ఆమోద ముద్ర వేసినట్లు ఆన్‌డిమాండ్ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ తాజాగా వెల్లడించింది. ర్యాపిడో మాతృ సంస్థ రోపెన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్‌లో వాటా విక్రయం ద్వారా దాదాపు రూ. 2,400 కోట్లు అందుకోనున్నట్లు తెలియజేసింది. ర్యాపిడో సైతం ఫుడ్ డెలివరీ సేవలలోకి ప్రవేశించనున్న నేపథ్యంలో వాటా విక్రయాన్ని చేపట్టనున్నట్లు జూలైలోనే స్విగ్గీ సంకేతమిచ్చింది. దీనిలో భాగంగా 10 ఈక్విటీ షేర్లతోపాటు.. తప్పనిసరిగా మార్పిడికి లోనయ్యే 1,63,990 సిరీస్ డి ప్రిఫరెన్స్ షేర్ల(సీసీపీఎస్)ను ఎంఐహెచ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వన్ బీవీ(నెదర్లాండ్స్)కు విక్రయించనుంది. వీటి విలువ రూ. 1,968 కోట్లుకాగా.. వాటాదారులకు లబ్ధిని చేకూర్చేబాటలో పెట్టుబడులను ప్రోజస్ గ్రూప్ సంస్థ ఎంఐహెచ్‌కు విక్రయించనున్నట్లు స్విగ్గీ తెలియజేసింది. ఈ బాటలో ర్యాపిడోకు చెందిన తప్పనిసరిగా మార్పిడికి లోనయ్యే 35,958 సిరీస్ డి ప్రిఫరెన్స్ షేర్ల(సీసీపీఎస్)ను సెబీ వద్ద రిజిస్టరైన వెస్ట్‌బ్రిడ్జ్ సంస్థ సేతు ఏఐఎఫ్ ట్రస్ట్‌కు అమ్మివేయనున్నట్లు పేర్కొంది. వీటి విలువ రూ. 431.5 కోట్లుగా వెల్లడించింది. వెరసి ర్యాపిడోలో వాటాను రూ. 2,400 కోట్లకు విక్రయించనుంది. కాగా.. ఇన్‌స్టామార్ట్ బ్రాండుతో నిర్వహిస్తున్న క్విక్ కామర్స్ బిజినెస్ విభాగాన్ని పరోక్ష సొంత అనుబంధ సంస్థ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ప్రయివేట్ లిమిటెడ్‌కు బదిలీ చేయనున్నట్లు వివరించింది. స్లంప్ సేల్ పద్ధతిన విక్రయాన్ని చేపట్టనున్నట్లు తెలియజేసింది.

ఐపీవో స్ట్రీట్

ఐపీవోకు పర్పుల్ స్టైల్ ల్యాబ్స్

- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- రూ. 660 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: లగ్జరీ ఫ్యాషన్ ప్లాట్‌ఫామ్ పెర్నియా పాపప్ షాప్.. పర్పుల్ స్టైల్ ల్యాబ్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 660 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. తద్వారా రూ. 660 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికలు వేసింది. అయితే రూ. 130 కోట్లమేర ప్రీఐపీవో ప్లేస్‌మెంట్ చేపట్టే యోచనలో ఉన్నట్లు వెల్లడించింది. ఇది జరిగితే ఈమేర ఐపీవో పరిమాణం తగ్గనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 363 కోట్లు పూర్తి అనుబంధ సంస్థ పీఎస్ఎల్ రిటైల్ లీజ్ లయబిలిటీలకు వెచ్చించనుంది. పీఎస్ఎల్ వీటిని దేశీయంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు, బ్యాకెండ్ ఆఫీసుల ఏర్పాటుకు వినియోగించనుంది. సేల్స్, మార్కెటింగ్‌పై మరో రూ. 128 కోట్లు, మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. కంపెనీ ప్రధానంగా స్త్రీ, పురుషుల దుస్తులు, ఫ్యాషన్ ఆభరణాలు, పిల్లల దుస్తులు తదితరాలను విక్రయిస్తోంది. సుమారు 2.12 లక్షల ఎస్‌కేయూల ద్వారా ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియోను నిర్వహిస్తోంది. 2023లో సగటు ఆర్డర్ విలువ రూ. 39,499కాగా.. 2025కల్లా రూ. 56,106కు ఎగసింది.


మెడిక్యాప్ హెల్త్‌కేర్ సైతం

- రూ. 240 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఫార్మా రంగ దిగ్గజాల కోసం కీలక ప్యాకేజింగ్ ప్రొడక్టులను తయారు చేసే మెడిక్యాప్ హెల్త్‌కేర్ పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 240 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. తద్వారా రూ. 240 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికలు వేసింది. అయితే రూ. 48 కోట్లమేర ప్రీఐపీవో ప్లేస్‌మెంట్ చేపట్టే యోచనలో ఉన్నట్లు వెల్లడించింది. ఇది జరిగితే ఈమేర ఐపీవో పరిమాణం తగ్గనుంది. ఇష్యూ నిధులను తయారీ యూనిట్ ఏర్పాటులో భాగంగా ప్లాంటు, మెషీనరీ కొనుగోలుకి, అనుబంధ సంస్థ కేపీఎస్ఆర్ హెల్త్‌కేర్ రుణ చెల్లింపులకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా దేశ, విదేశీ ఫార్మా దిగ్గజాల కోసం యూరో హెడ్‌క్యాప్స్, బాటిల్ ప్రిఫారమ్స్ తదితరాలను రూపొందిస్తోంది.

ఈ ఏడాది మరో 5 జినోమిక్స్

- జాబితాలో వైజాగ్, భువనేశ్వర్
- లక్నో, ఇండోర్, గౌహతిలో సైతం
- అపోలో హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ అనుపమ్ వెల్లడి



ముంబై: హెల్త్‌కేర్ రంగ హైదరాబాద్ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో మరో 5 జినోమిక్స్ ఇన్‌స్టిట్యూట్స్‌ను ఏర్పాటు చేయనుంది. ప్రధానంగా తూర్పు, ఉత్తర, మధ్య భారతంలోని టైర్-2, 3 పట్టణాలలో వీటికి తెరతీయనున్నట్లు వెల్లడించింది. తద్వారా జినోమిక్స్‌ను ప్రధాన క్లినికల్ కేర్‌తో సమ్మిళితం చేయనున్నట్లు తెలియజేసింది. రానున్న మార్చి31 లోగా ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్, ఒడిషాలోని భువనేశ్వర్, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, ఉత్తరప్రదేశ్‌లోని లక్నోతోపాటు అస్సామ్‌లోని గౌహతిలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ మెడికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అనుపమ్ సిబాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయంగా 12 అపోలో జినోమిక్స్ ఇన్‌స్టిట్యూట్స్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. వీటిలో హైదరాబాద్‌సహా.. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్ ఉన్నట్లు వెల్లడించారు. వివిధ వ్యాధులు, వీటి పరిస్థితులను అర్థం చేసుకోవడంలో జినోమిక్స్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు పేర్కొన్నారు. తద్వారా సమీకృత జినోమిక్ సర్వీసులను సమకూర్చుతున్నట్లు తెలియజేశారు. తద్వారా వ్యాధుల నిర్ధారణలో కచ్చితత్వం, రోగుల వ్యక్తిగత చికిత్సా ప్రణాళికలో భద్రత, మార్గదర్శకత్వం తదితరాలను అందిస్తున్నట్లు వివరించారు. పునరుత్పత్తి సంబంధిత జినోమిక్స్, అంకాలజీ, అరుదైన జెనెటిక్ వ్యాధులలో జినోమిక్స్ ప్రత్యేక నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నట్లు అనుపమ్ పేర్కొన్నారు. రోగులకు జెనెటిక్ టెస్టింగ్, కౌన్సిలింగ్, వ్యక్తిగత చికిత్స తదితరాలలో సమీకృత సేవలు సమకూర్చుతున్నట్లు తెలియజేశారు. అపోలో జినోమిక్స్ ఇన్‌స్టిట్యూట్స్ 11,000 జినోమిక్ కన్సల్టేషన్స్ మైలురాయిని చేరినట్లు వెల్లడించారు.

జూలైలో 21.04 లక్షల మందికి ఉపాధి

- ఈపీఎఫ్‌వో కింద నమోదైన సభ్యులు
- 5.55 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ: సంఘటిత రంగంలో ఉపాధి కల్పన జూలైలో బలంగా నమోదైంది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) కింద 21.04 లక్షల మంది సభ్యులు నికరంగా చేరారు. క్రితం ఏడాది ఇదే నెలలో సభ్యుల చేరికతో పోల్చి చూస్తే 5.5 శాతం పెరుగుదల కనిపించింది. ఇందులో 9.79 లక్షల మంది కొత్తగా చేరిన సభ్యులు ఉన్నారు. ఉపాధి అవకాశాల పెరుగుదలను, ఉద్యోగుల భవిష్యనిధి ప్రయోజనాల పట్ల పెరుగుతున్న అవగాహనకు ఇది నిదర్శనమని కేంద్ర కార్మిక శాఖ ప్రకటించింది. జూలైలో నమోదైన కొత్త సభ్యుల్లో 18-25 ఏళ్ల వయసు వారు 5.98 లక్షల మంది ఉన్నారు. మొత్తం కొత్త సభ్యుల్లో (9.79 లక్షలు) వీరు 61 శాతంగా ఉన్నారు. ఇదే వయసు నుంచి చేరిన నికర సభ్యులు మొత్తంగా 9.13 లక్షల మంది ఉన్నారు. 2024 జూలై నెలతో పోల్చి చూస్తే 4 శాతం పెరిగారు. జూలైలో 45 శాతం సభ్యులు 18-25 ఏళ్ల నుంచి ఉండడం సంఘటిత రంగంలో ఉపాధి పెరుగుదలను సూచిస్తోంది. సుమారు 16.43 లక్షల మంది ఒక సంస్థలో ఉద్యోగం మానేసి, మరొక సంస్థలో చేరినట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. గతేడాది ఇదే నెలలోని గణాంకాలతో పోల్చి చూస్తే 12 శాతం మంది అధికంగా సంస్థలను మార్చినట్టు తెలుస్తోంది.

2.80 లక్షల మంది మహిళలు

జూలై నెలలో చేరిన నికర సభ్యుల్లో మహిళలు 4.42 లక్షల మంది కాగా, ఇందులో కొత్త సభ్యులు 2.80 లక్షలుగా ఉన్నారు. క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే నికర సభ్యుల్లో పెరుగుదల కేవలం 0.17 శాతంగానే ఉంది. మొత్తం నికర సభ్యుల్లో మహారాష్ట్ర నుంచి అత్యధికంగా 20.47 శాతం మంది ఉన్నారు. తమిళనాడు, గుజరాత్, హర్యానా, ఢిల్లీ, తెలంగాణ, యూపీ.. ఇలా ఒక్కో రాష్ట్రం నుంచి 5 శాతానికిపైనే సభ్యులు చేరారు. ఐరన్ ఓర్ మైనింగ్, యూనివర్సిటీలు, బీడీల తయారీ, వస్త్రాల తయారీ, ఆస్పత్రులు, ట్రావెల్ ఏజెన్సీలు ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కల్పించాయి.

భారీ నౌకల తయారీకి ఇన్‌ఫ్రా హోదా

న్యూఢిల్లీ: మేకిన్ ఇండియా నినాదంలో భాగంగా దేశీయంగా భారీ నౌకల తయారీని మరింతగా ప్రోత్సహించే దిశగా ఈ పరిశ్రమకు మౌలిక రంగ హోదాను కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇన్‌ఫ్రాలో భాగమైన రంగాల మాస్టర్ లిస్ట్‌లో రవాణా, లాజిస్టిక్స్ కేటగిరీలో దీన్ని కూడా చేర్చింది. ఈ మేరకు సెప్టెంబర్ 19న ఆర్థిక శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం 10,000 పైగా టన్నుల స్థూల టన్నేజ్ ఉండి, భారతీయ ఓనర్‌షిప్, జెండా గల వాణిజ్య నౌకలకు ఇన్‌ఫ్రా హోదా లభిస్తుంది. అలాగే దేశీయంగా తయారై, భారతీయ ఓనర్‌షిప్, ఫ్లాగ్‌తో 1,500 పైగా స్థూల టన్నేజీ గల వాణిజ్య నౌకలు కూడా ఈ కేటగిరీ కింద వస్తాయి. ఇన్‌ఫ్రా హోదా గల పరిశ్రమల్లోని సంస్థలకు .. రుణాల సమీకరణకు సంబంధించి వెసులుబాట్లు లభిస్తాయి. పన్నులపరమైన రాయితీలు మొదలైన ప్రయోజనాలు కూడా ఉంటాయి.



జీడీపీ వృద్ధి 6.5 శాతం

- గత అంచనాలు కొనసాగింపు
- ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ ప్రకటన



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) భారత జీడీపీ 6.5% వృద్ధి రేటు నమోదు చేస్తుందన్న గత అంచనాలను కొనసాగిస్తున్నట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ (అంతర్జాతీయ రేటింగ్ సంస్థ) ప్రకటించింది. వర్షాలు సమృద్ధిగా పడడం, ఆదాయపన్ను, జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో దేశీ వినియోగం బలంగా ఉంటుందని పేర్కొంది. ప్రభుత్వ పెట్టుబడులు సైతం పెరుగుతాయని అంచనా వేసింది. ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3.2 శాతానికి పరిమితం అవుతుందని, దీంతో ఆర్‌బీఐ మరో విడత పావు శాతం మేర రెపో రేటును తగ్గించొచ్చని తన తాజా నివేదికలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడం తెలిసిందే. అంచనాలకు మించి ఆహార ధరలు తగ్గడం.. ప్రస్తుత ఏడాదిలో ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయిలోనే కొనసాగేందుకు మద్దతుగా ఉంటుందని తెలిపింది. ఇది తదుపరి రేట్ల కోతకు వెసులుబాటునిస్తుందని అభిప్రాయపడింది. ఆసియా దేశాల ఉత్పత్తులపై అమెరికా టారిఫ్‌లు.. వాటి ఎగుమతులు, ప్రాంతీయ సరఫరా పరిస్థితులపై ప్రభావం చూపిస్తాయని పేర్కొంది. ''యూఎస్ టారిఫ్‌లపై జూన్‌లో వేసిన మా అంచనాల తర్వాత పరిణామాలను గమనిస్తే.. ఇప్పటి వరకు ఇతర దేశాల కంటే చైనా మెరుగ్గా వ్యవహరించింది. ఆగ్నేయాసియా అభివృద్ధి మార్కెట్లపై ప్రభావం పడగా, భారత్‌పై ఇది మరింత ఎక్కువగా ఉంది'' అని ఎస్అండ్‌పీ వివరించింది.

పోరాడి ఓడిన తరుణ్



సువన్ సిటీ: కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లికి నిరాశ ఎదురైంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 42వ స్థానంలో ఉన్న తరుణ్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ప్రపంచ 69వ ర్యాంకర్ మాడ్స్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో తరుణ్ 55 నిమిషాల్లో 21-16, 17-21, 12-21తో పోరాడి ఓడిపోయాడు. క్వాలిఫయింగ్‌లో ఉన్న మరో భారత ప్లేయర్ మైస్నమ్ మెరాబా బరిలోకి దిగకుండానే తన ప్రత్యర్థి యూ టీ బిన్ (దక్షిణ కొరియా)కు 'వాకోవర్' ఇచ్చాడు.

సింధు 13వ స్థానంలో...

మంగళవారం విడుదల చేసిన ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ పీవీ సింధు ఒక స్థానం మెరుగుపర్చుకుంది. చైనా మాస్టర్స్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరిన సింధు 13వ ర్యాంక్‌లో నిలిచింది. భారత్‌కే చెందిన ఉన్నతి హుడా 31వ స్థానంలో, మాళవిక బన్సోద్ 33వ స్థానంలో, రక్షిత శ్రీ 40వ స్థానంలో, అనుపమ 41వ స్థానంలో, తన్వీ శర్మ 44వ స్థానంలో, ఆకర్షి కశ్యప్ 48వ స్థానంలో ఉన్నారు. పురుషుల సింగిల్స్ విభాగంలో లక్ష్య సేన్ ఒక స్థానం పడిపోయి 18వ ర్యాంక్‌లో ఉండగా... ఆయుశ్ శెట్టి 27వ స్థానంలో కొనసాగుతున్నాడు. ప్రణయ్ 34వ ర్యాంక్‌లో, కిరణ్ జార్జి 36వ ర్యాంక్‌లో, కిదాంబి శ్రీకాంత్ 40వ ర్యాంక్‌లో, ప్రియాన్షు రజావత్ 43వ స్థానంలో, సతీశ్ కుమార్ కరుణాకరన్ 45వ స్థానంలో నిలిచారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ ఒక స్థానం పురోగతి సాధించి ఆరో ర్యాంక్‌కు చేరుకుంది.

కెప్టెన్‌గా దినేశ్ కార్తీక్



ముంబై: హాంకాంగ్ సిక్సెస్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు కెప్టెన్‌గా దినేశ్ కార్తీక్ వ్యవహరిస్తాడు. నవంబర్ 7 నుంచి 9 వరకు ఈ టోర్నమెంట్ జరుగుతుంది. ఒక్కో టీమ్‌లో ఆరుగురు సభ్యులు ఉండి ఆరు ఓవర్ల చొప్పున సాగే ఈ 'సిక్సెస్' టోర్నీ 1992 నుంచి నిర్వహిస్తుండగా ప్రపంచ క్రికెట్‌లో దీనికి మంచి ప్రాచుర్యం లభించింది. 2005లో ఒకసారి టైటిల్ గెలిచిన భారత్ రెండు సార్లు రన్నరప్‌గా నిలిచింది. భారత మాజీ స్పిన్నర్ అశ్విన్ కూడా ఈ టోర్నీలో ఆడే అవకాశం ఉంది.

అమన్‌కు షోకాజ్ నోటీసు



- 27లోపు వివరణ ఇవ్వాలన్న భారత రెజ్లింగ్ సమాఖ్య
- ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అధిక బరువుతో అనర్హతకు గురైన భారత స్టార్ రెజ్లర్

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అమన్ సెహ్రావత్‌కు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈనెల 27వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల క్రొయేషియా రాజధాని జాగ్రెబ్ వేదికగా జరిగిన ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ నుంచి అమన్ సెహ్రావత్ అధిక బరువు కారణంగా డిస్‌క్వాలిఫై అయ్యాడు. పురుషుల 57 కేజీల ఫ్రీస్టయిల్ కేటగిరీలో తలపడాల్సిన అమన్... నిర్ణీత బరువుకంటే 1700 గ్రాములు అధికంగా ఉండటంతో నిర్వాహకులు అతడిని పోటీ నుంచి తొలగించారు. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధిస్తాడని భావించిన అమన్ ఇలా అర్ధాంతరంగా వైదొలగడంపై డబ్ల్యూఎఫ్ఐ ఆగ్రహంగా ఉంది. ఈ పోటీలకు భారత్ నుంచి నలుగురు కోచ్‌లు వెళ్లగా... వారెవరూ అమన్ నిర్ణీత బరువు కొనసాగించడంలో తోడ్పాటు అందించకపోవడంతో సమాఖ్య వారికి కూడా నోటీసులిచ్చింది. 'ఇది ఆమోదనీయం కాదు. దీని వెనక ఉన్న కారణాలను వెలికితీయాలి. రెండు నెలల వ్యవధిలో మన అత్యుత్తమ రెజ్లర్లకు ఇలాంటి చేదు అనుభవం ఎదురైంది. దీనిపై దృష్టి సారించాల్సిన అవసరముంది. అందుకే అమన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశాం' అని డబ్ల్యూఎఫ్ఐ అధికారి తెలిపారు. చీఫ్ కోచ్ జగ్‌మందర్ సింగ్, వినోద్, వీరేందర్, నరేందర్‌లను కూడా దీనిపై వివరణ ఇవ్వాలని సమాఖ్య కోరింది. 'జాగ్రెబ్‌లో జరిగిన పోటీల్లో పాల్గొనేందుకు భారత్ నుంచి మొత్తం 10 మంది రెజ్లర్లు, నలుగురు కోచ్‌లు వెళ్లారు. టోర్నీకి 15 రోజుల ముందే అక్కడికి చేరుకున్నారు. రెజ్లర్లందరూ తమ బరువును క్రమపద్ధతిలో ఉండే విధంగా చూసుకోవడం కోచ్‌ల కర్తవ్యం. అందుకే వారు కూడా దీనికి బాధ్యులే' అని ఆ అధికారి వెల్లడించారు. సెలక్షన్ ట్రయల్స్ సమయం నుంచే బరువు విషయంలో పకడ్బందీగా ఉండాలని సమాఖ్య భావిస్తోంది. రెండు కేజీల వెసులుబాటు అంశాన్ని పక్కనపెట్టి నిర్దిష్టమైన బరువు కొనసాగించే విధంగా రెజ్లర్లకు ముందు నుంచే శిక్షణ ఇవ్వాలని అనుకుంటోంది. 'మేము ఇప్పటికే కొంతమంది కోచ్‌లతో ఈ విషయాన్ని చర్చించాం. ఇలాంటి ప్రాక్టీస్ అవసరం లేదని చెప్పాం. అది అలవాటుగా మారిపోయి... ప్రధాన పోటీలకు ముందు తక్కువ సమయంలో బరువు తగ్గించుకోవాల్సి రావడంతో రెజ్లర్లు ఇబ్బంది పడాల్సి వస్తోంది. త్వరలో జరగనున్న అండర్-23 ప్రపంచ చాంపియన్‌షిప్ ట్రయల్స్‌లో నిర్దిష్ట బరువును మాత్రమే అనుమతిస్తాం' అని ఆయన పేర్కొన్నారు. వచ్చే నెల 20 నుంచి సెర్బియా వేదికగా అండర్-23 ప్రపంచ చాంపియన్‌షిప్ జరగనుండగా... దానికి ముందు లక్నో వేదికగా అక్టోబర్ 4, 5న ట్రయల్స్ నిర్వహించనున్నారు. ఇటీవల అండర్-20 ప్రపంచ చాంపియన్‌షిప్ నుంచి ఓవర్ వెయిట్ కారణంగా అనర్హతకు గురైన యువ రెజ్లర్ నేహా సాంగ్వాన్‌పై డబ్ల్యూఎఫ్ఐ సస్పెన్షన్ వేటు వేసింది. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో భారత స్టార్ మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఇలాగే 100 గ్రాముల అధిక బరువుతో పతకం కోల్పోయిన విషయం తెలిసిందే.

'టాప్' ర్యాంక్‌లోనే స్మృతి

- బౌలింగ్‌లో ఐదో ర్యాంక్‌కు దీప్తి
- ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ స్మృతి మంధాన అగ్ర స్థానంలోనే కొనసాగుతోంది. ఆస్ట్రేలియాతో ఇటీవల జరిగిన వన్డే సిరీస్‌లో 300 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన స్మృతి మొత్తం 818 ర్యాంకింగ్ పాయింట్లతో తన నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. స్మృతి, రెండో స్థానంలో ఉన్న నాట్ సివర్ బ్రంట్ (ఇంగ్లండ్; 731) మధ్య రేటింగ్ పాయింట్లలో భారీ అంతరం ఉండటం విశేషం. భారత్‌తో మూడో వన్డేలో శతకం బాదిన బెత్ మూనీ (ఆస్ట్రేలియా) రెండు స్థానాలు మెరుగుపర్చుకొని మూడో ర్యాంక్‌కు చేరుకుంది. టాప్-10లో భారత్ నుంచి స్మృతి మినహా ఎవరూ లేకపోగా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రెండు స్థానాలు కోల్పోయి 14వ ర్యాంక్‌కు పడిపోయింది. వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్ దీప్తి శర్మ రెండు స్థానాలు మెరుగుపర్చుకొని 5వ ర్యాంక్‌కు చేరుకుంది. భారత్ నుంచి టాప్-10లో మరెవరూ లేకపోగా... స్నేహ్ రాణా 16వ ర్యాంక్‌లో కొనసాగుతోంది. ఈ జాబితాలో సోఫియా ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్), యాష్లే గార్డ్‌నర్ (ఆస్ట్రేలియా), మేగన్ షుట్ (ఆస్ట్రేలియా) వరుసగా తమ టాప్-3 ర్యాంక్‌లు నిలబెట్టుకున్నారు. వన్డే ఆల్‌రౌండర్ల జాబితాలో కూడా దీప్తి శర్మ (4వ స్థానం)కు టాప్-10లో చోటు లభించింది.



డయానా గ్రేస్‌కు మూడు పతకాలు

సాక్షి, హైదరాబాద్: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) జాతీయ స్కూల్స్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన చిల్కముక్కు డయానా గ్రేస్, చిల్కముక్కు డేనియల్ రాణించారు. మహారాష్ట్రలోని సాధ్వి ప్రీతిసుధాజీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన ఈ టోర్నీలో డయానా గ్రేస్ ఒక స్వర్ణం, రెండు కాంస్య పతకాలు సాధించగా... డేనియల్ ఒక కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. చందానగర్‌లోని కార్నర్ స్టోన్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థి డయానా గ్రేస్ అండర్-17 విభాగం టేబుల్ వాల్ట్‌లో 11 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. అన్‌ఈవెన్ బార్స్, ఆల్ అరౌండ్ విభాగంలో డయానా గ్రేస్ కాంస్య పతకాలను సాధించింది. అండర్-14 బాలుర పామెల్ హార్స్ ఈవెంట్‌లో డేనియల్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు.

మానవ్ 'పాంచ్' పటాకా

- 5 వికెట్లు తీసిన స్పిన్నర్
- ఆస్ట్రేలియా 'ఎ' 350/9
- మెరిసిన మెక్‌స్వీనీ, ఎడ్వర్డ్స్
- భారత్ 'ఎ'తో అనధికారిక టెస్టు



లక్నో: లెఫ్టార్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ (5/93) ఐదు వికెట్లతో విజృంభించడంతో... భారత్ 'ఎ'తో రెండో అనధికారిక టెస్టులో ఆస్ట్రేలియా 'ఎ' జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 84 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 350 పరుగులు చేసింది. జాక్ ఎడ్వర్డ్స్ (78 బంతుల్లో 88; 11 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ నాథన్ మెక్‌స్వీనీ (162 బంతుల్లో 74; 10 ఫోర్లు) హాఫ్ సెంచరీలు చేశారు. ఎడ్వర్డ్స్ ధనాధన్ షాట్లతో రెచ్చిపోగా... మెక్‌స్వీనీ సంయమనం పాటిస్తూ అచ్చమైన టెస్టు ఇన్నింగ్స్ ఆడాడు. ఓపెనర్ స్యామ్ కొన్‌స్టాస్ (91 బంతుల్లో 49, 7 ఫోర్లు), వికెట్ కీపర్ జోష్ ఫిలిప్ (33 బంతుల్లో 39; 5 ఫోర్లు) కూడా రాణించారు. ఒలీవర్ పీక్ (29 6 ఫోర్లు), టాడ్ మార్ఫీ (29 బ్యాటింగ్; 5 ఫోర్లు) విలువైన పరుగులు జోడించారు. ఈ మ్యాచ్‌లో భారత 'ఎ'జట్టు పలు మార్పులతో బరిలోకి దిగింది. ఇరు జట్ల మధ్య జరిగిన తొలి టెస్టు 'డ్రా'గా ముగియగా... అందులో భారత 'ఎ'జట్టు సారథిగా వ్యవహరించిన శ్రేయస్ అయ్యర్ ఈ మ్యాచ్‌లో ఆడలేదు. దీంతో అతడి స్థానంలో ధ్రువ్ జురేల్ కెప్టెన్సీ బాధ్యతలు అందుకోగా... జగదీశన్ వికెట్ కీపర్‌గా వ్యవహరిస్తున్నాడు. స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ జట్టుతో చేరాడు. ఇంగ్లండ్ పర్యటనలో దుమ్మురేపిన హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్... కాస్త విశ్రాంతి తర్వాత తిరిగి మైదానంలో అడుగు పెట్టాడు. మరోవైపు ఇంగ్లండ్ టూర్‌లో గాయపడిన ఆంధ్ర పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి... సాధికారికంగా బౌలింగ్ చేశాడు. తొలి రోజు 8 ఓవర్లు వేసిన అతడు 16 పరుగులిచ్చి వికెట్ పడగొట్టలేకపోగా... సిరాజ్ 73 పరుగులు ఇచ్చి ఒక వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ ఒక వికెట్ తీయగా... గుర్‌నూర్ బ్రార్ 2 వికెట్లు పడగొట్టాడు. చేతిలో ఒక్క వికెట్ ఉన్న ఆస్ట్రేలియా 'ఎ'రెండో రోజు మరెన్ని పరుగులు జోడిస్తుందో చూడాలి. మార్ఫీతో పాటు హెన్రీ థోర్న్‌టన్ (10 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా 'ఎ' తొలి ఇన్నింగ్స్: స్యామ్ కొన్‌స్టాస్ (సి) జగదీశన్ (బి) సిరాజ్ 49; క్యాంప్‌బెల్ (సి) సాయి సుదర్శన్ (బి) ప్రసిధ్ కృష్ణ 9; మెక్‌స్వీనీ (సి) బదోనీ (బి) గుర్‌నూర్ బ్రార్ 74; ఒలీవర్ పీక్ (బి) మానవ్ సుతార్ 29; కూపర్ కొనొల్లీ (సి) జగదీశన్ (బి) మానవ్ సుతార్ 0; ఫిలిప్ (సి అండ్ బి) మానవ్ సుతార్ 39; ఎడ్వర్డ్స్ (సి) ప్రసిధ్ కృష్ణ (బి) గుర్‌నూర్ బ్రార్ 88; విల్ సథర్లాండ్ (సి) జురేల్ (బి) మానవ్ సుతార్ 10; రొచిసియోలి (సి) రాహుల్ (బి) మానవ్ 2; మార్ఫీ (బ్యాటింగ్) 29; థోర్న్‌టన్ (బ్యాటింగ్) 10; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (84 ఓవర్లలో 9 వికెట్లకు) 350. వికెట్ల పతనం:** 1-12, 2-98, 3-144, 4-150, 5-202, 6-214, 7-266, 8-274, 9-329. **బౌలింగ్:** సిరాజ్ 13-1-73-1; ప్రసిధ్ కృష్ణ 14-3-63-1; గుర్‌నూర్ బ్రార్ 13-0-71-2; మానవ్ సుతార్ 28-4-93-5; నితీశ్ కుమార్ రెడ్డి 8-2-16-0; ఆయుశ్ బదోనీ 8-0-20.

ప్రత్యూష శుభారంభం



గుర్‌గ్రామ్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ15 మహిళల టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాచపూడి ప్రత్యూష శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రత్యూష 6-4, 6-3తో భారత్‌కే చెందిన అదితి రావత్‌పై గెలిచింది. రెండు గంటల నాలుగు నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రత్యూష ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. హైదరాబాద్‌కు చెందిన వేమూరి అభయ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో అభయ 7-5, 7-6 (7/5)తో ఆమోదిని నాయక్ (భారత్)పై విజయం సాధించింది.

నేడు హాకీ ఇండియా లీగ్ వేలం

HOCKEY INDIA LEAGUE

న్యూఢిల్లీ: హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్)లో ఓ వైపు మూడో ఫ్రాంచైజీ యూపీ రుద్రాస్ వైదొలిగినప్పటికీ మరోవైపు నిర్వాహకులు షెడ్యూల్ ప్రకారం ముందుకెళుతున్నారు. ముందు ప్రకటించినట్లుగానే నేడు హాకీ ఆటగాళ్ల మినీ వేలం పాటను నిర్వహించేందుకు హాకీ ఇండియా (హెచ్‌ఐ) సిద్ధమైంది. ఇరు విభాగాల్లో కలిపి వందకుపైగా పురుషులు, మహిళా ప్లేయర్లు ఈ వేలానికి అందుబాటులో ఉన్నారని హెచ్‌ఐ వర్గాలు వెల్లడించాయి. ఫ్రాంచైజీలు పురుషుల జట్టు కోసం గరిష్టంగా రూ.4 కోట్లు, మహిళా జట్లకైతే రూ. 2 కోట్ల పర్సును ప్లేయర్ల కొనుగోలుకు వెచ్చించాల్సి ఉంటుంది. ఒక్కో జట్టు ఏడుగురు విదేశీ ప్లేయర్లు సహా గరిష్టంగా 20 మంది ప్లేయర్లను తీసుకునే వీలుంది. ఇందులో ఇద్దరు గోల్ కీపర్లు, ముగ్గురు జూనియర్ ప్లేయర్లు తప్పనిసరి! రూ. 2 లక్షలు, రూ. 5 లక్షలు, రూ. 10 లక్షల ప్రాథమిక ధరతో ప్లేయర్లు అందుబాటులో ఉన్నారు. 'ప్రతికూలతలెన్ని ఎదురైనప్పటికీ లీగ్‌ను విజయవంతం చేసేందుకు హాకీ ఇండియా పట్టుదలతో పనిచేస్తోంది. దేశంలో హాకీ క్రీడాభివృద్ధికి లీగ్ దోహదం చేస్తుంది. హాకీలో రాణించాలనుకునే ఆటగాళ్లకు లీగ్ చక్కని వేదికగా ఉపయోగపడుతోంది. వచ్చే సీజన్‌లో ఆటగాళ్లు తమ ప్రదర్శనతో హెచ్‌ఐఎల్‌ను మరో దశకు తీసుకెళ్తారని ఆశిస్తున్నా' అని హెచ్‌ఐ అధ్యక్షుడు దిలీప్ టిర్కీ అన్నారు.

ప్రపంచకప్ టోర్నీకి గ్రేస్ హారిస్ దూరం



బెంగళూరు: ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ గ్రేస్ హారిస్... త్వరలో జరగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీకి దూరమైంది. పిక్క కండరాల గాయంతో ఇబ్బంది పడుతున్న గ్రేస్... ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న వరల్డ్‌కప్‌నకు అందుబాటులో ఉండటం లేదని సమాచారం. దీంతో ఆమె స్థానంలో సీనియర్ ఆల్‌రౌండర్ హీథర్ గ్రహమ్‌కు జట్టులో చోటు దక్కే అవకాశాలున్నాయి. ఈ నెల 30 నుంచి భారత్, శ్రీలంక వేదికగా ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ జరగనుండగా... ఆస్ట్రేలియా జట్టు డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. ఈ మెగా టోర్నీకి ముందు టీమిండియాతో ఆడిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లోనూ ఆసీస్ గెలుపొందింది. ఈ సిరీస్ సందర్భంగానే 28 ఏళ్ల హారిస్ గాయపడింది. శనివారం జరిగిన ఆఖరి మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో ఆమె కాలుకు గాయమైంది. గ్రేస్ ఇప్పటి వరకు ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరఫున ఒక వన్డే, ఐదు టి20లు ఆడి... తొమ్మిది వికెట్లు పడగొట్టింది.

పాయింట్ తేడాతో గట్టెక్కిన టైటాన్స్



గుజరాత్ రెయిడర్‌ను పట్టేసిన టైటాన్స్ ఆటగాళ్లు



యు ముంబా రెయిడర్‌ను పట్టేసిన జైపూర్

ప్రొ కబడ్డీ లీగ్‌లో ఐదో విజయం

జైపూర్: ఈ సీజన్ ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్-12)లో నిలకడగా రాణిస్తున్న తెలుగు టైటాన్స్ ఐదో విజయాన్ని సాధించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పాయింట్ తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై గట్టెక్కింది. తెలుగు టైటాన్స్ 30-29తో గుజరాత్‌ను ఓడించింది. టైటాన్స్ జట్టులో ఆల్‌రౌండర్ భరత్ రాణించాడు. 17 సార్లు కూతకెళ్లిన అతను 9 పాయింట్లు సాధించాడు. కెప్టెన్ విజయ్ మలిక్ (7) కూడా రాణించడంతో తెలుగు జట్టు క్రమం తప్పకుండా స్కోరు చేసింది. డిఫెండర్లలో శుభమ్ షిండే (4), అంకిత్ (3) ఆకట్టుకున్నారు. గుజరాత్ జట్టులో మొహమ్మద్ రెజా (6) అదరగొట్టాడు. ఇతనికి ఆర్యవర్ధన్ (4), విశ్వంత్ (3), అంకిత్ దహియా (3), లక్కీ శర్మ (2), రోహిత్ నందల్ (2) సమష్టిగా సహకరించారు. అనంతరం జరిగిన హోరాహోరీ పోరులో జైపూర్ పింక్‌పాంథర్స్ టైబ్రేక్‌లో యు ముంబాపై గెలుపొందింది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 38-38 స్కోరుతో సమంగా నిలిచాయి.

దీంతో టైబ్రేక్ నిర్వహించగా జైపూర్ 6-4తో యు ముంబాపై పైచేయి సాధించింది. పింక్ పాంథర్స్ తరఫున రెయిడర్ నితిన్ కుమార్ (14) అదరగొట్టాడు. 20 సార్లు కూతకెళ్లిన 14 పాయింట్లు తెచ్చిపెట్టాడు. మిగతావారిలో డిఫెండర్లు రెజా మిర్‌బగేరి (4), ఆశిష్ కుమార్ (3) మెరుగ్గా ఆడారు. యు ముంబా జట్టులోనూ రెయిడర్ సందీప్ (14) ప్రత్యర్థి జట్టుకు దీటుగా రాణించాడు. కూతకెళ్లిన ప్రతీసారి జైపూర్ ఆటగాళ్లను వణికించాడు. డిఫెండర్లలో లోకేశ్ (4), అనిల్ (3), పర్వేశ్ (2), రింకూ (2) ఉమ్మడిగా పాయింట్లు సాధించారు. నేడు విశ్రాంతి రోజు కాగా... గురువారం జరిగే పోటీల్లో బెంగళూరు బుల్స్‌తో యూపీ యోధాస్, దబంగ్ ఢిల్లీతో యు ముంబా తలపడతాయి.





సరస్సులో సరదా షాపింగ్.. మయన్మార్‌లోని దక్షిణ షాన్ రాష్ట్రంలోని 'కదిలే బజార్'లో కూరగాయలు, చిరుతిండి, మాంసాహారం విక్రయిస్తున్న చిరు వ్యాపారులు. మంగళవారం ఇన్‌లే సరస్సులో కనిపించిన దృశ్యాలివి

హనుమాన్ నకిలీ దేవుడు

అమెరికాలో ట్రంప్ పార్టీ నేత అనుచిత వ్యాఖ్యలు

తీవ్రంగా మండిపడుతున్న హిందూ సంఘాలు

హూస్టన్: అమెరికాలో అధికార రిపబ్లికన్ పార్టీకి చెందిన ఓ నాయకుడు హిందూమతంపై తీవ్ర విద్వేషం వెళ్లగక్కాడు. టెక్సాస్‌కు చెందిన అలెగ్జాండర్ డంకన్.. హిందువులు ఎంతో భక్తితో పూజించే హనుమంతుడిని నకిలీ దేవుడిగా అభివర్ణించాడు. టెక్సాస్ రాష్ట్రంలోని సుగర్‌లాండ్‌లో ఉన్న అష్టలక్ష్మి ఆలయం వద్ద 90 అడుగుల ఎత్తయిన హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తున్నారు. ఈ విగ్రహానికి సంబంధించిన వీడియోను గతవారం ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఆయన.. 'టెక్సాస్‌లో ఇలాంటి నకిలీ దేవుడి నకిలీ విగ్రహాన్ని ఏర్పాటుచేయటానికి మనం ఎందుకు అనుమతిస్తున్నాం. మనది క్రైస్తవ దేశం 'అని పేర్కొన్నాడు. ఆయన వ్యాఖ్యలపై హిందూ అమెరికన్ ఫౌండేషన్ (హెచ్ఏఎఫ్) ఆగ్రహం వ్యక్తంచేసింది. డంకన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ పార్టీని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎక్స్‌లో టెక్సాస్ రిపబ్లికన్ పార్టీకి ఫిర్యాదు చేసింది. 'హలో టెక్సాస్ జీవోపీ.. ఎవరిమీదా.. ఎలాంటి వివక్షనూ ప్రదర్శించరాదన్న మీ సొంత మార్గదర్శకాలనే మీ పార్టీ సెనేట్ కాండిడేట్ ఉల్లంఘించి హిందూ మతంపై విద్వేష ప్రకటన చేశాడు. ఆయనను మీరు క్రమశిక్షణలో పెడతారా?'అని చురకలంటించింది. డంకన్ వ్యాఖ్యలపై అమెరికన్లు కూడా తీవ్రంగా మండిపడుతున్నారు. 'నువ్వు హిందువు కానంత మాత్రాన నకిలీ దేవుడు అంటావా? జీసస్ భూమిపై నడవటానికి 2000 ఏళ్లకు ముందే వేదాలు **రచించబడ్డాయి.** అవి ఎంతో ఉత్కృష్టమైనవి. క్రైస్తవ మతంపై కూడా వాటి ప్రభావం ఉంది. కాబట్టి వాటిని గౌరవించాలి. వీలైతే అధ్యయనం చేయండి'**అని ఒక** ఇంటర్నెట్ యూజర్ డంకన్‌కు **సలహా** ఇచ్చాడు. ఆ విగ్రహం ఇతర **మత**స్తులు ఎవరిపైనా బలవం**తంగా** హిందువుల నమ్మకాలను **రుద్దదు** అని మరో ఇంటర్నెట్ యూ**జర్** పేర్కొన్నాడు. 'మనది క్రిస్టి**యన్** మెజారిటీ దేశమే కావచ్చు. **కానీ,** ఇక్కడ ఇతర మతాలను **అను**మతించబోము అని అంటే.. మీరు మతపరమైన రాజ్యా**నికి** ప్రాతినిధ్యం వహిస్తున్నట్లే లెక్క. అది అమెరికా విలువలకు విరుద్ధం'అని మరో వ్యక్తి ఎక్స్‌లో డంకన్‌కు చివాట్లు పెట్టాడు. అయితే, ఈ వివాదంపై టెక్సాస్ రిపబ్లికన్ పార్టీ విభాగం మాత్రం ఇంత వరకు స్పందించకపోవటం గమనార్హం.

దుస్సాహసం చేయొద్దు

ఎయిర్‌స్పేస్ ఉల్లంఘనపై రష్యాకు నాటో మరోసారి హెచ్చరిక

బ్రస్సెల్స్: తన సభ్యదేశాల గగనతలాల్లోకి రష్యా యుద్ధ విమానాలు, డ్రోన్లు తరుచూ అక్రమంగా ప్రవేశించటంపై నాటో కూటమి తీవ్రంగా స్పందించింది. పదపదే దుస్సాహసానికి పాల్పడొద్దని రష్యాను హెచ్చరించింది. తన సభ్యదేశాల రక్షణ కోసం అన్నిరకాలుగా సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. ఈ నెల ప్రారంభంలో పోలండ్, ఎస్తోనియా గగనతలాల్లోకి రష్యా డ్రోన్లు అక్రమంగా ప్రవేశించాయి. గత శుక్రవారం కూడా మూడు రష్యా ఫైటర్ జెట్లు తమ గగనతలంలోకి అక్రమంగా ప్రవేశించి 12 నిమిషాలపాటు చక్కర్లు కొట్టాయని ఎస్తోనియా ఆరోపించింది. ఈ ఆరోపణలను రష్యా తోసిపుచ్చినప్పటికీ నాటో ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించింది. రష్యా దూకుడును అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. 'సైనికపరంగానూ.. ఇతర మార్గాల ద్వారానూ మా సభ్యదేశాలను రక్షించుకుంటామనటంలో రష్యా ఏ విధమైన సందేహాలు పెట్టుకోవద్దు. ఎటునుంచి ఏ విధమైన ముప్పు వచ్చినా ఎదుర్కొంటాం'అని 32 దేశాల నాటో కూటమి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. నాటో ఒప్పందంలోని ఆర్టికల్ 5 ప్రకారం కూటమిలోని ఏ ఒక్కదేశంపై ఇతరులు దాడిచేసినా.. కూటమిలోని అన్ని దేశాలపై దాడిచేసినట్లుగానే పరిగణిస్తామని గుర్తుచేసింది. తమ దేశ సమగ్రత, సార్వభౌమత్వ రక్షణ కోసం నాటో వెంటనే జోక్యం చేసుకోవాలని నాటోను ఎస్తోనియా కోరింది. తమ గగనతలంలోకి అనుమతి లేకుండా ప్రవేశించే ఎలాంటి వస్తువులనైనా ఎలాంటి చర్చలు లేకుండా నేలకూలుస్తామని పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ సోమవారం ప్రకటించారు. అయితే, ఈ విధానాన్ని కూటమిలోని అన్ని దేశాలు అంగీకరించిందీ లేనిదీ తెలియరాలేదు. ఉక్రెయిన్- రష్యా యుద్ధం మొదలైన తర్వాత తొలిసారి ఈ నెల 10న పోలండ్ గగనతలంలో నాటో, రష్యా నేరుగా తలపడ్డట్లు వార్తలు వచ్చాయి. రష్యా డ్రోన్లు పోలండ్‌లోకి ప్రవేశించటంతో వాటిని కూల్చినట్లు ఆ దేశం ప్రకటించింది.

'బుల్డోజర్' తీర్పుతో సంతృప్తి

సీజేఐ జస్టిస్ బీ.ఆర్.గవాయ్ వెల్లడి

న్యూఢిల్లీ: బుల్డోజర్ న్యాయంపై తమ ధర్మాసనం ఇచ్చిన తీర్పు తనకు తమతో ఎంతో సంతృప్తిని ఇచ్చిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ఈ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. జస్టిస్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌ల ధర్మాసనం 2024 నవంబర్ 13న బుల్డోజర్ న్యాయంపై తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. కేవలం నేరగాళ్లు అన్న కారణంతో వారి కుటుంబాలకు చెందిన ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేయడం చట్టవ్యతిరేకం అని ధర్మాసనం తేల్చిచెప్పారు. ఈ విషయంలో కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నెల 19న సుప్రీంకోర్టు అడ్వొకేట్స్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ ప్రసంగించారు. జస్టిస్ విశ్వనాథన్‌తో కలిసి దాదాపు ఆరు నెలలపాటు ధర్మాసనంలో పనిచేసినట్లు తెలిపారు. బుల్డోజర్ న్యాయానికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు తమకు ఎంతగానో సంతృప్తిని మిగిల్చిందని అన్నారు. కుటుంబంలో ఎవరైనా ఒకరు నేరబాట పడితే ఆ మొత్తం కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ప్రధాన న్యాయమూర్తిగా ఎక్కువ కాలం పనిచేస్తేనే ఎక్కువ ప్రతిభావంతుడు, సమర్థుడు అనే ముద్ర వేయలేమని వ్యాఖ్యానించారు. జస్టిస్ లలిత్ రెండు నెలలు, జస్టిస్ సంజీవ్ ఖన్నా రెండున్నర నెలలు మాత్రమే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారని, ఎన్నో ముఖ్యమైన తీర్పులు ఇచ్చిన మంచి పేరు తెచ్చుకున్నారని గుర్తుచేశారు.

అక్టోబర్‌లో ఆర్మీ డ్రోన్ల విన్యాసాలు

పలు డ్రోన్ల సత్తా, ప్రతిదాడి సామర్థ్యాల పరిశీలన

- హెడ్‌క్వార్టర్స్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ సారథ్యంలో విన్యాసాలు
- మధ్యప్రదేశ్‌లోని సెంట్రల్ సెక్టార్‌లో నిర్వహణకు ఏర్పాట్లు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ వేళ సరిహద్దు మీదుగా పాకిస్తాన్‌కు చెందిన వందల డ్రోన్ల దండు దండయాత్రకు దిగడంతో ప్రతిదాడి ఆవశ్యకతకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలో భారత సైన్యం కొనుగోలు చేసిన, సొంతంగా అభివృద్ధిచేసిన పలు రకాల డ్రోన్ల శక్తిసామర్థ్యాలను మరోసారి పునర్‌సమీక్షించాల్సిన తరుణం ఆసన్నమైంది. వచ్చే నెలలో ఈ మేరకు డ్రోన్ల విన్యాసాల కార్యక్రమానికి హెడ్‌క్వార్టర్స్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ (హెచ్‌క్యూ ఐడీఎస్) శ్రీకారం చుట్టింది. డ్రోన్ల శక్తిసామర్థ్యాలు, శత్రు డ్రోన్లను ఎదుర్కోవడం, వాటిని నేలమట్టం చేయడం వంటి కీలక బాధ్యతలను అవి ఏమేరకు నెరవేర్చుతాయనే అంశాలను ఈ ఎక్సర్‌సైజ్‌లో పరిశీలించనున్నారు. కౌంటర్-డ్రోన్ వ్యవస్థల పనితీరునూ బేరీజువేయనున్నారు. అక్టోబర్ ఆరు నుంచి పదో తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో ఆర్మీ అధీనంలోని సెంట్రల్ సెక్టార్‌లో ఈ డ్రోన్ల విన్యాస కార్యక్రమం జరగనుందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. త్రివిధ దళాల ఉన్నతాధికారులు ఈ విన్యాసాల కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు. పహల్గాంలో ఉగ్రవాదుల పాశవిక దాడి, తదనంతరం ఆపరేషన్ సిందూర్ జరిగిన ఐదు నెలల తర్వాత డ్రోన్ల ఎక్సర్‌సైజ్ ప్రక్రియ మొదలుకావడం గమనార్హం.

సైనికపర ఆలోచన, ఆచరణలో దూకుడు..

'కోల్డ్ స్టార్ట్'ఎక్సర్‌సైజ్ విషయమై మంగళవారం ఢిల్లీలో ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ సదస్సులో ఎయిర్ మార్షల్ రాకేశ్ సిన్హా, హెచ్‌క్యూఐడీఎస్‌లో డెప్యూటీ చీఫ్ మాట్లాడారు. ''ఆపరేషన్ సిందూర్‌తో యుద్ధప్రాంతం, యుద్ధంచేసే తీరులో మార్పు వచ్చిందని స్పష్టమైంది. ఇకపై సైనికపర ఆలోచన, ఆచరణలో మరింత దూకుడు అవసరం. ''మానవరహిత వాయు వ్యవస్థలుగా ఎదిగిన డ్రోన్ల రంగంలో ఆధునిక పోకడలను అందిపుచ్చుకుంటూ ముందుకు దూసుకెళ్తాం. ఈ ఎక్సర్‌సైజ్‌లో డ్రోన్ పరిశ్రమ వర్గాలు, పరిశోధకులు, నవ్యావిష్కర్తలు, బోధనారంగ ప్రముఖులు పాల్గొంటారు. ఇన్నాళ్లూ డ్రోన్ల కేవలం సహాయకారులుగా భావించాం. ఇకపై ఘర్షణల్లో అవి కీలకభూమిక పోషించనున్నాయి. నిఘా సమాచార సేకరణ, తక్కువ శ్రేణి దాడుల్లో డ్రోన్ల సామర్థ్యం అపారం. శత్రువును డ్రోన్లతో ఏమార్చడం, మన స్థావరాలపై దాడులు చేయకుండా డ్రోన్లపై దాడి జరిగేలా చేసే శత్రు సామర్థ్యాలను వృథా చేయడం, మన స్థావరాలను సురక్షితంగా కాపాడుకోవడం వంటివెన్నో డ్రోన్లతో సాధ్యం''అని ఎయిర్ మార్షల్ రాకేశ్ సిన్హా అన్నారు. ''స్వల్ప పరిమాణంలో ఉన్న చిన్న డ్రోన్ల దండు దాడిచేయడం, ఆత్మాహుతి కామికాజి డ్రోన్లు దాడి చేయడం, నిఘా, పర్యవేక్షణ డ్రోన్లు చుట్టుముట్టడంతో ఇప్పుడు గగనతలం అనేది ఏమాత్రం క్షేమం కాదని అన్ని దేశాలకు తెలిసొచ్చింది. ఈ మేరకు సంక్లిష్ట విద్యుదయస్కాంత గగన క్షేత్రంలోనూ పైచేయి సాధించేందుకు ఆధునిక డ్రోన్లను అమ్ములపొదిలోకి చేర్చుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది''అని సిన్హా వ్యాఖ్యానించారు.

బెట్టింగ్ యాప్ కేసులో యువరాజ్ సింగ్ విచారణ

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌నకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్‌ను విచారించారు. ఆయన మంగళవారం మధ్యాహ్నం తన న్యాయవాదులతో కలిసి సెంట్రల్ ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. 1ఎక్స్‌బెట్ అనే యాప్ కార్యకలాపాల గురించి అధికారులు ఆయనను ప్రశ్నించారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద యువరాజ్ సింగ్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఇదే కేసులో అన్వేషీ జైన్ కూడా విచారణకు హాజరయ్యారు. మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్, రాబిన్ ఊతప్ప, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి, బెంగాలీ నటుడు అంకుశ్ హజ్రాను ఈడీ అధికారులు ఇప్పటికే ప్రశ్నించిన సంగతి తెలిసిందే. బుధవారం తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ సినీ నటుడు సోనూ సూద్‌ను ఆదేశించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో జనాన్ని మోసం చేసి, రూ.వందల కోట్లు కొల్లగొట్టడంతోపాటు మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు కేసు నమోదయ్యింది. ఇందులో భాగంగానే 1ఎక్స్‌బెట్ యాప్‌పై విచారణ ప్రారంభించారు. ఈ కేసులో మరికొందరు క్రీడాకారులు, సినీ నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, ప్రముఖులను ఈడీ అధికారులు ప్రశ్నించే అవకాశం కనిపిస్తోంది. అలాగే కొందరు నిందితుల ఆస్తులను సైతం అటాచ్ చేయబోతున్నట్లు సమాచారం.

సత్యేంద్రజైన్ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

రూ.7.44 కోట్ల విలువైన స్థిరాస్తులు అటాచ్ చేసినట్లు వెల్లడి

న్యూఢిల్లీ: ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) నేత, ఢిల్లీ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌కు చెందిన రూ.7.44 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం ప్రకటించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆయనపై ఈడీ దర్యాప్తు జరుపుతున్న విషయం తెలిసిందే. సత్యేంద్రజైన్, ఆయన భార్య పూనమ్ జైన్ బినామీల పేరిట ఉన్న ఆస్తులను పీఎంఎల్ఏ చట్టం కింద అటాచ్ చేస్తున్నట్లు ఈ నెల 15న ఈడీ ప్రాథమిక ప్రకటన విడుదల చేసింది. ఆ మేరకు వారి ఆస్తులను అటాచ్ చేసినట్లు మంగళవారం పేర్కొంది. 2015 నుంచి 2017 వరకు సత్యేంద్ర జైన్ ఢిల్లీ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలోనే ఆయనపై సీబీఐ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు జరుపుతోంది. 2022లో కూడా సత్యేంద్రజైన్‌కు చెందిన రూ.4.81 కోట్ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. సత్యేంద్ర జైన్‌కు సన్నిహితులైన అంకుష్ జైన్, వైభవన్ జైన్ అనే ఇద్దరు ఆయనకు బినామీలేనని ఇటీవల ఢిల్లీ హైకోర్టు నిర్ధారించింది. వారు 2016లో బ్యాంక్ ఆఫ్ బరోడా భోపాల్ బ్రాంచిలో ముందస్తు పన్ను కింద రూ.7.44 కోట్లు జమచేసినట్లు గుర్తించి అటాచ్ చేసింది.

రెండేళ్ల తర్వాత జైలు నుంచి బయటకు

క్వాలిటీ బార్ కేసులో బెయిల్‌పై వచ్చిన ఆజంఖాన్

సీతాపూర్/లక్నో: సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ మంత్రి ఆజంఖాన్ సుమారు రెండేళ్ల తర్వాత బెయిల్‌పై సీతాపూర్ జైలు నుంచి బయటకు వచ్చారు. పలు కేసులను ఎదుర్కొంటున్న ఆజంఖాన్‌కు రామ్‌పూర్ జిల్లాలోని క్వాలిటీ బార్ భూఆక్రమణ కేసులో అలహాబాద్ హైకోర్టు గతవారం బెయిల్ మంజూరుచేసింది. ఎఫ్ఐఆర్ దాఖలైన ఐదేళ్ల తర్వాత పునర్విచారణ జరిపి పోలీసులు ఆజంఖాన్‌ను నిందితుల జాబితాలో చేర్చారు. ఇది 2013 నాటి కేసు అని, చాలా జాప్యం తర్వాత పోలీసులు ఆయనపై అక్రమంగా అభియోగాలు నమోదుచేశారని ఆజంఖాన్ న్యాయవాదులు వాదించారు. 23 నెలల తర్వాత జైలు నుంచి బయటకొచ్చిన ఆయనకు మంగళవారం స్వాగతం పలికేందుకు ఉదయం నుంచి పెద్దఎత్తున అభిమానులు అక్కడికి చేరుకున్నారు. ఆయన ఇద్దరు కుమారులు కూడా అక్కడికి వచ్చారు. పోలీసులు విధించిన నిషేధాజ్ఞలు తోసిరాజని అభిమానులు భారీగా జైలు వద్దకు తరలిరావడం గమనార్హం. జైలు బయట పెద్దసంఖ్యలో మీడియా ప్రతినిధులు ఉన్నప్పటికీ ఆయన వారితో మాట్లాడకుండా వెళ్లిపోయారు. తర్వాత సొంతూరు రామ్‌పూర్‌కు వెళ్తూ మార్గమధ్యంలో బరేలీ మీడియాతో మాట్లాడుతూ.. తన కోసం దేవుడిని ప్రార్థించిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. బహుజన్ సమాజ్‌పార్టీలో చేరతారన్న ఊహాగానాలను కొట్టిపారేశారు.

నాసా టాప్-10లో ఆరుగురు మహిళలే

కొత్త వ్యోమగాముల ఎంపికలో మహిళల హవా

వాషింగ్టన్: ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళామణులు ఇప్పుడు అమెరికా వారి ప్రతిష్టాత్మక నాసా నూతన వ్యోమగాముల రేసులోనూ ముందంజలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా భౌతిక,రసాయన, సాంకేతిక రంగాల్లో ప్రతిభావంతులైన నూతన తరం వ్యోమగామి అభ్యర్థుల నుంచి తొలి పది మందిని నాసా ఎంపికచేయగా వారిలో ఆరుగురు మహిళలే కావడం విశేషం. ప్రపంచదేశాల నుంచి 8,000 దరఖాస్తులు రాగా వారిలో నుంచి అత్యంత నైపుణ్యం కనబరిచిన ఈ పది మందిని తుది జాబితాగా నాసా ఎంపికచేసి ప్రకటించింది. హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్‌సెంటర్ కార్యాలయంలో '2025 క్లాస్'టాప్-10 కొత్త వ్యోమగామి అభ్యర్థులను నాసా తాత్కాలిక చీఫ్ సీన్ డఫీ అందరికీ పరిచయం చేశారు. బెన్ బెయిలీ, లారెన్ ఎడ్గర్, ఆడమ్ ఫర్మాన్, కేమరాన్ జోన్స్, యూరీ కూబో, రెబెక్కా లాలెర్, అన్నా మీనన్, ఇమెల్డా ముల్లర్, ఎరిన్ ఒవర్‌క్యాష్, క్యాథరిన్ స్పీస్‌లను ఎంపికచేశారు. ఈ సందర్భంగా ఈ కాబోయే వ్యోమగాములను ఆయన పొగడ్తల్లో ముంచెత్తారు. నవ్య పరిశోధనలతో మానవాళి మేథస్సును మార్స్, చంద్రుని ఆవలకు తీసుకెళ్తున్న అత్యంత ప్రతిభాశాలులు, శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు నూతన ప్రతినిధులుగా వీళ్లంతా వెలుగొందబోతున్నారు. తమ స్వప్నాలను సాకారం చేసుకునేందుకు అహర్నిశలు కృషిచేయబోతున్నారు. ఇప్పుడు మీముందు నిల్చున్న వీళ్లంతా తమ వృత్తి ప్రస్థానాన్ని ఎక్కడ, ఎలా ప్రారంభించారనేది ముఖ్యం కాదు. అమెరికా గడ్డపై శిక్షణ పొంది ఆకాశమే హద్దుగా తమ కలలన నెరవేర్చుకుంటూ ఎంతటి ఘనతలు సాధించబోతున్నారు అనేదే ప్రధానం ''అని సీన్ డఫీ అన్నారు. బుధగ్రహంపై పరిశోధన కోసం నాసా దశాబ్దాల క్రితం మెర్క్యూరీ సెవన్ పేరిట ఏడుగురు వ్యోమగాముల బృందాన్ని తొలిసారిగా ప్రకటించింది. ఆనాటి నుంచి చూస్తే ఈ బ్యాచ్ 24వది. ఈ కొత్త బ్యాచ్ ఆశావహ వ్యోమగాములు వచ్చే రెండేళ్లపాటు అత్యంత కఠినమైన వ్యోమగామి శిక్షణ తీసుకోబోతున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఎలా ఆపరేట్ చేయాలి, రోబోటిక్స్, జియోలజీ, విదేశీ బాషలపై పట్టు, వైద్యం, అత్యయిక సందర్భాల్లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఎలా ప్రతిస్పందించాలి వంటి ఎన్నో అంశాల్లో వీళ్లకు నాసా సీనియర్లు తర్ఫీదు ఇవ్వనున్నారు. చంద్రునిపై నాసా చేపట్టబోయే ప్రతిష్టాత్మక ఆర్టిమిస్ మిషన్లలో వీళ్లను త్వరలో భాగస్వాములుగా చేయనున్నారు.



నాసా ఎంపిక చేసిన పది మంది వ్యోమగాములు వీళ్లే

కోర్టులు నగదు రికవరీ ఏజెంట్లా?

సుప్రీంకోర్టు అసహనం

న్యూఢిల్లీ: డబ్బు రికవరీ వంటి సందర్భాల్లో నేరచట్టాలను దుర్వినియోగం చేస్తూ కొందరు సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా మార్చుతున్నారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ పెడధోరణి మారాలని సూచించింది. ఉత్తరప్రదేశ్‌లో నగదు తిరిగి రాబట్టే క్రమంలో ఒకరిపై అపహరణ కేసు పెట్టి ఆ సివిల్ వివాదాన్ని క్రిమినల్ కేసుగా మార్చడాన్ని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌ల సింగ్‌ల ధర్మాసనం తప్పుబట్టింది. మనీ రికవరీ లక్ష్యంగా చేసే ఇలాంటి తప్పుడు క్రిమినల్ కేసుల్లో కోర్టులేమీ నగదు రికవరీ ఏజెంట్లుగా పనిచేయబోవని కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేసింది. ''ఏదైనా కేసును నమోదుచేసేటప్పుడు అది పూర్తిగా సివిల్ కేసా, క్రిమినల్ కేసా అనేది మీ స్పృహతో ఆలోచించి రిజిస్టర్ చేయండి. క్రిమినల్ చట్టాల దుర్వినియోగం అనేది న్యాయవితరణ వ్యవస్థకు పెద్ద ముప్పుగా పరిణమిస్తోంది''అని కోర్టు హెచ్చరించింది.

మధ్యప్రదేశ్‌లో సివిల్ జడ్జీల భర్తీకి సుప్రీం పచ్చజెండా

న్యూఢిల్లీ: కనీసం మూడేళ్లు లాయర్‌గా ప్రాక్టీస్ చేసిన వాళ్లే సివిల్ జడ్జీల రిక్రూట్‌మెంట్‌లో అభ్యర్థులుగా అర్హత ఉంటుందంటూ మధ్యప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు మంగళవారం పక్కనబెట్టింది. వీలైనంత త్వరగా జడ్జీ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాలని హైకోర్టుకు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. 2023 నవంబర్‌లోనే పోస్టుల రిక్రూట్‌మెంట్‌కు బహిరంగ ప్రకటన ఇచ్చారు. దాని న్యాయపరిధిని కొత్తగా సమీక్షించే అధికారం హైకోర్టుకు లేదని, మళ్లీ మెయిన్ ఎగ్జామినేషన్ పెట్టాలని ఆదేశించడం సబబుకాదని సుప్రీంకోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. అయితే సుప్రీంకోర్టు తీర్పుతో రాష్ట్రంలో మరిన్ని న్యాయసమస్యలు వస్తాయని, ఇది రాజ్యాంగవిరుద్ధమని హైకోర్టు తరఫున న్యాయవాది అశ్వనీకుమార్ దూబే వాదించారు.

సగం సామర్థ్యంలో పూర్తి పని చేయాలని మేం కోరట్లేదు

అలహాబాద్ హైకోర్టు అంశంలో సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: గత 13 ఏళ్లుగా అలహాబాద్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న తమ కేసును అత్యంత వేగంగా పరిష్కరించేలా ఆ హైకోర్టును ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. ''కొన్ని హైకోర్టుల్లో సగం మంది జడ్జీలే ఉన్నారు. అలాంటప్పుడు పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను వేగంగా పరిష్కరించాలని మేం ఎలా చెప్పగలం? అయినా హైకోర్టులపై మాకు సర్వాధికారాలు లేవు. మీరు కోరుకున్నంత మాత్రాన హైకోర్టులను అతి వేగంగా కేసులను పరిష్కరించాలని ఆదేశించలేం. మీ కేసు కన్నా ముందు నుంచే అలహాబాద్ హైకోర్టులో ఎన్నో కేసులు పెండింగ్‌లో మూలుగుతున్నాయి. వాటికంటే ముందుగా మీ పని చూడాలంటే వెళ్లి వాళ్లనే అభ్యర్థించండి''అని పిటిషనర్‌కు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది.

చెక్‌బౌన్స్ కేసులను వేగంగా పరిష్కరిస్తున్నారా?: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: చెక్ బౌన్స్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు చేపట్టారో, ఆ మేరకు తాజా స్థితిగతుల నివేదికను వెంటనే తమకు అందజేయాలని అన్ని రాష్ట్రప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల పాలనాయంత్రాంగాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ''సంప్రతింపుల చట్టం, 1881లోని 138వ సెక్షన్ ప్రకారం ఎక్కువ పెండింగ్ కేసులున్న మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో మాజీ న్యాయాధికారుల సారథ్యంలో 25 ప్రత్యేక కోర్టులను కొలువుతీర్చాలని మూడేళ్ల క్రితం సూచించాం. అవి ఏమేరకు పనిచేస్తున్నాయి? ఆ కోర్టుల్లో పోస్టులను ఎన్ని భర్తీచేశారు, ఖాళీలెన్ని, ఎన్ని చెక్‌బౌన్స్ కేసులను వేగంగా పరిష్కరించారు? వేగవంత పరిష్కారం కోసం తీసుకున్న చర్యలతో నివేదికను ఆరు వారాల్లోపు మాకు సమర్పించండి'' అని ధర్మాసనం అన్ని రాష్ట్రాలకు సూచించింది.

జుబీన్ గార్గ్‌కు తుది వీడ్కోలు

- వేలాది అభిమానుల మధ్య అస్సాం గాయకుడికి అంత్యక్రియలు
- హాజరైన కేంద్రమంత్రులు, అస్సాం సీఎం, మంత్రులు నేతలు

గువాహటి: ప్రఖ్యాత అస్సాం గాయకుడు, బాలీవుడ్ సింగర్ జుబీన్‌గార్గ్ అంత్యక్రియలు మంగళవారం గువాహటి శివార్లలోని కమర్‌కుచిలో నిర్వహించారు. ఈ నెల 19న సింగపూర్‌లో మరణించిన తమ అభిమాన గాయకుడికి తుది వీడ్కోలు పలికేందుకు వేలాదిమంది అభిమానులు, ప్రముఖులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆదివారం గువాహటికి తీసుకొచ్చిన గార్గ్ భౌతిక కాయాన్ని అభిమానుల సందర్శనార్థం అర్జున్ భోగేశ్వర్ బారువా స్పోర్ట్స్' కాంప్లెక్స్‌లో ఉంచారు. మంగళవారం ప్రత్యేక వాహనంలో భౌతికకాయాన్ని ఉంచి కమర్‌కుచికి తీసుకెళ్లారు. అంతిమయాత్ర సరుసజై, బెల్టోలా, ఖనపరా, జొరాబట్ మీదుగా సాగింది. గార్గ్ చితికి ఆయన సోదరి పల్మీ బోర్ఠకుర్, సంగీత దర్శకుడు రాహుల్ గౌతమ్ నిప్పంటించారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, కేంద్రమంత్రులు పబిత్ర మార్గరీటా, కిరెన్ రిజిజు, సర్బానంద సోనోవాల్ స్వయంగా జుబీన్ చితి పేర్చారు. జుబీన్ తండ్రి మోహినీ మోహన్ బోర్ఠకుర్, సతీమణి గరిమా సైకియా గార్గ్‌తోపాటు అస్సాం మంత్రులు, రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు, విద్యార్థి, ఇతర సంఘాల నేతలంతా అంత్యక్రియలకు హాజరయ్యారు. జుబీన్ దాదాపు 38,000 పాటలను స్వరపరిచారు. అందులోని 'మయబిని రతిర్ బుకు'అనే పాట ను తన అంత్యక్రియల సమయంలో ఆలపించాలని గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆయన ఆకాంక్షించారు. అభిమాన గాయకుడి కోరికను తీరుస్తూ అంత్యక్రియలు పూర్తయ్యేవరకు వేలమంది అభిమానులు ఆ పాటను ఆలపిస్తూనే ఉన్నారు. హిందూ సంప్రదాయంలో జుబీన్ అంత్యక్రియలు నిర్వహించారు.


వేలాది మంది అభిమానులు కన్నీటివీడ్కోలు పలికేందుకు తరలివచ్చిన దృశ్యం

పత్రికా స్వేచ్ఛ గురించి తెలిపే ఆర్టికల్ ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

ప్రకరణ 19 నుంచి 22 వరకు ఉన్న హక్కులను వివిధ స్వేచ్ఛల రూపంలో పొందుపర్చారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత స్వేచ్ఛలు చాలా విలువైనవి. కానీ ఈ స్వేచ్ఛలపై హేతుబద్ధమైన పరిమితులను విధించవచ్చు. అధికరణం 19లో ఆరు వ్యక్తిగత స్వేచ్ఛలు ఉన్నాయి.

ప్రకరణ 19 (1)

ఎ. వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ, అభిప్రాయ ప్రకటన.

బి. శాంతియుతంగా, ఆయుధాలు లేకుండా సమావేశాలు నిర్వహించడం.

సి. సంస్థలు, సంఘాల ఏర్పాటు. సహకార సంఘాల ఏర్పాటు, నిర్వహణ.

డి. దేశవ్యాప్త సంచార స్వేచ్ఛ.

ఇ. దేశవ్యాప్త స్థిర నివాస స్వేచ్ఛ.

ఎఫ్. ఆస్తిని సముపార్జించుకునే స్వేచ్ఛ. (ఈ క్లాజ్‌ను 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.)

జి. వృత్తి, వ్యాపార, వాణిజ్య స్వేచ్ఛలు.

పైన పేర్కొన్న ఆరు స్వేచ్ఛలు ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఉంటాయి. ఇవి భారత పౌరులకు మాత్రమే వర్తిస్తాయి. విదేశీయులకు, కంపెనీలకు, కార్పొరేషన్లకు వర్తించవు.

ప్రకరణ 19(1)(ఎ)లో పేర్కొన్న వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించి సుప్రీంకోర్టు విస్తృత వ్యాఖ్యానాలు చేసింది. పౌరుడు తన భావాలతో పాటు ఇతరుల భావాలను కూడా వ్యక్తీకరించవచ్చు. ఇది పత్రికా స్వేచ్ఛ ద్వారా సాధ్యమవుతుంది. కాబట్టి పత్రికా స్వేచ్ఛ(ఫ్రీడం ఆఫ్ ప్రెస్) అనేది భావ ప్రకటన స్వేచ్ఛలో అంతర్గతంగా ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

కింద పేర్కొన్న స్వేచ్ఛలు కూడా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో అంతర్గతంగా ఉంటాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

- పత్రికా స్వేచ్ఛ
- వాణిజ్య ప్రకటన స్వేచ్ఛ
- రహస్యాలను కాపాడుకునే స్వేచ్ఛ
- ప్రసారాల స్వేచ్ఛ
- సమాచార స్వేచ్ఛ
- బంద్‌కు వ్యతిరేకమైన స్వేచ్ఛ
- మౌనం పాటించే స్వేచ్ఛ
- నిరసన వ్యక్తం చేసే స్వేచ్ఛ

మినహాయింపులు

ఈ స్వేచ్ఛలపై హేతుబద్ధమైన పరిమితులను విధించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. కింది కారణాల వల్ల పరిమితులు విధించవచ్చు.

- భారత సార్వభౌమాధికారం, సమగ్రత.
- దేశ రక్షణ, విదేశాలతో స్నేహ సంబంధాలు.
- ప్రజాశాంతి, సభ్యత, మర్యాద, నీతి, కోర్టు ధిక్కారం.
- పరువు నష్టం, నేర ప్రేరేపణ తదితర ప్రాతిపదికలపై స్వేచ్ఛకు హేతుబద్ధమైన పరిమితులు విధించవచ్చు.

ఈ పరిమితులు పార్లమెంట్, శాసనసభ చర్చలకు వర్తించవు. సభాధ్యక్షుల రూలింగ్ మేరకు సభ్యులు తమ భావాలను వ్యక్తీకరించవచ్చు.

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ - సుప్రీంకోర్టు తీర్పులు

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించి సుప్రీంకోర్టు విస్తృత తీర్పులు వెలువరించింది.

శ్రేయా సింఘాల్ V/s యూనియన్ ఆఫ్ ఇండియా (2015)

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం-2000లోని సెక్షన్ 66ఎ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు విరుద్ధమని, అది చెల్లదని సుప్రీం తీర్పు చెప్పింది.

శ్రీమతి కుష్బు V/s తమిళనాడు (2012)

పౌరులు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించవచ్చు. ఒకరు వ్యక్తీకరించిన భావం నచ్చకపోతే న్యాయస్థానంలో దావా వేయవచ్చు. అంతేకానీ పూర్తిగా తమ భావాలను వ్యక్తీకరించకుండా నిషేధించడానికి వీల్లేదని వ్యాఖ్యానించింది. మేజర్లయిన స్త్రీ, పురుషులు వివాహం చేసుకోకుండా సహజీవనం చేయడం నేరం కాదని పేర్కొంది.

భరత్ కుమార్ V/s సి.పి.ఎం. (1998)

బంద్‌లు, సార్వత్రిక సమ్మెలు, ప్రాథమిక హక్కులు కావని, అవి ప్రజా జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని, బలవంతంగా ప్రజా జీవితాన్ని ప్రభావితం చేయడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు పేర్కొంది. టి.రంగరాజన్ V/s తమిళనాడు కేసు(2003)లోనూ సమ్మె చేసే హక్కు ప్రాథమిక హక్కు కాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

బిజో ఇమాన్యువల్ V/s స్టేట్ ఆఫ్ కేరళ (1986)

దీన్ని జాతీయ గీతం కేసుగా పేర్కొంటారు. జాతీయ గీతాన్ని ఆలపించడం తమ మత విశ్వాసానికి విరుద్ధమని ఎవరైనా నిరూపించగలిగితే జాతీయ గీతాన్ని ఆలపించమని ఎవరూ ఒత్తిడి చేయరాదని పేర్కొంది. ఒక వ్యక్తి మౌనంగా ఉండటం కూడా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమని వ్యాఖ్యానించింది.

మేనకా గాంధీ V/s యూనియన్ ఆఫ్ ఇండియా (1978)

పౌరులకు సంచార స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలు దేశంలో ఉన్నప్పుడే కాకుండా, విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు కూడా వర్తిస్తాయని తెలిపింది. వాటికి భౌగోళిక పరిమితి ఉండదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

నవీన్ జిందాల్ V/s యూనియన్ ఆఫ్ ఇండియా (1995)

జాతీయ జెండాను ప్రతి పౌరుడు ఎగురవేయడం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో అంతర్భాగమని ప్రకటించింది.

పత్రికలు లేదా మీడియాపై ముందస్తు సెన్సార్‌షిప్ లేదా నియంత్రణ సాధ్యం కాదు. కానీ సినిమాలపై ముందస్తు సెన్సార్‌షిప్ ఉండాలి. అది స్వేచ్ఛకు వ్యతిరేకం కాదని, బ్రిజ్ భూషణ్ V/s యూనియన్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ వివాదంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సెన్సార్‌షిప్ విషయంలో పత్రికలు/మీడియాను, సినిమాలను ఒకే విధంగా చూడటం సమంజసం కాదని పేర్కొంది.

సమాచార స్వేచ్ఛ అంటే ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించి సమాచారాన్ని తెలుసుకునే హక్కు. అది ప్రకరణ 19(1)(ఎ)లో అంతర్భాగం అని బెన్నెట్ కోల్‌మన్ కంపెనీ కేసులో 1973లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అందువల్ల 2005 జూన్‌లో పార్లమెంట్ సమాచార హక్కు చట్టాన్ని రూపొందించింది.

19 (1) (బి) - సమావేశ స్వేచ్ఛ

శాంతి భద్రతలకు భంగం కలగకుండా, ఆయుధాలు లేకుండా, శాంతియుతంగా సమావేశం కావడానికి పౌరులకు స్వేచ్ఛ ఉంది. కానీ సిక్కులు తమ మత చిహ్నమైన చిన్న కత్తిని (కృపాణం) ధరించి శాంతియుతంగా సమావేశం కావచ్చు. స్వేచ్ఛపై కూడా కొన్ని పరిమితులుంటాయి. దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు, శాంతి భద్రతలకు భంగం కలిగించేలా నిర్వహించే సమావేశాలను నిషేధించవచ్చు. ఉదా: క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 144 ప్రకారం నిషేధాజ్ఞను, కర్ఫ్యూను అమలు చేయవచ్చు.

19 (1) (సి) - సంఘాలను, సంస్థలను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ

పౌరుడు స్వచ్ఛందంగా తమకు నచ్చిన సంఘాలు, సంస్థలు స్థాపించి కార్యకలాపాలు నిర్వహించవచ్చు. నైతిక విరుద్ధమైన, సమాజ హితానికి వ్యతిరేకమైన సంస్థలను, దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు, శాంతిభద్రతలకు భంగం కలిగించే సంస్థలను, సంఘాలను అనుమతించరు.

2012లో 97వ రాజ్యాంగ సవరణ ద్వారా సహకార సంఘాలను ఏర్పాటు చేసి, నిర్వహించుకునే స్వేచ్ఛను ఆర్టికల్ 19(1)(సి)లో చేర్చారు.

19 (1) (డి) - సంచార స్వేచ్ఛ

పౌరులు తమ ఇష్ట ప్రకారం దేశమంతటా సంచరించవచ్చు. తద్వారా వారికి విశాల భావజాలం పెంపొందడమే కాకుండా వైవిధ్యాన్ని అర్థం చేసుకునే



అవకాశం లభిస్తుంది. అయితే సంచార స్వేచ్ఛపై కొన్ని ఆంక్షలను విధించవచ్చు. ప్రజల సంక్షేమం, షెడ్యూల్డ్ తెగల ప్రయోజనాలు, శాంతి భద్రతల దృష్ట్యా జన సంచారాన్ని నిషేధించవచ్చు. సంచార సమయంలో పౌరులు కొన్ని నియమ నిబంధనలు పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు.

ఉదా: వాహనదారులు హెల్మెట్లు ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం, అంటువ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు తీసుకోవడం తదితర సహేతుకమైన నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవచ్చు.

19 (1) (ఇ): నివాసం ఏర్పరచుకొని స్థిరపడే స్వేచ్ఛ

దేశంలోని ఏ ప్రాంతంలోనైనా నివాసం ఏర్పరుచుకొని స్థిరపడే స్వేచ్ఛ పౌరులకు ఉంది. అయితే ప్రజా సంక్షేమం, షెడ్యూల్డ్ ప్రాంతాల ప్రయోజనాల దృష్ట్యా ఈ హక్కుపై హేతుబద్ధమైన పరిమితులు విధించవచ్చు. జమ్మూ కశ్మీర్ రాజ్యాంగ నిబంధనల మేరకు అక్కడ స్థిరపడే హక్కు రాష్ట్రేతరులకు ఉండదు.

ప్రకరణ-20

నేరం, శిక్ష నుంచి రక్షణ పొందే హక్కు

ఈ నిబంధన ప్రకారం వ్యక్తులకు నేరం, శిక్ష నుంచి రక్షణ పొందేందుకు కొన్ని అంశాలను పొందుపరిచారు.

- 20(1) ప్రకారం తప్పు చేయనిదే ఎవరినైనా శిక్షించరాదు. ఒక వ్యక్తి చేసిన పని అది చేసిన సమయానికి చట్టరీత్యా నేరమైతేనే శిక్షించాలి. ఆ నేరానికి చట్టపరంగా విధించాల్సిన శిక్ష కంటే ఎక్కువ శిక్ష విధించరాదు. కానీ తక్కువ శిక్షను విధించవచ్చు. దీన్ని 'Doctrine of Beneficial Construction' అంటారు.
- 20(2) ప్రకారం ఒకే నేరానికి ఒకసారి కంటే ఎక్కువ సార్లు విచారించి శిక్షించరాదు.
- 20(3) ప్రకారం ఏ వ్యక్తినీ తనకు తాను వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పమని నిర్బంధం చేయరాదు.

ఒక వ్యక్తి వర్తమానంలో చేసిన పనిని భవిష్యత్ కాలంలో నేరంగా పరిగణించి శిక్షించరాదు. క్రిమినల్ చట్టాలు చేసిన రోజు నుంచి లేదా తర్వాతి కాలం నుంచి అమల్లోకి వస్తాయి. క్రిమినల్ చట్టాలు ముందుకాలానికి వర్తిస్తాయి. కానీ గత కాలానికి వర్తించవు. దీన్నే న్యాయ పరిభాషలో ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో చట్టాలు (Ex post Facto Legislations) అంటారు. ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో అంటే Now and After, Not Before అని అర్థం.

సివిల్ చట్టాలను గతకాలానికి కూడా వర్తింపజేయవచ్చు. **ఉదా:** ప్రభుత్వం ఇంటి పన్నును పెంచుతూ 2015 జనవరి 26న ఆదేశాలు జారీ చేస్తే.. అది గత ఏడాది జూలై నుంచి వర్తిస్తుందని పేర్కొనడం సమంజసమే. పౌరులు ఆ రోజు నుంచి పెరిగిన పన్నులు చెల్లించాల్సి ఉంటుంది.

డబుల్ జపార్డీ

ద్వంద్వ శిక్షలను న్యాయ పరిభాషలో డబుల్ జపార్డీ (Double Jeopardy) అంటారు. ఒక వ్యక్తి చేసిన తప్పుకు ఒకసారి శిక్ష పడి ఉంటే అదే నేరానికి మరోసారి శిక్ష వేయరాదు. ఈ రక్షణ న్యాయపరమైన ప్రక్రియలకు మాత్రమే వర్తిస్తుంది. శాఖాపరమైన, పరిపాలనాపరమైన చర్యలకు వర్తించదు.

ఉదా: ఒక ప్రభుత్వ ఉద్యోగి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే అతణ్ని ఉద్యోగం నుంచి తొలగిస్తారు. జైలు శిక్ష విధించడంతోపాటు అన్యాక్రాంతమైన ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేస్తారు. ఇక్కడ తప్పు ఒక్కటే కానీ శిక్షలు ఒకటి కంటే ఎక్కువ ఉండవచ్చు.

స్వయం సాక్ష్యం చెల్లదు

ఏ వ్యక్తినీ తనకు తాను వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పమని బలవంతం చేయరాదు. దీన్ని న్యాయభాషలో సెల్ఫ్ ఇంక్రిమినేషన్ (Self Incrimination) అంటారు. కానీ ముద్దాయి చేతిగుర్తులు, చేతిరాత, రక్త నమూనాలను అతడికి వ్యతిరేక సాక్ష్యాలుగా తీసుకుంటారు. 1978లో నందిని శతపతి V/s పి.ఎల్.డానీ కేసులో సుప్రీంకోర్టు బలవంతపు సాక్ష్యం అనే అంశాన్ని విశదీకరించింది. దీని ప్రకారం.. బెదిరించి, శారీరకంగా హింసించి, మానసిక క్షోభకు గురిచేసి నేరం ఒప్పుకునేలా చేసి సమాచారం రాబడితే అది బలవంతపు సాక్ష్యం కిందకు వస్తుందని పేర్కొంది. అలాంటి చర్యలు ఆర్టికల్ 20(3)కు వ్యతిరేకమని పేర్కొంది. నేర వైద్య శాస్త్ర పరంగా (Forensic Science) నిందితుల నుంచి సమాచా రం రాబట్టడం కొంత మేరకు చెల్లుబాటు అవుతుంది.

ఉదా: సత్యశోధన లేదా లై డిటెక్టర్ (Polygraph), నార్కో అనాలిసిస్, మైండ్ మ్యాపింగ్ మొదలైనవి. అయితే కొన్ని రసాయనాలు ఉపయోగించి చేసే నార్కో అనాలసిస్ టెస్ట్ పూర్తిగా శాస్త్రబద్ధం కాదని కొవ్వాడ గాంధీ కేసు (2011)లో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

ప్రకరణ -21

వ్యక్తి స్వేచ్ఛకు, ప్రాణానికి రక్షణ

ఇది చాలా ముఖ్యమైంది. భారత పౌరులతో పాటు విదేశీయులకు కూడా వర్తిస్తుంది. జీవించే హక్కును, ఆంతరంగిక స్వేచ్ఛను చట్టం నిర్దేశించిన పద్ధతి ప్రకారం తప్ప మరే విధంగా హరించడానికి వీల్లేదు. ఈ నిబంధన వ్యక్తి జీవించే స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుంది. చట్టం నిర్దేశించిన పద్ధతి అనే భావాన్ని జపాన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. శాసన సభల చట్టాల నిర్ణీత పద్ధతి ప్రకారం వ్యక్తి స్వేచ్ఛను హరిస్తే పైన పేర్కొన్న పద్ధతి చెల్లుబాటవుతుంది. ఈ ప్రకరణను కార్యనిర్వాహక అధికారాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా మాత్రమే పొందుపరిచారు. ఇది శాసనసభల చట్టాలకు వ్యతిరేకంగా రక్షణ ఇవ్వదు.

ప్రకరణ 21లో కల్పించిన రక్షణలు కార్యనిర్వాహక చర్యలకు వ్యతిరేకంగా మాత్రమే వర్తిస్తాయి. శాసనపరమైన చర్యలకు వర్తించవు. వీటిని న్యాయస్థానంలో ప్రశ్నించడానికి వీల్లేదు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని మేనకా గాంధీ కేసులో విస్తృతంగా వ్యాఖ్యానించింది. శాసన శాఖ చర్యలకు వ్యతిరేకంగా రక్షణ కల్పించేలా కొన్ని సూత్రాలను నిర్దేశించింది..

ఫిల్మ్ ప్రొజెక్టర్ ఏ రకం బోధనోపకరణం?



బోధనోపకరణాలు

1. బోధనోపకరణం ద్వారా దృష్టి, వినికిడిని ఏకకాలంలో ఉపయోగించి విద్యార్థి అభ్యసన అనుభవాన్ని పెంపొందిస్తే దాన్ని దృశ్య శ్రవణ బోధనోపకరణం అంటారని నిర్వచించిందెవరు?
   1) బర్టన్ 2) కార్టర్ గుడ్ 3) ఎడ్గర్ డేల్ 4) జేమ్స్ వాట్
2. చూడడం ద్వారా అభ్యసన స్థాయి శాతం?
   1) 11% 2) 35% 3) 83% 4) 100%
3. చెప్పడం, చేయడం ద్వారా స్మృతి స్థాయి శాతం?
   1) 60% 2) 75% 3) 50% 4) 90%
4. అభ్యసనానుభవాలను బట్టి బోధనోపకరణాలను మూడు విధాలుగా వర్గీకరించినవారు?
   1) జి.ఎస్.బ్రూనర్ 2) కార్టర్ ఎ.గుడ్ 3) బర్టన్ 4) ఎడ్గర్ డేల్
5. నమూనాలు ఏ రకానికి చెందిన బోధనోపకరణాలు?
   1) ప్రత్యక్షానుభవాన్నిచ్చేవి
   2) ఆరోపిత అనుభవాన్నిచ్చేవి
   3) గుర్తులతో అనుభవాన్నిచ్చేవి
   4) సంకల్పిత అనుభవాన్నిచ్చేవి
6. ప్రయోగాలు చేయడం ఏ రకమైన బోధనోపకరణం?
   1) ఆరోపిత 2) ప్రత్యక్ష అనుభవ 3) మాటలు లేదా గుర్తులతో 4) ఏదీకాదు
7. దృశ్య, శ్రవణ, దృశ్య-శ్రవణ, కృత్యాధార అనే బోధనోపకరణాల వర్గీకరణ దేన్ని బట్టి జరిగింది?
   1) అనుభవాలు 2) పరిమాణం 3) లభ్యత 4) లక్షణాలు
8. క్షేత్ర పర్యటన ఏ రకం బోధనోపకరణం?
   1) దృశ్య 2) దృశ్య-శ్రవణ 3) కృత్యాధార 4) శ్రవణ
9. ఎడ్గర్ డేల్ బోధనోపకరణాలను అనుభవాలను బట్టి ఏ ఆకారంలో అమర్చారు?
   1) గోళాకారం 2) చతురస్రాకారం 3) శంఖాకారం 4) చతుర్భుజాకారం
10. ఎడ్గర్ డేల్ శంఖువులో ప్రత్యక్ష అనుభవాల స్థానం?
    1) పీఠ భాగం 2) శిఖర భాగం 3) మధ్య భాగం 4) కింది భాగం
11. ఎడ్గర్ డేల్ శంఖువులో శాబ్దిక చిహ్నాల స్థానం?
    1) పీఠ భాగం 2) శిఖర భాగం 3) మధ్య భాగం 4) ఎక్కడైనా ఉండొచ్చు
12. పోషకాహార విలువలను నృత్య రూపకంగా చేసి బోధించడం?
    1) ప్రత్యక్ష అనుభవం 2) క్షేత్ర పర్యటన 3) ప్రదర్శన 4) నాటకీకరణ
13. ఫ్లానెల్ బోర్డ్ ఏ రకానికి చెందిన బోధనోపకరణం?
    1) ప్రదర్శనా ఉపకరణాలు
    2) త్రిపరిమాణ ఉపకరణం
    3) రేఖీయ చిత్రం
    4) ప్రక్షేపిత ఉపకరణం
14. మాతృకలు (స్పెసిమన్) ఏ రకం బోధనోపకరణం?
    1) ప్రదర్శన 2) ప్రక్షేపిత 3) కృత్యాధార 4) త్రిపరిమాణ
15. ఫిల్మ్ ప్రొజెక్టర్ ఏ రకం బోధనోపకరణం?
    1) ప్రదర్శన 2) ప్రక్షేపిత 3) కృత్యాధార 4) త్రిపరిమాణ
16. ఎడ్గర్ డేల్ అనుభవ శంఖువులో ప్రొజెక్టర్‌ల స్థానం?
    1) ప్రదర్శన బల్లలపైన
    2) చార్టు తర్వాత 3) చలనచిత్రాలపైన
    4) శాబ్దిక చిహ్నాలపైన
17. జంతువుల వర్గీకరణ రాయడానికి ఏ రకం చార్ట్ అవసరం?
    1) వ్యవస్థానుక్రమ 2) దత్తాంశ 3) వంశవృక్ష 4) క్రమానుగత
18. బార్ గ్రాఫ్‌లను ఏ విధంగా పిలుస్తారు?
    1) హిస్టోగ్రామ్‌లు 2) లైన్ గ్రాఫ్‌లు 3) సెక్టర్ గ్రాఫ్‌లు 4) వ్యంగ్య చిత్రాలు
19. వీటిలో ఏది ప్రత్యక్ష అనుభవానికి దగ్గరగా ఉంటుంది?
    1) రేఖా చిత్రం 2) త్రిమితీయ ఉపకరణం 3) రేడియో 4) శాబ్దిక చిహ్నం
20. తోలుబొమ్మలు ఏ రకం బోధనోపకరణం?
    1) కృత్యాధార 2) ప్రదర్శన 3) ప్రక్షేపిత 4) త్రిమితీయ
21. అపార దర్శక వస్తువులను ఏ ఉపకరణం ద్వారా ప్రక్షేపితం చేయొచ్చు?
    1) ఫిల్మ్ ప్రొజెక్టర్
    2) ఓవర్‌హెడ్ ప్రొజెక్టర్
    3) ఎపిడయాస్కోప్
    4) మైక్రో ప్రొజెక్టర్
22. మైక్రో ప్రొజెక్టర్ ప్రత్యేకత ఏమిటి?
    1) ఉపాధ్యాయుడి వెనుక ప్రతిబింబం
    2) అపారదర్శకత కలిగిన వస్తువుల ప్రక్షేపణ
    3) సూక్ష్మదర్శినిలోని స్లైడుల ప్రక్షేపణ
    4) సెల్లోఫేన్ పేపర్‌పైన వేసిన బొమ్మల ప్రక్షేపణ
23. ప్రొజెక్టర్ ఉపాధ్యాయుడి దగ్గరే ఉండి ప్రతిబింబం కూడా ఆయన వైపే ప్రక్షేపించడం ఏ ప్రొజెక్టర్ లక్షణం?
    1) స్లైడ్ ప్రొజెక్టర్ 2) ఓవర్ హెడ్ ప్రొజెక్టర్ 3) ఎపిడయాస్కోప్ 4) మైక్రో ప్రొజెక్టర్
24. భారతదేశంలో దూరదర్శన్ ప్రయోగాత్మక ప్రసారాలు ప్రారంభించిన సంవత్సరం?
    1) 1959 2) 1961 3) 1987 4) 1998
25. బడి తోట పెంచడం ఏ కమిటీ సూచించిన SUPWలో ఒక భాగం?
    1) మొదలియార్ 2) తారాదేవి 3) ఈశ్వరీబాయి 4) కొఠారీ
26. వైజ్ఞానిక సంఘాలు ఏ రకం బోధనోపకరణాల కిందకు వస్తాయి?
    1) ప్రక్షేపిత 2) కృత్యాధార 3) పరోక్ష 4) దృశ్య శ్రవణ
27. 1959లో మొదటి బిర్లా పారిశ్రామిక సాంకేతిక ప్రదర్శనశాలను ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) కోల్‌కతా 2) ముంబై 3) హైదరాబాద్ 4) ఢిల్లీ
28. 1977లో ముంబైలో ఏ విజ్ఞాన శాస్త్ర కేంద్రాన్ని ఏర్పాటు చేశారు?
    1) బిర్లా ప్లానిటోరియం
    2) విశ్వేశ్వరయ్య మ్యూజియం
    3) నెహ్రూ విజ్ఞాన కేంద్రం
    4) జాతీయ విజ్ఞాన కేంద్రం
29. మొక్కలను లేదా వాటి భాగాలను కొంతకాలం ఎండబెట్టి భద్రపర్చే విధానం?
    1) వివేరియం 2) చేధనం 3) టెర్రేరియం 4) హెర్బేరియం
30. అక్వేరియం అనేది ఒక?
    1) అందాన్నిచ్చే వస్తువు
    2) కృత్రిమ జీవావరణ వ్యవస్థ
    3) అన్ని రకాల జీవులుండే స్థలం
    4) చీకటి జీవులను తెలుసుకునేది
31. ప్రత్యేక స్థలాల్లో జీవించి ఉన్న జంతువులకు సహజ స్థితులను ఏర్పర్చి పరిశీలించడాన్ని ఏమంటారు?
    1) వివేరియం 2) అక్వేరియం 3) హెర్బేరియం 4) టెర్రేరియం
32. కీటకాల జీవిత చరిత్రను బోధించేందుకు దేన్ని ఉపయోగించవచ్చు?
    1) అక్వేరియం 2) వివేరియం 3) హెర్బేరియం 4) టెర్రేరియం
33. భూచరాలయాన్ని ఏ విధంగా పిలుస్తారు?
    1) వివేరియం 2) హెర్బేరియం 3) అక్వేరియం 4) టెర్రేరియం
34. అక్వేరియంలో ఉండే జీవులు?
    1) కీటకాలు 2) చేపలు 3) వృక్షాలు 4) మానవులు
35. అక్వేరియంలో ఏ మొక్కలను పెంచుతారు?
    1) గులాబీ మొక్కలు 2) కాక్టస్ 3) హైడ్రిల్లా 4) గడ్డి మొక్కలు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 1; 5) 2; 6) 2; 7) 4; 8) 3; 9) 3; 10) 1; 11) 2; 12) 4; 13) 1; 14) 4; 15) 2; 16) 3; 17) 3; 18) 1; 19) 2; 20) 4; 21) 3; 22) 3; 23) 2; 24) 1; 25) 3; 26) 2; 27) 1; 28) 3; 29) 4; 30) 2; 31) 1; 32) 2; 33) 4; 34) 2; 35) 3..

అనియత విజ్ఞాన శాస్త్ర విద్య

1. ఏ రకమైన నియమ నిబంధనలు లేకుండా సైన్స్‌పై అవగాహన ఏర్పర్చి, శాస్త్రీయ వైఖరులను అభివృద్ధి చేయడానికి పాటించే పద్ధతులేవి?
   1) విద్యా సాంకేతిక శాస్త్ర కార్యక్రమాలు
   2) నిర్బంధ విద్యా కార్యక్రమాలు
   3) అనియత విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు
   4) పాఠ్యేతర విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు
2. వైజ్ఞానిక సంఘాలు, వైజ్ఞానిక ప్రదర్శనలు, మ్యూజియాలు, సైన్స్ కమ్యూనిటీ సెంటర్‌లు.. సైన్స్ ఫెయిర్స్ (ప్రదర్శన)ల ద్వారా అందించే విజ్ఞాన శాస్త్ర విద్య?
   1) నియత విజ్ఞాన శాస్త్ర విద్య
   2) నిర్బంధ విజ్ఞాన శాస్త్ర విద్య
   3) విద్య సాంకేతిక శాస్త్రం
   4) అనియత విజ్ఞాన శాస్త్ర విద్య
3. వైజ్ఞానిక సంఘాలు ఏ రంగాలను ప్రభావితం చేస్తాయి?
   1) జ్ఞానాత్మక - భావావేశ
   2) భావావేశ, మానసిక చలనాత్మక
   3) మానసిక చలనాత్మక, జ్ఞానాత్మక
   4) జ్ఞాన, భావావేశ, మానసిక చలనాత్మక
4. వైజ్ఞానిక సంఘాలు విద్యార్థులకు పని - అనుభవం కలిగించే ప్రక్రియలు అని తెలిపినవారు?
   1) మొదలియార్ 2) కొఠారీ 3) తారాదేవి 4) రాధాకృష్ణన్
5. కిందివాటిలో ఏది వైజ్ఞానిక సంఘ లక్ష్యం కాదు?
   1) విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులను పెంపొందించడం
   2) అనాదిగా వస్తున్న ఆచారాలను నమ్మడం
   3) విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను, పెంపొందించడం
   4)విరామకాలాన్ని సద్వినియోగపర్చుకునేలా చేయడం
6. సాధారణ సంఘాలు, ప్రత్యేక అభిరుచి సంఘాలు అనేవి ఏ సంఘంలో రకాలు?
   1) వైజ్ఞానిక సంఘం
   2) విహార యాత్ర సంఘం
   3) సేవా సంఘం 4) శాస్త్రవేత్తల సంఘం
7. ఫొటోగ్రాఫర్ క్లబ్ ఏ రకమైన సంఘం?
   1) సాధారణ సంఘం
   2) సాంస్కృతిక సంఘం
   3) ప్రత్యేక అభిరుచి సంఘం
   4) సేవా సంఘం
8. పాఠశాలలో వైజ్ఞానిక సంఘానికి మార్గదర్శి లేదా ప్రతిపాదకుడుగా వ్యవహరించాల్సిన వారు?
   1) ప్రధానోపాధ్యాయుడు 2) డీఈవో
   3) ఆ ప్రాంతంలోని శాస్త్రవేత్త
   4) విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు
9. కిందివాటిలో వైజ్ఞానిక సంఘం ఏర్పాటుకు పరిగణనలోకి తీసుకోని అంశం ఏది?
   1) ప్రభుత్వ గుర్తింపు
   2) కమిటీల ఏర్పాటు 3) నియమాలు
   4) సమావేశాలు, కార్యక్రమాలు
10. NCERT సూచనల ప్రకారం వైజ్ఞానిక సంఘంలో ప్రధానోపాధ్యాయుని పాత్ర?
    1) మార్గదర్శి 2) నియంత 3) పోషకుడు 4) సేవకుడు
11. సంఘం ఉద్దేశాలను, సంఘ కార్యక్రమాలను, ప్రదర్శనలు, వైజ్ఞానిక నాటకాల గురించి పరిసర సమాజానికి తెలియజేసే వైజ్ఞానిక సంఘ నిర్వాహక కమిటీ వ్యక్తి?
    1) అధ్యక్షుడు 2) కార్యదర్శి 3) పోషకుడు 4) ప్రచారాధికారి
12. కిందివాటిలో ఏది వైజ్ఞానిక సంఘ కార్యక్రమం కాదు?
    1) క్షేత్ర పర్యటన
    2) మాక్ పార్లమెంట్ నిర్వహణ
    3) బడి తోట నిర్వహణ
    4) పర్యావరణ దినోత్సవ నిర్వహణ
13. విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు, తగిన నైపుణ్యాలు పెంపొందించి వారు భావి శాస్త్రవేత్తలుగా రూపుదిద్దుకొనేందుకు ప్రతి ఏటా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు?
    1) మండల విద్యాశాఖ
    2) రాష్ట్ర విద్యాశాఖ
    3) NCERT 4) CBSE
14. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిల వైజ్ఞానిక ప్రదర్శనలు ఎవరి ఆర్థిక సహాయంతో జరుగుతాయి?
    1) NCERT– SCERT
    2) విద్యా శాఖా మంత్రి
    3) ముఖ్యమంత్రి 4) డీఈవో
15. జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన కమిటీ చైర్మన్‌గా వ్యవహరించేవారు?
    1) కలెక్టర్ 2) డీఈవో
    3) డైట్ ప్రిన్సిపాల్
    4) జిల్లాలో అవార్డు తెచ్చుకున్న సైన్స్ టీచర్
16. లైబ్రరీ అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
    1) గ్రీకు 2) పర్షియా 3) ఇంగ్లిష్ 4) లాటిన్
17. 'లైబర్' అనే మాటకు అర్థం?
    1) పుస్తకం 2) రాయడం 3) జ్ఞానం 4) సేకరించడం
18. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలయం ఎవరి ఆధీనంలో ఉంటుంది?
    1) ప్రధానోపాధ్యాయుడు
    2) జిల్లా విద్యాశాఖాధికారి
    3) తరగతిలో, సైన్స్‌లో తెలివి కలిగిన విద్యార్థి
    4) విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు
19. వేటి నిర్వహణలో ఇండెక్స్ కార్డ్, క్యాటలాగ్‌లను తప్పనిసరిగా ఏర్పర్చాలి?
    1) సైన్స్ క్లబ్ 2) సైన్స్ లైబ్రరీ 3) సైన్స్ ఫేర్ 4) ఫీల్డ్ ట్రిప్
20. ప్రతి పాఠశాలలో ప్రత్యేక విజ్ఞాన శాస్త్ర గ్రంథాలయం ఉండాలి అని ప్రతిపాదించిన వారు?
    1) కొఠారీ కమిషన్
    2) మొదలియార్ కమిషన్
    3) ఆలిండియా సైన్స్ సెమినార్
    4) రాధాకృష్ణన్ కమిషన్
21. హైదరాబాద్‌లోని ప్లానిటోరియం పేరు?
    1) బిర్లా 2) టాటా 3) గెలాక్సీ 4) గెలీలియో
22. విక్రం సారాభాయ్ సమాజ విజ్ఞాన కేంద్రాన్ని 1966లో ఎక్కడ ప్రారంభించారు?
    1) అహ్మదాబాద్ 2) ముంబై 3) లక్నో 4) అలహాబాద్
23. అంతర్జాతీయ సైన్స్ మ్యూజియాన్ని కేంద్ర ప్రభుత్వం ఎక్కడ నిర్వహిస్తుంది?
    1) హైదరాబాద్ 2) కోల్‌కతా 3) చెన్నై 4) న్యూఢిల్లీ

సమాధానాలు

1) 3; 2) 4; 3) 4; 4) 2; 5) 2; 6) 1; 7) 3; 8) 4; 9) 1; 10) 3; 11) 4; 12) 2; 13) 3; 14) 1; 15) 2; 16) 1; 17) 1; 18) 4; 19) 2; 20) 3; 21) 1; 22) 1; 23) 2.

ఆమ్లాలు, క్షారాలు - వాటి స్వభావాలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
కెమిస్ట్రీ

అన్ని పోటీ పరీక్షల్లో జనరల్ సైన్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ.. నిత్య జీవితంలో భాగంగా ఉండే అంశాలు. పోటీ పరీక్షలకు ప్రశ్నపత్రం ప్రిపేర్ చేసేవారికి వెంటనే స్ఫురించే అంశాలలో పదార్థాల స్వభావం ఒకటి. ఎందుకంటే మన జీవన క్రియల్లో పాల్పంచుకోవడంతో పాటు ప్రభావితం చేసే అనేక ఇతర అంశాల్లో ఆమ్లాలు, క్షారాలు, లవణాలు ముఖ్యమైనవి.

ఆమ్లాలు,క్షారాలు నిత్యజీవితంలో ఎంతో ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. ఉదరంలో ఉన్న హైడ్రోక్లోరిక్ ఆమ్లం మనం తిన్న ఆహారం సరిగా జీర్ణం కావడానికి దోహదం చేయడంతో పాటు ఇన్ఫెక్షన్‌లు రాకుండా కాపాడుతుంది.సంప్రదాయంగా ఇస్తున్న తాంబూలంలో తమలపాకుపై సున్నపు తేట ఒక క్షారం. ఇది ఎసిడిటీ రాకుండా కాపాడే ఒక మంచి ఆచారం. అయితే ప్రస్తుతం మనం తినగానే వెంటనే 'కూల్ డ్రింక్' తాగుతుంటాం. అందులోని ఫాస్ఫారిక్ ఆమ్లంతో పాటు ఉన్న కార్బొనిక్ ఆమ్లం ఉదరంలో చేరడంతో మంటను చల్లార్చడానికి పెట్రోలు చల్లిన చందంగా అవుతుంది.

కొన్ని సహజ సిద్ధమైన అమ్లాలు

పచ్చళ్లు నిల్వ ఉంచడానికి ఉప్పును మంచి నిల్వ కారిణిగా వాడతారు. మనం రుచి కోసం కూరల్లో వేసే ఉప్పు (సోడియం క్లోరైడ్) ఉదరంలో హైడ్రోక్లోరిక్ ఆమ్ల ఉత్పత్తికి తోడ్పడుతుంది. అదే విధంగా సోడియం బెంజోయేట్ ఒక మంచి 'ఆహార నిల్వకారిణి'. ఎర్ర చీమ కుడితే ఫార్మిక్ ఆమ్లం ఇంజెక్ట్ అవుతుంది. వెనిగర్ అనేది ఎసిటికామ్లం. గతంలో ఈ అంశంపై అనేకసార్లు ప్రశ్నలు వచ్చాయి. వివిధ ఆమ్ల, క్షారాలు-వాటి స్వభావాలు, ధర్మాలు, వివిధ లవణాలు-వాటి ఉపయోగాలపై ప్రశ్నలు అడగవచ్చు.

అనేక సిద్ధాంతాలు:

ప్రాచీన కాలం నుంచి పుల్లని రుచి కలిగిన పదార్థాలను ఆమ్లాలని, చేదు కలిగిన వాటిని క్షారాలని వ్యవహరించేవారు. ఈ రెండూ కాని వాటిని లవణాలని చెప్పేవారు. ఆ తర్వాత ఆమ్లాలలో ఆక్సిజన్ తప్పనిసరిగా ఉంటుందని కొందరు, హైడ్రోజన్ ఉంటుందని మరికొందరు శాస్త్రవేత్తలు భావించారు. లాటిన్ భాషలో 'అసిడస్' అంటే 'పులుపు' అని అర్థం. ప్రస్తుతం ఆమ్ల-క్షారాలకు సంబంధించి మూడు సిద్ధాంతాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అవి.. అర్హీనియస్, లూయీ, బ్రాన్‌స్టెడ్-లోరీ సిద్ధాంతాలు.

అర్హీనియస్ సిద్ధాంతం

లోతుగా వెళ్లకుండా సాధారణ పరిభాషలో ఆమ్ల-క్షార భావనను వివరించడానికి అర్హీనియస్ సిద్ధాంతం అనువైంది. ఈ సిద్ధాంతం ప్రకారం జల ద్రావణంలో ప్రోటాన్(H^+)ను ఇచ్చే పదార్థాలు ఆమ్లాలు.



హైడ్రాక్సిల్ అయాన్(OH^-) ఇచ్చేవి క్షారాలు. ఆమ్లాలు క్షారాలతో కలిసి నీటితో పాటు లవణాన్ని ఏర్పరుస్తాయి. ఉదాహరణకు హైడ్రోక్లోరిక్ ఆమ్లం (HCl), సోడియం హైడ్రాక్సైడ్($NaCl$)తో కలిసి సోడియం క్లోరైడ్ అనే లవణాన్ని ఏర్పరుస్తుంది.

ఆమ్లాలు-ఇతర ధర్మాలు:

- నీలి లిట్మస్‌ను ఎరుపు రంగులోకి మారుస్తాయి.
- చురుకైన లోహాలతో చర్య పొంది హైడ్రోజన్ వాయువును విడుదల చేస్తాయి.
- కార్బొనేటులు, బైకార్బొనేటులలో చర్యను పొందినపుడు బుసబుసమని పొంగుతూ కార్బన్‌డైఆక్సైడ్(CO_2) వాయువు విడుదలవుతుంది. ఉదా: చలువరాతి ముక్కలు (కాల్షియం కార్బొనేట్-$CaCO_3$)పై హైడ్రోక్లోరిక్ ఆమ్లం పోస్తే CO_2 వస్తుంది.
  $CaCO_3+2HCl \rightarrow CaCl_2+H_2O+CO_2$ అదే విధంగా తినేసోడా (సోడియం బైకార్బొనేట్ -$NaHCO_3$) మన ఆహారంతో పాటు తీసుకున్నప్పుడు తేన్పుల రూపంలో CO_2 బయటకు రావడాన్ని మనం గమనించవచ్చు.
  $NaHCO_3+HCl \rightarrow NaCl+H_2O+CO_2$
- ఆమ్లాలు చాలా వరకు మంచి విద్యుత్ వాహకాలు

కొన్ని బలహీన ఆమ్లాలు

- కార్బోనిక్ ఆమ్లం-H_2CO_3
- ఫార్మిక్ ఆమ్లం-$HCOOH$
- ఎసిటిక్ ఆమ్లం-CH_3COOH

బలమైన ఆమ్లాలు

- హైడ్రోక్లోరిక్ ఆమ్లం-HCl
- సల్ఫ్యూరిక్ ఆమ్లం- H_2SO_4
- నైట్రిక్ ఆమ్లం-HNO_3
- ఫాస్ఫారిక్ ఆమ్లం-H_3PO_4

క్షారాల సాధారణ ధర్మాలు:

- సబ్బు నురగ వంటి జారుడు స్వభావం గల చేదుగా ఉండే పదార్థాలు
- ఎరుపు లిట్మస్ పేపర్‌ను నీలి రంగులోకి మారుస్తాయి.
- కాస్టిక్ సోడా వంటి బలమైన క్షారాలు చేతిపై పడినప్పుడు చర్మాన్ని తినేస్తాయి.

బలహీన క్షారాలు:

- మెగ్నీషియం హైడ్రాక్సైడ్-$Mg(OH)_2$
- కాల్షియం హైడ్రాక్సైడ్-$Ca(OH)_2$
- అల్యూమినియం హైడ్రాక్సైడ్-$Al(OH)_3$
- అమ్మోనియం హైడ్రాక్సైడ్-NH_4OH

బలమైన క్షారాలు:

- సోడియం హైడ్రాక్సైడ్ -$NaOH$
- పొటాషియం హైడ్రాక్సైడ్ -KOH

కొన్ని లవణాలు:

- సోడియం క్లోరైడ్ -$NaCl$
- అమ్మోనియం క్లోరైడ్ -NH_4Cl
- సోడియం కార్బొనేట్ -Na_2CO_3

p^H:

ఆమ్ల క్షార బలాలను కొలవడానికి సొరెన్‌సెన్ పరిచయం చేసిన 'p^H స్కేలు' అనే పరిభాషను ఉపయోగిస్తారు. ఆమ్లాల p^H విలువ 1-7 వరకు. క్షారాల p^H విలువ 7-14 వరకు. తటస్థ పదార్థాల p^H విలువ 7. బలమైన ఆమ్లాల p^H విలువ ఒకటికి దగ్గరగా ఉంటే బలమైన క్షారాల p^H విలువ 14కు దగ్గరగా ఉంటుంది.

లవణ జల విశ్లేషణ:

కొన్ని లవణాలు నీటిలో కరిగించినపుడు ఆ ద్రావణానికి ఆమ్ల లేదా క్షార స్వభావం వస్తుంది. ఆ దృగ్విషయాన్నే లవణ జల విశ్లేషణ అంటారు. సాధారణంగా బలమైన క్షారం -బలహీనమైన ఆమ్లం కలయికతో ఏర్పడిన లవణాల జలద్రావణం క్షార స్వభావాన్ని కలిగి ఉంటుంది.
ఉదా: సోడియం బైకార్బొనేట్ -$NaHCO_3$
సోడియం కార్బొనేట్ -Na_2CO_3
అందుకే తినేసోడా ($NaHCO_3$) అధికంగా వాడినపుడు ఆమ్లత్వం (acidity) పెరిగి ఉదరంలో మంట మండినట్లు అనిపించడం గమనించవచ్చు. ఇదే చివరకు అల్సర్లకు కూడా దారితీయవచ్చు.

కొన్ని నమూనా ప్రశ్నలు

1. పెరుగు పులుపునకు కారణమైన ఆమ్లం
   1) ఫార్మిక్ ఆమ్లం 2) ఎసిటిక్ ఆమ్లం
   3) టార్టారిక్ ఆమ్లం 4) లాక్టిక్ ఆమ్లం
2. నారింజ వంటి నిమ్మ జాతి పండ్లలో ఉండే ఆమ్లం
   1) సిట్రిక్ ఆమ్లం 2) హైడ్రోక్లోరిక్ ఆమ్లం
   3) ఫార్మిక్ ఆమ్లం 4) లాక్టిక్ ఆమ్లం
3. కిందివాటిలో బలహీన ఆమ్లం ఏది?
   1) హైడ్రోక్లోరిక్ ఆమ్లం 2) నైట్రిక్ ఆమ్లం
   3) సల్ఫ్యూరిక్ ఆమ్లం 4)కార్బొనిక్ ఆమ్లం
4. సబ్బుల పరిశ్రమలో ఉపయోగించే కాస్టిక్ సోడాగా పిలిచే క్షారం ఏది?
   1) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   2) కాల్షియం హైడ్రాక్సైడ్
   3) సోడియం హైడ్రాక్సైడ్
   4) అల్యూమినియం హైడ్రాక్సైడ్
5. కిందివాటిలో తటస్థమైనది ఏది?
   1) నీరు 2) సోడియం క్లోరైడ్ జల ద్రావణం
   3) 1, 2 4) లాలాజలం
6. ఉసిరికాయలో ఎక్కువగా ఉండే ఆమ్లం ఏది?
   1) ఫార్మిక్ ఆమ్లం 2) ఆస్కార్బిక్ ఆమ్లం
   3) ఎసిటిక్ ఆమ్లం 4)టార్టారిక్ ఆమ్లం
7. జతపరచండి:
   ఎ. ఎర్రచీమలు 1. టార్టారిక్ ఆమ్లం
   బి. వెనిగర్ 2. హైడ్రోక్లోరిక్ ఆమ్లం
   సి. పొట్టలోని ఆమ్లం 3. ఫార్మిక్ ఆమ్లం
   డి. బేకింగ్ పౌడర్ తయారీలో ఉపయోగించే ఆమ్లం 4. ఎసిటిక్ ఆమ్లం

	ఎ	బి	సి	డి
1)	2	4	3	1
2)	1	3	2	4
3)	3	4	2	1
4)	4	2	1	3

8. నీటిలో చాకలిసోడా (సోడియం కార్బొనేట్) కరిగిస్తే వచ్చే ద్రావణం
   1) ఆమ్లయుతం 2) క్షారయుతం
   3) తటస్థం 4) చెప్పలేం
9. పాన్ తయారీలో తమలపాకుపై రాసే సున్నపు తేటలోని రసాయనం
   1) కాల్షియం కార్బొనేట్
   2) కాల్షియం హైడ్రాక్సైడ్
   3) సోడియం బైకార్బొనేట్
   4) సోడియం కార్బొనేట్
10. గ్యాస్ట్రిక్ రసం విలువ
    1) 2 2) 7 3) 10 4)14
11. జతపరచండి:
    జాబితా 1 (పదార్థం)
    ఎ. సారవంతమైన పదార్థం
    బి. లాలాజలం
    సి. మూత్రం
    డి. రక్తం
    జాబితా 2 (p^H విలువ)
    1. 6 - 6.8
    2. 6.2 - 6.9
    3. 4.8 - 7.5
    4. 7.1 - 7.4

	ఎ	బి	సి	డి
1)	1	2	3	4
2)	4	3	2	1
3)	3	2	1	4
4)	2	4	1	3

12. బలమైన ఆమ్లాలను తరలించే కంటెయినర్లను దేనితో రూపొందిస్తారు?
    1) ఇత్తడి 2) కంచు 3) రాగి 4) సీసం
13. సిరా మరకలను తొలగించడానికి వాడే ఆమ్లం ఏది?
    1) లాక్టిక్ ఆమ్లం 2) ఆక్జాలిక్ ఆమ్లం
    3) టార్టారిక్ ఆమ్లం 4) ఎసిటిక్ ఆమ్లం
14. మానవుల జీర్ణ వ్యవస్థలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం (గ్రూప్-1, 2012)
    1) అసిటిక్ ఆమ్లం 2) హైడ్రోక్లోరిక్ ఆమ్లం
    3) ఫార్మిక్ ఆమ్లం 4) నైట్రిక్ ఆమ్లం
15. అత్యధిక ఆమ్లాలలో సాధారణంగా ఉండే మూలకం
    1) గంధకం 2) ఉదజని
    3) క్లోరిన్ 4) ఆక్సిజన్
16. రసాయనికంగా వంట సోడా
    1) బేకర్స్ ఈస్ట్ 2) కాల్షియం ఫాస్ఫేట్
    3) సోడియం బైకార్బనేట్
    4) సోడియం క్లోరైడ్
17. వెనిగర్ దేని జల ద్రావణం (గ్రూప్-2, 2008)
    1) ఆక్సాలిక్ ఆమ్లం 2) సిట్రిక్ ఆమ్లం
    3) అసిటిక్ ఆమ్లం 4) హైడ్రోక్లోరిక్ ఆమ్లం
18. కింది వాటిలో ఆమ్ల విరోధి
    1) బేకింగ్ సోడా
    2) మిల్క్ ఆఫ్ మెగ్నీషియం
    3) అల్యూమినియం హైడ్రాక్సైడ్
    4) అన్నీ
19. మిల్క్ ఆఫ్ లైమ్ అనేది
    1) కాల్షియం కార్బొనేట్
    2) కాల్షియం హైడ్రాక్సైడ్
    3) మెగ్నీషియం హైడ్రాక్సైడ్ 4) లాక్టిక్ ఆమ్లం
20. ఆమ్ల వర్షాల్లో భూమిని చేరే ప్రధాన ఆమ్లాలు
    1) నైట్రిక్ ఆమ్లం, హైడ్రోక్లోరిక్ ఆమ్లం
    2) సల్ఫ్యూరిక్ ఆమ్లం, నైట్రిక్ ఆమ్లం
    3) ఫార్మిక్ ఆమ్లం, ఎసిటిక్ ఆమ్లం
    4) హైడ్రోక్లోరిక్ ఆమ్లం,సల్ఫ్యూరిక్ ఆమ్లం
21. కింది వాటిలో సరిగా జతపరచనిది ఏది?
    1) ఆహార నిల్వకారిణి-సోడియం బెంజోయేట్
    2) టేబుల్ సాల్ట్-సోడియం క్లోరైడ్
    3) నిమ్మ ఉప్పు-సిట్రిక్ ఆమ్లం
    4) చాకలి సోడా-సోడియం బైకార్బొనేట్
22. కింది వాటిలో సరికాని వాక్యం ఏది?
    1) మనం ఆహారం ద్వారా తీసుకునే ఉప్పు(సోడియం క్లోరైడ్), ఉదరంలో ఆహారం జీర్ణం కావడానికి అవసరమైన హైడ్రోక్లోరిక్ ఆమ్లాన్ని తక్కువ పరిమాణంలో ఉత్పత్తి చేస్తుంది.
    2) నీటిలో సంఘటనం పరంగా హైడ్రోజన్ అయాన్‌లు, హైడ్రాక్సిల్ అయాన్‌లు సమాన సంఖ్యలో ఉండడం వల్ల ఆమ్ల గుణం కానీ, క్షార గుణం కానీ ఉండక తటస్థంగా ఉంటుంది.
    3) శీతల పానీయాల్లో ఫాస్ఫారిక్ ఆమ్లాన్ని విరివిగా ఉపయోగిస్తారు.
    4) శీతలపానీయాల్లో కార్బన్‌డైఆక్సైడ్ కరిగించడం వల్ల ఏర్పడే ఆమ్లం ఫార్మిక్ ఆమ్లం.
23. జతపరచండి
    ఎ. బ్యాటరీలు 1. సాలిసిలిక్ ఆమ్లం
    బి. బేకరీలు 2. సల్ఫ్యూరిక్ ఆమ్లం
    సి. సోడా నీరు 3. కార్బోనిక్ ఆమ్లం
    డి. ఆస్పిరిన్ తయారీ 4. వెనిగర్

	ఎ	బి	సి	డి
1)	2	1	4	3
2)	2	4	3	1
3)	4	3	2	1
4)	1	2	3	4

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 3; 5) 3; 6) 2; 7) 3; 8) 3; 9) 2; 10) 1; 11) 1; 12) 4; 13) 2; 14) 2; 15) 2; 16) 3; 17) 3; 18) 4; 19) 2; 20) 2; 21) 4; 22) 4; 23) 2.

The facts attributed to my report...

BANK EXAMS
General English

Directions: Look at the italicized part of each sentence. Three alternatives are given, if one of them is better than the italicized part, indicate your response. If none of the substitutions improves the sentence, indicate D as your response.

1. They *are waiting* for Raju since morning.
   A) Have been waiting B) were waiting
   C) wait D) no improvement
2. They told me that they *were already sold* out all their belongings.
   A) Has sold already B) had already sold
   C) were already sold D) no correction
3. The disparity between the urban and the rural *area has widen* in the last decade.
   A) Areas has widened
   B) area have widen
   C) area has widened
   D) no alternative
4. He has studied Spanish *since four* years.
   A) Since four years ago
   B) for four years
   C) from four years
   D) no improvement
5. Roads are wet, *it must had* rained last night.
   A) Must have been B) must have
   C) would have been D) no improvement
6. In winter, nights are *more colder* than days.
   A) More cold B) colder
   C) coldest D) no improvement
7. It is better to say *too little* than too much.
   A) Little B) only little
   C) very little D) no improvement
8. A large number of houses *has come up* around Secunderabad.
   A) Is coming up B) are coming up
   C) had come up D) no improvement
9. The rules of chess require that one *made* only one move at a time.
   A) Makes B) make
   C) will make D) no improvement
10. Gita enjoys *to tell stories* to children.
    A) Telling stories B) how to tell stories
    C) to narrate stories D) no improvement
11. 'Daffodils' *have been written* by William Wordsworth.
    A) Has been written B) are written
    C) are being written D) no improvement
12. By temperament *the French* are reserved, so they prefer to live in solitude.
    A) French people B) French



    C) some French D) no improvement
13. Do not take an umbrella *lest you do* not get wet.
    A) Lest you should
    B) lest you should not
    C) lest you might not
    D) no improvement
14. He has been working *off and on* for several years to compile a dictionary.
    A) Regularly B) constantly
    C) on and off D) no improvement
15. But for the two incomes, we would be *hard out*.
    A) Hard upon B) hard up
    C) hard on D) no improvement
16. It is *all and one* to me whether he lives in Bangalore or Mumbai.
    A) All but one B) all one
    C) one and the same D) no improvement
17. The trunk is *so heavy* that I can hardly carry it.
    A) As B) too
    C) much D) no improvement
18. Most willingly Ravi agreed *to go to* Mumbai and remain there for a month.
    A) Go to B) on going to
    C) to going D) no improvement
19. Hemanth did not know the answer and I *did not neither*.
    A) And neither did I B) and either did I
    C) and neither have I
    D) no improvement
20. Although her parents warned her *of* what would happen, she continued to disobey them.
    A) Off B) on
    C) to D) no improvement
21. When new coins were issued, the old ones were *called out*.
    A) In B) up
    C) off D) no improvement
22. It will depend now on *they* coming on time.
    A) Their coming B) them coming
    C) theirs coming D) no improvement
23. He told us the story in *a nutshell*.
    A) In the nutshell B) putting it in a nut
    C) in nutshell D) no correction
24. Ravi is extraordinarily *clever at mimicking* his friends.
    A) Clever for mimicking
    B) clever in mimicking
    C) clever to mimick D) no correction
25. The facts *attributed to* my report in your paper are wrong.
    A) Attributing towards
    B) attributed against
    C) attribute for D) no correction

Answers:

1) A 2) B 3) A 4) B 5) B
6) B 7) A 8) B 9) A 10) A
11) A 12) D 13) A 14) C 15) B
16) C 17) B 18) B 19) A 20) D
21) C 22) A 23) D 24) B 25) B

PRACTICE TEST

Directions: In each sentence there is a blank) To fill the blank, three words are given below the sentence, which are denoted by (i), (ii) and (iii)) Find out which one can be used to fill up the blank and make the sentence meaningfully complete.

1. This is the common ____ followed by employees in many companies.
   i) Sense ii) practice iii) outcome
   a) Only i b) only ii c) only iii
   d) i and ii only e) ii and iii only
2. In such a ____changing scenario, the outdated methods should be dropped.
   i) Fast ii) speed iii) rapidly
   a) i or ii only b) ii or iii only
   c) i or iii only d) any one e) only i
3. He was the first to ____ this novel method in our factory.
   i) Intiate ii) start iii) implement
   a) Only i b) only ii c) only iii
   d) i or ii only e) any one
4. After spending a small amount on medicines, he refunded the entire ____ to his father.
   i) Remained ii) balance iii) residual
   a) Only i b) only ii
   c) only iii d) i and iii only e) ii and iii only
5. It happened inadvertently; he didn't do it - __.
   i) Deliberately ii) purposefully
   iii) intentionally
   a) Anyone b) i or ii only
   c) i or iii only d) ii or iii only
   e) none of these

In each sentence below one word has been printed in bold. Below the sentence, five words/ groups of words are suggested, one of which can replace the word printed in bold without changing the meaning of the sentence. Find out the appropriate word/group of words in each case.

6. A very **stubborn** attitude in life cannot prove helpful.
   a) Uncooperative b) rigid
   c) unsuitable d) unhelpful
   e) inapplicable
7. Travel will **familiarize** you with new customs.
   a) Adjust b) popularize
   c) satisfy d) influence
   e) acquaint
8. His appearance was extremely **misleading.**
   a) Attractive b) depressing
   c) deceptive d) sad e) normal
9. He was a **cunning** businessman.
   a) Crafty b) successful
   c) dishonest d) corrupt e) respected
10. The **affluence** of Hindi film actors has no match.
    a) Handsome appearance
    b) brave action c) healthy physique
    d) wealth condition e) intelligent deed

Answers:

1) B 2) C 3) E 4) B 5) C
6) B 7) E 8) C 9) A 10) D

Directions: Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in the proper sequence to form a meaningful paragraph; then answer the questions given below them.

A. There is ample justification for the phenomenon of the description.
B. In the present era also, efforts are being made to rejuvenate Pali.
C. A curious researcher can study them provided he has mastery over Pali language.
D. The Indian tradition describes Buddha as an advocate of analytical method.
E. Pali was perhaps the most commonly used language in those days.
F. This justification is found in several discourses.

1. Which of the following should be the FIRST sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E
2. Which of the following should be the SECOND sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E
3. Which of the following should be the FOURTH sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E
4. Which of the following should be the FIFTH sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E
5. Which of the following should be the SIXTH sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E

Directions: In each sentence below four words have been printed in bold which are numbered (a), (b), (c) and (d)) One of these words may be misspelt or inappropriate in the context of the sentence. Find out the wrongly spelt or inappropriate word. The number of that word is the answer. If all four words are correctly spelt than the appropriate answer is (e) i.e) 'All correct')

6. Mary **constantly** (a) talks about herself **irregardless** (b) of other **people's** (c) **interests** (d)) All correct (e)
7. All roads, **hotels** (a) and **restaurants** (b) in the **surrounding** (c) area were **devastated** (d) All correct (e)
8. As soon as Gandhi **presented** (a) his **proposal** (b) Muni **sumoned** (c) his **advisors** (d) All correct (e)

Answers:

1) D; 2)A; 3)C; 4) E;
5) B proper sequence is DAFCEB;
6) B proper word is 'regardless'; 7) E;
8) C correct spelling is 'summoned';